


'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 34

శనివారం 26-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


ONE
by MSN
ONE-OF-A-KIND DESTINATION
7.7 ACRES
5 TOWERS
4 BHK
55 FLOORS
12 FT. FLOOR TO FLOOR HEIGHT
1,80,000 SFT CLUBHOUSE, SKY PARK & AMENITIES
SCAN FOR LOCATION
CLUBHOUSE
SCAN FOR WEBSITE
PODIUM LEVEL AMENITIES
SKY PARK
CORPORATE OFFICE:
MSN Realty H. No. 2-91/10 &11, Laxmi Cyber City, Whitefields, Kondapur, Hyderabad, Telangana, India - 500084
SITE ADDRESS:
ONE by MSN, Plot No 1, NEOPOLIS, Kokapet, Hyderabad, Telangana - 500075
Project funded by ICICI Bank
DISCLAIMER: All norms and requirements pertaining to the environment, fire services, HMDA rules and regulations have been adhered to while designing One by MSN. The pictorial representation herein are merely creative imagination. Actual product may differ from what is indicated herein. The photographs contained herein may be stock/rendered photography used for illustrative purposes only. MSN Urban Ventures LLP reserves all rights on this offer & can change terms without any intimation/notice.
Wingman Brandworks



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 34

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గెలిచి నిలిచిన రైజర్స్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై ఐదు వికెట్లతో నెగ్గిన సన్‌రైజర్స్ హైదరాబాద్... నాలుగు వికెట్లతో రాణించిన హర్షల్ పటేల్.

- వివరాలు 17లో ▶



వక్ఫ్ చట్టంపై స్టే ఇవ్వొద్దు

వక్ఫ్ (సవరణ) చట్టం–2025 అమలును పాక్షికంగా లేదా తాత్కాలికంగా కూడా నిలిపివేయొద్దని కేంద్రం విజ్ఞప్తి చేసింది.

- వివరాలు 6లో ▶

పాక్‌ను ముక్కలు చేయండి

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలపండి.. సీఎం రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

- బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకొని దాడులు చేయండి
- ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వండి.. మేమంతా మీ వెంటే ఉంటాం
- ప్రధాని మోదీని ఉద్దేశించి సీఎం రేవంత్
- పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ
- మృతులకు నివాళి.. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- పాల్గొన్న మంత్రులు, మహేశ్‌గౌడ్, అసదుద్దీన్, అజహరుద్దీన్ తదితరులు



కొవ్వొత్తుల ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం, జూపల్లి, విజయశాంతి, పొంగులేటి, అసదుద్దీన్ ఒవైసీ, అజహరుద్దీన్, దామోదర రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'మోదీజీ.. పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేయండి. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను భారత్‌లో కలపండి. 1967, 1971లో ఇలాంటి దాడులు జరిగినప్పుడు నాటి ప్రధాని ఇందిరా గాంధీ దీటైన జవాబు ఇచ్చారు. పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానిగా మీరు ఇప్పుడు తీసుకొనే ఎలాంటి నిర్ణయానికైనా మా సంపూర్ణ మద్దతు ఉంటుంది'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రవాదులు పర్యాటకులను హతమార్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని పీపుల్స్‌ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రమూకలకు గట్టి జవాబు ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.

కఠినంగా వ్యవహరించాలి..

'పహల్గాంలో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతి చర్యకూ మద్దతు పలికేందుకు మేం సిద్ధంగా ఉన్నాం'అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 140 కోట్ల మంది భారతీయులంతా ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రధానిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. 'ఉగ్రదాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సానుభూతి తెలుపుతున్నాం. ఆ కుటుంబాలకు అందరం అండగా

మిగతా 7వ పేజీలో ▶

ఈ నెల 30లోగా వెళ్లిపోండి

- తెలంగాణలోని పాకిస్తానీలకు డీజీపీ ఆదేశం
- పాతబస్తీలో 200 మందికిపైగా పాకిస్తానీలు ఉన్నట్టు కేంద్రం ప్రకటన

7లో



బడికి టాటా.. 50 రోజుల ఆట

- వేసవి సెలవులతో ఇక విద్యార్థుల సందడే సందడి
- ఆటపాటలతో ఆరోగ్యం.. స్నేహబంధం మరింతగా అల్లుకొనేందుకు అవకాశం
- వినోదాల పేరిట పిల్లలు దారి తప్పకుండా తల్లిదండ్రులు చూసుకోవాలంటున్న నిపుణులు

7లో

అపార్థం చేసుకోవద్దు..

రాజకీయాల్లోకి రండి



సమ్మిట్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో పొన్నం, సల్మాన్ ఖుర్షీద్, మహేశ్‌గౌడ్ తదితరులు

ప్రపంచ యువతకు భారత్ సమ్మిట్ పిలుపు

- రాజకీయాల విషయంలో యువత సానుకూల నిర్ణయం తీసుకోవాలి
- అసమానత, వృద్ధిలో అస్థిరత తదితర అంశాలపై దృష్టిపెట్టాలి
- సమాజ భవిష్యత్తుకు పునాదులు వేయాలి
- తొలిరోజు సదస్సులో కీలక అభిప్రాయాలు వెలువరించిన వక్తలు

2లో

ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం: భట్టి 2లో

పురుషాధిక్య 'ఏఐ'

ఇస్రో మాజీ చీఫ్ కస్తూరిరంగన్ కన్నుమూత 6లో



జల దిగ్బంధం!

- పాక్‌కు ఇక చుక్కలే
- సింధూ, ఉపనదులపై నిర్మాణాలు
- తక్షణం డ్యామ్‌ల సామర్థ్యం పెంపు
- ఆ దిశగా మూడంచెల వ్యూహం

6లో

చుక్క కూడా వదిలేది లేదు 6లో

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

లష్కరే టాప్ కమాండర్ హతం

ఔను, ఉగ్రవాదాన్ని పోషించాం

- అంగీకరించిన పాక్ రక్షణ మంత్రి
- మూడు దశాబ్దాలుగా ఉగ్ర శిక్షణ
- ఆ చెత్త పనులన్నీ అమెరికా కోసమే చేశాం

- వివరాలు 6లో

ఇదండీ సంగతి



తల్లికి వందనం డబ్బులు అడిగితే సంపద సృష్టించే మార్గం చెవిలో చెప్పండని వెళ్లిపోతున్నాడు!



ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిన పార్టీ

"చంద్రబాబు ప్రభుత్వ హయాంలోని విద్యుత్ చార్జీల పెంపు, వలసలు, రైతు ఆత్మహత్యలు, విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం వంటివి టీఆర్‌ఎస్ స్థాపనకు పురికొల్పాయి. తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించడానికి ముందు కేసీఆర్ ఏడాది పాటు చేసిన కసరత్తులో నేనూ భాగస్వామిని కావడంతో ఉద్యమంవైపు ఆకర్షితుడినయ్యా."

- నాతో సహా అందరమూ కేసీఆర్ సైనికులమే
- వరుస ఎన్నికలతో రాజకీయ పరిణతి సాధించా
- ఏడాదిన్నరలోనే రేవంత్ ప్రభుత్వం తేలిపోయింది
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక కాదు. అది ఎన్‌డీఏ రిపోర్టు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో హరీశ్‌రావు

7లో

క్లుప్తంగా...

రజతోత్సవ సభపై రెండు పాటలు

విడుదల చేసిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా కేసీఆర్‌పై రూపొందించిన రెండు పాటలను విడుదల చేశారు. వీటిని మాను కోట ప్రసాద్, వెన్నమనేని రామచంద్రరావు రాశారు. సాకేత్, ఐశ్వర్య గానం చేయగా.. మిథున్, బల్లేపల్లి మోహన్ సంగీతం సమకూర్చారు. ఈ పాటల్ని శుక్రవారం నందినగర్‌లోని నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు ఏర్పాట్లు పూర్తి: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, ఒ.నరసింహారెడ్డి, జి.దేవి ప్రసాద్, కె.కిశోర్ గౌడ్, తుంగ బాలు, ధర్మేందర్, సంజీవరావు తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని ఏ ప్రాంతం నుంచైనా సజావుగా సభకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామని, 1200 ఎకరాల్లో పార్కింగ్ ఉందని వివరించారు. ప్రతి రోజు సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

రజతోత్సాహంతో సైకత శిల్పం

ఒడిశాలోని పూరీ తీరాన ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ శేరిలింగంపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేయించారు. చలో వరంగల్ సభ సందర్భంగా ఒడిశాలోని పూరీ సముద్ర తీరం చెంత ఏర్పాటు చేసిన 'సైకత శిల్పంలో.. తెలంగాణ పటం, అందులో కేసీఆర్ చిత్రం, 25 ఏళ్ల కేసీఆర్ ప్రస్థానం తదితర వివరాలను పేర్కొన్నారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ నిర్వహించనున్న సభ చరిత్రలో నిలిచిపోతుందని రవీందర్ యాదవ్ తెలిపారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ సహకారంతో ఎంఐఎం బలోపేతం

బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంఐఎం పార్టీ బలోపేతానికి.. పూర్తిస్థాయిలో సహకరించేందుకు బీఆర్ఎస్–కాంగ్రెస్ సిద్ధమయ్యాయని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. హిందువులకు వ్యతిరేకంగా మాట్లాడిన వారికి రాజకీయంగా మద్దతిచ్చినా.. తమకేం కాదనే రీతిలో కాంగ్రెస్–బీఆర్ఎస్ వ్యవహరిస్తున్నాయన్నారు. గతంలో మూడు ఎమ్మెల్యే సీట్లకు పరిమితమైన ఎంఐఎంను.. కాంగ్రెస్–బీఆర్ఎస్ కలిసి ఏడు సీట్లను పెంచాయన్నారు. ఏ మతం అని అడిగి ఉగ్రదాడులు జరుపుతున్న విషాదకర పరిస్థితుల్లోనూ.. నిస్సిగ్గుగా ఎంఐఎంకు ఈ రెండు పార్టీలు మద్దతిస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ లకు వేర్వేరు కార్యాలయాలు అవసరం లేదని, మూడు పార్టీలు దారుస్సలాం కార్యాలయంలోనే కలిసిపోవచ్చునని ఎద్దేవా చేశారు.

3 పార్టీల అపవిత్ర కలయిక బట్టబయలైంది

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల ద్వారా ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ అపవిత్ర కలయిక మరోసారి తేటతెల్లమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. పాకిస్తాన్ ప్రేమికులంతా ఒక్కటయ్యా రని, ఈ మూడు పార్టీల చెలిమికి ఈ ఫలితాలే సంకేతమన్నారు. మతోన్మాద పార్టీగా ముద్ర పడిన ఎంఐఎంకు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఏ ప్రాతిపదికన మద్దతిచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ ఎమ్మెల్సీ ఎస్.అభ్యర్థి గౌతంరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కు జాతీయ పార్టీగా చెప్పుకునే అర్హత లేదని, ఇదొక దొంగల ముఠా అని మండిపడ్డారు. ఎంఐఎంకు మద్దతుగా దొంగచాటుగా ఓటేసిన పార్టీ కాంగ్రెస్ కాగా, తమ కార్పొరేటర్లను ఓటు వేయొద్దని నియంత్రించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని వెంకటేశ్వర్లు ఆరోపించారు. హైదరాబాద్ స్థానిక ఎన్నికల్లో బీజేపీ నైతిక విజయం సాధించిందని గౌతంరావు అన్నారు. ఈ ఎన్నికల్లో ఎంఐఎంకు కాంగ్రెస్ మద్దతు తెలిపిందన్నారు. పాతబస్తీ నుంచి ఎంఐఎం మిగతా ప్రాంతాలకూ విస్తరిస్తే వారి ఆగడాలు మితిమీరిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నికలను బహిష్కరించాలని బీఆర్ఎస్ పిలుపునివ్వడం రాజ్యాంగ వ్యతిరేకంగా పరిగణిస్తూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

అపార్థం చేసుకోవద్దు.. రాజకీయాల్లోకి రండి

ప్రపంచ యువతకు భారత్ సమ్మిట్ పిలుపు ● రాజకీయాల విషయంలో యువత సానుకూల నిర్ణయం తీసుకోవాలి

- అసమానత, వృద్ధిలో అస్థిరత తదితర అంశాలపై దృష్టి సారించాలి
- సమాజ భవిష్యత్తుకు పునాదులు వేయాలి
- తొలిరోజు సదస్సులో కీలక అభిప్రాయాలు వెలువరించిన వక్తలు

సాక్షి, హైదరాబాద్: రాజకీయాలను యువత అపార్థం చేసుకోవద్దని, రాజకీయాలపై ఏవగింపు ధోరణితో కాకుండా సానుకూల దృక్పథంతో ఆలోచించి అవకాశాలను వెతుక్కోవడం ద్వారా సమాజ భవిష్యత్తుకు పునాదులు వేయాలని భారత్ సమ్మిట్–2025 పిలుపునిచ్చింది. అసమానత, వాతావరణ మార్పులు, వృద్ధిలో అస్థిరత అనే అంశాలపై దృష్టి సారించేందుకు యువత రాజకీయాల్లోకి రావాలని విజ్ఞప్తి చేసింది. 'ఓటింగ్‌లో పాల్గొనడం, గళమెత్తడం, రాజకీయాల్లో చేరడం' అనేవి నేటి యువతకు మార్గదర్శకాలుగా నిలవాలని కోరింది. యువజన కాంగ్రెస్ జాతీయ నాయకుడు కృష్ణ అళవారు సంధానకర్తగా శుక్రవారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో 'యువత..రేపటి రాజకీయాలు' అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పెద్దపల్లి ఎంపీ డాక్టర్ వంశీకృష్ణ, ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరిలతో పాటు పలు దేశాలకు చెందిన ఉదయ్‌భాను చిబ్, అరెనా విలియమ్స్, లినేశ్‌సెల్యు అందాన్, మెరీనా హే, జేమ్స్ స్టీవ్ సెరానో, జీసస్ తాపియాలు ప్యానలిస్టులుగా వ్యవహరించిన ఈ గోష్టి పలు కీలక అభిప్రాయాలకు వేదికయింది. వక్తలు వెలిబుచ్చిన అభిప్రాయాలివే..

పరిస్థితులను యువత అధిగమించాలి

- రాజకీయాలంటే అవినీతి అని యువత అనుకుంటోంది. ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు చేసి విస్మరించే పార్టీల వైఖరి వారికి వెగటు పుట్టిస్తోంది. అయితే ఈ కారణాలతో యువత రాజకీయాల నుంచి దూరం జరగకూడదు. వీటిని అధిగమించేలా యువత కంకణం కట్టుకోవాలి.
- చదువుకునేటప్పుడే యువతకు రాజకీయాలు అలవడాలి. వారు వివిధ వృత్తుల్లోకి వెళ్లిపోయిన తర్వాత రాజకీయాల్లోకి రావాలని కోరితే ప్రయోజనం ఉండదు. అందుకే కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో ఎన్నికలు నిర్వహించాలి.



భారత్ సమ్మిట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం. చిత్రంలో బల్మూరి, విదేశీ ప్రతినిధులు

- సోషల్ మీడియా యువతను బాగా ప్రభావితం చేస్తోంది. పలు సామాజిక మాధ్యమాల ద్వారా హింస, విద్వేషపూరిత ప్రసంగాలకు యువత ప్రభావితమవుతోంది. ఇది మంచిది కాదు. చెడును ప్రోత్సహించే ఎలాంటి సామాజిక మాధ్యమాలనైనా యువత అధిగమించగలగాలి.
- వాతావరణ మార్పు అనే అంశాన్ని యువత సీరియస్‌గా తీసుకోవాలి. ఇందుకోసం చట్టాలు చేసే క్రమంలో యువత భాగస్వామ్యం కావాలి. యువత ముందున్న ప్రస్తుత రాజకీయ కర్తవ్యం వాతావరణ మార్పులపై పోరాటమే.
- యువత ఎంత గట్టిగా అరిచిందన్నది ముఖ్యం కాదు. ఎంత నిఖార్సుగా పోరాడిందన్నదే ముఖ్యం.

వారసత్వం ఇంకెన్నాళ్లు?

చర్చాగోష్టిలో భాగంగా డొమినిక్ రిపబ్లిక్ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ వారసత్వ రాజకీయాలపై ప్రశ్నించారు. తన కుటుంబం నుంచి ఒక ఎంపీనో, మంత్రినో ఉంటే ఆ కుటుంబ సభ్యులు మళ్లీ అవే పదవుల్లోకి వెళుతున్నారని, అలాంటప్పుడు సామాన్యులకు అవకాశాలెలా వస్తాయో ప్యానలిస్టులు చెప్పాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తాను ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా రాజకీయాల్లో ఎదిగానని చెప్పారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న దిగ్విజయ్‌సింగ్. చిత్రంలో మంత్రి పొంగులేటి, ఎంపీ మల్లు రవి

ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లలో పనిచేసి ఎంపీని అయ్యానని, ఇప్పుడు రాష్ట్ర మంత్రిగా పనిచేస్తున్నానని, కష్టపడిన వారికి రాజకీయాల్లో అవకాశాలు వస్తాయనేందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. అయితే వారసత్వంగా రాజకీయాల్లోకి వస్తున్న వారు కూడా ఉన్నారని, ఆ పరిస్థితిని కాదనలేమని పొన్నం అభిప్రాయపడ్డారు.

మరో రెండు అంశాలపైనా చర్చ

తొలిరోజు భారత్ సమ్మిట్‌లో భాగంగా మరో రెండు అంశాలపై కూడా చర్చాగోష్టులు జరిగాయి. ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాటె మోడరేటర్‌గా జరిగిన 'నిజం వర్సెస్ ఊహాజనితం: తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టడం'పై జరిగిన చర్చాగోష్టిలో కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి దిగ్విజయ్‌సింగ్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో పాటు విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద శర్మ మోడరేటర్‌గా వ్యవహరించిన 'బహుళపక్ష వాదం' అనే అంశంపై చర్చాగోష్టిలోనూ పలువురు జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొని వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు.

పురుషాధిక్య 'ఏఐ'

- కృత్రిమ మేధలోనూ లింగ వివక్ష
- ఏఐ రూపకల్పనలోనూ పురుషులదే కీలకపాత్ర
- శాంతి చర్చల్లో మహిళలెందుకు ఉండరు?
- 'జెండర్ జస్టిస్ అండ్ ఏ ఫెమినిస్ట్ ఫ్యూచర్'పై చర్చలో ప్రపంచ మహిళా ప్రతినిధులు
- తెలంగాణ నుంచి ప్యానెలిస్టుగా పాల్గొన్న నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

సాక్షి, హైదరాబాద్: పురుషాధిక్య సమాజం కృత్రిమ మేధ (ఏఐ)ను కూడా ప్రభావితం చేస్తోందని.. లింగ వివక్ష గురించి ఏఐని అడిగినా సరైన సమాచారం రావడం లేదని పలువురు మహిళా వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐ రూపకల్పనలోనూ పురుషులదే కీలకపాత్ర అయినందున ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. భారత్ సమ్మిట్–2025లో భాగంగా శుక్రవారం జెండర్ జస్టిస్ అండ్ ఎ ఫెమినిస్ట్ ఫ్యూచర్ అనే అంశంపై చర్చాగోష్టి జరిగింది. కాంగ్రెస్ ఎంపీ ప్రణితి షిండే మోడరేటర్‌గా వ్యవహరించిన ఈ చర్చాగోష్టిలో యాన్ లిండే (స్వీడన్ మంత్రి), రబియా అబ్దుల్లా హమీద్ (టాంజానియా నేత), మోనికా ఫీన్ (అర్జెంటీనా సోషలిస్ట్ పార్టీ), ఉంద్రామ్ చిన్‌బాత్ (మంగోలియా ఎంపీ), మారియా ఎల్‌జాండ్రా పరే (పనామా ఉపమంత్రి), చిట్టెం పర్ణికారెడ్డి (నారాయణపేట ఎమ్మెల్యే), కేంద్ర మాజీ మంత్రులు సల్మాన్ ఖుర్షీద్, ఎం.ఎం.పల్లంరాజు ప్యానెలిస్టులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా లింగ న్యాయం, భవిష్యత్ స్త్రీవాదం అనే అంశాలపై తమ అభిప్రాయాలను తెలపడంతోపాటు ప్రపంచంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. సభికులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

చర్చాగోష్టిలో పలువురు వెలిబుచ్చిన అభిప్రాయాలు

- మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉన్నచోట అవినీతి తక్కువగా ఉందని.. పాలనలో మహిళల భాగస్వామ్యం కారణంగా విద్య, వైద్యం, సాంఘిక సంక్షేమం లాంటి వాటికి ప్రాధాన్యత లభిస్తోందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందువల్ల చట్టసభల్లో మహిళలకు అవకాశం కల్పించే విషయంలో సంస్కరణలు చేపట్టాల్సి ఉంది.
- పాఠశాల స్థాయి నుంచే లింగ సమానత్వం ప్రారంభం కావాలి. మహిళలపై హింసను నిరోధించే చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.
- జెండర్ బడ్జెటింగ్ అమల్లోకి తేవాలి. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా బడ్జెట్ కేటాయింపులుండాలి.
- గృహ హింస, లైంగిక వేధింపుల నుంచి మహిళలను కాపాడేలా చట్టాల్లో మార్పులు తీసుకురావాలి.



చర్చాగోష్టిలో మాట్లాడుతున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి. చిత్రంలో విదేశీ మహిళా ప్రతినిధులు

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలివే..

ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటో చెప్పాలని మోడరేటర్ ప్రణితి షిండే.. ప్యానలిస్టులను కోరగా లైంగిక వేధింపులు, రాజకీయ, ఆర్థిక అసమానతలు, స్త్రీవాద నిరోధానికి చేస్తున్న ప్రయత్నాలు, గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళల మధ్య వైరుధ్యం లాంటి సమస్యలను వారు వెల్లడించారు.

ఎమ్మెల్యే పర్ణిక.... సూపర్

నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చర్చాగోష్టిలో సభికులను ఆకట్టుకునేలా మాట్లాడారు. తన అభిప్రాయాలను పంచుకునే సందర్భంలో ఆమె మహిళా సాధికారత గురించి తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇందిరా స్త్రీశక్తి పథకం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, మహిళలకు ఉచిత ప్రయాణం గురించి చెప్పినప్పుడు అంతర్జాతీయ ప్రతినిధులు కూడా హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు. ఫెమినిజం గురించి ఆమె చెప్పిన సూక్తికి కూడా సభికుల నుంచి మంచి స్పందన లభించింది.

తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై పోలీసులు నమోదు చేసిన కేసులో ఫిర్యాదుదారైన ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న)కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనకు వ్యతిరేకంగా నకిలీ వీడియోలను విడుదల చేశారని కేటీఆర్, జగదీశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పీఎస్‌లో నవీన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గతేడాది మే 25న వారిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తమపై నమోదైన ఈ కేసును కొట్టేయాలని కోరుతూ కేటీఆర్, జగదీశ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది టీవీ రమణరావు వాదనలు వినిపిస్తూ.. వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి కేటీఆర్, జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలు చేయలేదన్నారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగా నమోదైన కేసును కొట్టివేయాలని కోరారు. తప్పుడు అభియోగాలతో ఫిర్యాదు చేశారని, ఆరోపణలకు ఆధారాల్లేవన్నారు.

జిల్లా ఇంటర్ విద్యాధికారి పోస్టులు భర్తీ చేయండి

ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యా సంస్థల్లో ప్రమాణాలు పెంచేందుకు.. జిల్లా ఇంటర్ విద్యాధికారి పోస్టులను భర్తీ చేయాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు విజ్ఞప్తి చేశారు. ఇంటర్ వృత్తి విద్య కాంట్రాక్టు అధ్యాపకులతో కలిసి ఆయన శుక్రవారం బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్యను కలిశారు. ఇంటర్ కళాశాలల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని, వృత్తి విద్య కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు అందజేయాలని కోరారు.

ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం

భారత్ సమ్మిట్ చరిత్రాత్మకంగా నిలిచిపోతుంది

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కాంగ్రెస్ మూల సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రపంచ న్యాయం కోసం సదస్సు

సాక్షి,హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలతో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్' చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని, ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సదస్సులో సుమారు వంద దేశాల ప్రతినిధులు పాల్గొని లింగ న్యాయం, స్త్రీవాద భవిష్యత్తు (ఫెమినిస్ట్ ఫ్యూచర్), వాస్తవం వర్సెస్ ఊహాత్మకం, తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టడం, రేపటి యువత..రాజకీయాలు, కొత్త బహుళపక్ష వాదాన్ని మెరుగుపరచడం వంటి అంశాలపై లోతైన చర్చలు నిర్వహిస్తున్నారని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో 'భారత్ సమ్మిట్' ప్రారంభమైన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా సామాజిక న్యాయం, అభివృద్ధి తదితర అంశాలపై తొలిరోజు సదస్సులో చర్చించామని తెలిపారు. శాంతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునేవారు, ప్రగతిశీల ఆలోచనలు ఉన్నవారు శుక్రవారం 4 ప్యానెళ్లుగా చర్చల్లో పాల్గొన్నారని, శనివారం మరో 4 ప్యానెళ్లుగా చర్చలు కొనసాగుతాయని తెలిపారు.

ఖర్గే, రాహుల్ నేతృత్వంలో మరోసారి..

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ. సామాజిక అసమానతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని భట్టి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో అహింస, సత్యం, సామాజిక న్యాయం అనే ప్రాథమిక మూల సిద్ధాంతాలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ మరోసారి.. ఈ భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశం చేస్తున్నదని చెప్పారు. సామాజిక న్యాయం, అభివృద్ధిని మేళవించి కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఏ విధంగా తాము ముందుకు తీసుకెళుతున్నామో ప్రపంచ దేశాల ప్రతినిధులకు వివరిస్తున్నామన్నారు. గతంలో ప్రచ్ఛన్నయుద్ధ సమయంలో యావత్ ప్రపంచం రెండు కూటములుగా విడిపోయినపుడు కొన్ని దేశాలతో కలిసి ఆనాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అలీన విధానాన్ని తీసుకుని ప్రపంచానికి దిశా నిర్దేశం చేశారని గుర్తుచేశారు. కశ్మీర్ ఉగ్రవాద దాడిని విదేశీ ప్రతినిధులు ఖండించడంతో పాటు నిరసనల్లోనూ పాల్గొన్నారని చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ప్రజెంటేషన్

తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కూడా భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పామని భట్టి చెప్పారు. క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా... 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బాటలు వేసే ప్రణాళికలను ప్రతినిధులకు వివరించామని తెలిపారు. తెలంగాణలో చేపడుతున్న విప్లవాత్మక పథకాలు, ఆయా వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాల గురించి దేశ, విదేశీ ప్రతినిధులకు ఓ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్టు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్లు, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం, నాలెడ్జ్ ఐటీ సెంటర్ గురించి వివరించామన్నారు. ఇందిరా గిరి జల వికాసం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాల గురించి సోదాహరణంగా తెలియజేశామన్నారు.

విదేశీ ప్రతినిధుల హర్షం

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విదేశీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారని డిప్యూటీ సీఎం తెలిపారు. రాహుల్‌గాంధీ న్యాయ్ కార్యక్రమంపై కూడా హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. రాహుల్ గ్లోబల్ జస్టిస్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో... తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సదస్సుకు హాజరైన ప్రతినిధులు స్వాగతించి, అభినందించారని వెల్లడించారు. దేశానికే మోడల్‌గా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులను కోరినట్లు తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరం ఒక్కటై నిలబడదామని విజ్ఞప్తి చేశారు. శాంతి, అహింసా మార్గంలో ప్రపంచ న్యాయం కోసం ప్రయత్నిస్తున్న కాంగ్రెస్‌తో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.



రంగధాంపల్లి నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

ఈ పాదయాత్ర.. రేపటి విజయయాత్ర

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు యువకుల పాదయాత్ర
- జెండా ఊపి ప్రారంభించిన హరీశ్

సాక్షి, సిద్దిపేట: 'యువత చేపట్టిన ఈ పాదయాత్ర రేపు బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి విజయ యాత్ర కాబోతోంది'అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. వరంగల్‌లో జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సిద్దిపేట రంగధాంపల్లి నుంచి పాదయాత్రగా 1,500 మంది యువకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. ఈ యాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించి వారితో కలసి నడిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ '14 సంవత్సరాల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమే'అని స్పష్టం చేశారు. 'లంకలో ఉన్న రావణుడిని ఎదిరించడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలింది'అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన మోసపూరిత మాటలు, అబద్ధపు హామీలు ప్రజలకు అర్థమయ్యాయన్నారు. ఈ పాదయాత్ర కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు కావాలన్నారు. 'పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను అభివృద్ధి, సంక్షేమాల్లో దేశానికి ఆదర్శంగా నిలిపాం. ధాన్యం ఉత్పత్తిలో, తలసరి ఆదాయంలో నంబర్‌వన్‌గా నిలిపాం. తెలంగాణ రాష్ట్రం ప్రారంభించిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు మార్గదర్శకంగా నిలిచాయి'అని హరీశ్ అన్నారు. కాగా, పాదయాత్రలో యువకులు కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, హరీశ్‌రావు సిద్దిపేట అభివృద్ధికోసం చేసిన పనులను గుర్తు చేస్తూ.. 25 మీటర్ల గులాబీ జెండాను ప్రదర్శిస్తూ ముందుకు సాగారు.

దేశ ఐక్యతను ప్రశ్నిస్తే గుణపాఠం చెప్పాలి

కాంగ్రెస్ నేత సల్మాన్ ఖుర్షీద్ సూచన

సాక్షి, హైదరాబాద్: దేశ ఐక్యతపై ఎవరైనా పదేపదే ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తే.. తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ నేత, మాజీ విదేశాంగమంత్రి సల్మాన్ ఖుర్షీద్ సూచించారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో జాతీయ ఐక్యతను ప్రదర్శించాల్సిన సమయమిదేనని స్పష్టం చేశారు. ఉగ్రదాడిని మనదేశంపై దాడిగా, మన సోదరభావం, సామరస్యతకు సవాల్‌గా భావించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న సందర్భంగా.. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి దేశ ప్రజలు, రాజకీయపార్టీలు మద్దతిస్తున్నందున, తగిన చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రదాడి నేపథ్యంలో.. పాకిస్తాన్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం నిర్ణయాత్మక ప్రతిస్పందనగా భావించడం లేదన్నారు. దీని తర్వాత ఏం జరుగుతుందనేది వేచి చూడాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా.. కాంగ్రెస్ మద్దతునిస్తుందని ఇదివరకే స్పష్టం చేశామన్నారు.

అట్టహాసంగా భారత్ సమ్మిట్

- పలు కీలక అంశాలపై అభిప్రాయాల వెల్లడి
- హైదరాబాద్ డిక్లరేషన్ నేటికి వాయిదా...
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి... పహల్గాం పర్యటన నేపథ్యంలో రాహుల్‌గాంధీ గైర్హాజరు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ సదస్సుకు షహర్ హమారా హైదరాబాద్ ఆతిథ్యమిస్తోంది. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో 'డెలివరింగ్ గ్లోబల్ జస్టిస్' పేరిట నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్' దేశ, విదేశ ప్రతినిధుల రాకతో అట్టహాసంగా ప్రారంభమైంది. శుక్రవారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో.. యూరప్, లాటిన్ అమెరికా, ఆఫ్రికా, ఆసియా దేశాల నుంచి వచ్చిన యువ ఎంపీలు, మంత్రులు, ఇతర ప్రముఖులకు బోనాలు, డప్పులు, పేరిణి శివతాండవం వంటి కళారూపాలు, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలతో ఘనస్వాగతం పలికారు.లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాధాన్యతా అంశాలుగా చర్చించడంతో పాటు...డిజిటల్ డిస్ ఇన్ఫర్మేషన్, మిస్ ఇన్ఫర్మేషన్ లాంటి సవాళ్లపై చట్టపరమైన చర్చలు..రాజకీయాల్లో యువత పాత్రను పెంపొందించేందుకు మార్గదర్శకత్వం..విదేశ ప్రతినిధులకు తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయడం వంటి ప్రధాన లక్ష్యాల సాధన దిశగా దీనిని నిర్వహిస్తున్నారు. వీటితో పాటు..ప్రస్తుత ప్రపంచ స్థాయి రాజకీయాలు, వేగంగా చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో..న్యాయం, అహింస, ప్రపంచశాంతి వంటి ప్రపంచస్థాయి అంశాలపైనా సింహావలోకానికి ఈ సమ్మిట్ వేదికగా మారింది.

పహల్గాంకు రాహుల్...ప్లీనరీలో పాల్గొనని రేవంత్

శుక్రవారం సదస్సు ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకావాల్సి ఉండగా కశ్మీర్ పహెల్గాంలో ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో ఆయన అక్కడి బాధితుల పరామర్శకు వెళ్లారు. సాయంత్రం జరగాల్సిన ప్లీనరీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనాల్సి ఉండగా..ఉగ్రదాడిని నిరసిస్తూ సమ్మిట్‌కు హాజరైన విదేశీప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్యనేతలతో కలిసి నెక్లెస్‌రోడ్డు వద్ద నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. దీంతో ప్లీనరీ వాయిదా పడింది. శనివారం సదస్సు ముగింపు సమావేశంలో సీఎం ప్రసంగిస్తారని పార్టీవర్గాల సమాచారం. కాగా ఈ సమ్మిట్ వేదికగా చేయాల్సిన హైదరాబాద్ డిక్లరేషన్ కూడా శనివారానికి వాయిదా పడింది. చివరిరోజు సదస్సుకు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ హాజరుకావాల్సి ఉంది.

తొలిరోజు సదస్సులో ప్రముఖులు

శుక్రవారం కాంగ్రెస్ ముఖ్యనేతలు దిగ్విజయ్‌సింగ్, సల్మాన్ ఖుర్షీద్, ఇతర రాష్ట్రాల నేతలు, తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు పాల్గొన్నారు. శుక్రవారం నాలుగు అంశాలపై ప్యానెల్ చర్చలు సాగగా వివిధ దేశాల ప్రతినిధులు చురుగ్గా పాల్గొన్నారు. పలువురు విదేశీ ప్రముఖులతో పాటు భారత్ నుంచి మాజీ మంత్రులు పల్లం రాజు, సల్మాన్ ఖుర్షీద్, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి పాల్గొన్నారు. మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన ప్రోత్సాహానికి పన్ను రాయితీ కల్పించాలని సల్మాన్ ఖుర్షీద్ సూచించారు. మహిళలకు పన్ను రాయితీలు, ఉచిత బస్సు ప్రయాణాలు వంటి తెలంగాణ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. 'ఫాక్ట్‌వర్సెస్ ఫిక్షన్: కౌంటరింగ్ డిస్ ఇన్ఫర్మేషన్' అంశంపై ప్యానెల్ డిస్కషన్‌లో థాయిలాండ్‌కి చెందిన థనిసారా రుఅంగ్‌డెజ్, యూరోపియన్ పార్లమెంట్ మాజీ సభ్యురాలు మియాపేట్రా కంపులా–నాత్రి, యూకే లేబర్ పార్టీకి చెందిన మ్యాథ్యూ ఫాల్డింగ్, కేంద్రమాజీ మంత్రి దిగ్విజయ్ సింగ్ పాల్గొన్నారు. 'యూత్ అండ్ పాలిటిక్స్ ఆఫ్ టుమారో' ప్యానెల్ చర్చలో న్యూజిలాండ్ యువ ఎంపీ అరీనా విలియమ్స్, శ్రీలంక, ఫిలిప్పీన్స్ దేశాల యువ ప్రతినిధులు మాట్లాడారు. 'షేపింగ్ న్యూ మల్టీలేటరలిజం'పై చర్చలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి 'పవర్ సెంటర్'లో అనూహ్య మార్పులు వచ్చాయని, ఈ నేపథ్యంలో తీవ్రవాదం, మహమ్మారులు, ఇతర అంశాలపై దృష్టి సారించాల్సి ఉందని చెప్పారు.

పహల్గాంలో ఉగ్రదాడిని ఖండించిన భారత్ సమ్మిట్

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిపై భారత్ సమ్మిట్–2025 తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దాడిని ముక్తకంఠంతో ఖండించింది. 'ఈ అనాగరిక దాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. శాంతితో జీవించే పౌరులపై ఇలాంటి క్రూర చర్యలకు సమాజంలో స్థానం లేదు. ఈ దాడిని ఐక్యత, శాంతి, సామరస్యం అనే రాజ్యాంగ విలువలపై చేసిన ప్రత్యక్ష దాడిగా మేం భావిస్తున్నాం. భారతదేశ ప్రజలకు మా సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం..' అని ఒక సంయుక్త ప్రకటనలో ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎవరైతే అన్నింటితో సంబంధము లేక, శుభాశుభములందు మనోధ్యాస ఏమాత్రము లేకుండా సుఖదుఃఖములను అనుభవించకుండునో అట్టి వాని ప్రజ్ఞ గొప్పది.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 26 ఏప్రిల్ 2025

కార్పొరేట్ సంస్థలకు కళ్లెం

ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి. మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది. మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి.

వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు. ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహరిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది.

కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే డెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది. ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూపోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది.

కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.నవమి ప.1.03 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.06 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.02 నుండి 1.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.50 నుండి 11.36 వరకు, **అమృతఘడియలు:** రా.9.30 నుండి 11.01 వరకు.

సూర్యోదయం : 5.41
సూర్యాస్తమయం : 6.13
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.3.00 నుండి 3.00 వరకు
మాస శివరాత్రి.

యువ సృష్టికర్తలకు ప్రోత్సాహం

సందర్భం



కిరణ్ మజుందార్ షా

వాణిజ్య సుంకాలు, స్టాక్ మార్కెట్ అస్థిరతలు ప్రపంచాన్ని వేధిస్తున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తూనే ఉంది. విస్తృత జనాభా, సాంకేతిక సామర్థ్యాలను సద్వినియోగం చేసుకుంటూ, సవాళ్లను అవకాశాలుగా మలుచుకుని ప్రపంచ 'క్రియేటివ్ పవర్ హౌస్'గా తనను తాను నిరూపించుకునే సత్తా భారత్‌కుంది. కథలు చెప్పడంలో మనకున్న సామర్థ్యాన్ని 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ద వరల్డ్' విజన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా సృష్టికర్తలను (క్రియేటర్స్) లక్ష్యంగా చేసుకుని భారత మీడియా–వినోద (ఎం అండ్ ఇ) రంగం ముందుకు సాగుతోంది.

చలనచిత్రం, సంగీతం, కళ, సాంకేతికత వంటి వివిధ రంగాలలో యువ సృష్టికర్తలకు భారత్ నిలయంగా ఉంది. ముఖ్యంగా 'డ్యూన్–2' సినిమా ఆస్కార్ గెలుపునకు కారణమైన అద్భుత వీఎఫ్ఎక్స్‌ను అందించిన విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ స్టూడియోగా నమిత్ మల్హోత్రాకు చెందిన 'డీఎన్ఈజీ'ని చెప్పుకోవచ్చు. ఇది ప్రపంచ వినోద పరిశ్రమలో భారత్ ప్రాబల్యాన్ని తెలియచెబుతూ భారత్‌కు 7వ ఆస్కార్‌ను తెచ్చిపెట్టింది. సంప్రదాయ ఫిల్మ్ మేకింగ్ నుంచి డిజిటల్ నిర్మాణానికి మళ్ళుతూ ప్రపంచ స్థాయి కంటెంట్‌ను రూపొందించడంలో భారత్ సామర్థ్యాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

ముంబయి వేదికగా మే నెలలో భారత ప్రభుత్వం 'ప్రపంచ ఆడియో–విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)– 2025'ను నిర్వహిస్తోంది. యువ సృష్టికర్తలను పరిశ్రమ దిగ్గజాల చెంతకు చేర్చడం, అంకుర సంస్థలను ప్రోత్సహించడం వేవ్స్‌లో భాగమైన వేవ్స్ ఎక్స్‌లెరేటర్ (వేవెక్స్) లక్ష్యం. యువ సృష్టికర్తలు అనుభవజ్ఞుల సలహాలు పొందేలా చూడటం, నిధుల లభ్యత, అంతర్జాతీయ అవకాశాలను అందించడం ద్వారా మీడియా, వినోద రంగాల్లో భారత అంకుర సంస్థల స్థాయిని పెంచడానికి వేవ్స్ కృషి చేస్తుంది. గేమింగ్, కృత్రిమ మేధ, మెటావర్స్ వంటి వినూత్న రంగాలపై దృష్టి సారిస్తూ... ఈ రంగం 2023లో రూ. 2,422 బిలియన్ల నుంచి 2027 నాటికి రూ.3,067 బిలియన్లకు పెరుగుతుందని అంచనా.

కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, బ్రాహ్మణ్ గేమ్ స్టూడియోస్, కీబౌండ్, వాయస్ క్లౌడ్ వంటి అంకుర సంస్థలు ప్రపంచ పెట్టుబడిదారుల ముందు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేవ్స్ ఒక వేదికగా ఉపకరిస్తుంది. వీటిలో మీడియా – వినోద రంగ సామర్థ్యాన్ని చాటే ల్యాప్‌వింగ్ స్టూడియోస్, వైగర్ మీడియా వంటి మహిళల నేతృత్వంలోని అంకుర సంస్థలు కూడా ఉన్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో అడుగు పెట్టడానికి ఒక పోటీతత్వ అంకుర సంస్థల వాతావరణాన్ని వేవ్స్ అందిస్తుంది. పెట్టుబడులు పొందడానికి, అంతర్జాతీయ అరంగేట్రంలో ఇబ్బందులను తప్పించడానికి, మెంటార్‌షిప్ అడ్డంకులకు ఒక పరిష్కార వేదికగా నిలుస్తుంది. కేవలం రూ.10,000 పెట్టుబడితో ఒక విజన్‌తో 'బయోకాన్'ను ప్రారంభించిన నాకు ఇటువంటి ప్రోత్సాహక వేదికల ప్రాముఖ్యం ఏమిటో బాగా తెలుసు.



మే 1–4 వరకు ముంబయిలో భారత ప్రభుత్వ 'వేవ్స్' శిఖరాగ్ర సదస్సు

క్రియేటివ్ హబ్

కళలంటే ఇష్టపడే నేను మ్యూజియం ఆఫ్ ఆర్ట్ అండ్ ఫొటోగ్రఫీ (మ్యాప్), సైన్స్ గ్యాలరీ బెంగళూరు కార్యక్రమాలకు నా సహకారాన్ని అందిస్తూ ఉంటాను. ఒక దేశ సంస్కృతి దాని కళలు, శాస్త్రాలతో ముడిపడి ఉందని బలంగా నమ్ముతాను. కళలు, విజ్ఞాన శాస్త్రం రెండూ సృజనాత్మకతలో భాగమే. కళాకారులు వేదికపై ప్రదర్శించే విధంగానే శాస్త్రవేత్తలు ప్రయోగశాలల్లో ప్రయోగాలు చేస్తారు.

కథలు చెప్పడంలో శతాబ్దాలుగా నైపుణ్యం కలిగిన భారత్... ప్రపంచ సృజనాత్మక శక్తిగా ఎదగడానికి గొప్ప అవకాశం ఉంది. శాస్త్రీయ నృత్యం నుంచి సినిమా వరకు; కామిక్స్ నుంచి ఇమ్మర్సివ్ టెక్నాలజీ వరకు, అధునాతన సృజనాత్మకత ఆవిష్కరణలతో ముడిపడి ఉన్న ఉత్తేజకరమైన యుగంలోకి ప్రవేశిస్తున్నాం. 'క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ద వరల్డ్' అనే ఆలోచన ఈ ఆశయాన్ని సంపూర్ణంగా నెరవేరుస్తుంది.

సృజనాత్మక అంకుర సంస్థలకు ఉత్ప్రేరకం

సాంకేతికత, కథ చెప్పడంలోని నైపుణ్యానికి వేవ్స్ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. యానిమేషన్, ఏఐ, ఏఆర్/వీఆర్, గేమింగ్, మెటావర్స్ వంటి వినూత్న రంగాల్లో అంకుర సంస్థలకు మద్దతు ఇవ్వడం ద్వారా వేవెక్స్ తన ప్రాబల్యాన్ని చాటడానికి సిద్ధంగా ఉంది.

వేవ్స్ బజార్‌లో 4,500కు పైగా అమ్మకందారులు, 5,900కి పైగా కొనుగోలుదారులు నమోదు చేసుకున్నారు. ఇది భారతీయ అంకుర సంస్థలను అంతర్జాతీయ సంస్థల చెంతకు చేర్చడం ద్వారా ప్రపంచ మీడియా, వినోద రంగాల్లో భారత్ పురోగమనాన్ని మరింత వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

◆ యానిమేషన్, ఏఐ, ఏఆర్/వీఆర్, గేమింగ్, మెటావర్స్ వంటి వినూత్న రంగాల్లో అంకుర సంస్థలను ప్రోత్సహించడం 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమిట్' (వేవ్స్) లక్ష్యం.

◆ పెట్టుబడులు పొందడానికి, అంతర్జాతీయ అరంగేట్రంలో ఇబ్బందులు, మెంటార్‌షిప్ అడ్డంకులు తప్పించడానికి సదస్సు ఒక పరిష్కార వేదికగా నిలుస్తుంది.

సంప్రదాయ మీడియాకు మించిన ఆవిష్కరణలకు కూడా వేవ్స్ పెద్దపీట వేస్తుంది. కృత్రిమ మేధ ఆధారంగా తయారుచేసిన ప్రకటనల్లో ఎరుకానావిస్ టెక్నాలజీస్ వంటి కంపెనీలు అగ్రగామిగా ఉన్నాయి. అదే సమయంలో యానిమేషన్, వీఆర్ ద్వారా అమేజ్ స్టూడియోస్, ఆఫ్‌లైన్ హ్యూమన్ స్టూడియోలు కథను చెప్పే విధానాన్ని పునర్నిర్వచిస్తున్నాయి. ఇన్‌స్కేప్ ఎక్స్‌ఆర్, విజన్ ఇంపాక్ట్ వంటి ఎడ్–టెక్ వెంచర్లు ఇమ్మర్సివ్ మీడియాతో నేర్చుకునే విధానంలో మార్పులు తెస్తున్నాయి.

భవిష్యత్ దృక్కోణం

మీడియా, వినోద రంగంలో ప్రపంచవ్యాప్తంగా పోటీపడేలా అంకుర సంస్థలను ప్రోత్సహించడానికి రూపొందించిన వేవ్స్ వంటి కార్యక్రమాలకు మద్దతునిచ్చే విషయంలో భారత ప్రభుత్వం నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు మనం వేవ్స్ ద్వారా కేవలం అంకుర సంస్థల్లో పెట్టుబడి పెట్టడమే కాదు, కథను చెప్పే, స్వీయ–వ్యక్తీకరణ, భవిష్యత్తును నిర్వచించే సృజనాత్మక ఆర్థిక వ్యవస్థలోనూ పెట్టుబడి పెడుతున్నాం. అది బయోటెక్ ల్యాబ్ కావొచ్చు, డిజిటల్ స్టూడియో కావొచ్చు... సృజనాత్మకత అనేది రేపటి పరిశ్రమలు, గుర్తింపులను రూపొందించే ఒక సాధనం.

వేవ్స్–2025 భారతదేశపు మీడియా, వినోద పరిశ్రమలకు సంబంధించిన వేడుకే కాదు... ఇప్పటి వినోదం, విద్య, సంస్కృతుల్లో సమూల మార్పులు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్న ప్రపంచంలో తదుపరితరం సృష్టికర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిచయ వేదిక.

ఈ ప్రయాణంలో వేవ్స్ సలహా సంఘంలో నేనూ ఒక సభ్యురాలినైనందుకు ఎంతో గర్వపడుతున్నాను. ప్రపంచ సృజనాత్మక విప్లవానికి నాయకత్వం వహించడానికి భారత్ సిద్ధమవుతున్న క్షణమిది. 'భారత్‌లో సృష్టిద్దాం– ప్రపంచం కోసం సృష్టిద్దాం' అంటూ అనంత కాల్పనిక శక్తిని ప్రపంచానికి పరిచయం చేద్దాం.

వ్యాసకర్త బయోకాన్ గ్రూప్ చైర్ పర్సన్

తీవ్రవాదులను ఓడిద్దాం... దేశాన్ని గెలిపిద్దాం!

అభిప్రాయం



ప్రొ. మాడభూషి శ్రీధర్

కేవలం పహల్‌గామ్‌లోనే కాదు, కేవలం పాకిస్తాన్‌లోనే కాదు, దేశమంతా ఉన్నారు. అవకాశవాద, అవినీతిలో నిండిన ప్రజా, సివిల్ అధికారుల వల్లనే టెర్రరిస్టులు బతుకుతున్నారు, టెర్రరిజం బతుకుతున్నది. టెర్రరిస్టు డబ్బుతో ఆ దేశం, ఈ దేశం అనికాదు, ప్రతి బిజినెస్‌లో పెద్దలు, నేతలు బతుకుతున్నారు. సిగ్గు సిగ్గు! రాబోయే పదేళ్లదాకా, లేదా వందేళ్లదాకా తీవ్రవాదం ఉంటుంది, ఉంచుతారు. వ్యాపారం కోసం, రాజకీయం కోసం! అధికారం కోసం, ఎన్నికల కోసం!

అంతర్జాతీయంగా అన్నీ అమ్ముకోవడాలే గాని, జాతీయతా భావనే లేదు. నాయకులకే కాదు, సగం మంది ప్రజలకు కూడా సిగ్గు పడవలసిన 'దుర్మార్గం' ఎక్కువగా ఉంది. గుడికి దర్శనానికి వెళుతున్నాం. ప్రసాదాలను, నిజాలను నమ్ముకోకుండా, ఖనిజాలు అమ్ముకుంటున్నాం. ఆ ఖనిజం కోసం అడవులు నరికేస్తున్నాం.

'సత్యమేవ జయతే' అని మన జాతీయ నినాదం. 150 కోట్ల జనాల్లో ఎంతమంది నిజం చెబుతున్నారు? 'రామ్ నామ్ సత్య్ హై' అనేది మనదేశంలో చిత్తశుద్ధితో వినేవారున్నారా? రామ్ పేరుతో రాజకీయాలు, మతం పేరుతో అధికారాలతో ఆడుకుంటూ, పై పెదవుల కొస నుంచే 'జై శ్రీరామ్' అంటున్నాం. రామరాజ్యం రావడం లేదు. భక్తి లేదు, భయం లేదు. గర్భగుడులలో ఒక్కొక్క స్తంభానికి బంగారపు తాపడాలకు డబ్బిస్తాం కానీ పేదవాడికి తిండిచ్చేవాడు లేదు.



అమెరికాలో అద్భుత ఆకాశాలను తాకే రెండు భవనాలను విమానాల్తో కూల్చిన దుర్మార్గం ద్వారా వందలాది జీవనాలు ధ్వంసమయ్యాయి(2001 సెప్టెంబర్ 11). నిన్న పహల్‌గామ్‌లో 26 మంది ప్రాణాలు తీసిన నేరం చిన్నదేం కాదు. వెంటాడి వేటాడి ఒక్కొక్కణ్ణి పట్టుకు శిక్ష వేస్తాం అంటున్న ప్రభుత్వానికి వందలాది వందనాలు.

అమెరికా చేసిందేమిటి? మాటలు కాదు. తూటాలు కాదు. రాజకీయం కాదు. ఎక్కడున్నా సరే వేటాడి పట్టుకుని అమెరికాను కాపాడుకోవడానికి చూపిన కమిట్‌మెంట్ మనకు ఆదర్శం కావాలి. కమిట్‌మెంట్ అంటే కట్టుబాటు, దీక్ష. అకుంఠిత దీక్ష కావాలి. అది ఉందా? ఒక్కో మరణానికి కన్నీటి బిందువునైనా ఇచ్చుకున్నామా? క్రికెట్ మైదానంలో ఓ రెండు క్షణాలు నిలబడితే చాలా? కోట్ల కోట్ల వ్యాపారం కోసం, ప్రచారం కోసం మౌనమే సరిపోతుందా? ఒక్కో ప్రాణానికి, ఒక్కో సైనికుడి జీవనానికి డబ్బు ఇచ్చే దమ్ముందా?

రాజ్యాంగాన్ని మార్చుకున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలితం చేశారు. అంటే జరిగిన దానికి రాష్ట్ర బాధ్యత లేదు, కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. టూరిస్టులయిన మామూలు మనుషుల్ని టెర్రరిస్టులకు బలిచేసిన ప్రభుత్వానికి బాధ్యత లేదా? పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తో పాటు, మరికొన్ని భూభాగాలతో అఖండ భారత్ అనే నినాదాలు చేసే పెద్దలు... పక్కనున్న టెర్రరిస్టులు, మన నేల మీద మన వారిని చంపేస్తుంటే ఏం చేస్తున్నట్టు? పదేళ్ల ముందు దద్దమ్మలని పాత పాలకులను తిట్టిపోశాం. యూపీఏ చెత్త పరిపాలన వల్ల తీవ్రవాదులు జనాన్ని చంపేస్తున్నారన్నారు. మరి ఇప్పుడు 2025 దాకా ఏం చేస్తున్నట్టు?

ఇప్పుడు మనకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహానాయకుడు అవసరం. ప్రతి సైనికుడిని ఒక శక్తిగా మార్చి, తుపాకీలు ఎక్కుపెట్టినట్టే మహా ధైర్యంగా, రాజకీయ నాయకులను కూడా ప్రశ్నించి, నిజం చెప్పి, వ్యూహం నేర్పి భారత దేశాన్ని గెలిపించిన (1971 ఇండో–పాక్ యుద్ధం) ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా వంటి సైన్యాధిపతులు మనకు అవసరం. ఆ విధంగా మన దేశాన్ని గెలిపిద్దాం. తీవ్రవాదులను మట్టి కరిపిద్దాం. చెత్త రాజకీయాలు కాదు, మన కైలాస హిమాలయాలున్న మన కశ్మీర్‌ను గెలిపిద్దాం. మన రాజ్యాన్ని, రాజ్యాంగాన్ని, రాజనీతిని నిలబెడదాం.

వ్యాసకర్త మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ప్రొఫెసర్

సోషల్ మీడియా



మేటి శాస్త్రవేత్త

ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ మరణం విషాదం కలిగించింది. ఆయన గొప్ప దేశభక్తుడు, మేటి శాస్త్రవేత్త. అంతరిక్ష సైన్సు, పరిశ్రమ ఆయన్ని ఎప్పుడూ మరిచిపోవు. ఇండియాలో శాటిలైట్లకు ప్రైవేట్ యాజమాన్యం కల్పించే విధానాన్ని తేవడంలో ఆయన నాకూ, టీవీ పరిశ్రమకూ సాయపడ్డారు. ఆయన ఆత్మకు శాంతి కలుగుగాక.

– సుభాష్ చంద్ర, మీడియా పర్సనాలిటీ



బెదిరింపా?

పాకిస్తాన్ మూడు దశాబ్దాలుగా తీవ్రవాద గ్రూపులకు మద్దతిస్తోందని పాకిస్తాన్ రక్షణ మంత్రి బహిరంగంగా అంగీకరించడం ముఖ్యవిషయం. బహుశా వాళ్లు సిగ్గులేకుండా దీన్ని చెప్పేయడం ద్వారా, పశ్చిమ దేశాలను కూడా ఇండియాలాగే లక్ష్యం చేసుకోగలమని వ్యూహాత్మకంగా బెదిరిస్తున్నారు.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

ఇన్ బాక్స్

గ్రంథాలయ పునర్వికాసం కోసం...

ఆనాడు ప్రజలను విజ్ఞానవంతులను చేసి సామాజిక స్పృహ పెంపొందించే దిశగా గ్రంథాలయ ఉద్యమం రూపుదిద్దుకుంది. దానికి హేమాహేమీల్లాంటివారు నాయకత్వం వహించారు. 1911లో విజయవాడలో రామ్మోహన గ్రంథాలయాన్ని నెలకొల్పి ఆ తర్వాత తొలి గ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటుచేశారు. అయితే ప్రస్తుత పాలకులు గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడం బాధాకరం. 1960లో గ్రంథాలయ చట్టం వచ్చింది. దీని ప్రకారం ప్రజలు చెల్లించే ఆస్తిపన్నులో 8 శాతం వాటాను గ్రంథాలయ సెస్సుగా తీసి నిధిని ఏర్పాటుచేసి, తద్వారా పుస్తక భాండాగారాలను అభివృద్ధి చేయాలని చట్టం చెప్పింది. వాస్తవంలో అలా జరగడం లేదు. ఫలితంగా నిధుల కొరత వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి.

సంస్థ వద్ద నిధులు లేవన్న సాకుతో రచయితలు, ప్రచురణకర్తల నుంచి కొత్త పుస్తకాలు కొనుగోలు చేయడం నిలిపివేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి భారీ సంఖ్యలో పుస్తకాలు కొనుగోలుచేయడం అభినందనీయం. పది నెలలు దాటినా కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం రచయితల నుంచి పుస్తకాలు కొనుగోలు చేస్తామని ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం. ఈ కారణాల రీత్యా 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం' తెరపైకి వచ్చింది. వల్లూరు శివప్రసాద్ రాష్ట్ర కన్వీనర్‌గా గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఏర్పాటైంది. గత ఏడాది డిసెంబర్ 14న విజయవాడలో భారీ ర్యాలీ, సదస్సుతో ఉద్యమాన్ని ప్రారంభించారు.

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి నిధులు విడుదల చేయించే క్రమంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసేందుకు ఈ నెల 27వ తేదీ ఆదివారం విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఉదయం గం. 9.30 నుంచి సాయంత్రం గం. 5.30 వరకు పలు సదస్సులు నిర్వహించనున్నారు. ప్రభుత్వంపై జరిపే ఈ పోరాటాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత పుస్తక ప్రేమికులందరిపై ఉంది.

– చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ

జర్నలిస్టు – గ్రంథాలయ పునర్వికాస ఉద్యమకారుడు / ఎన్టీఆర్ జిల్లా కో–కన్వీనర్
(ఏప్రిల్ 27న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సదస్సు)

దేశాన్ని ఎన్ని ముక్కలు చేద్దామనీ!

విశ్లేషణ



శశి శేఖర్

సంవత్సరాల క్రితం, నేను హిందీ నవలా రచయిత కమలేశ్వర్ రాసిన 'కిత్నే పాకిస్తాన్' (ఎన్ని పాకిస్తాన్లు) – అనే నవల చదివాను. ఆయన భారతీయ సమాజపు విచ్ఛిన్నకరమైన, వివక్ష, అధికార దాహంతో కూడిన ధోరణులను విజయవంతంగా వ్యక్తపరిచారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా నుండి ప్రజలు వలస వెళ్ళిన నేపథ్యంలో.. 'ధార్మిక విశ్వాసం' ఆధారంగా ప్రజలను విభజించే మనస్తత్వాన్ని మనం ఎప్పుడు వదిలించుకోగలం అని మరోసారి అడగవలసిన అగత్యం ఏర్పడింది. మెజారిటీ వర్గంవారి మనుగడకు ప్రత్యేక హక్కులు ఉండే మెజారిటీవాదాన్ని... మెజారిటీ పాలన స్థానంలో ఉంచాలనుకుంటున్నారా?

మనం ముర్షిదాబాద్‌తో ప్రారంభిద్దాం. భారత ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టాన్ని ఆమోదించిన తర్వాత చెలరేగిన అల్లర్లు, అక్కడి మైనారిటీ హిందువుల జీవితాలను దుర్భరంగా మార్చాయి. పరిస్థితి దారుణంగా ఉంది. బాధితుల కుటుంబం ఎదుర్కొన్న విచారణలను బట్టి దీనిని అర్థం చేసుకోవచ్చు. ఆ జిల్లాలోని జాఫరాబాద్ నగరానికి చెందిన టీ స్టాల్ యజమాని హృదయ్ దాస్, అతని కోడలు సుచరిత సర్కార్ జార్ఖండ్–పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతంలో ఉండే రాజ్‌మహల్‌లో ఒక జాతీయ పత్రిక విలేకరికి తమ కథను వివరిస్తున్నప్పుడు కూడా వారు భయంతో వణుకుతున్నారు. కన్నీళ్ల నిండిన వారి కళ్లలో... జరిగిన బీభత్సం ఛాయలు స్పష్టంగా కనిపించాయి.

ఏప్రిల్ 12 ఉదయం ఇదంతా ప్రారంభమైందని వారు చెప్పారు. ప్రతి రోజులాగే, 170 దళిత కుటుంబాలు పనికి సిద్ధమవుతుండగా అకస్మాత్తుగా డజన్ల కొద్దీ సాయుధ వ్యక్తులు వారిపై దాడి చేశారు. వారు తాళం వేసిన ఇళ్లపై రాళ్ళు రువ్వారు. దాస్ దుకాణాన్ని ధ్వంసం చేశారు. కానీ అతను తన నివాసంలోనే ఇరుక్కుపోయాడు. తన ఇంటికప్పుపై రాళ్ళ వర్షం కురుస్తూనే ఉందనీ, వీధుల్లో ఉన్న ప్రజలను కొట్టారనీ దాస్ అన్నారు. అతని సోదరుడు హర్‌గోబింద్, మేనల్లుడు చందన్ దాక్కునేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు ఆ గుంపు వారిని పట్టుకుంది. రాడ్లు, కర్రలు, కత్తులతో వారిపై దాడి చేసింది. 'తిరిగి వచ్చే వారిని తుడిచిపెట్టేస్తాము'నే ఒక హెచ్చరిక జారీ చేస్తూ ఆ గుంపు హెచ్చరించింది. 'మిమ్మల్ని రక్షించే ధైర్యం పాలనా యంత్రాంగంలో ఎవరికి ఉందో చూద్దాం' అనేది దాడి చేసినవారి మరో సవాల్.

సుచరిత భయంతో వణుకుతూ, తాను ముర్షిదాబాద్‌కు ఎప్పటికీ తిరిగి రానని చెప్పింది. ముర్షిదాబాద్, 24 పరగణాలు, పరిసర జిల్లాల్లో చాలా మంది ఇలాంటి కథనాలను వివరించారు. బాధితులంతా తమను రక్షించడానికి పాలనా యంత్రాంగం ఎందుకు ముందుకు రాలేదన్న ఒకే ఒక సాధారణ ప్రశ్న అడుగుతున్నారు. ఇది చట్టబద్ధమైన ప్రశ్న. కానీ వారికి భద్రత కల్పించే బాధ్యత అప్పగించబడిన వారు రాజకీయాలలో బిజీగా ఉన్నారు.

వాస్తవానికి, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలలో మతతత్త్వ మహమ్మారి చాలా సంవత్సరాలుగా విజృంభిస్తోంది. ఇప్పుడు, ఈ విభేదాలు బయటపడ్డాయంతే! రాష్ట్ర బీజేపీ నాయకుడు, ఒకప్పుడు మమతా బెనర్జీకి కీలక అనుయాయి అయిన సువేందు అధికారి, బెంగాల్‌లో ప్రబలంగా ఉన్న చట్టవిరుద్ధతను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోలేకపోతోందని పేర్కొంటూ, ప్రభుత్వాన్ని రద్దు చేయాలని పిలుపునిచ్చారు. మరో వైపున ముర్షిదాబాద్ హింసాకాండ కొన్ని రాజకీయ పార్టీలతో కుమ్మక్కై, కేంద్ర సంస్థలు చేసిన పని అని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ఈ చిరకాల హింసాకాండలో నేరస్థులు, బాధితుల ముఖాలు మాత్రమే మారాయి. నాయకుల ప్రకటనలు మాత్రం అలాగే ఉన్నాయి.



అందరూ బాధితులే!

గత 50 సంవత్సరాలలో దేశంలో జరిగిన అన్ని ప్రధాన హింసాత్మక ఘటనలను సమీక్షిస్తే ఇది నిజమే సుమా అనిపిస్తుంది. 1970–80ల మధ్య, అస్సాంలో హిందీ మాట్లాడే ప్రజలపై జరిగిన దౌర్జన్యాలతో ఈ విద్వేషం ప్రారంభమైందనాలి. దీని ఫలితంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఆ రాష్ట్రం నుండి పారిపోవాల్సి వచ్చింది. అదే సమయంలో, ఉగ్రవాద కార్యకలాపాల కారణంగా చాలా మంది హిందువులు పంజాబ్‌ను విడిచి వెళ్ళవలసి వచ్చింది. ఇందిరా గాంధీ మరణం తరువాత జరిగిన అల్లర్లు సిక్కు సమాజాన్ని ధ్వంసం చేసి పడేశాయి. ఉత్తరప్రదేశ్‌లోని మాలియానా, బిహార్‌లోని భాగల్పూర్ ప్రత్యేకించి ముస్లింలకు చాలా కఠిన పరిస్థితులను తెచ్చిపెట్టాయి. అల్లర్ల తర్వాత భాగల్పూర్ నగరాన్ని విడిచిపెట్టిన పట్టు నేత కార్మికులు తిరిగి రాలేదు. 1990లలో కశ్మీరు పండిట్లు కశ్మీర్ లోయను వదిలి వెళ్ళవలసి వచ్చింది. ఈ దురదృష్టకర జాబితా సుదీర్ఘమైనది.

21వ శతాబ్దం మొదటి రెండు దశాబ్దాలలో పరిస్థితి కొద్దిగా మెరుగుపడింది. అయితే, గత సంవత్సరం మణిపుర్‌లో చెలరేగిన హింస మళ్ళీ పాత గాయాలను రేపింది. ఇక్కడ, నిర్వాసితులైన వారిలో ఎక్కువ మంది క్రైస్తవ సమాజానికి చెందినవారు.

ఈ హింసాత్మకమైన సంక్లిష్ట సంఘటనలు హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులను ఒకేలా ప్రభావితం చేశాయి. కొన్ని సంఘటనలలో వారు నేరస్థులు, మరికొన్నింటిలో బాధితులు. మతం కంటే మెజారిటీవాదం కారణంగా వలసలు ఎక్కువగా జరిగాయి. అల్లర్లను ప్రేరేపించడానికి మత విశ్వాసం ఒక అనుకూలమైన సాధనం. సోషల్ మీడియా విస్తరణ ఇప్పటికే దిగజారుతున్న పరిస్థితిని క్లిష్టతరం చేస్తోంది. ఇది వేర్పాటువాదులు, పుకార్లు వ్యాప్తి చేసేవారు, దుష్ట శక్తులకు శక్తినిచ్చేదిగా సోషల్ మీడియా పని చేసింది. మన రాజకీయ నాయకులు కూడా విభజనవాద పరిస్థితులను ఉపయోగించుకోవడానికి ఎల్లప్పుడూ ఆసక్తి చూపుతారు. మతంతో పాటు, ప్రాంతీయ, భాషా వ్యత్యాసాలను ప్రజల మధ్య విభజనను రేకెత్తించడానికి ఉపయోగిస్తున్నారు. భారతదేశంలోనే మరెన్ని దేశాలను సృష్టించాలనీ! ఈ దేశాన్ని ఎన్ని ముక్కలు చేద్దామనీ!

వ్యాసకర్త 'ది హిందుస్థాన్ టైమ్స్' సంపాదకుడు

ఉస్మానియా ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజారావు

- హెల్త్ సెక్రటరీ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజారావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి మెడికల్ కాలేజీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజారావు.. సోమవారం ఉస్మానియా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకోనున్నారు. కరోనా సమయంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయనకు ప్రజలు, అధికారులు, ప్రభుత్వం నుంచి ప్రశంసలు లభించాయి. అందరినీ సమన్వయం చేస్తూ కరోనా సమయంలో గాంధీ హాస్పిటల్‌ను సమర్థవంతంగా నిర్వహించారనే పేరుంది.

వీఆర్వో, వీఆర్ఏలకు 'జీపీవో పరీక్ష'

సాక్షి, హైదరాబాద్: గ్రామ పాలనాధికారుల (జీపీవో) పోస్టుల కోసం పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలకు పరీక్ష నిర్వహించే దిశలోనే ప్రభుత్వం ముందుకెళుతోంది. ఈ మేరకు వచ్చే నెల రెండో వారంలో పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను టీజీపీఎస్సీకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించాలని, ఇందుకు అనుకూలమైన భవనాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం. కాగా, మళ్లీ రెవెన్యూలోకి వచ్చి జీపీవోలుగా బాధ్యతలు నిర్వహించేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి అడిగిన ఆసక్తి వ్యక్తీకరణ గడువు శనివారంతో ముగియనుంది.

ముందస్తు బెయిల్ ఇస్తే దర్యాప్తునకు సహకరిస్తా

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వాదనలు
- వ్యక్తిగత లాభం కోసం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారన్న పోలీసులు
- తదుపరి విచారణ 29కి వాయిదా వేసిన న్యాయమూర్తి



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో తనను అన్యాయంగా ఇరికించారని.. పోలీసులు అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు హైకోర్టును కోరారు. ఈ మేరకు ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 'అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావు వారంలో భారత్ రావడానికి సిద్ధంగా ఉన్నారు. రాగానే పోలీసులు అదుపులోకి తీసుకొనే అవకాశం ఉంది. ప్రభాకర్‌రావు 30 ఏళ్లకుపైగా ప్రభుత్వ సర్వీసులో వివిధ హోదాల్లో పనిచేశారు. ఎంతో విధేయతతో పనిచేయడంతో అనేక గుర్తింపులు దక్కాయి. 65 ఏళ్ల వయసులో కేన్సర్‌తో బాధపడుతున్నారు. పోలీసుల వాదన ప్రకారం ప్రభాకర్‌రావు, శ్రవణ్‌కుమార్ పరారీలోని నిందితులే. ఇద్దరూ విదేశాల్లోనే ఉన్నారు. శ్రవణ్ విజ్ఞప్తిని అంగీకరించి సుప్రీంకోర్టు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. అవే ఉత్తర్వులను ప్రభాకర్‌రావుకు కూడా వర్తింపజేస్తే దర్యాప్తునకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలో ఎవరి ఫోన్‌ను ట్యాపింగ్ చేయాలన్నా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి, డీజీపీతో కూడిన కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ కమిటీని ప్రశ్నించని దర్యాప్తు అధికారులు.. ప్రభాకర్‌రావు వెంట పడుతున్నారు. రాజకీయంగా కొందరిపై పగతీర్చుకోవడం కోసం ప్రభుత్వం ఆయన్ను పావుగా వాడుకోవాలని చూస్తోంది. పరారీలోని వ్యక్తిగా ప్రకటించడానికి ముందే లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఇది ఢిల్లీ హైకోర్టు తీర్పును ఉల్లంఘించడమే. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే వెంటనే హైదరాబాద్‌కు వస్తారు' అని నివేదించారు.

అవసరం కోసం రంగులు మారుస్తున్నారు..

ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదిస్తూ 'ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు కీలకపాత్ర పోషించారు. ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని ఉల్లంఘించి అధికార యంత్రాంగాన్ని వ్యక్తిగత లాభం కోసం ఫోన్ ట్యాపింగ్‌కు వినియోగించుకున్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తి రిటైరయ్యాక ఓఎస్డీగా ఎలా కొనసాగారు? కేసు నమోదు కాగానే తిరుమలకు.. అక్కడి నుంచి చెన్నైకి.. అక్కడి నుంచి అమెరికా ఎలా వెళ్లగలిగారు? అవసరం కోసం ఊసరవెల్లిగా రంగులు మారుస్తున్నారు. ముందస్తు బెయిల్‌కు ప్రభాకర్‌రావు అర్హుడు కాదు' అని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ ఈ నెల 29కు వాయిదా వేశారు. ప్రభుత్వం తరఫున లూథ్రాతో పాటు పీపీ పల్లె నాగేశ్వర్‌రావు విచారణకు హాజరయ్యారు.

నయా ఫాసిస్టు విధానాలపై పోరాటం

- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను



ఖమ్మం మయూరిసెంటర్: నయా ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) అలుపెరుగని పోరాటం చేస్తుందని సంఘం జాతీయ అధ్యక్షుడు వీపీ సాను తెలిపారు. హిందూ, హిందుస్తానీ అంటూ కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొస్తోందని, బీజేపీకి, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడిన విద్యార్థి నేతలను విద్యాలయాల నుంచి సస్పెండ్ చేస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 5వ మహాసభల సందర్భంగా ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో సాను మాట్లాడారు. కశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి భద్రతా వైఫల్యమే కారణమని ఆరోపించారు. పార్లమెంట్ మొదలు పుల్వామా వరకు అనేక చోట్ల ఉగ్రదాడులు జరుగుతున్నాయని, ప్రధానిగా నరేంద్రమోదీ, హోంమంత్రిగా అమిత్ షాకు కొనసాగే అర్హత లేదన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ విద్యా రంగంతోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, యూనివర్సిటీల్లో పోస్టులు భర్తీ చేయాలన్నారు. సభలో ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీశ్ నారాయణ్, విద్యావేత్తలు పాల్గొన్నారు.

జలదిగ్బంధం!

పాక్‌కు ఇక చుక్కలే

- సింధూ, ఉపనదులపై నిర్మాణాలు
- తక్షణం డ్యామ్‌ల సామర్థ్యం పెంపు
- ఆ దిశగా మూడంచెల వ్యూహం

దశాబ్దాల నాటి సింధూ నదీజల ఒప్పందాన్ని పక్కన పెడుతూ భారత్ కొట్టిన దెబ్బతో ఆర్థికంగా పాకిస్తాన్ నడ్డి విరిగినట్టేనని చెబుతున్నారు. కొందరు చెబుతున్నట్టుగా దీని ప్రభావం పూర్తిస్థాయిలో కనిపించేందుకు దశాబ్దాలేమీ పట్టదని జల వనరుల నిపుణులు అంటున్నారు. పాక్‌పై తక్షణ ప్రభావం చూపేందుకు పలు మార్గాలున్నాయని వారు చెబుతున్నారు. దీన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. సింధూ నదిపై డ్యాముల సామర్థ్యాన్ని పెంచనున్నట్టు వెల్లడించాయి. అందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నాయి. జీలం తదితర సింధూ ఉపనదుల విషయంలో కూడా ఇదే వ్యూహం అమలవుతుందని తెలిపాయి. వీటితో పాటు కొత్తగా డ్యాములు తదితరాల నిర్మాణం వంటివి కూడా శరవేగంగా జరిపే యోచన ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే చినాబ్ బేసిన్‌లో పలు డ్యాములు, ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. అవి పూర్తయ్యేందుకు ఐదేళ్ల దాకా పట్టవచ్చని అంచనా. తాజా పరిణామాల నేపథ్యంలో వాటన్నింటినీ శరవేగంగా పూర్తి చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



అపార నష్టం

సింధూ ఒప్పందం రద్దుతో పాక్‌కు కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఆ దేశ సాగునీటి అవసరాల్లో ఏకంగా 80 శాతం మేరకు ఈ ఒప్పందమే తీరుస్తోంది. అక్కడ ఉత్పత్తయ్యే 90 శాతం ధాన్యాలకు ఈ జలాలే ఆధారం. ఆ లెక్కన ఈ ఒప్పందం విలువ పాక్ జీడీపీలో నాలుగో వంతు పై చిలుకే. కరాచీ, లాహోర్, ముల్తాన్ వంటి పలు ముఖ్య నగరాల దాహార్తిని పూర్తిగా ఈ నదుల జలాలే తీరుస్తున్నాయి. ఆ లెక్కన భారత్ నిర్ణయంతో పాక్‌కు గొంతెండటంతో పాటు మొత్తం సాగు వ్యవస్థే కుదేలవడం ఖాయం.

చుక్క కూడా వదిలేది లేదు

- కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్
- అతి త్వరలో సమగ్ర వ్యూహం
- ప్రధాని ఆదేశాలిచ్చినట్టు వెల్లడి
- సింధూ ఒప్పందంపై సమీక్ష
- అమిత్ షా తదితరుల హాజరు

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు చుక్క నీటిని కూడా వదలబోమని కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ స్పష్టం చేశారు. ''ఆ దిశగా సమగ్ర వ్యూహాన్ని రూపొందిస్తున్నాం. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే పలు సూచనలు చేశారు. స్పష్టమైన ఆదేశాలిచ్చారు'' అని వెల్లడించారు. సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ నేపథ్యంలో ఈ విషయమై చేపట్టాల్సిన తదుపరి చర్యల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. పాటిల్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు అందులో పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధాని ఆదేశాల అమలుకు చేపట్టాల్సిన చర్యలపైనే భేటీలో ప్రధానంగా చర్చించినట్టు వివరించారు. అమిత్ షా కూడా పలు సూచనలు చేసినట్టు తెలిపారు. ఈ దిశగా స్వల్ప, దీర్ఘకాలిక చర్యలు చేపడుతూ మూడంచెల వ్యూహంతో కేంద్రం ముందుకు సాగనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

పాక్‌కు సమాచారం

తొమ్మిదేళ్ల సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం భారత్, పాక్ నడుమ 1960లో సింధూ జలాల ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తూర్పుకు పారే సట్లెజ్, బియాస్, రావి నదీ జలాలు భారత్‌కు; పశ్చిమానికి ప్రవహించే సింధు, జీలం, చీనాబ్ నదుల జలాలు పాక్‌కు చెందాయి. సింధూ జలాల్లో 20 శాతం భారత్‌కు, 80 శాతం పాక్‌కు దక్కేలా అంగీకారం కుదిరింది. ఆ ఒప్పందాన్ని పక్కన పెడుతున్నట్టు పాక్‌కు కేంద్రం లాంఛనంగా వర్తమానమిచ్చింది. కేంద్ర జల వనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఈ మేరకు పాక్ జల వనరుల శాఖ కార్యదర్శికి ఇప్పటికే లేఖ రాశారు. జమ్మూ కశ్మీర్‌ను లక్ష్యం చేసుకుని పాక్ సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడుతోందని అందులో ఘాటుగా దుయ్యబట్టారు. ''ఏ ఒప్పందానికైనా పరస్పర విశ్వాసమే పునాది. దానికే మీరు తూట్లు పొడుస్తున్నారు. మీ దుశ్చర్యలు సింధూ ఒప్పందం కింద భారత్‌కు దఖలుపడ్డ హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. కనుక సింధూ ఒప్పందాన్ని గౌరవించాల్సిన అవసరం భారత్‌కు ఎంతమాత్రమూ లేదు'' అని కుండబద్దలు కొట్టారు. ఈ నేపథ్యంలో పాక్ అంగీకారంతో నిమిత్తం లేకుండా సింధూ, దాని ఉపనదులపై ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు వాటి జలాలను భారత్ తోచిన రీతిలో వాడుకునే వీలుంది. వాటికి సంబంధించి దాయాదికి ఎలాంటి ముందస్తు సమాచారమూ ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండదు. దీనిపై పాక్ తీవ్రంగా ఆక్రోశించడం, నీటిని ఆపే చర్యలను తమపై యుద్ధ ప్రకటనగా భావిస్తామంటూ బీరాలు పలకడం తెలిసిందే.

– సాక్షి, నేషనల్ డెస్క్



శిథిలాల దిబ్బగా మారిన ఆదిల్ నివాసం

బలగాలను బలి తీసుకునేందుకు... సొంతిళ్లలో ఐఈడీలు!

పహల్గాం ముష్కరుల కుట్ర • తృటిలో తప్పించుకున్న సైనికులు

శ్రీనగర్: పహల్గాం దాడిలో పాల్గొన్న లష్కరే తొయిబా ఉగ్రవాదులు తమకోసం వేటాడుతున్న భద్రతా బలగాలను బలి తీసుకునేందుకు పక్కాగా స్కెచ్ వేశారు. పథకం ప్రకారం వారికి తమ ఇళ్ల ఆచూకీ చిక్కేలా చేశారు. ఇళ్ల నిండా అత్యాధునిక పేలుడు పదార్థాలు (ఐఈడీ) అమర్చారు. బలగాలు లోనికి అడుగు పెట్టగానే అవి పేలేలా ప్లాన్ చేశారు. పహల్గాం దాడి నుంచి తప్పించుకున్న పర్యాటకుల సాయంతో నిఘా వర్గాలు ఆసిఫ్ ఫౌజీ, మరో ఇద్దరు ఉగ్రవాదుల ఊహా చిత్రాలు రూపొందించి విడుదల చేయడం తెలిసిందే. వారితో పాటు కశ్మీర్‌కు చెందిన ఆదిల్ హుస్సేన్ థోకర్ అనే లష్కరే ఉగ్రవాది కూడా తమపై కాల్పులకు తెగబడ్డట్టు అతని ఫొటో చూసి పర్యాటకులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో దక్షిణ కశ్మీర్‌లోని బిజ్ బెహరాలోని ఫౌజీ, త్రాల్ ప్రాంతంలోని ఆదిల్ నివాసాల్లో శుక్రవారం భద్రతా దళాలు తనిఖీలు జరిపాయి. దీన్ని ఊహించిన ముష్కరులు తమ ఇళ్లలో ముందే ఐఈడీలు అమర్చి ఉంచారు. తనిఖీల సమయంలో అవి ఒక్కసారిగా యాక్టివేట్ అయ్యాయి. దాన్ని గమనించిన బలగాలు ఉన్నపళంగా బయటికి వచ్చేశాయి. ఆ వెంటనే భారీ పేలుళ్లు సంభవించాయి. దాంతో ఉగ్ర కుట్ర నుంచి భద్రతా సిబ్బంది తృటిలో తప్పించుకున్నారు. అనంతరం రెండు నివాసాలనూ బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఆదిల్ 2018లో పాక్‌కు వెళ్లి ఐదేళ్ల పాటు లష్కరే వద్ద ఉగ్ర శిక్షణ పొంది తిరిగొచ్చినట్టు నిఘా వర్గాలు ఇప్పటికే వెల్లడించడం తెలిసిందే. పహల్గాం ముష్కరుల వివరాలు తెలిపిన వారికి పోలీసులు ఇప్పటికే రూ.20 లక్షల రివార్డు ప్రకటించారు.



పేలుళ్లతో ధ్వంసమైన ఆసిఫ్ షేక్ ఇల్లు

ఔను, ఉగ్రవాదాన్ని పోషించాం


అంగీకరించిన పాక్ రక్షణ మంత్రి

- మూడు దశాబ్దాలుగా ఉగ్ర శిక్షణ
- ఆ చెత్తపనులన్నీ అమెరికా కోసమే
- అంతర్జాతీయ మీడియాతో ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: ఉగ్రవాదమే తన అసలు ముఖమని పాకిస్తాన్ ఎట్టకేలకు అంగీకరించింది. ఉగ్రవాదానికి దశాబ్దాలుగా అడ్డాగా మారినట్టు అంగీకరించింది. ఈ మేరకు సాక్షాత్తూ ఆ దేశ రక్షణ మంత్రే స్పష్టంగా ప్రకటన చేశారు. కనీసం 30 ఏళ్లుగా ఉగ్ర తండాలను పాక్ పెంచి పోషిస్తూ వస్తోందని అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలోనే చెప్పారు! దాంతో ఈ విషయమై భారత్ ఇంతకాలంగా చెబుతూ వస్తున్నది అక్షరసత్యమని నిరూపణ అయింది. స్కై న్యూస్ మీడియాకు పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా ఇంటర్వ్యూ ఇచ్చారు. 'ఉగ్రవాద సంస్థలకు దన్నుగా నిలిచిన సుదీర్ఘ చరిత్ర పాక్‌కు ఉంది. దీనిపై మీరేమంటారు?' అని జర్నలిస్టు యాల్దా హకీం ప్రశ్నించారు. దానికి మంత్రి స్పందిస్తూ, ''అవును. అది నిజమే'' అంటూ అంగీకరించారు. అయితే, ''అమెరికా, బ్రిటన్, ఇతర పాశ్చాత్య దేశాల కోసమే మేం కనీసం 30 ఏళ్లుగా ఈ చెత్త పని చేస్తూ వస్తున్నాం'' అని చెప్పుకొచ్చారు. తద్వారా ఉగ్ర పాపాన్ని అగ్ర దేశాలకూ అంటించే ప్రయత్నం చేశారు. తాము శిక్షణ ఇచ్చిన ఉగ్రవాదులను అఫ్గాన్‌లో సోవియట్‌పై పోరుకు అమెరికా వాడుకుందని ఖవాజా ఆరోపించారు. ''మేం చేసింది నిజంగా దిద్దుకోలేని పొరపాటే. అందుకు పాక్ భారీ మూల్యమే చెల్లించుకుంది. పూడ్చుకోలేనంతగా నష్టపోయింది. సోవియట్ యూనియన్‌పై పోరులో, 2001 సెప్టెంబర్ 11 అల్‌కాయిదా ఉగ్ర దాడి అనంతర చర్యల్లో అమెరికాతో చేతులు కలపకపోతే పాక్ ట్రాక్ రికార్డు అద్భుతంగా ఉండేది. మా చరిత్రే వేరుగా ఉండేది'' అంటూ వాపోయారు. సోవియట్‌తో ప్రచ్ఛన్నయుద్ధంలో, న్యూయార్క్ జంట టవర్లపై ఉగ్ర దాడి తర్వాత అఫ్గానిస్తాన్‌పై ఆక్రమణలో అమెరికాకు పాక్ దన్నుగా నిలవడం తెలిసిందే.

లష్కరే లేనేలేదట!

పహల్గాం ఉగ్ర దాడిని భారతే చేయించుకుందంటూ ఖవాజా వాచాలత ప్రదర్శించారు. కశ్మీర్‌తో పాటు పాక్‌లో సంక్షోభం సృష్టించడమే దాని లక్ష్యమంటూ సంధి ప్రేలాపనకు దిగారు. లష్కరే తొయిబా ఉగ్ర సంస్థ అసలు ఉనికిలోనే లేదంటూ బుకాయించారు. పహల్గాం దాడి తమ పనేనని ప్రకటించిన లష్కరే ముసుగు సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ పేరైనా ఎప్పుడూ విన్లేదంటూ అమాయకత్వం ప్రదర్శించారు. పాక్ కూడా దశాబ్దాలుగా ఉగ్రవాద బాధితురాలేనంటూ మొసలి కన్నీరు కార్చారు. 2019 బాలాకోట్ మాదిరిగా భారత్ సైనిక చర్యకు దిగుతుందని భావిస్తున్నారా అని ప్రశ్నించగా, అలా చేస్తే పూర్తిస్థాయి యుద్ధం తప్పదంటూ ఖవాజా మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.



దురాక్రమణను ఎదుర్కొంటాం

పహల్గాం దాడితో పాక్ సంబంధముందన్న భారత్ ఆరోపణలు నిరాధారాలంటూ ఆ దేశ సెనేట్ శుక్రవారం తీర్మానం చేసింది. ''మాపై దురాక్రమణకు దిగితే దీటుగా ఎదుర్కొంటాం. ఆ సామర్థ్యం మాకుంది'' అని పేర్కొంది. సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పక్కన పెట్టడాన్ని ఖండించింది.

ముష్కరుల వేటలో భారత్‌కు సహకరిస్తాం

తులసీ గబ్బార్డ్ హామీ

వాషింగ్టన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది హిందువులను పొట్టనబెట్టుకున్న ముష్కరుల వేటలో భారత్‌కు తమ దేశం పూర్తిగా సహకరిస్తుందని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ స్పష్టం చేశారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆమె శుక్రవారం 'ఎక్స్' వేదికగా సానుభూతి ప్రకటించారు. దాడికి కారకులైన ఉగ్రవాదులను పట్టుకునేందుకు భారత్‌కు సాయంగా నిలుస్తామని అమెరికా విదేశాంగ శాఖ ఇప్పటికే ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. దారుణాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

బయోమెట్రిక్స్, చిరునామా

హెచ్‌–1బీ వీసా దరఖాస్తుదారులకు అమెరికా కొత్త నిబంధనలు

వాషింగ్టన్: వీసాల విషయంలో రోజుకో కొత్త నిబంధనతో ఆశావహులకు అమెరికా చుక్కలు చూపుతోంది. హెచ్‌–1బీ వీసా దరఖాస్తుదారులు ఇంటి చిరునామా, బయో మెట్రిక్ డేటా వంటి వ్యక్తిగత సమాచారం అందజేయాలని అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్ సీఐఎస్) తాజాగా ఆదేశించింది. ఈ మేరకు వివరాలు సమర్పించాలంటూ వారికి రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఎఫ్ఈ) జారీ చేస్తోంది. అమెరికాలోని 240కి పైగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదవాలని కలలుగనే అంతర్జాతీయ విద్యార్థులకు ఇది కొత్త సమస్యగా మారనుంది. దీని వెనక ఉద్దేశాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌–1బీ వీసా దరఖాస్తులకు బయోమెట్రిక్స్ అవసరమే ఉండదని ఇమ్మిగ్రేషన్ అటార్నీలు అంటున్నారు.

కశ్మీరీ పండిట్లు, రైల్వే ఆస్తులపై ఉగ్ర గురి

శ్రీనగర్: రైల్వే మౌలిక వనరులు, కశ్మీరీ పండిట్లు, స్థానికేతరులే లక్ష్యంగా కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడులకు పథకం వేస్తున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. శ్రీనగర్, గండేర్‌బల్‌లలోని పోలీసులపైనా దాడులు చేసేందుకు ఐఎస్ఐ పథకం వేసిందని సమాచారం. ఈ హెచ్చరికలతో భద్రతా బలగాలు అప్రమత్తత ప్రకటించాయి. కశ్మీర్‌లో రైల్వే ఆస్తులు దాడులకు అనుకూలంగా ఉండటం, ఇక్కడ పని చేసే రైల్వే సిబ్బందిలో ఎక్కువ మంది స్థానికేతరులే కావడం గమనార్హం. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు అధికారు లు ముందు జాగ్రత్తలు ప్రకటించారు. రైల్వే ఉద్యోగులు తమ క్వార్టర్లను వదిలి బయటకు వెళ్లడం తక్షణమే మానుకోవాలని హెచ్చరించారు.

ఐక్యంగా ఎదుర్కొందాం

- ముష్కర మూకల కుట్రలను తిప్పికొడదాం
- కాంగ్రెస్ నేత రాహుల్ పిలుపు
- పహల్గాం ఉగ్రదాడి బాధితుడికి పరామర్శ

శ్రీనగర్: దేశ ప్రజలంతా కలిసికట్టుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. మనమంతా ఐక్యంగా ఉంటే ఉగ్రవాదం అంతం కావడం ఖాయమని చెప్పారు. ప్రజల మధ్య చిచ్చు పెట్టి, విభజన తీసుకురావాలన్న లక్ష్యంతోనే పహల్గాంలో ఉగ్రవాద దాడి జరిగిందని అన్నారు. కలిసి ఉంటున్న సోదరుల మధ్య గొడవలు పెట్టాలన్నదే ముష్కరుల ఉద్దేశమని ఆరోపించారు. ముష్కర మూకల కుట్రలను తిప్పికొట్టడానికి మనమంతా ఒక్కటై చేతులు కలపాలని సూచించారు. ఐక్యమత్యమే మన బలమని ఉద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించడానికి యావత్ దేశం ఐక్యంగా ఉండాలని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ శుక్రవారం జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లోని సైనిక ఆసుపత్రిని సందర్శించారు. ఇక్కడ చికిత్స పొందుతున్న పహల్గాం ఉగ్రవాద దాడి బాధితుడిని పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని బాధితుడికి భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అసలేం జరిగిందో తెలుసుకోవడానికి ఇక్కడికి వచ్చానని అన్నారు. పహల్గాం దాడి అత్యంత దారుణమని చెప్పారు. ఈ ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఈ దాడిలో ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు తన సానుభూతి ఉంటుందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొనే చర్యలు పూర్తి మద్దతు ఇస్తున్నామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షం మొత్తం ప్రభుత్వానికి అండగా ఉంటుందన్నారు. దేశంలో ఇతర ప్రాంతాల్లో జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రజలపై దాడుల జరుగుతుండడం విచారకరమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మన సోదర సోదరీమణులను లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదని చెప్పారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనమంతా ఒక్కటి కావాలని కోరారు. మరోవైపు జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతోపాటు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాలపై చర్చించారు. అంతకుముందు జమ్మూకశ్మీర్ వ్యాపారులు, విద్యార్థి సంఘాల నాయకులు, పర్యాటక రంగ ప్రతినిధులతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న రాహుల్

వక్ఫ్ చట్టంపై స్టే ఇవ్వొద్దు

- చట్టం రాజ్యాంగబద్ధతపై ఊహాగానాలే వినిపిస్తున్నాయి
- అందుకే అన్ని పిటిషన్లు కొట్టివేయండి
- సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం–2025 అమలును పాక్షికంగా లేదా తాత్కాలికంగా కూడా నిలిపివేయొద్దని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం ద్వారా ఈ చట్టం అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. చట్టం రాజ్యాంగబద్ధతపై వ్యక్తమవుతున్నవి కేవలం ఊహాగానాలేనని స్పష్టంచేసింది. అందుకే అందుకే చట్టం అమలుపై స్టే విధిస్తూ ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని విన్నవించింది. చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను కొట్టివేయాలని అత్యున్నత న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రెటరీ షెర్షా సి.షేక్ మొహిద్దీన్ శుక్రవారం సుప్రీంకోర్టులో 1,332 పేజీల ప్రాథమిక అఫిడవిట్ కౌంటర్ దాఖలు చేశారు. వివాదాస్పదంగా మారిన ఈ చట్టాన్ని కేంద్రం సమర్థించుకుంది. 2013 తర్వాత దేశంలో అదనంగా 20.92 లక్షల ఎకరాల భూమిని వక్ఫ్ ఆస్తిగా మార్చారని అఫిడవిట్‌లో వెల్లడించింది. వక్ఫ్ ఆస్తులు ఏకంగా 116 శాతం పెరగడం ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొంది. స్వాతంత్ర్యం కంటే ముందు, స్వాతంత్ర్యం తర్వాత 18.29 లక్షల ఎకరాల భూమి వక్ఫ్ ఆస్తిగా ఉండేదని పేర్కొంది. గతంలో అమల్లో ఉన్న వక్ఫ్ చట్టాన్ని దుర్వినియోగం చేశారని, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి వక్ఫ్ ఆస్తులుగా మార్చేశారని ఆక్షేపించింది. ఇలాంటి ఆక్రమణలు అడ్డుకోవడానికే వక్ఫ్(సవరణ) చట్టాన్ని తీసుకొచ్చినట్లు స్పష్టంచేసింది. రాజకీయ పార్టీల సభ్యులతో కూడిన పార్లమెంటరీ ప్యానెల్ ద్వారా లోతైన అధ్యయనం, విశ్లేషణ చేసిన తర్వాతే చట్టంలో సవరణలు తీసుకొచ్చినట్లు వివరించింది. పలు సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కులను హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికపై కొందరు పిటిషన్లు దాఖలు చేశారని కేంద్రం విమర్శించింది. వాటిని కొట్టివేయాలని సుప్రీంకోర్టును కోరింది. సవరణ చట్టంతో వక్ఫ్ బోర్డుల్లో ముస్లింలు మైనార్టీలుగా మారిపోతారన్న వాదనను కేంద్రం తిరస్కరించింది. చట్టంతో వారికి ఎలాంటి నష్టం జరగదని, వక్ఫ్ బోర్డులో వారు మెజార్టీగా ఉంటారని తెలియజేసింది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్(సీడబ్ల్యూసీ)లో మొత్తం 22 మంది సభ్యులుంటారని, ఇందులో నలుగురు ముస్లిమేతరులు ఉంటారని వెల్లడించింది. వక్ఫ్(సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై మే 5న తదుపరి విచారణ జరగనుంది. అప్పటిదాకా వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని, కేంద్ర వక్ఫ్ మండళ్లలో కొత్తగా నియామకాలు చేపట్టబోమని కేంద్రం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తాజాగా ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.

లష్కరే టాప్ కమాండర్ హతం

- లల్లీని మట్టుబెట్టిన భద్రతా దళాలు
- పహల్గాం ముష్కరుల కోసం వేట
- బందిపురాలో ఆర్మీ చీఫ్ సమీక్ష



శ్రీనగర్: వేట మొదలైంది. పహల్గాంలో పర్యాటకులపై పాశవిక దాడికి తెగబడ్డ పాకిస్తానీ ఉగ్ర సంస్థ లష్కరే తొయిబాకు గట్టి దెబ్బ తగిలింది. లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని భద్రతా దళాలు శుక్రవారం మట్టుబెట్టాయి. పహల్గాం దాడికి కారకులైన ఉగ్రవాదులను అంతమొందించేందుకు సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో లల్లీ హతమయ్యాడు. బందిపురాలో ఉగ్రవాదులు నక్కారన్న నిఘా సమాచారం మేరకు సైన్యంతో పాటు జమ్మూకశ్మీర్ పోలీసులు శుక్రవారం ఉదయం సంయుక్తంగా గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురుకాల్పుల్లో లల్లీ హతమయ్యాడు. కాల్పుల్లో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హుటాహుటిన శ్రీనగర్ చేరుకున్నారు. బందిపోరాలో జరుగుతున్న ఆపరేషన్ గురించి తెలుసుకోవడంతో పాటు పరిస్థితిని సమీక్షించారు. పహల్గాం ముష్కరులను పట్టుకునేందుకు భద్రతా బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. దాడి నుంచి బయటపడ్డ పర్యాటకులు అందించిన వివరాల ఆధారంగా ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబూ తల్హా అనే ముగ్గురు అనుమానితుల ఫొటోలను ఇప్పటికే విడుదల చేయడం తెలిసిందే.

ఎల్‌ఓసీ వెంబడి పాక్ కాల్పులు

పహల్గాం ఉగ్రదాడి జరిగిన మూడు రోజుల తర్వాత పాక్ కాల్పులకు తెగబడింది. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి ఉన్న అనేక పోస్టుల నుంచి పాక్ సైన్యం రాత్రంతా కాల్పులకు దిగింది. అందుకు భారత సైన్యం దీటుగా బదులిచ్చింది. భారత్ వైపు నుంచి ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఉగ్ర దాడి, తదనంతర ఉద్రిక్తతల నేపథ్యంలో అరేబియా సముద్రంపై పాక్ నో ఫ్లై జోన్ ప్రకటించడంతో ఇరుదేశాలు అప్రమత్తంగా ఉన్నాయి.

పాకిస్తాన్ పౌరులకు 14 కేటగిరీల వీసాలు రద్దు

న్యూఢిల్లీ: పాకిస్తాన్ పౌరులకు ఇచ్చిన 14 కేటగిరీల వీసాలను రద్దు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ శుక్రవారం వెల్లడించింది. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టంచేసింది. ఇందులో బిజినెస్, కాన్ఫరెన్స్, విజిటర్ వంటి వీసాలు ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు సమాచారం చేరవేసింది. పాకిస్తాన్ జాతీయులకు జారీ చేసిన లాంగ్‌టర్మ్, దౌత్య, అధికారిక వీసాలకు మాత్రం మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొంది. సార్క్ వీసాలు కలిగినవారంతా ఈ నెల 26వ తేదీలోగా దేశం విడిచివెళ్లిపోవాలని ఆదేశించింది. బిజినెస్, ఫిలిం, జర్నలిస్టు, ట్రాన్సిట్, స్టూడెంట్, గ్రూప్ టూరిస్టు వంటి వీసాలు పొందినవారు ఈ నెల 27వ తేదీలోగా ఇండియాను వీడాల్సి ఉంటుందని స్పష్టంచేసింది. పాకిస్తాన్‌లోని మైనార్టీలకు ఇచ్చిన బృంద యాత్రికుల వీసాలను సైతం రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక మెడికల్ వీసాలపై ఇండియాకు వచ్చినవారు ఈ నెల 29వ తేదీలోగా స్వదేశానికి వెళ్లిపోవాలని కేంద్ర హోంశాఖ తేల్చిచెప్పింది.


పాకిస్తానీలను పంపేయండి

సీఎంలకు కేంద్రం ఆదేశం • స్వయంగా ఫోన్లు చేసిన అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్ పౌరులందరినీ గుర్తించి తక్షణం వెనక్కి పంపించాలని అన్ని రాష్ట్రాలనూ కేంద్రం ఆదేశించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వ్యక్తిగతంగా ఫోన్లో మాట్లాడారు. ఈ మేరకు తక్షణం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాక్ పౌరులకు అన్ని రకాల వీసాలనూ రద్దు చేసినట్లు భారత్ ప్రకటించడం తెలిసిందే. పాకిస్తానీ హిందువులకు జారీ చేసిన దీర్ఘకాలిక వీసాలకు మాత్రం ఈ నిషేధం వర్తించదు.

ఇస్రో మాజీ చీఫ్ కస్తూరి రంగన్ కన్నుమూత

- బెంగళూరులోని స్వగృహంలో తుదిశ్వాస
- సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి, ప్రధాని



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)మాజీ చీఫ్ డాక్టర్ కుమారస్వామి కస్తూరి రంగన్ (84) కన్నుమూశారు. బెంగళూరులోని స్వగృహంలో శుక్రవారం ఉదయం 10.43 గంటల సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. కొన్ని నెలలుగా వయోసంబంధ ఆరోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారని చెప్పారు. 2023లో శ్రీలంక వెళ్లిన కస్తూరి రంగన్ గుండెపోటుకు గురయ్యారు. అప్పటి నుంచి ఆయన బయటకు రావడం తగ్గిపోయింది. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. కె.కస్తూరి రంగన్ మృతిపట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కేరళలోని ఎర్నాకులంలో సీఎం కృష్ణస్వామి అయ్యర్, విశాలాక్షి దంపతులకు 1940 అక్టోబర్ 24న కస్తూరి రంగన్ జన్మించారు. బాంబే యూనివర్సిటీ నుంచి ఫిజిక్స్‌లో పీజీ, 1971లో అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు కస్తూరి రంగన్.

ఇస్రోతో 35 ఏళ్ల అనుబంధం

ఇస్రోతో 1994 నుంచి 2003 వరకు 35 ఏళ్ల అనుబంధ ఆయనది. దేశం మొదటిసారిగా ప్రయోగాత్మకంగా ప్రయోగించిన ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహాలు భాస్కర 1, 2లకు కస్తూరి రంగన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేశారు. రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ ఐఆర్ఎస్–1ఏ ప్రయోగం ఆయన మార్గదర్శకత్వంలోనే జరిగింది. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాలు ఆయన సారథ్యంలోనే చేపట్టారు. 2003లో ఇస్రో పగ్గాలు చేపట్టిన కస్తూరిరంగన్ దాదాపు తొమ్మిదేళ్లపాటు బాధ్యతల్లో కొనసాగారు. స్పేస్ కమిషన్ చీఫ్‌గా, భారత ప్రభుత్వ అంతరిక్ష శాఖకు సెక్రటరీగా ఉన్నారు. ఆయనందించిన విశిష్ట సేవలకు గాను ప్రభుత్వం 1982లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్, 2000లో పద్మ విభూషణ్‌తో గౌరవించింది.

వైఎస్ జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ (84) మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్' ఖాతాలో శుక్రవారం నివాళులర్పిస్తూ ట్వీట్ చేశారు. 'ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె. కస్తూరిరంగన్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. భారత అంతరిక్ష చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే విఖ్యాత శాస్త్రవేత్త, దూరదృష్టి గల విద్యా వేత్త, పర్యావరణ పరిరక్షణలో నిబద్ధత కలిగిన వ్యక్తి ఆయన. భారత అంతరిక్ష రంగ చరిత్రలో ఆయన తనదైన ముద్ర వేశారు. మహోన్నత వ్యక్తికి నా ఘన నివాళులు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను' అని వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.



బడికి టాటా.. 50 రోజుల ఆట

సాక్షి, హైదరాబాద్: పరీక్షా కాలం ముగిసింది.. చదువుల ఒత్తిడి నుంచి పిల్లలకు విరామం లభించింది.. బడులకు టాటా చెప్పి ఆటపాటలతో సేదతీరే వేళయింది. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో దాదాపు 50 రోజులపాటు సందడే సందడి నెలకొననుంది. అయితే వినోదాల పేరిట పిల్లలు ఇష్టారీతిన వ్యవహరిస్తూ దారితప్పకుండా తల్లిదండ్రులు ఇప్పుడే దృష్టి పెట్టాలని.. వారు ఏం చేస్తున్నారో ఓ కంట కనిపెడుతూ ఉండాలని.. అవసరమైన మార్గదర్శనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అందుకు తగ్గ ప్రణాళిక రచించాలంటున్నారు. కాసేపు టీవీలు చూడనిచ్చినా కుటుంబ సభ్యులంతా కలిసి ఆడుకొనే ఆటలపై దృష్టి పెట్టాలని చెబుతున్నారు.

ఆన్‌లైన్‌కు బానిసలు కానివ్వొద్దు

పట్టణాలు, నగరాల్లో పిల్లలకు ఆటస్థలాల కొరత వల్ల చాలా మంది సెల్‌ఫోన్లు, ఆన్‌లైన్ ఆటలకే పరిమితమయ్యే అవకాశం ఉంది. ఇలా చేయడం వల్ల 50 రోజుల్లో వారి మానసిక ధోరణిలో మార్పులొస్తాయని ప్రముఖ మానసిక శాస్త్రవేత్త అంజలా గౌరీ తెలిపారు. ఈ విధానం వల్ల రెండేళ్లలో మెదడు మొద్దుబారి విచిత్ర ధోరణి ప్రదర్శించిన 28 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. రేయింబవళ్లు సెల్‌ఫోన్లకు పరిమితమవడం నిద్రలేమికి దారితీస్తుందని.. ఫలితంగా వారి మానసిక ధోరణిలో మార్పులొస్తాయని హైదరాబాద్‌కు చెందిన మానసిక నిపుణులు అరోరీ వాగ్దేవి తెలిపారు. గతేడాది వేసవి సెలవుల్లో తన కుమారుడు అదేపనిగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం వల్ల తిరిగి స్కూల్ తెరిచాక ఏడాదంతా పాఠ్యపుస్తకాలు చదవాలంటే ఒక రకమైన భయం పట్టుకుందని కూకట్‌పల్లికి చెందిన ఓ విద్యార్థి తల్లి పేర్కొన్నారు.

వేసవి సెలవులతో విద్యార్థులకు ఇక సందడే సందడి

ఆటపాటలతో ఆరోగ్యం.. స్నేహబంధం మరింతగా అల్లుకొనేందుకు అవకాశం

వినోదాల పేరిట పిల్లలు దారితప్పకుండా తల్లిదండ్రులు చూసుకోవాలంటున్న నిపుణులు

ఆన్‌లైన్ వ్యసనానికి దూరం చేయాల్సిన బాధ్యత వారిదేనని వెల్లడి

ఆప్యాయతల విలువ తెలుసుకొనేలా అమ్మమ్మల ఊళ్లకు పంపాలని సూచన

దీనివల్ల వారి మానసిక ధోరణి మెరుగవుతుందంటున్న భారత సైకాలజీ అసోసియేషన్

బంధాల వైపు మళ్లించాలి

పిల్లలకు అమ్మమ్మ, తాతయ్యల ఊళ్లలో గడిపే అవకాశం ఇవ్వడం వల్ల సంబంధ బాంధవ్యాలు మెరుగుపడటంతోపాటు పొడుపు కథల వంటివి వారి నుంచి నేర్చుకునే అవకాశం ఉంటుందని తెలుగు భాషపై వరంగల్ స్కాలర్ వినీత్ భార్గవ్ జరిపిన పరిశోధనలో వెలుగులోకి వచ్చింది. నానమ్మలు, తాతయ్యలు, అమ్మమ్మల అనుభవాల్లోంచి కథలు నేర్చుకొనే పిల్లల్లో ఆత్మవిశ్వాసం కనిపిస్తోందని.. 100 మందిలో 82 మంది తరగతి గదుల్లోనూ చురుకుగా వ్యవహరించిన తీరును గుర్తించామని ఆయన పేర్కొన్నారు. దీంతోపాటు గ్రామీణ అనుబంధాలు, బంధువులతో మమేకమైనప్పుడు కలిగే అనుభూతులు విద్యార్థుల మానసిక ధోరణిలో మార్పు తెస్తున్నాయన్నారు. అనుబంధాలు పెంచుకొనే పిల్లల మానసిక ధోరణి ఇతరులతో పోలిస్తే భిన్నంగా ఉంటోందని భారత సైకాలజీ అసోసియేషన్ జరిపిన ఓ పరిశోధన తేల్చింది. 468 మందిపై అసోసియన్ ఆన్‌లైన్ సర్వే చేపట్టింది. ఎవరికి ఎవరు అనే ధోరణి నుంచి బయటపడిన పిల్లల్లో 332 మంది వేసవి సెలవుల్లో పెద్దవాళ్ల దగ్గర నేర్చుకున్న జ్ఞానమేనని తేలింది.



జాగ్రత్తగా వ్యాయామం

ఆట విడుపులో భాగంగా పిల్లలు నిత్యం క్రికెట్, కబడ్డీ లాంటి రకరకాల క్రీడలు ఆడుతుంటారు. దీనివల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా బలపడతారని వ్యాయామ కళాశాలలో విశేష అనుభవం ఉన్న జీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆటలతో స్నేహాలు మరింత మెరుగవుతాయని.. కొత్త స్నేహాలను చిగురింపజేస్తాయని పేర్కొన్నారు. అయితే ఈ క్రమంలో పిల్లలు ఘర్షణలు, విభేదాల వైపు మళ్లకుండా మార్గదర్శకుల పర్యవేక్షణలో వారు ఆటలు ఆడేందుకు వీలున్న గ్రౌండ్లకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది విద్యార్థులు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్తూ సేదతీరుతుంటారు. అయితే ఇందులో ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 32 మంది ఇలాంటి ఘటనల్లో తీవ్రంగా గాయపడగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.



“వేసవి సెలవుల్లో పిల్లల్ని ఖాళీగా వదిలేస్తే ఫోన్లు, టీవీలకు అతుక్కుపోవడమో లేదా ఎండలో స్నేహితులతో తిరగడమో చేస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పిల్లలకు నీతికథలు చెప్పాలి. గ్రామాల్లో ఇరుగుపొరుగు పిల్లలందరినీ ఒకచోట కూర్చోబెట్టి వారికి లోకజ్ఞానం నేర్పించే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పిల్లలు కూడా ఇవే కోరుకుంటున్నారు. బోర్‌గా ఫీలవ్వడం లేదు.

\- కాకి వీరభద్రం, వనం వారి కృష్ణాపురం, ఖమ్మం జిల్లా





కృత్రిమ మేధ (ఏఐ) గురించి తెలుసుకోవాలనే ఆసక్తి పిల్లల్లో పెరిగింది. దాని గురించి నేర్పడానికి ఇదే మంచి తరుణం. వేసవిలో వారితో కూర్చొని ఏఐపై కసరత్తు చేస్తే పిల్లలు బోర్‌గా ఫీలవ్వరు. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో ఈ తరహా మోటివేషన్ బాగా పనిచేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ పెద్దలు చొరవ తీసుకొని ఆన్‌లైన్‌లో ఏఐపై శిక్షణ ఇప్పించాలి.”

\- కంకిపాటి శేషుకుమార్, హైదరాబాద్

‘ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై కేబినెట్‌లో చర్చిస్తాం’



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికపై సమగ్ర అధ్యయనం చేసిన అనంతరం, తీసుకోవాల్సిన చర్యలపై వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చిస్తామని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదిక చూసిన బీఆర్‌ఎస్ నేతలు సిగ్గుపడాల్సింది పోయి ఇంకా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం భారత్ సమ్మిట్ ప్రాంగణంలో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీఆర్‌ఎస్ కట్టిన ఆ ప్రాజెక్టు వారి పాలనలోనే కుప్పకూలిపోయిందని, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎందుకూ పనికి రాకుండా పోయాయని ఉత్తమ్ విమర్శించారు. అయినా ఆ నిర్మాణాలు తమ గొప్పతనమంటూ బీఆర్‌ఎస్ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. కాళేశ్వరం పేరుతో అధిక వడ్డీతో లక్ష కోట్ల రూపాయల రుణం తెచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ధ్వజమెత్తారు.

బీఆర్‌ఎస్ నేతలు క్షమాపణలు చెప్పాలి: కాళేశ్వరం రైతుల కోసం నిర్మించింది కాదని, కేవలం బీఆర్‌ఎస్ నేతలు తమ జేబులు నింపుకునేందుకే దాన్ని ఉపయోగించుకున్నారని మంత్రి ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలను గుర్తిస్తామని, బాధ్యుల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదని, ఎవరికైనా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ప్రజాధనం ఉపయోగించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం సహించదగింది కాదన్నారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు బయటపడ్డాయని, ఇందుకు బీఆర్‌ఎస్ నేతలు తెలంగాణ రైతాంగానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు.



ఇదే నా ఇల్లు.. నాకు లేదా ఇందిరమ్మ ఇల్లు?

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఒంటరి మహిళ ఆవేదన

భీమారం: ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందని ఆ మహిళ ఎంతో ఆశపెట్టుకుంది. శిథిలావస్థకు చేరిన ఇంటిని తొలగించి ప్రస్తుతం నాలుగు వైపులా కర్రలు పాతి ప్లాస్టిక్ కవర్లతో గూడు ఏర్పాటు చేసుకుని ఉంటోంది. తీరా ఇల్లు మంజూరు కాకపోవడంతో ఆందోళన చెందుతోంది. మంచిర్యాల జిల్లా భీమారం మండలం మద్దికల్ గ్రామంలో బండారు లక్ష్మి ఒంటరిగా నివసిస్తోంది. ఇందిరమ్మ ఇంటికోసం దరఖాస్తు చేసుకుంది. శిథిలమైన ఇంటిని తొలగించి 4 నెలల క్రితం తాత్కాలిక ఆవాసం ఏర్పాటు చేసుకుంది. గ్రామంలో మొత్తం 104 మందికి ఇళ్లు మంజూరైనట్లు ప్రజాపాలన సభలో ప్రకటించారు. ఇందులో నుంచి 34 మందికి నిర్మాణాలకు అనుమతి ఇస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ జాబితాలో లక్ష్మి పేరు లేకపోవడంతో ఆమె తీవ్రంగా ఆందోళన చెందుతోంది. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలే గానీ ఆర్థికంగా ఉన్న వాళ్లకి ఎందుకు మంజూరు చేస్తున్నారని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది.



మాకెప్పుడు సెలవులు?

అన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించినా.. అంగన్‌వాడీ కేంద్రాలను మాత్రం నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు మండుటెండలో అవస్థలు పడుతూ.. రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరవుతున్నారు. అన్ని పాఠశాలలకు జూన్ 12వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించడం తెలిసిందే. అంగన్‌వాడీ కేంద్రాలు ఇంకా కొనసాగడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

\- సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

‘కాళేశ్వరం’లో అవినీతిపై సీబీఐ దర్యాప్తు కోరాలి

రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ నేతల సూచన

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాల బండారం బయటపెట్టేందుకు సీబీఐ దర్యాప్తు కోరడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, డా.పాల్వాయి హరీశ్‌బాబు, పార్టీనేతలు కాసం వెంకటేశ్వర్లు, డా. ఎస్.ప్రకాశ్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. లేని పక్షంలో అవినీతి నుంచి కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని ఈ ప్రభుత్వం రక్షిస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. కేసీఆర్ కుటుంబానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఏటీఎంగా మారిందన్న బీజేపీ విమర్శలు అక్షర సత్యాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. లక్ష కోట్లు వెచ్చించి కట్టిన ఈ ప్రాజెక్టు వల్ల రైతుల పొలాల్లో నీళ్లు పారలేదు కానీ, కమీషన్ల రూపంలో అవినీతి సొమ్ము కేసీఆర్ కుటుంబంలో ఏరులై పారిందని విమర్శించారు. మేడిగడ్డ ఏడో బ్లాకు మరమ్మతులకు కూడా పనికిరాకుండా దెబ్బతిన్నదని ఎన్డీఎస్ఏ చెప్పిందంటే ఈ ప్రాజెక్టు పేరిట ఎంత ప్రజాధనం దుర్వినియోగం అయిందో అర్థం చేసుకోవచ్చునన్నారు.

క్లుప్తంగా...

నా పీఏలంటూ ఫోన్ చేస్తే ఫిర్యాదు చేయండి

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తన వ్యక్తిగత సహాయకుల (పీఏ)మంటూ ఎవరైనా ఫోన్ చేసినా, తన పేరు చెప్పే వారి పట్ల ఎలాంటి చిన్న అనుమానం కలిగినా వెంటనే సచివాలయానికి తెలియజేయాలని, 040–23451072/040–23451073 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఎవరైనా తన పీఏ అంటూ ప్రజలను కలిస్తే ఊరుకునేది లేదని, అధికార దుర్వినియోగాన్ని సహించేది లేదని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన స్పష్టంచేశారు. కాగా, రెవెన్యూ మంత్రి పీఏలమంటూ అమాయకులను మోసగించేందుకు ప్రయత్నించిన బుస్సా వెంకట్‌రెడ్డి (వరంగల్), మచ్చ సురేశ్ (హైదరాబాద్)లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి పొంగులేటి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ మేరకు ఇద్దరిని అరెస్టు చేసినట్టు రెవెన్యూ మంత్రి కార్యాలయం వెల్లడించింది.

జీఆర్‌టీ జ్యువెల్లర్స్‌లో అక్షయ తృతీయ ఆఫర్లు

సాక్షి, హైదరాబాద్: అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్టు జీఆర్‌టీ జ్యువెల్లర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ ఒక ప్రకటనలో తెలిపారు. ‘అక్షయ తృతీయ రోజున బంగారం కొనడం చాలాకాలంగా ఉన్న పవిత్ర సంప్రదాయం. దీన్ని మేం వినియోగదారులకు మరింత ప్రత్యేకంగా అందిస్తున్నాం’అని పేర్కొన్నారు. బంగారు ఆభరణాల కొనుగోళ్లపై గ్రాముకు రూ.250 తగ్గింపు, పాత బంగారు ఆభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.75 అదనం, వజ్రాల విలువపై క్యారట్‌కు రూ.12,500 తగ్గింపు లభించనున్నట్టు పేర్కొన్నారు. అదనపు ఆఫర్లలో అన్‌కట్ డైమండ్ విలువపై 10 శాతం తగ్గింపు, వెండి వస్తువులు, కాలిపట్టీలపై 25 శాతం మేకింగ్ చార్జీలు, వెండి ఆభరణాల ఎమ్మార్పీపై 10 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్టు తెలిపారు.

మలబార్ గోల్డ్ అక్షయ తృతీయ బొనాంజా

సాక్షి, హైదరాబాద్: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అక్షయ తృతీయ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు అందిస్తున్నట్టు తెలిపింది. బంగారు ఆభరణాల తయారీ చార్జీలపై 25 శాతం తగ్గింపు, రాళ్లు, అన్‌కట్ వజ్రాభరణాల తయారీ చార్జీలపై 25%, వజ్రాల విలువపై 25 % వరకు డిస్కౌంట్లు ఇస్తున్నట్టు వెల్లడించింది. కొనుగోళ్లలో అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న వారికి వెండి నాణేన్ని అందించనుంది. బంగారు ఆభరణాల విలువపై 10 శాతం చెల్లించడం ద్వారా అడ్వాన్స్ బుకింగ్ చేసుకుని పెరిగే బంగారం ధర నుంచి తప్పించుకోవచ్చన్నారు. మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ ‘అక్షయ తృతీయ సంప్రదాయంగా ఎంతో ప్రాముఖ్యం పొందింది. కొత్త కొత్త ఆభరణాల డిజైన్లతో వినియోగదారులకు దీన్ని మరింత ప్రత్యేకంగా నిలపాలనుకుంటున్నాం’ అని పేర్కొన్నారు.



ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిన పార్టీ

నాతో సహా అందరమూ కేసీఆర్ సైనికులమే

‘సాక్షి’ ఇంటర్వ్యూలో హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్ : కుటుంబ పార్టీ అంటూ బీఆర్‌ఎస్‌పై చేసే విమర్శలు అర్థ రహితమని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమించిన తాము.. ప్రజల ఆశీర్వాదంతోనే పదవులు చేపట్టామన్నారు. బ్యాక్‌డోర్‌లో తాము పదవులు పొందలేదని చెప్పారు. కేటీఆర్, కవిత సహా ఎవరికి ఏ బాధ్యతలు అప్పగించినా కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగానే పనిచేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఇచ్చిన నివేదిక ఎన్‌డీఏ ప్రభుత్వ నివేదిక తరహాలో ఉందని తెలిపారు. మేడిగడ్డ పిల్లర్ల మరమ్మతులో ఉద్దేశపూర్వకంగా కాలయాపన జరుగుతోందన్నారు. ఏడాదిన్నరలోనే రేవంత్ పాలన తేలిపోయిందని చెప్పారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా తిరిగి అధికారంలోకి వచ్చి కేంద్రంలోనూ క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవం నేపథ్యంలో పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటి నడిచిన హరీశ్‌రావు ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను ‘సాక్షి’తో నెమరువేసుకున్నారు. ఉద్యమంలో తన అనుభవాలు, అనుభూతులను పంచుకున్నారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

నాటి పరిస్థితులతోనే టీఆర్‌ఎస్ స్థాపన

తెలంగాణ ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిన పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితి. చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు, వలసలు, రైతు ఆత్మహత్యలు, విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం తదితరాలు టీఆర్‌ఎస్ స్థాపనకు పురికొల్పాయి. తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించడానికి ముందు కేసీఆర్ ఏడాది పాటు చేసిన కసరత్తులో నేనూ భాగస్వామిని కావడంతో ఉద్యమం పట్ల ఆకర్షితుడిని అయ్యా. ప్రొఫెసర్ జయశంకర్ తదితరులతో జరిగిన చర్చల్లో అనేక అంశాల పట్ల అవగాహన ఏర్పడటంతో ఉద్యమం పట్ల ఆకర్షణ, పాల్గొనాలనే ఉత్సాహం పెరిగింది. తెలంగాణకు సంబంధించిన అంశాలను ఆకళింపు చేసుకునే క్రమంలో కేసీఆర్ వందలాది మందితో గంటల కొద్దీ సంప్రదింపులు జరిపారు. వారిని సమన్వయం చేయడం నా ప్రధాన బాధ్యతగా ఉండేది. టీఆర్‌ఎస్ ఆరంభంలోనే పార్టీ కోశాధికారిగా, ప్రచార కార్యదర్శిగా మీడియా బాధ్యతలు, ఆర్థిక అంశాలు, ఎన్నికల బాధ్యతలు చూసేవాడిని. పార్టీ పెట్టిన రెండు నెలల్లోనే జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవులు దక్కించుకునేందుకు జెడ్పీటీసీ సభ్యులతో క్యాంపుల నిర్వహణ బాధ్యత కేసీఆర్ నాకు అప్పగించారు.

వైఎస్ మంత్రివర్గంలోకి అనగానే..

నాకు ఎమ్మెల్యే పదవి లేకున్నా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో చేరమని కేసీఆర్ ఆదేశించినప్పుడు నేను ఆశ్చర్యానికి లోనయ్యా. మంత్రివర్గంలో కొనసాగుతూ పార్టీ బలోపేతం చేయమని ఆదేశిస్తూ టీఆర్‌ఎస్ తరఫున మంత్రివర్గంలో చేరే వారి జాబితాను నాతోనే కేసీఆర్ రాయించి కాంగ్రెస్ అధిష్టానానికి ఇచ్చారు. 33 ఏళ్ల వయసులోనే రాష్ట్ర మంత్రివర్గంలో చేరినా, పాలన కంటే ఉద్యమం మీదే ఎక్కువ దృష్టి ఉండేది. మంత్రిగా పనిచేస్తూనే 2004 అక్టోబర్‌లో సిద్దిపేట ఉప ఎన్నికలో తొలిసారి పోటీ చేశాం. అంతకు మునుపే కేసీఆర్‌కు సంబంధించిన 2001 ఉపఎన్నిక, 2004 అసెంబ్లీ ఎన్నిక బాధ్యతలను నేనే చూశా. దీంతో నాకు సిద్దిపేట, ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో ఉన్న సన్నిహిత సంబంధం ఉండటం కలిసొచ్చింది.

మహాగర్జన అపురూప జ్ఞాపకం

ఉద్యమ సమయంలో వరంగల్‌లో 25 లక్షల మందితో నిర్వహించిన మహాగర్జన అపురూప జ్ఞాపకంగా మిగిలిపోయింది. కేసీఆర్ ఈ సభకు సిద్దిపేట నుంచి సైకిల్‌పై వచ్చారు. అలాంటి సభలు ఈ రోజుల్లో నిర్వహించడం సాధ్యం కాదు. పార్టీ వద్ద అప్పట్లో పెద్దగా డబ్బులు లేకున్నా ప్రజలు ఈ సభకు స్వచ్ఛందంగా తరలివచ్చారు.

నివేదికల పేరిట పార్టీని దెబ్బతీసే కుట్ర

తెలంగాణలో ఏర్పడిన తొలి మంత్రివర్గంలో మిషన్ కాకతీయతోపాటు పెండింగ్ ప్రాజెక్టులుగా ఉన్న కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఆయకట్టును పెంచాం. కాళేశ్వరం ప్రాజెక్టుతో సహా పనులు వేగంగా పూర్తి చేసేందుకు సైట్ వద్దే నిద్రించిన సందర్భాలు అనేకం. ఈడీ, సీబీఐ తరహాలోనే ఎన్‌డీఎస్‌ఏ కూడా ఎన్‌డీఏ జేబు సంస్థగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రాథమిక నివేదిక, పార్లమెంట్ ఎన్నికల సమయంలో మధ్యంతర నివేదిక, రజతోత్సవ సందర్భంలో తుది నివేదిక అంటూ మా పార్టీని దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయా అనే అనుమానాలు వస్తున్నాయి.

పదవులొస్తాయని అనుకోలేదు

కుటుంబ పార్టీ, ఆ నలుగురు అంటూ మాపై చేసే విమర్శలు అర్థ రహితం. రాష్ట్ర సాధన లక్ష్యంగా ఉద్యమించడమినహా, అధికారం, పదవులు వస్తాయని మాలో ఎవరూ అనుకోలేదు. మేము వెనుక డోర్ నుంచి పదవుల్లోకి రాలేదు. ప్రజల ఆశీర్వాదంతో వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందిన వాళ్లం. కేసీఆర్ నాయకత్వంలో, మార్గదర్శకత్వంలో కార్యకర్తలుగా పనిచేస్తాం. నాతో సహా పార్టీలో అందరమూ కేసీఆర్ సైనికులమే.

బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా ఎదుగుతుంది

ఏడాదిన్నరలోనే రేవంత్ ప్రభుత్వం తేలిపోయింది. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగితే వారి పాలన సామర్థ్యం ప్రజలకు మరింత అర్థమవుతుంది. ఇప్పటికే బీజేపీ కేంద్రంలో ప్రాంతీయ పార్టీల మద్దతు వల్లే మనుగడలో ఉంది. రేపు కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ప్రాంతీయ పార్టీల మద్దతు తప్పనిసరి. బీఆర్‌ఎస్ బలమైన శక్తిగా రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావడంతో పాటు కేంద్రంలోనూ క్రియాశీల పాత్ర పోషిస్తుంది.

ఈ నెల 30లోగా వెళ్లిపోండి

తెలంగాణలోని పాకిస్తానీలకు డీజీపీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 30వ తేదీలోగా దేశం విడిచి వెళ్లిపోవాలని తెలంగాణలోని పాకిస్తాన్ దేశస్తులను డీజీపీ జితేందర్ ఆదేశించారు. పాకిస్తానీల వీసాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని, ఇప్పటికే వీసాలు పొందినవారికి ఈ నెల 27 వరకు అవకాశం ఉందని చెప్పారు. మెడికల్ వీసాలకు ఈ నెల 29 వరకు అవకాశం ఉందని, ఆ తర్వాత ఎవరూ రాష్ట్రంలో ఉండటానికి వీలు లేదని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టంచేశారు. అటారీ సరిహద్దు ఈ నెల 30 వరకే తెరిచి ఉంటుందని, ఆలోగా పాకిస్తానీలంతా వెళ్లిపోవాలని సూచించారు. హైదరాబాద్ పాతబస్తీలో 200 మందికి పైగా పాకిస్తానీలు ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. 156 మంది లాంగ్‌టర్మ్, 13 మంది షార్ట్ టర్మ్, 39 మంది బిజినెస్ వీసాలతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారని.. వీరంతా రెండు రోజుల్లో భారత్ వీడాల్సిందేనని తేల్చిచెప్పింది. మరోవైపు పాకిస్తానీలను వెతికి పట్టుకునేందుకు బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, మదీనాగూడ, పాతబస్తీ, చార్మినార్ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ నెల 27 నాటికి అందర్నీ గుర్తించి పాకిస్తాన్‌కు పంపేలా చర్యలు చేపడుతున్నారు.

పాక్‌ను ముక్కలు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిలబడి మనోస్థైర్యాన్ని ఇవ్వాలని కోరుతున్నాం’అని రేవంత్ అన్నారు. ఇందిరా గాంధీ ఒక్క దెబ్బతో పాకిస్తాన్‌ను పాకిస్తాన్, బంగ్లాదేశ్ అని రెండు ముక్కలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయ్ దుర్గామాతతో పోల్చారని పేర్కొన్నారు. ‘మోదీజీ.. మీరు దుర్గామాత భక్తులు. ఇందిరను ఆదర్శంగా తీసుకొని ఉగ్రవాదులపై దాడులు నిర్వహించాలని కోరారు.



కొవ్వొత్తుల ర్యాలీలో భట్టి, మహేశ్‌కుమార్, మీనాక్షి నటరాజన్ తదితరులు

కొవ్వొత్తుల ప్రదర్శన...

పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, మాజీ ఎంపీలు అజహరుద్దీన్, సల్మాన్ ఖుర్షీద్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు విజయశాంతి, సలహాదారులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మ శాంతించాలని ప్రార్థించారు. భారత్ సమ్మిట్–2025 అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి హైదరాబాద్ విచ్చేసిన ప్రతినిధులు సైతం ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న వారంతా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జాతీయ జెండాలు పట్టుకొని భారత్ మాతాకి జై అంటూ ముందుకు సాగారు.

తెలంగాణలోనే డీఏల పెండింగ్

- పరిష్కరించకుంటే జూన్ 9న మహాధర్నా
- టీజేఏసీ చైర్మన్ జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మం సహకారనగర్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వివిధ రకాల 57 సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆ సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 9న మహాధర్నా, నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టంచేశారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగుల డీఏల పెండింగ్‌తో పాటు పీఆర్సీ, జీపీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. లేదంటే మే 4న రాష్ట్రస్థాయి సదస్సు, జూన్ 9న.. 206 సంఘాలతో కలిపి 13.31 లక్షల మంది ఉద్యోగులతో మహాధర్నా చేపడతామని ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఉద్యోగుల బకాయిలు రూ.8 వేల కోట్లు నెలకు కొంత చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అది నేటికీ అమలు కాలేదని తెలిపారు. సమావేశంలో టీజేఏసీ నేతలు మన్నెబోయిన తిరుపతి, గుంటుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- రైల్వే రిటైర్డ్ అధికారి కె.వి.రావు రచించిన గ్రామపంచాయతీ పాలన పుస్తకాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు. శుక్రవారం సచివాలయంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశంలో పంచాయతీరాజ్ చరిత్ర మొదలుకొని తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, గ్రామసభలు, సర్పంచ్, ఉపసర్పంచ్ ఎన్నికలు, అర్హతలు, నిధులు, విధులు వంటి సమగ్ర వివరాలతో దీన్ని రచించారని రచయితను అభినందించారు.

వారసుల కోసం.. రోగుల వేషం!

వెటర్నరీ శాఖలో 'మెడికల్లీ అన్‌ఫిట్' స్కాం.. తమ పిల్లలకు ఉద్యోగాల కోసం తండ్రుల నిర్వాకం

- తమకు లేని జబ్బులు ఉన్నాయని తప్పుడు పత్రాలు సమర్పిస్తున్న వైనం
- ఉమ్మడి కరీంనగర్‌లో 30 మంది వారసులకు ఉద్యోగాలు!
- రాష్ట్రవ్యాప్తంగా రాకెట్.. రంగంలోకి సీబీడీ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంగా మెడికల్ కుంభకోణం వెలుగు చూసింది. నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు చూపించి తాము ఇక పనిచేయలేమంటూ.. తమ వారసులకు ఉద్యోగాలు ఇప్పిద్దామనుకున్న ఇద్దరు వెటర్నరీ శాఖ ఉద్యోగుల గుట్టును అధికారులు రట్టు చేయటంతో ఈ స్కాం బయటపడింది. ఈ స్కాం లోతుపాతులను కనిపెట్టేందుకు పోలీసులు కూపీ లాగుతున్నారు. సిరిసిల్ల, కరీంనగర్‌తోపాటు ఇతర జిల్లాల్లోనూ అక్రమ వారసత్వ నియామకాల రాకెట్ సాగినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తూ వెటర్నరీ శాఖ అధికారునలు సీఐడీకి లేఖ రాశారు. దీంతో సీఐడీ కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం.

ఎలా బయటపడిందంటే?

వాస్తవానికి ఈ కుంభకోణాన్ని మార్చిలోనే గుర్తించారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట మండలాల నుంచి వెటర్నరీ శాఖకు చెందిన ఉద్యోగులు వేర్వేరుగా మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లోనూ సమర్పించిన డాక్యుమెంట్లు ఒకేలా ఉండటం, ఇద్దరూ కాలేయ సంబంధిత సమస్యలనే కారణాలుగా చూపించడంతో అధికారులకు అనుమానం వచ్చి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. కరీంనగర్ కేంద్రంగా ఈ రాకెట్ పనిచేసిందని గుర్తించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు కరీంనగర్‌కు చెందిన రిటైర్డ్ తహసీల్దార్ బీరయ్యను సంప్రదించారు. ఆయన వారి నుంచి రూ.3 లక్షల చొప్పున తీసుకొని తనకు డి.ఎం.హెచ్.ఓ ఆఫీస్‌లో పరిచయం ఉన్న మొహమ్మద్ బాసిద్ హుస్సేన్, ల్యాబ్ టెక్నీషియన్ కొత్తపల్లి రాజేశం సాయంతో కరీంనగర్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రి ప్రిస్క్రిప్షన్లతో నకిలీ మెడికల్ ఇన్వాలిడేషన్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు గుర్తించారు. దీనిపై ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట పోలీసుస్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి.

రంగంలోకి సీఐడీ..

ఇదే తరహాలో మెడికల్ అన్‌ఫిట్ కింద ఉమ్మడి జిల్లాలో 30 మంది వరకు ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. ఈ రాకెట్ సిరిసిల్ల, కరీంనగర్‌కు మాత్రమే కాకుండా వెటర్నరీ విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిందని భావిస్తున్నారు. కుంభకోణం భారీగా కనిపిస్తుండటంతో స్థానిక పోలీసులతో దర్యాప్తు సాధ్యం కాదని భావించి సీఐడీకి లేఖ రాశారు. దీంతో సీఐడీ అధికారులు ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట పోలీసుస్టేషన్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, ప్రాథమికంగా ఉమ్మడి జిల్లాల నుంచి సమాచారం తెప్పించుకుని అధ్యయనం చేస్తున్నారు. త్వరలోనే దర్యాప్తు మొదలుపెట్టనున్నారని అధికార వర్గాల సమాచారం.

శాంతి చర్చలపై మావోల మరో లేఖ

- చర్చల ప్రక్రియను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలి
- ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దులో ఆపరేషన్ నిలిపేయాలి
- మూడో లేఖ జారీ చేసిన నార్త్-వెస్ట్ సబ్ జోనల్ ఇన్‌చార్జ్ రూపేశ్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ ప్రక్రియను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని మావోయిస్టు పార్టీ నార్త్-వెస్ట్ సబ్ జోనల్ ఇన్‌చార్జ్ రూపేశ్ శుక్రవారం మూడో లేఖను విడుదల చేశారు. ఇప్పటికే శాంతి చర్చలపై ఆ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో మార్చి 28న లేఖ రాగా, ఆ తర్వాత రూపేశ్ నుంచి వరుసగా రెండు లేఖలు వచ్చాయి. తాజాగా జారీ చేసిన మూడో లేఖలో 'శాంతి చర్చల ద్వారా సమస్య లకు పరిష్కారం కనుక్కొందాం. శాంతి చర్చలకు మా పార్టీ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. ఈ విషయంలో మా మీద విశ్వాసం కలిగేందుకు అన్ని రకాల ప్రయత్నాలు నిరంతరం చేస్తూనే ఉన్నాం. కానీ ప్రభుత్వ ఉద్దేశం మరోలా కనిపిస్తోంది. చర్చల ద్వారా కాకుండా అణచివేత, హింసాకాండ ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌లో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభమైంది. తుపాకీ కంటే చర్చల ద్వారానే సమస్యలకు సానుకూల పరిష్కారం లభిస్తుంది. చర్చల ప్రక్రియ ముందుకెళ్లేందుకు అనుకూల వాతావరణం కల్పించాలి. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న సైనిక ఆపరేషన్ తక్షణమే నిలిపేయాలి, కనీసం నెల రోజుల పాటైనా కాల్పుల విరమణ ప్రకటించాలి. ఈ మా విజ్ఞప్తికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నాం' అని రూపేశ్ పేర్కొన్నారు.

రూపేశ్ ఎవరంటే...
సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

కొనసాగుతున్న 'ఆపరేషన్ కర్రిగుట్టలు'

4 రోజులుగా ఎండ తీవ్రతతో పలువురు జవాన్లకు అస్వస్థత

చర్ల: ఆపరేషన్ కర్రిగుట్టల పేరిట నాలుగు రోజులుగా మావోయిస్టులకోసం కూంబింగ్ కొనసాగుతోంది. డీఆర్‌జీ, కోబ్రా, సీఆర్‌పీఎఫ్, బస్తర్ ఫైటర్స్, ఎస్టీఎఫ్ విభాగాలకు చెందిన సుమారు 5 వేల మంది జవాన్లు మావోయిస్టుల కోసం కర్రిగుట్టలను జల్లెడ పడుతున్నారు. అయితే ఈ ప్రాంతంలో గత నాలుగు రోజులుగా 42 నుంచి 44 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఎండ తీవ్రతతో జవాన్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గురువారం 15 మంది, శుక్రవారం మరో 25 మంది తీవ్రమైన ఎండల కారణంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో స్వల్ప అస్వస్థతకు గురైన వారికి కర్రిగుట్టల సమీపాన ఉన్న క్యాంపుల్లో చికిత్స అందిస్తుండగా, తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ఆరుగురిని వెంకటాపురం, భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ఈ నేపథ్యంలో జవాన్ల ఆరోగ్య భద్రత దృష్ట్యా హెలికాప్టర్ ద్వారా మినరల్ వాటర్ బాటిళ్లు, శీతల పానీయాలు, జ్యూస్ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ వంటివి అందజేసేందుకు ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు చర్యలు వేగవంతం చేసినట్లు సమాచారం. నాలుగు రోజులుగా కూంబింగ్ జరుగుతున్నా, ఇప్పటివరకు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడం మినహా పెద్దగా ఫలితం లేకపోవడం, జవాన్లు ఒక్కొక్కరుగా అస్వస్థతకు గురవుతుండడంతో ఆపరేషన్‌పై ఎలా ముందుకు సాగాలనే విషయమై అధికారులు చర్చిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ ఆపరేషన్‌తో కర్రిగుట్టల సమీప గ్రామాల ఆదివాసీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇంటినుంచి బయటకు రావద్దని పోలీసులు చెబుతుండగా తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గన్నీ బ్యాగుల కోసం రైతుల రాస్తారోకో

- జాతీయ రహదారి దిగ్బంధం..

మహబూబ్‌నగర్ రూరల్: వరి ధాన్యం విక్రయం కోసం అవసరమైన గన్నీ బ్యాగుల కొరతను నిరసిస్తూ శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. కోటకదిర ప్రాథమిక సహకార సంఘంలో గన్నీ బ్యాగులు అవసరమైనన్ని నిలువ ఉంచకపోవడంతో భారీగా కొరత ఏర్పడింది. దీంతో బ్యాగుల కోసం అక్కడికి వచ్చిన రైతులు సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించారు. గంటపాటు రైతులు రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ సుందర్‌రాజ్, ఎస్సై విజయ్ కుమార్ హుటాహుటిన అక్కడికి చేరుకొని రైతులకు అవసరమైనన్ని గన్నీ బ్యాగులను అక్కడికి తెప్పించి వారితో రాస్తారోకోను విరమింపజేశారు.


అప్పాయిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు

వడదెబ్బతో నలుగురు మృతి

జగిత్యాల, ఖమ్మం, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో విషాదం


దర్గయ్య


జగన్‌గౌడ్


రాజయ్య


వెంకన్న

జగిత్యాల క్రైం/తల్లాడ/ధర్మారం (ధర్మపురి)/జమ్మికుంట: రాష్ట్రంలో తీవ్రమైన ఎండలు కొనసాగుతుండటంతో శుక్రవారం వివిధ జిల్లాల్లో వడదెబ్బతో నలుగురు మరణించారు. జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన గొల్లపల్లి జగన్‌గౌడ్ (30) వడదెబ్బతో మృతిచెందాడు. అతడు రెండు రోజుల క్రితం బయటకు వెళ్లగా వడదెబ్బ తగిలింది. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెంలో బయ్యారపు దర్గయ్య(70) పశువులు మేపేందుకు గురువారం పొలానికి వెళ్లి వడదెబ్బకు గురయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక అస్వస్థతకు గురికాగా, 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగానే మరణించాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన కుమ్మరికుంట రాజయ్య (65) అనే రైతు వడదెబ్బతో శుక్రవారం మరణించాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన వొల్లాల వెంకన్న (55) వడదెబ్బతో చనిపోయాడు. గతంలో జీపు డ్రైవర్‌గా పనిచేసిన వెంకన్న కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఇంటివద్దే ఉంటున్నాడు.

పంట నష్టం భరించలేక రైతు ఆత్మహత్య

కాటారం: పంట నష్టం భరించలేక ఒక రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుండ్రాత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లారం గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. మల్లారం గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య (55) తనకున్న నాలుగు ఎకరాల భూమిలో.. కొంత మేర పత్తి, మరికొంత వరి సాగు చేశాడు. పత్తి దిగుబడి సరిగ్గా రాకపోవడంతో.. రూ.1.20 లక్షల మేర పెట్టుబడి నష్టపోయాడు. వరి పొలానికి నీరు అందక కొంత ఎండి పోయింది. మనస్తాపానికి గురైన రాజయ్య 20 రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 24న రాజయ్య ఇంటి సమీపంలో పురుగు మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని కుమారుడు నాగరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ కుడి కాలువ స్లూయిజ్‌లను మేమే నిర్వహించుకుంటాం

- సీఆర్పీఎఫ్ బలగాలు వైదొలగితే మా పోలీసులతో భద్రత
- కృష్ణా బోర్డు చైర్మన్‌కు ఏపీ జలవనరుల శాఖ లేఖ
- దీనిపై తెలంగాణ అభిప్రాయం కోరిన బోర్డు చైర్మన్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భూభాగంలో నాగార్జునసాగర్ భద్రత నుంచి సీఆర్పీఎఫ్ బలగాలు వైదొలుగుతున్న నేపథ్యంలో.. ఏపీ భూభాగంలోని సాగర్ భద్రత, కృష్ణా బోర్డు జారీచేసే మార్గదర్శకాల మేరకు సాగర్ కుడి కాలువ స్లూయిజ్‌లను తామే నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌కు ఆ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ లేఖ రాశారు. ఈ అంశంపై కృష్ణా బోర్డు ఆదేశాలకు రెండు రాష్ట్రాలు కట్టుబడి ఉండాలని.. బోర్డు ఉత్తర్వులను నిక్కచ్చిగా అమలు చేసేలా చూడాలని కోరారు. దీంతో ఈ ప్రతిపాదనపై అభిప్రాయం చెప్పాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు కృష్ణా బోర్డు చైర్మన్ లేఖ రాశారు. కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశించే వరకు శ్రీశైలం ప్రాజెక్టును ఏపీ, నాగార్జునసాగర్‌ను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించాలని కేంద్ర జల్‌శక్తి శాఖ 2014లో ఆదేశించింది. ఏపీ భూభాగంలో ఉన్న నాగార్జునసాగర్ సగం స్పిల్ వే, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ స్లూయిజ్‌లను 2023, నవంబర్ 30న ఆ రాష్ట్ర ప్రభుత్వం తన అధీనంలోకి తీసుకుంది. అక్కడ ఏపీ పోలీసులను మోహరించింది. ఇది రెండు రాష్ట్రాల మధ్య వివాదానికి దారితీయడంతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి 2023, డిసెంబర్ 1న ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ బలగాల పహారాలో సాగర్‌ను కృష్ణా బోర్డు నిర్వహిస్తుందని కేంద్రం చేసిన ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. అప్పటి నుంచి సాగర్‌కు తెలంగాణ భూభాగంలో 39వ బెటాలియన్, ఏపీ భూభాగంలో 234వ బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ బలగాలు భద్రత కల్పిస్తున్నాయి. కానీ.. ఈ నెల 7న తెలంగాణ భూభాగంలో భద్రత కల్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌ను తక్షణమే ఉపసంహరించుకుంటున్నామని.. ఏపీ భూభాగంలో భద్రత కల్పిస్తున్న బెటాలియన్‌ను జూన్ 30న వెనక్కి తీసుకుంటామని కృష్ణా బోర్డుకు కేంద్ర హోంశాఖ లేఖ రాసింది. ఈ నేపథ్యంలో ఏపీ భూభాగంలోని సాగర్ స్పిల్ వే, కుడి కాలువ స్లూయిజ్‌లను తామే నిర్వహించుకుంటామని ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డుకు లేఖ రాసింది.

పత్తి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- విజిలెన్స్ విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లలో చోటు చేసుకున్న అవకతవకలపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, దళారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేశారంటూ వచ్చిన కథనాలపై అధికారులను ఆరా తీసిన మంత్రి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోందని, విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని మంత్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణ త్వరగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి, మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. అక్రమాలపై జిల్లా మార్కెటింగ్ అధికారులు, మార్కెట్ కార్యదర్శుల నుంచి వివరణ కోరాలని సూచించారు. మార్కెట్లలో జరిగే ఎలాంటి అక్రమాలను ప్రభుత్వం ఉపేక్షించేది లేదని, రైతులకు నష్టం కలిగే విధంగా ఎవరూ నడుచుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తుమ్మల హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 197 మార్కెట్ కమిటీల్లో ఇప్పటివరకు 162 కమిటీలకు నూతన పాలకవర్గాలను నియమించినట్లు మంత్రి తెలిపారు. సంవత్సరంన్నరలోనే 2,268 నామినేట్ పోస్టులను భర్తీ చేశామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అతి తక్కువ సమయంలో ఈ స్థాయిలో మార్కెట్ కమిటీలను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారని చెప్పారు.

నిలిచిన ఉపాధి హామీ జాబ్‌కార్డుల జారీ

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు నేపథ్యంలోనే..!



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి హామీ పనులు చేయడానికి కూలీలకు అవసరమైన జాబ్ కార్డుల జారీ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసింది. తదుపరి ఆదేశాల వరకు కొత్త జాబ్‌కార్డుల దరఖాస్తులు స్వీకరించొద్దని ఆదేశించింది. త్వరలోనే కొత్త మార్గదర్శకాలు జారీ చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాలకు ఆదేశాలందాయి. దీంతో గత నెల రోజులుగా కొత్త జాబ్‌కార్డుల జారీ నిలిచిపోయింది. అయితే ఇప్పటికే ఒక కుటుంబంలో జాబ్‌కార్డు ఉంటే కొత్తగా కూలీ పేరును అందులో నమోదు చేసేందుకు అవకాశం ఉంది. కానీ కొత్త జాబ్‌కార్డుల జారీకి మాత్రం ప్రస్తుతానికి దరఖాస్తులు స్వీకరించడం లేదు. వేసవిలో పెద్దగా ఉండని వ్యవసాయ పనులకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులే ఆర్థిక భరోసానిస్తాయి. అయితే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల కుటుంబానికి ప్రభుత్వం ఏటా రూ. 12 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. కనీసం 25 రోజులు ఉపాధి హామీ పనులకు హాజరై భూమిలేని కూలీలనే ఈ పథకానికి అర్హులుగా గుర్తిస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త జాబ్‌కార్డుల జారీకి తాత్కాలికంగా బ్రేక్ పడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కంది అధిక దిగుబడికి 'బ్రాడీరైజోబియం' ఊతం

- హైదరాబాద్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పాత రకం కంది వేరు కుదుళ్లలో బ్రాడీరైజోబియం సూక్ష్మజీవులు అధికంగా ఉండటం వల్ల మొక్కకు అవసరమైన నత్రజని ఎక్కువగా అంది.. పంట ఎదగడానికి దోహదపడేదని హైదరాబాద్ యూనివర్సిటీ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. పేదవాడి ప్రొటీన్.. కందిపప్పు అన్న సంగతి విదితమే. దీనిపై హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అప్పారావు పొడిలె బృందం చేసిన పరిశోధనల్లో పలురకాల కంది వంగడాలను పరిశీలించారు. బ్రాడీరైజోబియం అధికంగా ఉంటే.. రైతులు అదనంగా రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరం తక్కువగా ఉంటుందని గుర్తించారు. 'ఆశా', 'దుర్గా', 'మన్నెం కొండ కంది'వంటి కంది రకాలను పరిశోధకులు వేర్వేరు మట్టిలో (ఆల్ఫిసాల్, వర్టిసాల్, ఇన్సెప్టిసాల్) పెంచి వేరు కుదుళ్లలోని సూక్ష్మజీవుల ఉనికిని పరిశీలించారు. వీటితో పాటు అడవి కంది మొక్కను కూడా పరీక్షించారు. మొక్క రకం, ఎలాంటి మట్టిలో మొక్క పెరిగింది.. అనే విషయాలపై సూక్ష్మజీవుల రకాలు ఆధారపడి ఉంటాయని పరిశోధకులు వివరించారు. ఇదిలా ఉండగా అడవి కందిలో బ్రాడీరైజోబియం ఎక్కువగా ఉండగా, సాగు చేసే కంది వంగడాల్లో వివిధ రకాల సూక్ష్మజీవులు కనిపించాయి. సాగుపద్ధతుల వల్ల సహజ జీవసంబంధాలు మారిపోయినట్లు పరిశోధనలో వెల్లడైంది. ఈ పరిశోధనతో భవిష్యత్తులో రైతులకు తక్కువ ఎరువులతో అధిక దిగుబడి ఇచ్చే సుస్థిర వంగడాల రూపకల్పనకు వీలు కలుగుతుందని పరిశోధకులు తెలిపారు. ఈ అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వ అనుసంధాన్ జాతీయ పరిశోధన సంస్థ (ఏఎన్ఆర్ఎఫ్) సహకారం అందించింది. ప్రొఫెసర్ అప్పారావుతో పాటు డాక్టర్ అనిర్బన్ బసు, డాక్టర్ దంతేశ్వరి, డాక్టర్ శర్మ ఈ పరిశోధనలో పాల్గొన్నారు.

పౌల్ట్రీకి ఇక మంచి రోజులు

పౌల్ట్రీ ఫెడరేషన్ జాతీయ నేత కసిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరుస సంక్షోభాల నుండి తేరుకున్న పౌల్ట్రీ రంగానికి మంచి రోజులు వస్తున్నాయని, అందుకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దోహదం చేస్తున్నాయని పౌల్ట్రీ ఫెడరేషన్ జాతీయ నేత కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా విధానంలో తీసుకువచ్చిన మార్పులు.. పౌల్ట్రీ రంగానికి ఊతం ఇవ్వనున్నాయని చెప్పారు. బర్డ్ ఫ్లూని అధిగమించామని, దేశానికి అన్ని రకాల పౌల్ట్రీ ఉత్పత్తులను అందించటంలో తెలంగాణను ప్రథమ స్థానంలో ఉంచుతామని పేర్కొన్నారు. తమకు పూర్తి సహకారం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని.. ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ, ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో త్వరలో కలిసి కృతజ్ఞతలు తెలుపుతామని కసిరెడ్డి వెల్లడించారు.



అగ్గిపుడితే.. బుగ్గే.!
సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఫైర్‌సేఫ్టీకి సంబంధించిన ప్రతిపాదనలు పదేళ్లుగా కాగితాలకే పరిమితమవుతున్నాయి.
-10లో



సర్వీస్ మోటో..
భాగ్య నగరం ఒక ఐటీ హబ్ మాత్రమే కాదు.. సేవా తత్పరతకు, మానవీయ కోణానికి కూడా మారుపేరుగా నిలుస్తోంది.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
39.0/27.0

వాతావరణం
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 27 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



నృత్య స్వాగతం!

నగరంలో శుక్రవారం 'భారత్ సమ్మిట్-2025' ఉత్సాహంగా ప్రారంభమైంది. పలు దేశాలకు చెందిన వక్తలు పాల్గొన్నారు. వీరికి తెలంగాణ సంప్రదాయ, సాంస్కృతిక, నృత్య కళారూపాలతో ఘనంగా స్వాగతం లభించింది.

'స్థానిక' ఎమ్మెల్సీగా ఎఫెండి

ఎంఐఎం నేతకు మద్దతు ఇచ్చిన కాంగ్రెస్!

మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండికి 63 ఓట్లు
- బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు
- పోలింగ్‌కు దూరంగా బీఆర్ఎస్



ఎఫెండికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎంఐఎం పార్టీకి చెందిన మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం జరిగిన ఓట్ల లెక్కింపులో ఎఫెండికి ఎక్కువ ఓట్లు రావడంతో ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి ప్రకటించారు. మధ్యాహ్నం జీహెచ్ఎంసీ ఎన్నికల కార్యాలయానికి వచ్చిన ఎఫెండికి ఈ మేరకు డిక్లరేషన్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ ఎన్నికలో మొత్తం 112 ఓట్లకు 88 ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్లలో ఎంఐఎంకు 49, కాంగ్రెస్‌కు 13, కాంగ్రెస్ మిత్రపక్షం టీజేఎస్‌కు ఒక ఓటు కలిపి 63 ఓట్లుండగా, బీజేపీకి 25, బీఆర్ఎస్‌కు 24 ఉన్నాయి. ఎఫెండికి 63 ఓట్లు రావడంతో ఎంఐఎంకు కాంగ్రెస్, టీజేఎస్ మద్దతిచ్చినట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ పోలింగ్‌ను బహిష్కరించగా, బీజేపీ అభ్యర్థి ఎన్.గౌతమ్‌రావుకు 25 ఓట్లు రావడంతో ఆ పార్టీ ఓట్లు మాత్రమే ఆయనకు పడినట్లు వెల్లడవుతోంది. తనకు మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ఒవైసీ సోదరులకు ఎఫెండి కృతజ్ఞతలు తెలిపారు. ఎంఐఎంకు ఈ ఎన్నిక ఏకగ్రీవం కావద్దనే తలంపుతోనే బీజేపీ చివరి నిమిషంలో తమ అభ్యర్థిని నిలబెట్టిందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల మారణకాండ దృష్ట్యా తన విజయోత్సవ ర్యాలీ రద్దు చేసుకున్నట్లు తెలిపారు. తమ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎఫెండి ఇంతకుముందు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఉన్నారు.

ఆ మూడు పార్టీలు ఒక్కటేనని వెల్లడైంది: గౌతమ్‌రావు

బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఓట్లు వేయకుండా చేసిన ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాల్సిందిగా ఎన్నికల కమిషన్‌ను కోరనున్నట్లు బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావు తెలిపారు. ఈ ఎన్నికతో ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ మూడు పార్టీలూ ఒక్కటేనని వెల్లడైందని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు తమకు ఓట్లేసేందుకు సిద్ధమైనా, వారు పోలింగ్‌కు రాకుండా కేటీఆర్ అడ్డుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేరుగా ఎంఐఎంకు సహకరించిదంటూ దాని చెప్పుచేతల్లోనే కాంగ్రెస్ పని చేస్తోందన్నారు. ఆ మూడు పార్టీలూ ఒకటే అనే విషయాన్ని హైదరాబాద్, తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో తనకు అన్నివిధాలుగా సహకరించిన బీజేపీ నాయకులకు, తనకు ఓట్లేసిన కార్పొరేటర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కనిపించని క్రాస్ ఓటింగ్

బీఆర్ఎస్ పార్టీ తమ కార్పొరేటర్లను పోలింగ్‌లో పాల్గొనవద్దని ఆదేశించినప్పటికీ, ఆ పార్టీ కార్పొరేటర్లు పోలింగ్‌లో పాల్గొంటారని,తమకు మద్దతు తెలుపుతారని బీజేపీ చివరి దాకా ఆశలు పెట్టుకుంది. ఈ ఎన్నికకు తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ, ఇతర పార్టీల వారిని ఆకర్షించి,క్రాస్ ఓటింగ్ ద్వారా గెలవాలని ప్రయత్నించినా, ఎలాంటి ఫలితం కనిపించలేదు. కనీసం క్రాస్ ఓటింగ్ ద్వారా ఒక్క ఓటును కూడా పొందలేకపోయింది. తమ పార్టీకి ఉన్న 25 ఓట్లు మాత్రమే దానికి లభించాయి. ఎంఐఎంకు తమ పార్టీవారి 49 ఓట్లతోపాటు కాంగ్రెస్ చెందిన 13 ఓట్లు, దాని మిత్రపక్షం టీజేఎస్ ఒక ఓటు కలిసి మొత్తం 63 ఓట్లు లభించాయి. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు మొదలు కాగా ఊహించినట్లే 2 గంటల్లోపే ఫలితం వెలువడింది. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు.

ఉత్కంఠకు తెర !
- ఫలించని బీజేపీ వ్యూహం
- పతంగికి కాంగ్రెస్ 'స్నేహహస్తం'

దాదాపుగా గత రెండు వారాలుగా నగరంలో సరికొత్త రాజకీయానికి తెరలేపిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతంగా ముగియడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తగిన సంఖ్యాబలం లేకపోయినప్పటికీ, బరిలో దిగిన బీజేపీ కడదాకా పోరాడింది. ఈ నేపథ్యంలో ఆయా రాజకీయపార్టీల మధ్య చెలరేగిన దుమారాలు, వివాదాలు టీకప్పులో తుపానును తలపించాయి. తాము గెలవనున్నామంటూ బీజేపీ చేపట్టిన ప్రచారంతో ఈ ఎన్నికల్లో ఏం జరగనుందోనని వేచి చూసిన వారి ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఎంఐఎం-కాంగ్రెస్‌ల మధ్య కొనసాగిన స్నేహబంధం మళ్లీ కనిపించింది.

పదవీ విరమణ రోజే

పెన్షన్ పేమెంట్



జీపీఎఫ్ ఫైనల్ విత్ డ్రా ప్రొసీడింగులను అందజేస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ రోజే పెన్షన్ డబ్బులు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అకౌంటెంట్ జనరల్ ఏఅండ్ఈ, హైదరాబాద్ కలెక్టరేట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెన్షన్ అదాలత్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి చందా పండిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెన్షన్ డిజిటలైజేషన్ ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తి కానుందన్నారు. అనంతరం పెన్షన్ మంజూరు పత్రాలు, జీపీఎఫ్ ఫైనల్ విత్ డ్రా ప్రొసీడింగులను పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందజేశారు. సమావేశంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ సోనార్కర్, జాయింట్ డైరెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక్రమ్.. ఇంకా ఇక్కడే!

2011లో అక్రమంగా వచ్చిన పాకిస్థానీ

- దుబాయ్‌లో ఉండగా నగర మహిళతో ప్రేమాయణం
- ఆమె కోసమే అడ్డదారిలో సరిహద్దులు దాటి సిటీకి..
- 2018లో అరెస్టు చేసిన నగర సైబర్ క్రైమ్ పోలీసులు
- కేసులు తేలినా ఇప్పటికీ డిటెన్షన్ సెంటర్‌లోనే



ఇక్రమ్

సాక్షి, సిటీబ్యూరో: కశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ముష్కర మూకల ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై పోరు కొనసాగుతోంది. ఈ ఘాతుకాన్ని సీరియస్‌గా తీసుకున్న భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. పాకిస్తానీల వీసాల రద్దు కూడా అందులో ఒకటి. దీంతో వివిధ రకాలైన వీసాలపై నగరంలో ఉన్న 208 మంది పాకిస్థానీల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంలో తెరపైకి వచ్చే అంశమే హైదరాబాద్ డిటెన్షన్ సెంటర్‌లో బందీగా ఉన్న పాకిస్థానీ మహ్మద్ ఉస్మాన్ ఇక్రమ్ అలియాస్ మహ్మద్ అబ్బాస్ ఇక్రమ్. సిటీలో నమోదైన కేసుల విషయం తేలినా.. ఇప్పటికీ ఇక్కడే ఉండిపోయాడు.

ఢిల్లీ వాసిగా నమ్మించి..

నగరంలోని పాతబస్తీకి చెందిన ఓ మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయారు. 17 ఏళ్ల క్రితం ఆమె బతుకుతెరువు కోసం దుబాయ్ వెళ్లారు. అక్కడ ఉద్యోగం చేస్తున్న ఈమెకు పాకిస్థానీ ఇక్రమ్‌తో పరిచయమైంది. తాను భారతీయుడినేనని, స్వస్థలం ఢిల్లీ అని నమ్మించి ఆమెను వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లకు అసలు విషయం తెలిసిన మహిళ హైదరాబాద్ తిరిగొచ్చేశారు. 2011లో ఇక్రమ్ సైతం నగరానికి వచ్చాడు. అప్పట్లో తాను ఆరు నెలల విజిట్ వీసాపై వచ్చానంటూ ఆమెతో చెప్పాడు. అయితే వాస్తవానికి దుబాయ్ నుంచి నేపాల్ వరకు విమానంలో వచ్చి అక్కడ నుంచి రోడ్డు, రైలు మార్గాల్లో ఢిల్లీ.. అక్కడి నుంచి నగరానికి చేరుకున్నాడు.

ఆ విషయం బయటపడక..

ఇక్రమ్ వచ్చిన ఆరు నెలలకు ఈ విషయం తెలుసుకున్న మహిళ అతడిని దూరంగా ఉంచడం ప్రారంభించారు. దీంతో కక్షగట్టిన అతగాడు ఆమెను వేధించడంతో మహిళా ఠాణాను ఆశ్రయించింది. దీంతో ఇక్రమ్‌పై వేధింపుల కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు ఇక్రమ్‌ను విచారించి, నోటీసులు జారీ చేశారు. అప్పట్లో తన భర్త పాకిస్థాన్‌కు చెందినవాడని చెప్పకపోవడంతో విషయం బయటకు రాలేదు. పోలీసులు 2018 జూన్‌లో ఇక్రమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సరిహద్దుల నుంచి వెనక్కు..

సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో నమోదైన కేసు విచారణ, శిక్షా కాలం ముగియడంతో ఇక్రమ్‌ను పాకిస్థాన్‌కు బలవంతంగా తిప్పి పంపాలని (డిపోర్టేషన్) భావించారు. డిపోర్టేషన్‌కు సంబంధించిన పత్రాల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు చెప్పిన పాకిస్థాన్ అధికారులు అతడి రాకను అడ్డుకున్నారు. కాగా.. తనపై నమోదైన కేసును భార్యతో రాజీ చేసుకున్న ఇక్రమ్‌ను దాదాపు రెండేళ్లుగా నగరంలోని సీసీఎస్ అధీనంలో ఉన్న డిపోర్టేషన్ సెంటర్‌లో ఉంచారు. ఇక్రమ్‌ను పాకిస్థాన్‌కు పంపడానికి అవసరమైన కసరత్తులు తుది దశకు చేరుకున్నాయి. తాజాగా పహల్గాం ఉదంతంతో ఇతడి డిపోర్టేషన్ ప్రక్రియపై సందేహాలు నెలకొన్నాయి.

సాగులో ఏఐ వినియోగంపై అవగాహన ఒప్పందం

ముందుకు వచ్చిన ఏజీ వర్సిటీ, బిట్స్ పిలానీ సంస్థలు



అవగాహన ఒప్పంద పత్రాలను చూపిస్తున్న సంస్థల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని అగ్రి హబ్‌లో జరిగిన కార్యక్రమంలో పీజేటీఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌రావు సమక్షంలో అవగాహన ఒప్పందం పత్రాలపై ఇరు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. పరస్పరం ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మకమైన సంస్థల మధ్య జరిగిన అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందని బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌రావు అన్నారు. ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి నాణ్యమైన పరిశోధనా పత్రాలు ప్రచురించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. దుబాయ్‌తో పాటు దేశంలోని నాలుగు చోట్ల బిట్స్ క్యాంపస్‌లు ఉన్నాయని, అందులో ప్రతి ఏటా సుమారు 600 మంది పీహెచ్‌డీలో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. బిట్స్ పిలానీ సంస్థకు దేశంలోనే మూడో అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టార్టప్ నెట్‌వర్క్ ఉందని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిజ్ఞానం(హార్డ్‌వేర్), బిట్స్ పిలానిలోని సాఫ్ట్‌వేర్ కలిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు ఉపకులపతి జానయ్య తెలిపారు. ఇందులో భాగంగా ముందుగా పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుకు ఉపయోగపడే అగ్రి రోబోల రూపకల్పన జరగాలని జానయ్య ఆకాంక్షించారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం అవగాహన ఒప్పందం ముఖ్య లక్ష్యాల గురించి సమావేశంలో వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, బిట్స్ పిలాని డీన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డాక్టర్ సంకేత్ గోయల్, పీజేటీఏయూ అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డాక్టర్ రాములు, డిజిటల్ అగ్రికల్చర్ సంచాలకులు డాక్టర్ బాలాజీనాయక్, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బిట్స్ పిలానీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అహో.. అంబేడ్కర్..

బాబాసాహెబ్ జీవిత విశేషాలను సమున్నతంగా చాటేలా..

- మహా విగ్రహం వద్ద మ్యూజియం, స్మారక గ్రంథాలయం
- ప్రైవేట్ సంస్థలు నిర్వహించేలా హెచ్ఎండీఏ సన్నద్ధం
- కన్సల్టెన్సీ ఎంపిక కోసం ఆసక్తుల వ్యక్తీకరణకు ఆహ్వానం


సాక్షి, సిటీబ్యూరో: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మ్యూజియం, స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) సన్నాహాలు చేపట్టింది. నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల అంబేడ్కర్ మహా విగ్రహం వద్ద రాజ్యాంగ స్ఫూర్తిని చాటేలా.. పార్లమెంట్ భవనాన్ని తలపించేలా.. విశాలమైన వేదికను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ భవనంలోనే అంబేడ్కర్ జీవిత విశేషాలను సమున్నతంగా ఆవిష్కరించేందుకు మ్యూజియం, లైబ్రరీలతో పాటు అంబేడ్కర్ జీవితంపై రూపొందించిన చిత్రాలను ప్రదర్శించాలని అప్పట్లో ప్రతిపాదించారు. అంబేడ్కర్ రచనలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలను రూపొందించారు. కానీ అప్పటి బీఆర్ఎస్ హయాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించినప్పటికీ మ్యూజియం, లైబ్రరీ తదితర సదుపాయాలను ప్రారంభించలేదు. పైగా అప్పటి నుంచి ఇప్పటి వరకు సందర్శకులను కూడా అనుమతించడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్ విగ్రహం వద్ద మ్యూజియం, మెమోరియల్ లైబ్రరీ, ట్రాన్సాక్షన్ అడ్వైజరీ, క్యూరేషన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ తదితర నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు హెచ్ఎండీఏ అధికారులు ఆసక్తి గల కన్సల్టెన్సీల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ (ఆర్ఎఫ్‌పీ)లను ఆహ్వానించారు. 8 నెలల్లో ఈ మ్యూజియం, లైబ్రరీలను వినియోగంలోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు. అంబేడ్కర్ మహా విగ్రహ ప్రాంగణాన్ని రాజకీయ, వైజ్ఞానిక కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. అంబేడ్కర్ బాల్యం నుంచి చివరి వరకు జీవిత విశేషాలను చాటేలా ఆడియో సౌండ్ సిస్టం తో పాటు లైటింగ్ షోను ఏర్పాటు చేయనున్నారు. మహా విగ్రహం, మ్యూజియంపై ప్రత్యేక వెబ్ సైట్‌ను రూపొందించే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం ఈ తరహా మ్యూజియంలు విజయవాడ, పుణె, చెన్నై, ఢిల్లీ నగరాల్లో ఉన్నాయి. హెచ్ఎండీఏ అధికారులు విజయవాడ, పుణెలోని మ్యూజియంలను సందర్శించి అధ్యయనం చేశారు. త్వరలో ఢిల్లీ మ్యూజియంను కూడా పరిశీలించనున్నట్లు సమాచారం.



కారెనుక.. కారు గట్టి..

రేపు ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- గ్రేటర్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ
- ఒక్కో నియోజకవర్గం నుంచి 5 వేల మంది
- 1,200 బస్సులు సహా 1,500కు పైగా కార్లు సిద్ధం
- సమన్వయం చేస్తున్న పార్టీ ప్రధాన నేతలు



సాక్షి, సిటీబ్యూరో: వరంగల్ జిల్లా ఎల్కతుర్తితో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు గ్రేటర్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ చేయాలని పార్టీ నిర్ణయించింది. ఒక్కో నియోజకవర్గం నుంచి కనీసం 5 వేల మందిని తరలించాలని తీర్మానించింది. ఆ మేరకు ఇప్పటికే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు 1,200 బస్సులు సహా మరో 1,500కుపైగా కార్లను కేటాయించింది. పార్టీ అధిష్టానం ఈ బాధ్యతను మాజీ మంత్రులు మహ్మద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, చామకూర మల్లారెడ్డి, హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌కు అప్పగించింది. ఇప్పటికే వీరంతా ఆయా నియోజకవర్గాల్లోని ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేసి, మున్సిపాలిటీ, కార్పొరేషన్, మండలం, గ్రామ పంచాయతీల వారీగా బస్సులను, కార్లు, ఇతర వాహనాలను కేటాయించారు. 'ఇంటికో జెండా.. ఊరికో బస్సు' చొప్పున కేవలం గ్రేటర్ జిల్లాల నుంచే లక్ష మందిని తరలించాలని నిర్ణయించారు.

పురుషులనే ఎక్కువగా తరలించాలని..

భగ్గున మండుతున్న ఎండల నేపథ్యంలో మహిళలు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పురుషులనే ఎక్కువగా తరలించాలని భావిస్తున్నారు. ఆ మేరకు కార్యకర్తలను, అభిమానులను సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయం, క్యాంపు ఆఫీసుల నుంచి ర్యాలీగా బయలుదేరనున్నారు. ఎవరికీ వారు ఆయా సమీప మార్గాల నుంచి ఔటర్ మీదుగా ఘట్‌కేసర్ జంక్షన్‌కు చేరుకోనున్నారు. అటు నుంచి భారీ ర్యాలీగా వరంగల్ బయలుదేరనున్నారు. సభకు వచ్చే ముఖ్య నాయకులు, కార్యకర్తలకు మంచినీరు, భోజన వసతి కల్పించనున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు టూరిస్ట్ బస్సులతో పాటు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిలకు సంబంధించిన ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీల బస్సులను ఇందుకు కేటాయించారు.

25 ఏళ్లు.. అనేక ఆటుపోట్లు

1969 తెలంగాణ తొలి దశ ఉద్యమం తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన ఎజెండాగా 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఏర్పడింది. కేసీఆర్ సహా ఆచార్య జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, ఆలే నరేంద్ర, గాదె ఇన్నయ్య తదితరులు మలిదశ తెలంగాణ ఉద్యమానికి అంకురార్పణ చేశారు. ఆ తర్వాత 2003 ఏప్రిల్ 27న సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్ వేదికగా 'తెలంగాణ గర్జన' పేరుతో ద్వితీయ వార్షికోత్సవ సభను నిర్వహించారు. 2001 నుంచి 2014 వరకు టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. అప్పటి వరకు ఒక్క సికింద్రాబాద్ (పద్మారావు గౌడ్) మినహా గ్రేటర్‌లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఆ సమయంలో తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొంది. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థుల పోరు గర్జనతో చివరకు కేంద్రం దిగొచ్చింది. డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణ ప్రకటన చేసింది. కొందరి అభ్యంతరాలతో డిసెంబర్ 23న కేంద్రం మళ్లీ వెనక్కి తగ్గింది. 2011 మార్చి 10న ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్, ఆ తర్వాత సకల జనుల సమ్మె, ఉద్యోగుల సహాయ నిరాకరణ వంటి వరుస ఆందోళనలతో చివరకు కేంద్రం దిగొచ్చింది.

గ్రేటర్‌లో అనేక అభివృద్ధి పనులు..

2014 ఫిబ్రవరిలో తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొంది, జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అప్పటివరకు గ్రేటర్ జిల్లాల్లో పార్టీకి పెద్దగా బలం లేదు. 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీడీపీ, కాంగ్రెస్ నుంచి భారీగా పార్టీలోకి వలసలు పెరిగాయి. మెజారిటీ ఎమ్మెల్యే సీట్లు సహా గ్రేటర్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 2018 నాటికి పార్టీ మరింత బలపడింది. పదేళ్ల అధికారంలో ఉంది. గ్రేటర్‌లో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. 2024 ఎన్నికల్లో ఎల్బీనగర్, మహేశ్వరం, సనత్‌నగర్, జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో గెలుపొందింది. రూరల్ జిల్లాలతో పోలిస్తే.. గ్రేటర్ జిల్లాల్లోనే పార్టీకి అత్యధిక సీట్లు వచ్చాయి. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి, భారీగా నిధుల కేటాయింపుల పేరుతో రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు కారు దిగి హస్తం గూటికి చేరుకున్నారు. ముఖ్య నేతలు పార్టీ మారినా.. కేడర్ మాత్రం కేసీఆర్ నాయకత్వాన్నే నమ్ముకుని పని చేస్తోంది.



శభాష్ హెచ్-న్యూ!

సిబ్బందికి రివార్డులు అందించిన సీపీ

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తమ పనితీరు ప్రదర్శించిన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు, సిబ్బందిని కొత్వాల్ సీవీ ఆనంద్ అభినందించారు. బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరికి ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలు అందించారు. ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాస్, జీఎస్ డేనియల్ శాంతి కుమార్‌లతో పాటు 80 మంది సిబ్బంది వీటిని అందుకున్నారు. ఈ బృందం మాదకద్రవ్యాల దందాలో ఉన్న ముగ్గురు ప్రధాన సూత్రధారులను పట్టుకోవడంతో పాటు 36 కేసుల్ని కొలిక్కితెచ్చారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ నగరంలో ఎక్కడా మాదకద్రవ్యాల ఛాయలు లేకుండా చేయాలని ఆనంద్ ఆకాంక్షించారు.

‘అక్షయపాత్ర’కు చేయూత

బంజారాహిల్స్: చిన్నారుల పోషణ, విద్యతో పాటు పర్యావరణ సుస్థిరతను మెరుగుపర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హడ్కో), ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సర్వీసెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. హడ్కో తొలిసారిగా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అధునాతన వంట గది పరికరాలతో పాటు ఎలక్ట్రిక్ వాహనం రూపంలో రూ.88 లక్షల విలువైన పరికరాలను విరాళంగా అందించింది. అందులో భాగంగా రైస్ స్టీమర్లు, మల్టీ ఫంక్షనల్ పీలర్లు, చింతపండు వలిచే యంత్రం, ఎలక్ట్రిక్ వాహనాలను అందించారు. ఈ ఆధునిక పరికరాలను హైదరాబాద్ సమీపంలోని సంగారెడ్డి జిల్లా అధునాతన కంది కిచెన్ కేంద్రం నుంచి భోజనాల సరఫరా సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో దోహదం చేస్తుంది. అలాగే ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఇండియా అక్షయపాత్ర పౌండేషన్‌కు కొత్త భోజన సరఫరా వాహనాన్ని అందించింది. దీని ద్వారా రోజుకు సుమారు 2,500 మందికి భోజనాలు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాన మాట్లాడుతూ హడ్కో, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సంస్థల సహకారంతో మరింత మంది విద్యార్థుల చెంతకు ఆహారాన్ని అందించగలుగుతామన్నారు.



అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వాహనాలను అందజేస్తున్న హడ్కో, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ప్రతినిధులు

అగ్గిపుడితే.. బుగ్గే.!

- గాంధీ ఆస్పత్రిలో మారని దుస్థితి
- దశాబ్ద కాలంగా ప్రతిపాదనలకే పరిమితమైన నివేదికలు
- ఉన్న అగ్నిమాపక కేంద్రం తరలింపు
- ప్రమాదం జరిగితే హడావుడి.. అనంతరం పట్టించుకోని ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో/గాంధీఆస్పత్రి : ఎక్కడైనా ప్రమాదం జరిగినపుడు హడావుడి చేయడం.. నిధులు అవసరం అంటూ నివేదికలు తయారు చేయడం. ఆనక ఆ విషయాన్ని గాలికి వదిలేయడం గాంధీ ఆస్పత్రి అధికారులకు అలవాటుగా మారింది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ దవాఖానలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పదేళ్ల నుంచి ఏటా ఫైర్ సేఫ్టీ పరికరాల కొనుగోలుకు సంబంధించి రూ.కోట్లలో ప్రతిపాదనలు పంపిస్తున్నా నేటికీ అవి అనమతులకు నోచుకోక దస్త్రాలకే పరిమితమవుతున్నాయి.

తుప్పుపట్టిన పరికరాలు..

తెలుగు రాష్ట్రాలతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజల ఆరోగ్యప్రదాయినిగా వెలుగొందుతున్న గాంధీ ఆస్పత్రిలో ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ రోగులు, వారి సహాయకులు, వైద్యులు, నర్సింగ్, ఇతర సహాయక సిబ్బంది అంతా కలసి రోజుకు సుమారు 15 వేల మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. 8 అంతస్తుల్లో నిర్మించిన ప్రధాన భవనంలో 36 విభాగాలకు చెందిన ఇన్ పేషెంట్ వార్డులు ఉన్నాయి. 2003లో నిర్మించిన ప్రధాన భవనంలో ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ పరికరాలు నిర్వహణ కొరవడి కొన్ని తుప్పుపట్టి పోగా.. మరికొన్ని దొంగతనానికి గురయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఫైర్ సేఫ్టీ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర మార్గాలు లేవు. ప్రస్తుతం ఉన్న లిఫ్టులు, మెట్ల మార్గం ఆసుపత్రి లోపలి నుంచి మాత్రమే ఉన్నాయి. ప్రమాద సమయంలో వీటిని వినియోగించలేరు. అందుకు ప్రత్యామ్నాయంగా భవనం వెలుపల నుంచి మెట్ల మార్గం, ర్యాంప్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు అలాంటివి అందుబాటులో లేవు. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ఆస్తి నష్టంతో పాటు ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. మొదటి నుంచి భవన నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం

గాంధీ ఆసుపత్రిలో ఫైర్‌సేఫ్టీకి సంబంధించిన ప్రతిపాదనలు గత పదేళ్ల నుంచి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. కొత్త పరికరాల కొనుగోళ్లకు సుమారు రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అప్పట్లో ప్రభుత్వానికి సమర్పించారు. ఆ తర్వాత దాని పర్యవేక్షణ మరిచారు. దీంతో ఆ దస్త్రాలు కాగితాలకే పరిమితమయ్యాయి. అక్కడి నుంచి సందర్భం వచ్చినపుడల్లా పదేపదే నివేదికలు అందించడం తప్ప నిధుల మంజూరుపై శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అగ్నిమాపక కేంద్రం తరలింపు

గాంధీ మెడికల్ కళాశాల, వసతి భవనాలు, ఆసుపత్రి ఐపీ, ఓపీ, పరిపాలనా భవనాలు, తదితరాలు మొత్తం 38 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఉండాలనే డిమాండ్ ఉంది. దీంతో గతంలో ఆసుపత్రి ప్రాంగణంలో తాత్కాలిక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఏదైనా సంఘటన జరిగినపుడు సిబ్బంది అప్రమత్తమయ్యేవారు. కరోనా అనంతరం ఇక్కడున్న అగ్నిమాపక కేంద్రాన్ని తరలించారు. ఇప్పుడేదైనా చిన్న సంఘటన జరిగినా సికింద్రాబాద్, చిక్కడ్‌పల్లి కేంద్రాల నుంచి వాహనాలు రావాల్సి ఉంటుంది. ఇప్పుడున్న ట్రాఫిక్‌లో అగ్నిమాపక శకటం ఆసుపత్రి ఆవరణకు చేరుకోవడానికి కనీసం 40 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. ఈ లోగా జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా దీనిపై ఆస్పత్రి సూపరింటెండ్ డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని, అవి పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

2019 సంవత్సరం ఆగస్టులో అగ్నిప్రమాదం జరిగి గాంధీ ఆస్పత్రిలోని పీడియాట్రిక్ సర్జరీ ప్రిపరేషన్ వార్డు అగ్నికి ఆహుతైంది. ఆ సమయంలో పిల్లలెవరూ వార్డులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కానీ విలువైన పరికరాలు దగ్ధమయ్యాయి.



నగరంలో నేడు

- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో క్విస్ట్ లైట్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని టీఆర్ఎస్ భవన్ సమీపంలో ఉన్న కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేసవి హరేకృష్ణ కల్చర్ క్యాంపు పేరిట ప్రత్యేక శిబిరాన్ని బంజారాహిల్స్, కోకాపేట్‌లలో నిర్వహించనున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, భక్తివంటి అంశాలపై కొనసాగే ఈ శిబిరంపై పూర్తి వివరాలకు 8143655188 మొబైల్ నెంబర్లో సంప్రదించవచ్చు.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో ఫుడ్ ఎక్స్-2025 ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జర్నలిస్టులు, జర్నలిజంపై డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) యాక్ట్ ప్రభావంపై చర్చ జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

క్రెడాయ్ జాతీయ నాయకత్వంలో మనోళ్ల ప్రాతినిధ్యం

సాక్షి, సిటీబ్యూరో: భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) జాతీయ నాయకత్వంలో హైదరాబాద్ డెవలపర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2025-27 సంవత్సరానికి గాను క్రెడాయ్ నేషనల్‌కు ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా గుమ్మి రాంరెడ్డి నియమితులయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీగా సీహెచ్ రామచంద్రా రెడ్డి, ఎన్‌సీఎల్‌టీ కమిటీ కో-కన్వీనర్‌గా క్రాంతి కిరణ్ రెడ్డి, అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ కో-కన్వీనర్‌గా శ్రీరాం ముసునూరు ఎన్నికయ్యారు. వీరితో పాటు క్రెడాయ్ యూత్ వింగ్ నేషనల్ సెక్రటరీగా జైదీప్ పానుగూటి, సౌత్ జోనల్ కో-ఆర్డినేటర్‌గా సంకీర్త్ రెడ్డి ఎంపికయ్యారు.

‘మనూ’ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పాలిటెక్నికల్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చివరి తేదీని మే13 గా నిర్ణయించినట్లు 'మనూ' హైదరాబాద్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. ఉర్దూ మాధ్యమం నుంచి లేదా పదవ లేదా 12వ స్థాయిలో ఉర్దూను ఒక సబ్జెక్టు ఆప్షనల్‌గా చదివిన విద్యార్థుల కోసం నాలుగు డిప్లొమో కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 9885380534, 9032394813 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, సిటీబ్యూరో: జేఈఈ మెయిన్స్-2025లో శ్రీచైతన్య విద్యార్థులు టాప్ ర్యాంక్‌లు సాధించారు. ఒక్క హైదరాబాద్ నుంచే 300కు 300 మార్కులతో ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన వంగా అజయ్‌రెడ్డి శ్రీ చైతన్య విద్యార్థేనని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వరుసగా మూడేళ్లుగా జేఈఈ మెయిన్స్‌లో 300కు 300 మార్కులతో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించిన ఘనత శ్రీచైతన్య విద్యార్థులదేనని పేర్కొన్నారు. తాజా ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా టాప్-100లో 10 ర్యాంకులు, 500లోపు 31 ర్యాంకులు సాధించింది శ్రీ చైతన్య విద్యార్థులేనని తెలిపారు.

ప్రజావాణికి 291 దరఖాస్తులు

లక్డీకాపూల్: గిరిజన శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం ప్రజావాణి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించినట్టు ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజ్ స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మహిళలు, గిరిజన శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న నోడల్ అధికారి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో ప్రజావాణిలో మొత్తం 291 దరఖాస్తులు అందాయి.

బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలి

జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్



బహిరంగ లేఖను విడుదల చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

హిమాయత్‌నగర్: బీసీలపై బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీలకు ఇచ్చేలా ఆ పార్టీ వరంగల్ రజతోత్సవ సభలో ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ సభలో బీసీ రాజకీయ పాలసీని ప్రకటించాలని కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు బీసీ సంఘాల నేతలతో కలసి ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు పలు డిమాండ్లతో కూడిన బహిరంగ లేఖను విడుదల చేశారు. 25 ఏళ్ల బీఆర్ఎస్ జెండాలు మోసింది ఎస్సీ, ఎస్టీ, బీసీలేనని, కానీ పదవులు అనుభవించింది మాత్రం వేరే వారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీనే ముఖ్యమంత్రిని చేస్తామని సభలో స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎస్.దుర్గయ్య గౌడ్, బాలాగోని బాలరాజు గౌడ్, కులకచర్ల శ్రీనివాస్, విజయ్ కుమార్ గౌడ్, కనకాల శ్యామ్ కుర్మా, అయిలు వెంకన్న గౌడ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నలుగురు పాకిస్తానీలకు నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో దేశంలో ఉన్న పాకిస్తానీయుల వీసాలు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు అప్రమత్తం అయ్యారు. తమ పరిధుల్లో నివసిస్తున్న పాకిస్థానీలు, వారి వీసా కేటగిరీలను ఆరా తీశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం నాటికి హైదరాబాద్‌లో 199 మంది, సైబరాబాద్‌లో 11 మంది, రాచకొండలో ముగ్గు రు పాకిస్థానీలు ఉన్నట్లు తేలింది. పాక్ జాతీయులకు భారత ప్రభుత్వం షార్ట్, లాంగ్, సార్క్ వీసాలు జారీ చేస్తుంటుంది. రాజధానిలోని మూడు కమిషనరేట్లలో సార్క్ వీసాలు కలిగిన వాళ్లు ఎవరూ లేరు. షార్ట్ టర్మ్ వీసాలు ఉన్న వాళ్లు ఆదివారం లోపు దేశం విడిచి పెట్టాల్సి ఉంది. ఈ వీసాపై నగరంలో నలుగురు ఉంటున్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి పోలీసులు శనివారం నోటీసులు జారీ చేయనున్నారు.

అవకాడో కొనాలనుకుంటే..అడ్డంగా దోచేశారు!

- ఆన్‌లైన్‌లో ఫలాలు కొనాలని భావించిన యువకుడు
- విక్రయిస్తామంటూ సంప్రదించిన సైబర్ నేరగాళ్లు
- జీఎస్టీ సహా వివిధ పేర్లు చెప్పి రూ.2.6 లక్షలు స్వాహా
- హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్‌లో అవకాడో ఫలాలు ఖరీదు చేయాలని భావించిన నగర యువకుడు ఏకంగా రూ.2.6 లక్షలు నష్టపోయాడు. జీఎస్టీ సహా రకరకాల పేర్లు చెప్పిన నేరగాళ్లు విడతల వారీగా ఈ మొత్తం స్వాహా చేశారు. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు శుక్రవారం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. నగరానికి చెందిన విద్యార్థి (23) అవకాడో ఫలాలు ఒక కేజీ ఖరీదు చేయడానికి జస్ట్ డయల్ యాప్‌లో వెతికాడు. అందులో విజయవాడకు చెందిన బాలాజీ ట్రేడర్స్ అనే సంస్థ వివరాలు దొరికాయి. కొద్దిసేపటికి ఆ సంస్థ ప్రతినిధులుగా చెప్పుకుంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము విజయవాడ నుంచి అవకాడోలు పంపిస్తామని, అడ్వాన్సుగా కేవలం ఇంధనం ఖర్చులు ఇస్తే చాలంటూ కొంత మొత్తం బదిలీ చేయించుకున్నారు. ఆపై ఫలాలు తీసుకుని వాహనం బయలుదేరిందంటూ సమాచారం ఇచ్చారు. మరోసారి బాధితుడిని సంప్రదించిన నేరగాళ్లు వాహనం మరమ్మతుకు గురైందని చెప్పి కొంత, మీ లోకేషన్‌కు పది కిలోమీటర్ల దూరంలో ట్రాఫిక్ పోలీసులు ఆపారంటూ మరికొంత బదిలీ చేయించుకున్నారు. అవకాడో సరఫరాదారుల నుంచి ఆ ఫలాలు కొంటున్నామని, జీఎస్టీగా చెల్లించాలంటూ మళ్లీ నగదు బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత మరోసారి బాధితుడిని సంప్రదించిన సైబర్ నేరగాడు 'ఇప్పటి వరకు మీరు బదిలీ చేసిన మొత్తాన్ని నా కుమారుడు దుర్వినియోగం చేశాడు' అని, తనకు మరికొంత మొత్తం అత్యవసరమని పేర్కొన్నారు. బాధితుడిని పూర్తిగా నమ్మించడానికి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ వేరే వారికి జారీ చేసినట్లు ఉన్న ఓ చెక్కు ఫొటోను పంపించారు. అవకాడో ఫలాలు పంపడం ఆలస్యం అవుతున్నందుకు క్షమాపణలు చెప్తూనే... బ్యాంకు ఖాతా వివరాలు చెప్తే చెల్లించిన మొత్తం రిఫండ్ చేస్తామంటూ నమ్మబలికాడు. ఓ దశలో నేరగాడి వ్యవహారశైలిపై సందేహం వచ్చిన యువకుడు తన డబ్బు వెంటనే రిఫండ్ చేయమని కోరారు. దీంతో బాధితుడిని తీవ్రంగా బెదిరించిన సైబర్ నేరగాళ్లు తాము డిమాండ్ చేసిన మొత్తం చెల్లించకుంటే రిఫండ్ రాదని చెప్పారు. ఈ విషయం తన తల్లిదండ్రులకు చెప్పడానికి భయపడిన యువకుడు నగదు బదిలీ చేస్తూపోయాడు. మొత్తం రూ.2.6 లక్షలు కోల్పోయిన తర్వాత సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

టీఎస్ఎఫ్ఏ-2025 అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: టీ హబ్ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి కల్రాజ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వారి 'ది సోషల్ మీడియా అండ్ ఫిల్మ్ అవార్డులు (టీఎస్ఎఫ్ఏ)-2025' కర్టన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. కాగా టీఎస్ఎఫ్ఏ అవార్డుల కోసం ఏప్రిల్ 27 నుంచి మే 20 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని నిర్వాహకులు ప్రకటించారు. దేశంలోని ఇన్‌ఫ్లూయెన్సర్లు, ఫిల్మ్ మేకర్లు, డిజిటల్ ప్రొఫెషనల్స్ అవార్డుల కోసం నామినేషన్లు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీ హబ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, టీజీబీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య, తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ వ్యవస్థాపకులు శ్రీవిశ్వ, మిస్ ఇండియా తెలంగాణ-2025 మితాలీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌లో కల్తీ మద్యం

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు
- ప్రీమియం మద్యం బాటిళ్లలో తక్కువ ధర మద్యంతో కల్తీ
- రూ.1.48 లక్షల విలువైన కల్తీమద్యం పట్టివేత



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఓ బార్ కల్తీ మద్యం విక్రయాలకు తెరలేపింది. ఖరీదైన ప్రీమియం మద్యం బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపి వినియోగదారులకు అందజేస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. లింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ట్రూప్స్ బార్‌ను కొంతకాలంగా లైసెన్స్ పునరుద్ధరించకుండానే నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు రంగారెడ్డి ఏఈఎస్ జీవన్ కిరణ్ ఎక్సైజ్ సిబ్బందితో కలిసి శుక్రవారం బార్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బార్‌లోని పనిచేసే కూకట్‌పల్లికి చెందిన సత్యనారాయణ, పునిక్ పట్నాయక్‌లు కలిసి ఖరీదైన మద్యం బాటిళ్ల సీల్ తీసి తక్కువ ధరలు కలిగిన మద్యాన్ని వాటిలో కలుపుతుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.2690 ధర కలిగిన జేమ్సన్ బాటిళ్లలో రూ.1000 ధర కలిగిన ఓక్స్మిత్ మద్యాన్ని కలుపుతున్నట్లు ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. ఇలా వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన 75 మద్యం బాటిళ్లను, 55 ఖాళీ బాటిళ్లను ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. గత కొంత కాలంగా ట్రూప్ బార్ లైసెన్స్ ఫీజ్ చెల్లించకపోవడమే కాకుండా మద్యం డిపోల నుంచి మద్యం కొనుగోలు చేయడం లేదని అధికారులు తెలిపారు. డిపోల నుంచి కొనుగోలు చేయడానికి బదులు వైన్‌షాపుల నుంచి కొనుగోలు చేసి ఎక్కువ ధర కలిగిన బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలుపుతూ అమ్మకాలు చేపడుతున్నట్లు ఎక్సైజ్ విచారణలో వెల్లడైంది. మొత్తం రూ.1.48 లక్షల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. బార్ యజమాని ఉదయ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ వి. సత్యనారాయణరెడ్డి, బార్‌లో పనిచేసే ఉద్యోగి పునిత్ పట్నాయక్‌లపైన కేసు నమోదు చేసినట్లు ఏఈఎస్ జీవన్ కిరణ్ తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



జశ్వంత్ (ఫైల్)

పోచారం: ఇంటర్మీడియట్‌లో ఫెయిలైనందుకు మనస్తాపం చెందిన విద్యార్థి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం..జగిత్యాలలోని హనుమాన్‌వాడకు చెందిన భూసి జశ్వంత్ (17) అన్నోజిగూడలోని నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ ప్రథమ సంవత్సం 90 శాతం మార్కులతో పాసైన జశ్వంత్..ద్వితీయ సంవత్సరంలో మాత్రం మూడు సబ్జెక్టుల్లో ఫెయిలయ్యాడు. దీంతో మానసిక వేదనకు గురయ్యాడు. ఇటీవల నగరంలో ఉంటున్న తన మామ ఇంటికి వెళ్లి 90 శాతం మార్కులతో ఇంటర్ పాసయ్యానని చెప్పాడు. కానీ, తల్లిదండ్రులతో ఫెయిలయ్యానని ఫోన్ చేసి చెప్పాడు. ఈ క్రమంలో జశ్వంత్ బుధవారం సాయంత్రం ఉప్పల్‌లో గడ్డి మందు బాటిల్ కొనుక్కుని కాలేజ్‌కు వచ్చాడు. ఆ రోజు రాత్రి కావడంతో ఇంటికి వెళ్లడం కుదరలేదు. మరుసటి రోజు గురువారం ఉదయం 4 గంటల సమయంలో గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న కళాశాల నిర్వాహకులు సమీపంలోని హాస్పిటల్‌లో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం జశ్వంత్‌ను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం జశ్వంత్ మృతి చెందాడు. మృతుని తండ్రి వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యపై ఎలాంటి అనుమానాలు లేవని, ఈ విషయంలో కళాశాల యాజమాన్యంతో పాటు సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ తనను హేళనగా చూడడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు జశ్వంత్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడని స్నేహితులు చెబుతున్నారు.

ఉగ్రదాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో నమాజ్



బంజారాహిల్స్ రోడ్ నెం-10 మస్జిద్-ఇ-మదీనాలో నల్ల రిబ్బన్లతో ముస్లింలు

బంజారాహిల్స్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడికి నిరసనగా ముస్లింలంతా నల్ల రిబ్బన్లు ధరించి నమాజ్‌లో పాల్గొనాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఇచ్చిన పిలుపు మేరకు బంజారాహిల్స్ రోడ్ నం.10లోని మస్జిద్-ఇ-మదీనాలో ముస్లింలు చేతులకు నల్ల రిబ్బన్లు ధరించి నమాజ్‌లో పాల్గొన్నారు. టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మస్జిద్ అధ్యక్షుడు మునీర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్



బండెల శ్రీకాంత్‌కు నియామక పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.4లోని సుఖ్‌దేవ్‌నగర్ బస్తీకి చెందిన సీనియర్ బీఆర్‌ఎస్ కార్యకర్త బండెల శ్రీకాంత్‌ను వెంకటేశ్వరకాలనీ డివిజన్ అధ్యక్షుడిగా నియమించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఈ మేరకు బండెల శ్రీకాంత్‌ను డివిజన్ అధ్యక్షుడిగా ప్రకటించారు. తనను నమ్మి డివిజన్ అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు.

అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ దినోత్సవం



కలశ పూజ నిర్వహిస్తున్న పూజారులు

బంజారాహిల్స్: సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులో కొలువుదీరిన శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, అనంతరం మహాగణపతి హోమం, మృత్యుంజయ హోమం, సర్వాభిషేకం, ఉషా పూజ, కలశ పూజ, కలశాభిషేకం తదితర పూజా మహోత్సవాలను శబరిమల అర్చకులచే నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మహాదీపారాధన, ప్రత్యేక పూజల అనంతరం ప్రసాదాల వితరణ చేపట్టారు. శ్రీఅయ్యప్ప భక్త సమితి జనరల్ సెక్రటరీ జీఎస్‌వీఎస్‌ఎస్ ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవం కొనసాగింది.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



రహమత్‌నగర్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అరుణ, ధనలక్ష్మి, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీకి సిద్ధం

- 1 నుంచి సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు
- రేషన్ షాపులకు చేరిన సన్నబియ్యం
- తనిఖీలు చేస్తున్న రేషనింగ్ అధికారులు
- ఖైరతాబాద్ సర్కిల్ 2,92,882 మందికి లబ్ధి
- ఫోర్టిఫైడ్ రైస్ కలపడంతో ఆరోగ్యానికి మేలు
- ప్లాస్టిక్ రైస్ అనే అపోహతో ఏరిపారేయవద్దు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఫిలింనగర్‌లోని రేషన్‌షాపులో సన్నబియ్యాన్ని పరిశీలిస్తున్న రేషనింగ్ సర్కిల్-7 ఆర్‌ఐ శంకర్

బంజారాహిల్స్: హైదరాబాద్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోడ్ అడ్డు రావడంతో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పంపిణీ కావాల్సిన సన్నబియ్యం ఖైరతాబాద్ జోన్ రేషనింగ్ సర్కిల్-7 పరిధిలో నిలిచిపోయింది. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలు జరగడం, ఫలితాలు కూడా వెలువడంతో కోడ్ ముగిసింది. దీంతో మే 1వ తేదీ నుంచి ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధిలోని 81 రేషన్ దుకాణాల పరిధిలో కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని రేషన్ షాపులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. 40 శాతానికి పైగా సన్నబియ్యం అన్ని రేషన్ షాపులకు పంపించడం జరిగిందని, వచ్చే నెల 1వ తేదీ నాటికి వంద శాతం బియ్యం పంపిణీ పూర్తి చేస్తామని సర్కిల్-7 రేషనింగ్ ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపారు. రేషనింగ్ అధికారులు మూడు రోజులు నుంచి అన్ని రేషన్ షాపుల్లో పర్యటిస్తూ సన్న బియ్యం పంపిణీపై డీలర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా క్వింటాల్ సన్నబియ్యంలో ఒక కిలో ఫోర్టిఫైడ్ రైస్ కలుపుతున్నారు. ఈ బియ్యంలో పోషక పదార్థాలు మెండుగా ఉంటాయని, చాలామంది ప్లాస్టిక్ బియ్యం అని భ్రమపడి ఏరేస్తుంటారని, అలా చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. ఇవి ఫోర్టిఫైడ్ రైస్, ప్లాస్టిక్ రైస్ కాదని, మిల్లెట్స్‌తో తయారు చేసిన పోషక విలువలు కలిగిన బియ్యం అని పేర్కొంటున్నారు. క్వింటాల్ సన్నబియ్యంలో కిలో ఫోర్టిఫైడ్ రైస్ కలపడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు అని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కూడా కలిగిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటికే రేషన్ షాపులకు చేరిన సన్నబియ్యం బస్తాల్లో ఫోర్టిఫైడ్ రైస్ కలిపి పంపిణీకి సిద్ధం చేస్తున్నారు.

2,92,882 మందికి లబ్ధి..

ఖైరతాబాద్ సర్కిల్-7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 81 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 79,531 తెల్ల రేషన్‌కార్డులు ఉండగా, అంత్యోదయ అన్న యోజన(ఏఏవై) కార్డులు 3,481 ఉన్నాయి. ఒక అన్నపూర్ణ రేషన్‌కార్డు కూడా ఉంది. ప్రతినెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఈ రేషన్‌కార్డుల్లో ఉన్న లబ్ధిదారులు 2,92,882 మందికి 18,19,011 కిలోల సన్నబియ్యం పంపిణీ చేయనున్నారు.

జ్వరం వస్తే నిర్లక్ష్యం వద్దు

- మలేరియా అని తేలితే వైద్యం చేయించుకోవాలి
- బంజారాహిల్స్‌లో మలేరియాపై అవగాహన నడక

బంజారాహిల్స్: నివాసిత పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని, దాంతో మలేరియా దోమల ఎదుగుదల నిలిచిపోతుందని ఎంటమాలజీ ఏఈ రజిత తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం-7లోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో పాటు డాక్టర్ వేదశ్రీ, ఎంటమాలజీ సిబ్బంది కలిసి మలేరియా అవగాహన నడకను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్వరం వస్తే సమీప ఆస్పత్రుల్లో రక్త పరీక్షలు చేయించుకోవాలని, మలేరియా అని తేలితే వెంటనే వైద్యం ప్రారంభించాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



బంజారాహిల్స్‌లో మలేరియా అవగాహన ర్యాలీలో ఎంటమాలజీ, ఆరోగ్య సిబ్బంది

బోధనా, అభ్యాస ప్రక్రియల మెరుగుకు ఏఐ



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఏఐ ప్రాముఖ్యతపై వర్క్‌షాప్

ఫిలింనగర్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త అశోక్‌కుమార్ పాండే హాజరై ఏఐ ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా బోధనా, అభ్యాస ప్రక్రియలను మెరుగుపర్చడంలో ఏఐని ఏవిధంగా ఉపయోగించుకోవాలో, వారికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాభివృద్ధి ఏవిధంగా సాధించాలో తెలియజేశారు. విద్యార్థులకు రియల్ టైమ్ ఫీడ్‌బ్యాక్, మద్దతు అందించడంలో ఏఐ ఆధారిత ట్యూటరింగ్ సిస్టమ్‌ల సామర్థ్యాన్ని వర్క్‌షాప్‌లో వివరించారు. సమర్థవంతమైన అభ్యాసనా అనుభవాలను సృష్టించడానికి విద్యలో ఏఐ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు ఉపయోగంపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలకు ఏఐ ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. అలాగే బోధనలో కీలకమైన అంశాలపై దృష్టి పెట్టడానికి విద్యావేత్తలకు ఎంతగానో సహకరిస్తుందన్నారు. తరగతి గది బోధనలో ఏఐ సాధనాలను అన్వేషించడం, నైపుణ్యం సాధించడం, అమలు చేయడంపై దృష్టిపెట్టాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు.

బీఆర్‌ఎస్ చలో వరంగల్‌ను జయప్రదం చేద్దాం



బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: బీఆర్‌ఎస్ చలో వరంగల్ రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్‌ను జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఏకాగ్రత

నార్త్‌జోన్ అడిషినల్ డీసీపీ అశోక్



పోటీలను ప్రారంభిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ అశోక్

బంజారాహిల్స్: క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు నిర్ణయాత్మకమైన జీవనశైలి, క్రియాశీలత, ఏకాగ్రత పెరుగుతుందని నార్త్‌జోన్ అడిషనల్ డీసీపీ పి.అశోక్ అన్నారు. బంజారాహిల్స్‌లోని జేఎన్‌ఐఏఎస్(జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్) ఆర్కిటెక్ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కురుక్షేత్ర ఆటల పోటీలను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ సైతం తీసుకురావడంతో పాటు చదువుల్లో కూడా రాణించేందుకు దోహద పడతాయన్నారు. జేఎన్‌ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ మాట్లాడుతూ ఇది కురుక్షేత్ర 9వ ఎడిషన్ అని, ప్రతి సంవత్సరం క్రీడాపోటీలతో పాటు ఫ్యాషన్ డిజైనింగ్, జర్నలిజం, డిజైనింగ్, ఫొటోగ్రఫీ రంగాల్లో కూడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్నామని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడాపోటీల్లో రాష్ట్రంలోని అన్ని ఆర్కిటెక్ కాలేజీల విద్యార్థులు పాల్గొంటారని, ఆదివారం ముగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ గోపాలకృష్ణ, సినీ సంగీత దర్శకుడు కె.నిహాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడిని ఖండిస్తూ క్యాండిల్ ర్యాలీ

ఫిలింనగర్: పహెల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌కు చెందిన మహిళా సంఘాలు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులను ప్రదర్శించారు. తక్షణమే ఉగ్రవాదులను పట్టుకుని కాల్చి చంపాలని, పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ మహిళా సంఘాలు నినదించాయి.



క్యాండిల్ ర్యాలీలో మహిళా సంఘాల ప్రతినిధులు

ఇంటర్ ఫస్టియర్ స్టేట్ టాపర్లకు సన్మానం



స్టేట్ టాపర్లను సత్కరిస్తున్న అధ్యాపకులు, కాలేజీ ప్రిన్సిపాల్

బంజారాహిల్స్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించిన అరస్తు జూనియర్ కాలేజీ విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. బంజారాహిల్స్ రోడ్ నెం-10లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటర్ కాలేజీ స్థాపించిన తొలి ఏడాదే రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య బ్రహ్మేంద్ర తెలిపారు. సీఈసీ మొదటి సంవత్సరంలో 500 మార్కులకు మునీబ్ అనే విద్యార్థి 494 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. బైపీసీ, ఎంపీసీలలో సైతం టాప్-10లో నాలుగు ర్యాంకులు సాధించినట్లు వారు వెల్లడించారు. సీఈసీలో 450 మార్కులకు పైగా 11 మంది విద్యార్థులు సాధించినట్లు అరస్తు కాలేజీ చైర్మన్ ఎండి రఫి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జిమిర్చి 28, క్యాప్సికం 45, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 38, క్యాబేజీ 09, క్యారెట్ 19, దొండకాయ 23, గుండు బీన్స్ 75, గింజచిక్కుడు 45, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 85, క్యాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 15 ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకూ అందుబాటులో ఉంటాయి.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: న్యూశాస్త్రినగర్ 11కేవీ ఫీడర్ జనప్రియ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు అవంతినగర్, పీఆర్‌నగర్, న్యూశాస్త్రినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం తెలిపారు. జాఫర్ ఆలీనగర్, దుర్గానగర్, హెచ్‌పి రోడ్డు 11కెవీ ఫీడర్లు ఎర్రమంజిల్, ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ల పరిధుల్లో మరమ్మతుల కారణంగా యశోద ఆస్పత్రి వెనుక, హైదరాబాద్ సెంట్రల్, ఠాకూర్ హరిప్రసాద్ లేన్, పంజగుట్ట, హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ, శ్రీరాములు థియేటర్లు, ఆశ్వినీ హెయిర్ ఆయిల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 10 వరకు కరెంటు ఉండదు. భారతినగర్, పాటిగడ్డ 11కేవీ ఫీడర్లు, జనప్రియ, ఎస్.పార్క్ సబ్‌స్టేషన్ల పరిధిలో భారతినగర్, మహేశ్వరినగర్ కాలనీలు, శక్తినగర్, ఎల్‌ఐజీ, ఈడబ్ల్యూఎస్, ఎంఐజీ, హెచ్‌ఐజీ, పాటిగడ్డ క్వార్టర్లు, ఎస్‌పీనగర్, నూర్‌బాగ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 వరకు డీఎస్‌ఎం కాలనీ 11కేవీ ఫీడర్ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 4 నుంచి 5 వరకు డీఎస్‌ఎం, అశోక్‌కాలనీ, సనత్‌నగర్, సుభాష్‌నగర్, ఎస్‌ఆర్‌టీ, టీవీఎస్ షోరూం, మెథడిస్ట్ చర్చిలైన్లు, డీ-మార్ట్ ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు.



బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను బహిష్కరించాలి


తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యాదగిరి, ప్రఫుల్ రాంరెడ్డి

హిమాయత్‌నగర్: తెలంగాణ ప్రజలను, ఉద్యమకారులను మోసం చేసిన బీఆర్‌ఎస్ వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ సభను తెలంగాణ సమాజం బహిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పుట్టి మూడేళ్లు అవుతుంటే రజతోత్సవాలు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'సేవ్ తెలంగాణ-లీవ్ బీఆర్‌ఎస్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో శాస్త్రీయ పాలన సాగలేదన్నారు. మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కేసీఆర్ కుటుంబం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. అధికార దాహం తీరాక రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసం చేసేందుకే రజతోత్సవ సభ నిర్వహిస్తోందని మండిపడ్డారు. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు వేముల యాదగిరి, చంద్రన్న ప్రసాద్, బీఆర్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా ఏఐదే..



ఏఐ గురించి వివరిస్తున్న లెక్చరర్ పవన్

శ్రీనగర్‌కాలనీ: అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ముఖ్య భూమిక పోషిస్తోందని లెక్చరర్ పవన్ అన్నారు. భవిష్యత్ అంతా ఏఐదే అన్నారు. ఎల్లారెడ్డిగూడ నాగార్జుననగర్ కాలనీ శారదా మహిళా కళాశాలలో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ఏఐని ఎలా నేర్చుకోవాలి.. భవిష్యత్‌లో ఏఐ ఎలా ఉపయోగపడుతుంది, ఏఐ విశిష్టత తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ఏఐని భాగం చేసుకొని విద్యను సులభతరం చేసుకోవాలో కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ తెలిపారు. లెక్చరర్స్ మాధవి, అంజన, శ్రీవల్లి పాల్గొన్నారు.

'రేవనాలు' పుస్తకావిష్కరణ




'రేవనాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సురేంద్రరాజు తదితరులు

హిమాయత్‌నగర్: ప్రముఖ కవి విశ్వనాథుల పుష్పగిరి రాసిన కవిత్వ సంకలనం 'రేవనాలు' పుస్తకాన్ని శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు నీలం వెంకన్న అధ్యక్షత వహించగా.. కవి, విమర్శకుడు అంబటి సురేంద్రరాజు, రచయిత విశ్వనాథుల పుష్పగిరి, ఫార్మాసిటీ బాధిత రైతులు, ఇతర కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల వ్యతిరేకిగా పనిచేస్తోందని, నాటి ఫార్మాసిటీని రూపం మార్చి ఫ్యూచర్ సిటీగా చెబుతూ రైతులను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. రేవంత్ పాలనలోని లోపాలను కవి తన పుస్తకంలో బాగా ఎండగట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కవులు, ఇతర ప్రముఖులు రాచకొండ రమేష్, నరేష్ కుమార్ సూఫీ, ఇంద్రపాల శ్రీనివాస్, మోహన్ బైరాగి, దుప్పు స్వామి, ఎం.ఎస్.నాయుడు, తంగెళ్లపల్లి కనకాచారి, రాజబాపు, జంపాల ప్రవీణ్, వెంకట కిశోర్, ప్రభాకరాచారి, సల్వాచారి, వాణి, కార్తీక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కాల్చి చంపేయాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నారెడ్కో సభ్యులు



క్యాండిల్ ర్యాలీలో విలేకరులు

వెంగళరావునగర్: ఉగ్రవాదులను కాల్చి చంపేయాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ వద్ద జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రింట్, అండ్ ఎలక్ట్రానిక్, యూట్యూబ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ఉగ్రవాదులు భారతీయులను దారుణంగా కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ జర్నలిస్టులు ప్రశాంత్, వరప్రసాద్, శ్రీధర్‌గౌడ్, అనిల్, హబీబ్, విజయ్ మురళీకృష్ణ, జమీల్, ఎస్.సురేష్, వేణుగోపాల్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ర్యాలీ

బంజారాహిల్స్: పహెల్గామ్ ఉగ్ర దాడికి నిరసనగా నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్(నారెడ్కో) తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బంజారాహిల్స్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బసవతారకం కేన్సర్ ఆస్పత్రి చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు కేబీఆర్ పార్కు మీదుగా ర్యాలీ నిర్వహించారు.

బార్‌లో ఎక్స్‌ట్రా గ్లాస్ అడిగాడని చితకబాదిన వెయిటర్లు

బంజారాహిల్స్: బార్‌లో స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్న ఓ యువకుడు ఎక్స్‌ట్రా గ్లాస్ కావాలని అడిగినందుకు దుర్భాషలాడడమే కాకుండా వెయిటర్లతో కలిసి బార్ మేనేజర్ చితకబాదిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని ఇందిరానగర్‌లో నివసించే కే.నవీన్ తన స్నేహితులు సాయి, హరీష్, లక్ష్మణ్, జగదీష్‌తో కలిసి ఇందిరానగర్‌లోని అమృత బార్‌కు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో నవీన్ క్యాషియర్ వద్దకు వెళ్లి ఎక్స్‌ట్రా గ్లాస్ కావాలని అడిగాడు. అయితే ఆగ్రహంతో ఊగిపోయిన క్యాషియర్ తిడుతూ వెయిటర్లతో కలిసి నవీన్‌పై దాడికి పాల్పడ్డాడు. సాయిని కూడా కొట్టారు. దీనిపై బాధితుడు నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అమృత బార్ క్యాషియర్‌తో పాటు వెయిటర్లపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిజ్రాల హల్‌చల్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని బర్త్ ప్లేస్ ఆస్పత్రి పక్కన శుక్రవారం ఓ ఆభరణాల షాపు ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడకు చేరుకున్న హిజ్రాలు షాపు యజమానికి చుక్కలు చూపించారు. సుమారు 80-100 మంది హిజ్రాలు షాపు ప్రారంభోత్సవం జరుగుతున్న చోటికి చేరుకుని తమకు డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ షాపు లోపలికి కొంతమంది, బయట కొంతమంది బైఠాయించారు. షాపు యజమానిని ఇబ్బంది పెట్టారు. యజమాని ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకోగా పోలీసులను చూసిన హిజ్రాలు అక్కడి నుంచి ఉరుకులు, పరుగులు పెట్టారు. ఈ షాపు ప్రారంభోత్సవానికి వచ్చిన వారు విగ్గులు తొడుక్కుని వచ్చారని, అసలైన హిజ్రాలు కాదని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోనం రాథోడ్ అనే హిజ్రా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భాగ్యనగరంలో.. బ్యూటీ స్పాట్..





■ నగరంలో హాలీవుడ్ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ బ్రెస్లిన్ సందడి

సాక్షి, సిటీ బ్యూరో: ప్రఖ్యాత హాలీవుడ్ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ యెాంగ్–చిన్ బ్రెస్లిన్‌ను స్పెషల్ ఎఫెక్ట్స్, సినిమా ప్రోస్థటిక్ మేకప్‌లో సీనియర్ ఫ్యాకల్టీ సభ్యురాలిగా నియమించినట్లు అలియా బేగ్ అకాడమీ ఆఫ్ మేకప్ ప్రకటించింది. 2022లో నెట్‌ఫ్లిక్స్ 'గ్లో అప్' సీజన్–4 విజేతగా, బ్రెస్లిన్ ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేసుకున్నారు. నగర వేదికగా మేకప్ రంగానికి గ్లోబల్ హంగులు అద్దేందుకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు బంజారాహిల్స్‌లోని ఏబీఏఎం అకాడమీలో శుక్రవారం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన మాస్టర్ క్లాసులో 'బ్రెస్లిన్' తన అసాధారణ నైపుణ్యాలతో 20 ఏళ్ల మోడల్‌ను ప్రోస్థటిక్ మేకప్ ద్వారా 70 ఏళ్లలా మార్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. విద్యార్థులకు మేకప్‌లో కటింగ్–ఎడ్జ్ టెక్నిక్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీఏఎం అకాడమీ వ్యవస్థాపకురాలు అలియా బేగ్ మాట్లాడుతూ.. తమ వేదికలో అధ్యాపకులుగా బ్రెస్లిన్ చేరికతో నూతనోత్సాహం ఏర్పడిందన్నారు. అంతేకాకుండా జేమ్స్ మాక్, బెరిల్ బెర్నార్డ్ వంటి నిష్ణాతులైన అంతర్జాతీయ అధ్యాపక బృందం అధునాతన ప్రమాణాలతో, అత్యాధునిక పద్ధతులతో విద్యార్థులకు గ్లోబల్ అవకాశాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటి, సినిమాలతో పాటు హైదరాబాద్ మేకప్ రంగంలో కూడా అంతర్జాతీయ గుర్తింపును అందుకుందన్నారు. ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ మేకప్ అసోసియేషన్‌తో అనుబంధంగా ఆసియాలోని మూడు అకాడమీలలో ఒకటిగా, మేకప్ విద్యలో ఏబీఏఎం ముందంజలో ఉందన్నారు.



నైపుణ్యాలు చూసి ఆశ్చర్యపోయాను..

అలియా బేగ్ అకాడమీ ఆఫ్ మేకప్ బృందంలో చేరడం.. ముఖ్యంగా స్పెషల్ ఎఫెక్ట్స్, ప్రోస్థటిక్ మేకప్ పట్ల నా అభిరుచిని పంచుకోవడం చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తు తరం ఆర్టిస్టులను తయారు చేయడానికి, మారుతున్న కాలానికి అనుగుణంగా మేకప్ నైపుణ్యాలను పెంపొందించడానికి నేనొక వారధిగా నిలవడం ఆనందాన్ని ఇస్తుంది. ఫ్యాషన్ రంగానికి అత్యద్భుత వేదికగా మారుతున్న హైదరాబాద్ మేకప్ ఆర్టిస్టులకు కొదవ లేదు. ఏబీఏఎం వేదికగా కొందరు మేకప్ ఔత్సాహికులతో ముచ్చటించాను, వారి ఆసక్తి నైపుణ్యాలు నన్ను ఆశ్చర్యపరిచాయి.

– యెాంగ్–చిన్ బ్రెస్లిన్, ప్రఖ్యాత హాలీవుడ్ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్

లీగ్ ఆఫ్ లెజెండ్స్ కలెక్షన్..



సాక్షి, సిటీ బ్యూరో : ప్రస్తుత ఐపీఎల్ క్రికెట్ సీజన్ పురస్కరించుకొని ప్రముఖ దుస్తుల బ్రాండ్.. లీగ్ ఆఫ్ లెజెండ్స్ దుస్తుల శ్రేణిని విడుదల చేసింది. ఈ విషయాన్ని స్థానిక బ్రాండ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. నాటి క్రికెట్ వీరులు కపిల్ దేవ్, వివ్ రిచర్డ్స్, హర్షా భోగ్లే క్రికెట్ నైపుణ్యాలను గుర్తు చేసుకునేలా క్రికెట్ ఆట స్ఫూర్తిగా ఈ కలెక్షన్ రూపొందిందని, నగరంలోని ప్రముఖ స్టోర్స్‌లో ఈ శ్రేణి అందుబాటులో ఉందని వివరించారు.



భాగ్యనగరం ఒక ఐటీ హబ్ మాత్రమే కాదు.. సేవా తత్పరతకు, మానవీయ కోణానికి కూడా మారుపేరుగా నిలుస్తోంది. ప్రస్తుత తరుణంలో నగరంలో వాలంటీరింగ్ సంస్కృతి వేగంగా విస్తరిస్తోంది. సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాల్లో తాము పాలు పంచుకోవాలని నగరవాసులు తపనపడుతున్నారు. ఇందులో భాగంగా యువత మాత్రమే కాదు, ఉద్యోగులు, గృహిణులు, చిన్నారులు, సీనియర్ సిటిజన్లు కూడా తమ సమయాన్ని సమాజం కోసం వెచ్చించేందు ముందుకు కదులుతున్నారు. ప్రధానంగా నగర వేదికగా సేవలందిస్తున్న వందల కొద్దీ స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ వాలంటీర్లకు అవకాశాల వేదిక అవుతున్నాయి. సామాజిక సేవకు ఒక వేదిక ఒక మాధ్యమం అంటూ ఉండదు.. ఇందులో భాగంగానే అనాథలు, అన్నార్తులు, మూగజీవాలు, పర్యావరణ సంరక్షణ తదితర అంశాల్లో భాగస్వాములవుతున్నారు. – సాక్షి, సిటీ బ్యూరో

సర్వీస్ మోటో..

నగరంలో వాలంటీరింగ్ జోష్

- యువతకు అలవాటుగా మారుతున్న వైనం
- అనాథలు, మూగజీవాలు మొదలు పర్యావరణం వరకూ
- వాలంటీరింగ్ అవకాశాల వేదికలుగా ఎన్జీవోలు
- సెలబ్రిటీలు సైతం పిలుపునిస్తున్న తీరు
- సరికొత్తగా వారాంతాల్లో వాలంటీరింగ్ ట్రెండ్
- వ్యక్తిగతంగా రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు
- సేవా స్ఫూర్తికి నిలువెత్తు ఉదాహరణగా హైదరాబాద్ యువత



హైదరాబాద్ వంటి మహానగరంలో ప్రధానంగా అనాథలకు, అన్నార్తులకు ఈ వాలంటీర్ల సేవలు విశేషంగా ఉపయోగపడుతున్నాయి. దాదాపు మూడు కోట్ల జనాభా ఉన్న నగర వాతావరణంలో సామాజిక సేవకు ఉన్న ఆస్కారాన్ని గుర్తించిన నగర యువత సామాజిక బాధ్యతనుఓ అలవాటుగా మార్చుకుంటున్నారు. యువత, విద్యార్థులు, యువ ఉద్యోగులు వాలంటీరింగ్‌లోకి అడుగుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో వందల సంఖ్యలో ఎన్జీవోలు తమ సేవలను విస్తరించడానికి వాలంటీర్లను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయి. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో జంతు సంరక్షణ కోసం, వాటి హక్కుల కోసం పాటుపడే ఎన్జీవోలు సంఖ్య కూడా పెరిగింది. ఇలాంటి వేదికలతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యూషన్ చెప్పడం, యాత్రికుల సహాయార్థం రోడ్లపై గైడ్‌లుగా మారడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ రహిత ప్రచారం వంటి అనేక సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అవుతోంది.

ఎన్జీవోలు అవకాశాల వేదికలు..

హైదరాబాద్ వంటి మహానగరాల్లో వలసల వల్ల జనాభా పెరుగుతోంది. ప్రభుత్వ సేవలు చాలాకాలంగా ఒత్తిడిలో ఉన్న నేపథ్యంలో వాలంటీరింగ్ చాలా అవసరం. పాఠశాలల్లో టీచర్ల కొరత, ఆస్పత్రుల్లో సహాయకుల అవసరం, పర్యావరణ కాలుష్య నియంత్రణ వంటి అనేక రంగాల్లో వాలంటీర్ల సేవలు సమాజానికి మేలు చేకూరుస్తున్నాయి. అనాథ పిల్లల విద్య కోసం కృషి చేస్తున్న మేక్ ఏ డిఫరెన్స్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మెరుగుపరిచేందుకు యువతను భాగం చేస్తున్న టీచ్ ఫర్ ఇండియా, ఆహారం వ్యర్థం కాకుండా అవసరమైన వారికి చేరవేయడంలో సేవలందిస్తున్న రాబిన్ హుడ్ ఆర్మీ, పిల్లల విద్య, పర్యావరణ, సామాజిక కార్యక్రమాల్లో వాలంటీరింగ్ సేవలందిస్తున్న భూమి, పర్యావరణ సంరక్షణ కోసం మొక్కలు నాటడం, స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్న జీహెచ్ఎంసీ, నిత్యం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్వ్ నీడీ వంటి సంస్థలు నగరంలో వాలంటీరింగ్ అవకాశాలను కల్పిస్తున్నాయి. వీటితోపాటు వినూత్నంగా అంధ విద్యార్థులకు, దివ్యాంగులకు పరీక్షల సమయంలో పరీక్షలు రాసే సహాయకులుగా, అత్యవసర పరిస్థితిలో వ్యక్తిగతంగా రక్త దానం చేసే స్వీయ సేవకులు గానూ పలువురు సేవలో నిమగ్నం అవుతున్నారు.

క్యాన్సర్ పై అవగాహన..

నాకు మంచి ఉద్యోగం దొరకడంలో వాలంటీరింగ్ అనుభవం ఉపయోగపడింది. మరీ ముఖ్యంగా నేను ఒక మనిషిగా ఎదగడానికి వాళ్ల ప్రేరణ ఎక్కువగా దోహద పడిందని నమ్ముతున్నాను. విభిన్న అంశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 2, 3 ఎన్జీవోలకు యాక్టివ్ వాలంటీర్‌గా పనిచేస్తున్నాను. క్యాన్సర్ అవగాహన కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటున్నాను. సమాజానికి దీని ఆవశ్యకత ఎక్కువగా ఉందని నా అభిప్రాయం.

– రామ్ రెడ్డి, ఫార్మా ఉద్యోగి





మేము సైతం..

నగరంలోని ఎన్జీవోలు సోషల్ మీడియా, కాలేజీ వర్క్‌షాప్‌లు ద్వారా వాలంటీర్లను చేర్చుకుంటున్నా.. వాలంటీరింగ్‌లో వయస్సు, కేటగిరీలలో యాక్టివ్ వాలంటీర్లు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు వారు అత్యధికంగా పాల్గొంటున్నారు. విద్యార్థులు, ఉద్యోగంలోకి కొత్తగా ప్రవేశించినవారు తమ ఖాళీ సమయాన్ని సమాజానికి ఉపయోగపడేలా వినియోగించుకుంటున్నారు. అయితే ఇటీవల గృహిణులు, రిటైర్డ్ ఉద్యోగులు కూడా వాలంటీరింగ్‌లో పాల్గొనడం గమనార్హం. ముఖ్యంగా వీకెండ్ వాలంటీరింగ్ అంటూ వారాంతంలో శని, ఆదివారాల్లో ఎన్జీవోల బాట పడుతున్నారు. వీరికి ప్రోత్సాహకరంగా ఈ కార్యక్రమాల్లో పలువు సీలింగ్ ప్రముఖులు క్రీడాకారులు భాగమవుతున్నారు. గత కొన్ని రోజుల క్రితమే ప్రముఖ సినీ తార మంచు లక్ష్మి నగరంలోని క్రీడాకారులు సినీ తారలతో కలిసి టీచ్ ఫర్ ఇండియా కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం విధితమే. మరో సినీ తార సమంత, కొణిదల ఉపాసన, సినీ హీరో రామ్ చరణ్ వంటి సెలబ్రిటీలు తమకు ఆసక్తి ఉన్న అంశాల్లో సమాజ సేవ చేస్తున్నారు. అక్కినేని అమల బ్లూ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జంతు సంరక్షణ కోసం విశేషంగా కృషి చేయడమే కాకుండా వాలంటీర్లకు సైతం అవకాశాలను కల్పిస్తున్నారు.



మూగజీవాలకు బాసటగా..



నగరంలో మూగజీవాల పరిస్థితి అత్యంత దీన పరిస్థితుల్లో ఉంది. వాటికి చేయూత అందించాల్సిన అవసరం మనందరిపై ఉంది. ఈ స్ఫూర్తితోనే నగర వేదికగా వీధి కుక్కల సంరక్షణ కోసం ఏర్పడిన ఫర్రి ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ ఎన్జీవోలో సేవలందిస్తున్నాను. వీధి కుక్కలకు ఆహారం అందించడం, వ్యాక్సిన్ వేయడం వంటి కార్యక్రమాల్లో విధిగా పాల్గొంటున్నాను. అంతేకాకుండా నగరవాసుల్లో స్వీట్ అడాప్షన్ పెంపొందించడానికి ఎన్జీవో ఆధ్వర్యంలో నా వంతు భాగస్వామ్యాన్ని అందిస్తున్నా. నా స్నేహితులను సైతం తీసుకెళ్తున్నాను.

– సాషా మోంటేరియొ, ఫర్రి ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ ఎన్జీవో వాలంటీర్



బెటర్ మిల్క్..

వేసవిలో మహా పానీయంగా మజ్జిగ

ఆరోగ్యానికి మేలు చేస్తుందంటున్న నిపుణులు

మలక్‌పేట : వేసవికాలంలో మజ్జిగ మహాపానీయం ఆరోగ్యానికి మంచిది. ఎండదెబ్బ నుంచి ఉపశమనం పొందడానికి ఎంతగానో ఉపయోగపడటమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలాంటి పానీయానికి సంస్కృతంలో తక్రం, మథితం, ఉదశ్విత్తు అని మూడు పేర్లు ఉన్నాయి.

- తక్రం : నాలుగో వంతు నీరుపోసి తయారు చేసేది తక్రం.
- మథితం : అసలు నీరు పోయకుండా చిలికినది. ఇది రుచిగా ఉంటుంది. కానీ ఆరోగ్యానికి అంత ప్రశస్తం కాదు.
- ఉదశ్విత్తు : సగం నీళ్లు పోసి తయారు చేసేది. ఈ మూడింటిలో తక్రం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది.

వేడి నుంచి ఉపశమనాన్నిస్తుంది..



గతంలో అయితే ఇంటికి వచ్చిన అతిథులకు.. ఎండలో వచ్చిన వారికి, వెళ్లే వారికి మజ్జిగను ఇచ్చేవారు. బాగా చిలికిన మజ్జిగలో ఒక నిమ్మకాయరసం, తగినంత ఉప్పు, చిటికెడు పంచదార కలిపి ఇచ్చేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలకు వెళ్లే వారు గాజుసీసాలో మజ్జిగ తీసుకెళ్తే ఎండ దెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.

– ఉన్నవ పూర్ణచందర్‌రావు, మూసారంబాగ్

ప్రయోజనాలెన్నో..

మజ్జిగ తాగేవారికి ఏ వ్యాధులూ దరిచేరవని, వచ్చిన వ్యాధులు తగ్గి తిరిగి తలెత్తకుండా ఉంటాయని, విషదోషాలు, దుర్బలత్వం, చర్మరోగాలు, దీర్ఘకాలిక వ్యాధులు, కొవ్వు, అమిత వేడి తగ్గిపోతుందని, శరీరానికి మంచి వర్చస్సు కలుతుందని యోగరత్నాకరంలో పేర్కొన్నారు.

- వేసవిలో మజ్జిగ ఎక్కువగా తీసుకోడం వల్ల శరీరంలో లవణాలను తగ్గకుండా చేస్తుంది.
- తోడుపెట్టినందు వల్ల పాలల్లో ఉండే పోషక విలువలన్నీ మజ్జిగలోనూ పదిలంగా ఉంటాయి. దీంతోపాటు మంచి బ్యాక్టీరియా మనకు దొరుకుతుంది.
- ఫ్రిజ్‌లో పెడితే మజ్జిగలోని ఈ బాక్టీరియా దెబ్బతింటుంది. అందుకే అతి చల్లని మజ్జిగ తాగకూడదు.
- మజ్జిగను చిలకడం వల్ల తేలికగా అరిగే గుణం ఏర్పడుతుంది. అందుకే పెరుగు కంటే మజ్జిగ మంచిది.

వేసవిలో కూర్చిక పానీయం..



ఒక గ్లాసు పాలు తీసుకుని కాచి చల్లార్చి అందులో రెండు గ్లాసుల పుల్లని మజ్జిగ కలపాలి. ఈ పానీయాన్ని కూర్చిక అంటారు. ఇందులో పంచదార, ఉప్పు బదులుగా ధనియాలు, జీలకర్ర, శొంఠి ఈ మూడింటినీ 100 గ్రాములు చొప్పున దేనికదే మెత్తగా దంచి కలుపుకోవాలి. ముందుగా ఈ మూడింటినీ కలిపి తగినంత ఉప్పు చేర్చి దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోవాలి. కూర్చికను తాగినప్పుడల్లా అందులో ఈ మిశ్రమాన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగితే.. వడదెబ్బ కొట్టదు. పేగులకు బలాన్నిస్తుంది. జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది. దప్పికని పోగొడుతుంది.




అబ్బురపర్చిన ఫిలిగ్రీ ఐడల్స్

అదనపు ఆకర్షణగా ఏటికొప్పాక బొమ్మలు

ముగిసిన ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ డిజైన్ సింక్ ప్రదర్శనలు



రాయదుర్గం : వివిధ రకాల దేవతామూర్తులు, కళాకారులు, ఇతరత్రా ఏటికొప్పాక బొమ్మలు అందరినీ అబ్బురపరిచాయి. ముఖ్యంగా ఏటికొప్పాక కళాకారుడు పి నాగేశ్వరరావు స్వయంగా ఏటికొప్పాక బొమ్మలను తయారు చేసి వాటికి రంగులద్ది అందరినీ ఆకట్టుకున్నాడు. అప్పటి కప్పుడు తయారు చేసిన ఏటికొప్పాక బొమ్మను ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్ లోహిత్‌రెడ్డికి బహూకరించారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వార్షిక ఫెస్ట్ 'డిజైన్ సింక్' ప్రదర్శనలు శుక్రవారం ముగిశాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏటికొప్పాక కళాకారుడు నాగేశ్వరరావు ఎఫ్‌డీడీఐ విద్యార్థులకు మన సంప్రదాయ కళను నేర్పించేందుకు ఈ ప్రదర్శన నిర్వహించారు. అంతేకాకుండా సిల్వర్ ఫిలిగ్రీ ఐడల్స్‌ను కూడా ప్రదర్శనలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో ప్రపంచ అతిపెద్ద సిల్వర్ పిలిగ్రీ తయారు చేయడంలో 2018లో స్థానం పొందిన కళాకారుడు రామోజు చిరంజీవి రూపొందించిన ఐడల్స్‌ను ప్రదర్శించారు. వీటిని కూడా విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాకారులకు ఈడీ సన్మానం చేసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



జర్నలిస్టులకు.. సండేస్ ఆన్ సైకిల్

- ఫిట్ ఇండియా మిషన్ కింద ఫిట్‌నెస్‌కు ప్రోత్సాహం
- రేపు గచ్చిబౌలిలో సైక్లింగ్ డ్రైవ్

లక్డీకాపూల్ : సండేస్ ఆన్ సైకిల్ మిషన్‌లో తెలంగాణలోని జర్నలిస్టులు పాల్గొనాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుజాత చతుర్వేది కోరారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య స్పృహ కలిగిన రవాణా విధానాన్ని మరింత ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్ చేపట్టనుందన్నారు. దీని ద్వారా సాధారణ శారీరక శ్రమ, ఫిట్‌నెస్ ప్రోత్సహించడం ద్వారా పౌరులను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రేరేపించడమే లక్ష్యమన్నారు. ముఖ్యంగా జీవనశైలి సంబంధిత ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవాలనే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపుకు అనుగుణంగా తమ శాఖ ఈ నెల 27న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 'సండేస్ ఆన్ సైకిల్' ప్రత్యేక ఎడిషన్‌ను నిర్వహించతలపెట్టామని, ఈ కార్యక్రమం గచ్చిబౌలిలో జరుగుతుందన్నారు. ఈ డ్రైవ్‌ను గతేడాది డిసెంబర్ 17న కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రారంభించారని గుర్తుచేశారు. తెలంగాణ జర్నలిస్టులందరూ తమ పేర్లను నమోదు చేసుకుని పాల్గొనాలని ఆ శాఖ కార్యదర్శి సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.



అప్ అండ్ డౌన్

- గిడ్డంగుల లావాదేవీల్లో వృద్ధి.. సరఫరాలో క్షీణత
- 2025 క్యూ1లో 3 లక్షల చ.అ. స్థలం లీజుకు
- ఇదే కాలంలో సరఫరా 2 లక్షల చ.అ.లే
- 50 శాతం పెరిగిన లీజులు, 67 శాతం తగ్గిన సప్లయి

2025 క్యూ1లో నగరాల వారీగా వేర్‌హౌస్ స్పేస్: (చ.అ. లక్షల్లో)

నగరం	లావాదేవీలు	సరఫరా
ఢిల్లీ-ఎన్‌సీఆర్	31	25
చెన్నై	20	20
ముంబై	10	19
బెంగళూరు	8	9
పుణె	7	9
అహ్మదాబాద్	6	5
కోల్‌కతా	5	5
హైదరాబాద్	3	2

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పారిశ్రామిక గిడ్డంగుల(వేర్‌హౌస్) విపణిలో భిన్న వాతావరణం ఏర్పడింది. ఈ ఏడాది తొలి త్రైమాసికం(క్యూ1)లో నగరంలో 3 లక్షలు చ.అ. లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 2 లక్షల లావాదేవీలతో పోలిస్తే ఇది 50 శాతం అధికం. ఇక, 2025 క్యూ1లో నగరంలో కొత్తగా 2 లక్షల చ.అ. గిడ్డంగుల స్థలం సరఫరా అయ్యింది. గతేడాది ఇదే కాలంలో సరఫరా అయిన 6 లక్షల చ.అ.లతో పోలిస్తే ఇది 67 శాతం తక్కువ.

- ఈ ఏడాది క్యూ1లో దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 90 లక్షల చ.అ. పారిశ్రామిక గిడ్డంగుల స్థల లావాదేవీలు జరిగాయి. గతేడాది ఇదే కాలంలో జరిగిన 78 లక్షల చ.అ. లావాదేవీలతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఎక్కువగా ఇంజినీరింగ్ కంపెనీలు 25 శాతం, ఈ-కామర్స్ సంస్థలు 21 శాతం స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయని కొలియర్స్ ఇండియా నివేదిక వెల్లడించింది. అలాగే ఈ క్యూ1లో కొత్తగా 94 లక్షల చ.అ. స్పేస్ సరఫరా అయింది. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 16 శాతం ఎక్కువ.



హరిత భవనాలు 1,300 కోట్ల చ.అ..

డెవలపర్లు, పెట్టుబడిదారులు, కొనుగోలుదారులు గ్రీన్ సర్టిఫికెట్, ఇంధన సమర్థవంతమైన నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. స్థిరమైన భవన పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సరళమైన నిబంధనలు గ్రీన్ బిల్డింగ్‌ల నిర్మాణానికి ప్రధాన కారణం. దీంతో గృహాలు, ఆఫీసులు, వాణిజ్య సముదాయాలు, గిడ్డంగులు, డేటా సెంటర్లు కూడా కార్బన్ ఉద్గారాల తగ్గించే భవన నిర్మాణానికే బిల్డర్లు మొగ్గు చూపిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో హరిత భవనాలు 1,300 కోట్ల చ.అ.కు చేరాయని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) తెలిపింది. గతేడాది ముగింపు నాటికి దేశంలో 21 లక్షలకు పైగా గృహాలు, 6,500 వాణిజ్య సముదాయాలు, 750 పారిశ్రామిక ప్రాజెక్ట్‌లు గ్రీన్ సర్టిఫికెట్‌ను పొందాయి.

సాక్షి, సిటీబ్యూరో:

- కరోనా తర్వాత స్థిరాస్తి కొనుగోలుదారులలో మార్పులు వచ్చాయి. తినే తిండితో పాటు ఉండే ఇల్లు కూడా హైజీన్‌గా ఉండాలని భావిస్తున్నారు. దీంతో పర్యావరణహితమైన భవన నిర్మాణాలకు ఆదరణ పెరిగింది. ఈ గ్రీనరీ కేవలం ఇళ్లకే కాదు పనిచేసే ఆఫీసులూ హరితంగానే ఉండాలని భావిస్తున్నారు. దీంతో ఉద్యోగస్తుల అభిరుచులకు తగ్గట్టుగానే యాజమాన్యాలు కూడా గ్రీన్ స్పేస్ ఆఫీసులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని క్రెడాయ్-కొలియర్స్ నివేదిక వెల్లడించింది.
- కరోనా తర్వాతి నుంచి బహుళ జాతి సంస్థలు ఇంధన సామర్థ్యం, కార్బన్ ఉద్గారాల తగ్గుదలతో పాటు ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. దీంతో హరిత కార్యాలయాలకు ఆదరణ పెరుగుతుంది. 2010లో దేశంలోని ఆఫీసు స్పేస్ స్టాక్‌లో గ్రీన్ ఆఫీసు స్పేస్ వాటా 52 శాతంగా ఉండగా.. గత ఐదేళ్లలో ఏకంగా 80 శాతానికి పైగా చేరడమే ఇందుకు ఉదాహరణ. హరిత భవనాల అత్యధికంగా ఐటీ, బీఎఫ్ఎస్ఐ, హెల్త్ కేర్ అండ్ ఫార్మా, ఇంజినీరింగ్ అండ్ మాన్యుఫాక్చరింగ్ సంస్థలు లీజుకు తీసుకుంటున్నాయి.

కూల్.. కూల్.. ఆఫీస్!

దేశంలో హరిత కార్యాలయాలకు ఆదరణ

గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్ లావాదేవీలు 50.3 కోట్ల చ.అ.	ఇందులో 66 శాతం వాటా హరిత కార్యాలయాలదే..	వచ్చే 3 ఏళ్లలో 70 కోట్ల చ.అ.కు గ్రీన్ ఆఫీస్ స్పేస్	క్రెడాయ్-కొలియర్స్ నివేదిక

హైదరాబాద్‌లో 8.67 కోట్ల చ.అ. గ్రేడ్-ఏ స్థలాలు

కర్బన ఉద్గారాల తగ్గింపు, విద్యుత్, నీటి బిల్లుల ఆదా





నగరాల వారీగా గ్రేడ్-ఏ ఆఫీసులు: (చ.అ. కోట్లలో)

నగరం	స్టాక్	వాటా (శాతంలో)
బెంగళూరు	15.82	31
ఢిల్లీ-ఎన్‌సీఆర్	9.38	19
హైదరాబాద్	8.67	17
ముంబై	6.82	14
చెన్నై	5.22	10
పుణె	4.34	9

అద్దెలు ప్రీమియమే..

గ్రీన్ సర్టిఫికెట్ పొందిన ఆఫీసు భవనాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వీటిల్లో ఆక్యుపెన్సీ లెవల్ 80-90 శాతం వరకు ఉంది. సాధారణ భవనాలలో పోలిస్తే గ్రీన్ ఆఫీసుల అద్దె 25 శాతం అధికంగా ఉంటుంది. దేశంలోని గ్రీన్ సర్టిఫైడ్ ఆఫీసు స్పేస్ స్టాక్‌లో 31 శాతం వాటాతో బెంగళూరు తొలి స్థానంలో నిలవగా.. ఢిల్లీ-ఎన్‌సీఆర్ 19 శాతం, హైదరాబాద్ 17 శాతంతో ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి. 2024 చివరి నాటికి 50.3 కోట్ల చ.అ. గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్ స్టాక్ ఉంది. వచ్చే 2-3 ఏళ్లలో 70 కోట్ల చ.అ.లకు చేరుతుందని అంచనా.

పాత భవనాలు గ్రీనరీగా..

దేశంలో పదేళ్లకు పైగా మించిన 35.5 నుంచి 38.5 కోట్ల చ.అ.లలో పాత భవనాలు ఉన్నాయి. వీటిని గ్రీన్ ఆఫీసులుగా పునరుద్ధరించడానికి 425 బిలియన్లకు పైగా పెట్టుబడులు అవసరం. అలాగే పదేళ్లలోపు 8 నుంచి 11 కోట్ల చ.అ. పాత భవనాలు ఉన్నాయి. వీటి పునరుద్ధరణకు 22-32 బిలియన్లు అవసరం.


మార్కెట్‌లోకి ఆఫీసు స్పేస్ సరఫరా..

వచ్చే మూడేళ్లలో ఆరు ప్రధాన నగరాల్లో 17-20 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ అందుబాటులోకి వస్తుందని అంచనా. అత్యధికంగా ఐటీ హబ్‌లైన బెంగళూరు, హైదరాబాద్‌లో సరఫరా రానుంది.

ప్రయోజనాలివీ..

- ఏటా 6,430 యూనిట్ల విద్యుత్ ఆదా
- సంవత్సరానికి 19,800 కోట్ల లీటర్ల నీరు ఆదా
- వార్షికంగా 5.14 కోట్ల టన్నుల సీఓ-2 ఉద్గారాల తగ్గుదల
- ఏటా 25 లక్షల టన్నుల నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగం
- ఇంట్లోకి ధారాళమైన గాలి, వెలుతురు
- తక్కువ యూటిలిటీ బిల్లులు

దేశంలో గ్రేడ్-ఏ గ్రీన్ ఆఫీసు స్పేస్	సంవత్సరం	2010	2015	2020	2024
	స్టాక్(చ.అ. కోట్లలో)	13.7	23.6	36.0	50.3



దేశంలో హరిత భవనాల గణాంకాలివీ

సంవత్సరం	చ.అ. (కోట్లలో)
2020	770
2021	800
2022	980
2023	1,030
2024	1,300

నగరాల వారీగా గణాంకాలివీ..

నగరం	చ.అ. (కోట్లలో)
బెంగళూరు	5 - 5.5
హైదరాబాద్	4 - 4.5
ఢిల్లీ-ఎన్‌సీఆర్	3 - 3.5
ముంబై	2 - 2.5
పుణె	2 - 2.5
చెన్నై	1 - 1.5



ఇళ్ల అమ్మకాల్లో యువత కీలకం

సాక్షి, సిటీబ్యూరో: కరోనాతో స్థిరాస్తి రంగానికి జరిగిన ప్రధాన మేలు.. సొంతింటి అవసరం తెలిసిరావటమే. మరీ ముఖ్యంగా గృహ విభాగంలో యువతరం భాగస్వామ్యం పెరగడం. ఇళ్ల కొనుగోలు నిర్ణయంలో వీరు కీలకంగా మారారు. 74 శాతం సంపన్న కొనుగోలుదారులు ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రియల్ ఎస్టేట్ ఒక ప్రధాన ఆస్తిగా పరిగణిస్తారు. విశాలవంతమైన గృహాలు, గ్రీనరీ ఎక్కువగా ఉండే ప్రాపర్టీలకే లగ్జరీ కొనుగోలుదారులు మొగ్గు చూపిస్తున్నారు. సంపన్న భారతీయుల ప్రాపర్టీ ఎంపికలో తొలి ప్రాధాన్యం మెరుగైన ఫిజికల్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలకే. సంపన్న కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ప్రధాన కారణం మెరుగైన జీవన శైలి. మూలధన వృద్ధి, భవిష్యత్తు తరాలకు ఆస్తి వంటివి ఆ తర్వాతి అంశాలు. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, గోవా, బెంగళూరు నగరాలలో గృహాల కొనుగోళ్లకు హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్ఎన్ఐ), అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(యూహెచ్ఎన్ఐ)లు ఆసక్తిగా ఉన్నారు. 11 శాతం మంది సంపన్నులు విదేశాలలో ప్రాపర్టీలకు మొగ్గు చూపుతున్నారు. విలాసవంతమైన భారతీయులు న్యూయార్క్, మయామి, లండన్, దుబాయ్, లిస్బన్ దేశాలలో లగ్జరీ అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొంటే.. మన దేశం మాత్రం వేగవంతమైన ఆర్థిక అభివృద్ధి సాధిస్తోంది. దేశీయ స్థిరాస్తి రంగంలో విదేశీ పెట్టుబడులు గణనీయంగా పెరుగుతున్నాయి. దేశాభివృద్ధిపై దేశీయ పెట్టుబడిదారులకు విశ్వాసం ఉన్నప్పటికీ.. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో విదేశీ పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరిగింది. దేశంలో బలమైన ఆర్థిక వృద్ధి, వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలు, సులభతర పెట్టుబడి విధానం వంటి రకరకాల కారణాలతో విదేశీ పెట్టుబడిదారుల వాటా గతేడాది తొలి త్రైమాసికం(క్యూ1)లో 2 శాతం నుంచి ఈ ఏడాది క్యూ1 నాటికి ఏకంగా 43 శాతానికి పెరిగిందని వెస్టియన్ నివేదిక వెల్లడించింది. -సాక్షి, సిటీబ్యూరో

ఫారిన్ ఫ్లో

స్థిరాస్తి రంగంలో విదేశీ పెట్టుబడుల వెల్లువ

- ఈ క్యూ1లో 813 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్
- ఇందులో 43 శాతం వాటా ఫారినర్స్‌దే..
- నివాస, వాణిజ్య విభాగంలోనే అధిక పెట్టుబడులు



విదేశీ పెట్టుబడుల వెల్లువ..

దేశంలోకి 2024 క్యూ1లో 552.1 మిలియన్ డాలర్ల సంస్థాగత పెట్టుబడులు వచ్చాయి. ఇందులో విదేశీ పెట్టుబడులు కేవలం 4 శాతమే. అంటే 11 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. అదే 2025 క్యూ1 నాటికి మొత్తం 813.3 మిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా.. ఇందులో విదేశీ పెట్టుబడుల వాటా ఏకంగా 43 శాతం. 346.9 మిలియన్ డాలర్ల ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి.

నివాసంలోకే అత్యధికం..

నివాస విభాగంలో పెట్టుబడులకే విదేశీయులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. గృహ రంగంలోకి 506 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం ఇన్వెస్ట్‌మెంట్స్‌లో రెసిడెన్షియల్ సెక్టార్ వాటా 62 శాతం. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 41 శాతం అధికం. విలువల పరంగా చూస్తే.. పెట్టుబడులు వార్షికంగా 125 శాతం వృద్ధి నమోదు చేశాయి. ఆ తర్వాత వాణిజ్య విభాగంలోకి 307.2 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్స్ వచ్చాయి. ఈ త్రైమాసికంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో ఈ విభాగం వాటా 38 శాతం. అయితే ఈ క్యూ1లో పారిశ్రామిక, గిడ్డంగుల విభాగంలోకి ఎలాంటి పెట్టుబడులు రాలేదు. అయితే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ-కామర్స్ రంగం, లాజిస్టిక్ ఖర్చుల తగ్గింపు నేపథ్యంలో భవిష్యత్తులో ఈ విభాగంలోకి పెట్టుబడులు వచ్చే అవకాశాలు అపారంగా ఉన్నాయి.

విభాగాల వారీగా ఇన్వెస్ట్‌మెంట్స్: (మిలియన్ డాలర్లలో)

విభాగం	క్యూ1 2025	క్యూ1 2024	వృద్ధి(శాతంలో)
నివాసం	506.1	225.0	62
వాణిజ్యం	307.2	231.6	38
వేర్‌హౌస్	-	58.9	-

సంస్థాగత పెట్టుబడుల గణాంకాలివీ: (మిలియన్ డాలర్లలో)

పెట్టుబడిదారులు	క్యూ1 2025	క్యూ1 2024
విదేశీయులు	346.9	11.0
భారతీయులు	466.4	541.1

మినీ హోమ్ థియేటర్

సాక్షి సిటీబ్యూరో: హోమ్ థియేటర్ ఏర్పాటు చేసుకునేందుకు విశాలమైన ఇల్లు లేదా విల్లా ఉండాలని చాలా మంది భావిస్తారు. కేవలం ఖరీదైన గృహాలున్న వారే వీటిని ఏర్పాటు చేసుకుంటారని అనుకుంటారు. కానీ, కేవలం కాస్త బడా సైజు టీవీ ఖర్చుతోనే ఇంట్లోనే ఎంచక్కా హోమ్ థియేటర్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. మీ ఇంట్లో 8/6 అడుగుల సైజు గోడ ఉందా? అయితే అదే గోడకు హోమ్ థియేటర్‌ను బిగించి.. ఎంచక్కా కొత్త సినిమాలను ఆస్వాదించొచ్చు. ఇందుకు మీకు అయ్యే ఖర్చు కేవలం లక్షన్నర. ఒక ప్రొజెక్టర్, సినిమా స్క్రీన్, 2.1 డిజిటల్ సౌండ్ సిస్టమ్ వస్తుంది. హ్యాపీగా మీరు కుటుంబంతో కలిసి ఎంచక్కా నచ్చిన సినిమాను ఆస్వాదించొచ్చు. మ్యూజికల్ కన్సర్ట్‌ను వీక్షించొచ్చు. పిండి కొద్ది రొట్టె అన్నట్టుగా.. ఆధునిక హోమ్ థియేటర్ అయితే కాస్త ఖరీదెక్కువ.. ఇందులో ఫీచర్లూ ఎక్కువే.



కాస్త పెరిగిన అద్దెలు

ప్రధాన నగరాల్లో పెరుగుతున్న అద్దె గృహాల విపణి

పశ్చిమ హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: కొనేటప్పుడు తక్కువ ధరకు కావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువ ధర రావాలని కోరుకునేది స్థిరాస్తి రంగంలోనే.. ఇది అద్దె విభాగానికీ వర్తిస్తుంది. గత కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాలలో అద్దె గృహాల విపణి క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉంది. ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహ యజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తుండటంతో సప్లయి తగ్గింది. దీంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు రెంట్లు కూడా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22 శాతం మేర పెరిగింది. సరఫరా 2.1 శాతం క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 శాతం మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్ 50, సప్లయి వాటా 39 శాతంగా ఉన్నాయి.

పశ్చిమంలో డిమాండ్ ఎక్కువ..

గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోని అద్దె గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో మెరుగైన కనెక్టివిటీనే ప్రధాన కారణం. రూ.25 వేలు నుంచి రూ.35 వేలు నెలవారీ అద్దెలకు కోసం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 1,000 చ.అ. నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ అధికంగా ఉంది.





రాష్ట్రంలో వేసవి భగభగలు తారస్థాయికి చేరాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3–4 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదవుతున్నాయి. మరోవైపు తేమశాతం పెరగడంతో తీవ్ర ఉక్కపోత, దీనికితోడు వడగాడ్పులు జనజీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ పరిస్థితులు ముందుముందు మరింత పెరుగుతాయని రాష్ట్ర విపత్తుల నివారణ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. గతంతో పోలిస్తే ప్రస్తుత వేసవి సీజన్ మరింత వేడిమిగా ఉంటుందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ 'హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్–2025'ను విడుదల చేసింది. జిల్లాలవారీగా తీసుకోవాల్సిన చర్యలను సూచించింది.

సాక్షి, హైదరాబాద్

15 జిల్లాలు.. అగ్నిగుండం

588 మండలాల్లో తీవ్ర వడగాడ్పులకు అవకాశం

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలపై తీవ్ర ప్రభావం

హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ - 2025లో హెచ్చరిక

జిల్లాల వారీగా హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన

వేసవి సీజన్ ముగిసే వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు

నల్లగొండ అగ్నిగుండం

రాష్ట్రంలో ఏటా హీట్‌వేవ్ రోజుల సంఖ్య పెరుగుతోంది. పదేళ్ల గణాంకాలను పరిగణనలోకి తీసుకొని వడగాడ్పుల తీవ్రతను నిర్ణయిస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి 2022 వరకు హీట్‌వేవ్ రోజుల సంఖ్య అత్యంత పరిమితంగా ఉండగా, ఆ తర్వాత వేగంగా పెరిగింది. 2024 వేసవి సీజన్‌లో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 81 రోజుల పాటు వడగాడ్పులు వీచాయి. వేసవి సీజన్‌ను మూడు నెలలపాటు పరిగణనలోకి తీసుకుంటే.. అందులో 90 శాతం కాలం వడగాడ్పులు నమోదు కావడం అత్యంత ఆందోళన కలిగించే అంశం. గత వేసవి సీజన్‌లో సూర్యాపేట జిల్లాలో 54 రోజులు వడగాడ్పులు వీచాయి. మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో వరుసగా 34, 33, 28 రోజుల పాటు వడగాడ్పులు వీచాయి. నాగర్ కర్నూల్ 24 రోజులు, కరీంనగర్ 18 రోజులు, కుమురంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో 16 రోజుల పాటు వడగాడ్పులు వీచాయి. హైదరాబాద్, మెదక్, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల్లో గతేడాది వడగాడ్పులు నమోదు కాలేదు. మిగిలిన జిల్లాల్లో 15 కంటే తక్కువ రోజులు వడగాడ్పులు వీచాయని తెలంగాణ ప్రణాళిక విభాగం గణాంకాలు చెబుతున్నాయి.

యాక్షన్ ప్లాన్‌లోని కీలక అంశాలు

- ప్రస్తుత వేసవి సీజన్‌లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదవుతాయి. నల్లగొండ, సూర్యాపేట, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల, నాగర్‌కర్నూల్, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. సీజన్ ముగిసేవరకు ఈ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యే అవకాశం ఉండడంతో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నివారణ విభాగం సూచించింది.
- జిల్లాలవారీగా హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని సీజన్ ప్రారంభంలో విపత్తుల నివారణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. 33 జిల్లాల కలెక్టర్లు యాక్షన్ ప్లాన్‌లను రూపొందించి రాష్ట్ర విపత్తుల నివారణ శాఖకు సమర్పించగా.. వాటిని ఆమోదిస్తూ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్–2025లో పొందుపరిచింది.
- రాష్ట్రవ్యాప్తంగా 588 మండలాలు వడగాడ్పులకు గురవుతున్నాయి.
- వడగాడ్పుల ప్రభావంతో 2021లో 174 మంది మృతి చెందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2022 వేసవి సీజన్లో 85 మంది, 2023లో 44 మంది, 2024లో 10 మంది వడగాడ్పులకు మరణించినట్లు విపత్తుల శాఖ చెబుతోంది. కానీ, క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య భారీగా ఉన్నట్లు తెలుస్తోంది.
- హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌లో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయనున్నాయి. ఇందుకుగాను శాఖలవారీగా బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది.

క్లుప్తంగా...

జూన్ 3 నుంచి జోసా కౌన్సెలింగ్

మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సహా, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 3వ తేదీ నుంచి మొదలవుతుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) ప్రకటించింది. ఐఐటీల్లో 17,740, ఎన్‌ఐటీల్లో 24,229, ట్రిపుల్ ఐటీల్లో 9,546, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో 9,402 ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని జోసా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. జేఈఈ మెయిన్ ర్యాంకు ఆధారంగా ఐఐటీలు మినహా అన్ని సంస్థల్లో సీట్లు భర్తీ చేస్తారు. ఇటీవలే మెయిన్ ఫలితాలు వెల్లడించారు. ఇందులో పొందిన మార్కుల కటాఫ్ ఆధారంగా అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2.5 లక్షల మందిని ఎంపిక చేస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మే 18న జరుగుతుంది. ఈ పరీక్షను ఐఐటీ కాన్పూర్ ఈసారి నిర్వహిస్తోంది. జూన్ 2వ తేదీన ఫలితాలు వెల్లడిస్తామని ఆ సంస్థ తెలిపింది. ఇది పూర్తయిన వెంటనే అర్హులైన అభ్యర్థులు జోసా కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మొత్తం అయిదు దశల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది. జూలై మొదటి వారంలో అన్ని జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో తరగతులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.

ఉపాధ్యాయ విద్యలో మార్పులు అవసరం

విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ విద్యలో వృత్తిపరమైన మార్పులు అవసరమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి అన్నారు. ఆధునిక బోధన మెళకువలు పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో కమిషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ విద్యపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మేధావులు సంస్కరణల దిశగా పలు సూచనలిచ్చారు. ప్రస్తుత విద్యా విధానాన్ని మరింత విస్తృతం చేయాలని, ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న బోధన విధానాలను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్స్ ఎడ్యుకేషన్ వర్కింగ్ గ్రూపు కన్వీనర్ సంధ్యారాణి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అనాగరికం: బార్ కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి అనాగరికమని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఘాతుకానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష విధించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లు నల్ల రిబ్బన్ ధరించి మృతుల కుటుంబాలకు సంఘీభావం ప్రకటించాలని, క్రూరమైన దాడిని ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ అమానవీయ చర్యను ఖండిస్తూ తీర్మానాన్ని ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు.

అసైన్డ్, అటవీ సమస్యలే అధికం

'భూ భారతి' పైలట్ మండలాల్లో వస్తున్న దరఖాస్తుల్లో అధికం ఇవే

వారం రోజులుగా కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



కామారెడ్డి జిల్లా రాంపూర్‌లో దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: 'భూ భారతి' పైలట్ మండలాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో అత్యధికంగా అసైన్డ్, అటవీ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ స్థానంలో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని అమలు చేయడానికి ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్టుగా) రాష్ట్రంలో నాలుగు మండలాలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. కామారెడ్డి జిల్లాలోని లింగంపేట, నారాయణపేట జిల్లాలోని మద్దూర్, ములుగు జిల్లాలోని వెంకటాపూర్(ఎం), ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలాల్లో రెవెన్యూ గ్రామాలవారీగా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 17న ప్రారంభమైన సదస్సులు 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆయా మండలాల్లో రెవెన్యూ సదస్సుల తీరును 'సాక్షి'గురువారం పరిశీలించింది. అటవీ భూములపై హక్కులు, అసైన్డ్ భూముల బదిలీ, రికార్డుల్లో సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం మిస్సింగ్, సాదా బైనామాలపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయి.

గ్రామాలవారీగా సదస్సులు..

రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి రోజుకు రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తూ దరఖాస్తులు తీసుకుంటూ రశీదులు ఇస్తున్నారు. సదస్సులు జరుగుతున్న సమయంలో అందుబాటులో లేని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు.

అటవీ, అసైన్డ్ భూములతో..

కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలో భూ సమస్యలు అటవీ భూములతోనే ముడిపడి ఉన్నాయి. 23 రెవెన్యూ గ్రామాలు ఇప్పటివరకు 12 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. 1,400 దరఖాస్తులు వచ్చాయి. అన్ని గ్రామాల్లో అసైన్డ్, అటవీ భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా ఉన్నాయి. దశాబ్దాల కిందట కొనుగోలు చేశామని వాటికి మార్పిడి అవకాశం కల్పించాలంటూ చాలా గ్రామాల్లో దరఖాస్తులు వచ్చాయి. ములుగు మండలం వెంకటాపురం(ఎం) మండలంలో అసైన్డ్ పట్టాల కోసం 1,642 దరఖాస్తులు వచ్చాయి.

పీవోటీ సమస్యలు..

నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములు, దేవాలయాలు, వక్ఫ్, ప్రభుత్వ భూములు కొనడానికి, అమ్ముకోవడానికి వీలుండదు. అయితే చాలాచోట్ల ఆయా భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. ఇప్పుడు వాటిని రికార్డుల్లోకి ఎక్కించాలంటూ రైతులు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో పీవోటీకి సంబంధించి 94 సమస్యలు రాగా, 260కి పైగా అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలంటూ దర ఖాస్తులు వచ్చాయి. సాదాబైనామాలకు 94 దరఖాస్తులు వచ్చాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో సాదాబైనామా లకు సంబంధించి 568 దరఖాస్తులు వచ్చాయి. నారాయణ పేట జిల్లా మద్దూరు మండలంలో సాదాబైనామాలకు సంబంధించి 60 దరఖాస్తులు వచ్చాయి. ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలో 1,240 దరఖాస్తులు వచ్చాయి.

రికార్డుల్లో విస్తీర్ణం తక్కువ, సర్వే నంబర్ల మిస్సింగ్...

ధరణి రికార్డుల్లో సర్వే నంబర్ల మిస్సింగ్, విస్తీర్ణం తక్కువగా నమోదు కావడం వంటి సమస్యలపైనా ఫిర్యాదులు వస్తున్నాయి. నేలకొండపల్లిలో తరుగు విషయంలో 69 మంది దరఖాస్తు చేసుకున్నారు. మద్దూరు మండలంలో సర్వే నంబర్ల మిస్సింగ్‌కు సంబంధించి 297, లింగంపేటలో 43 దరఖాస్తులు వచ్చాయి.

వారం రోజుల్లో వచ్చిన భూభారతి దరఖాస్తుల వివరాలు ఇలా...

జిల్లా	పైలట్ మండలం	దరఖాస్తులు
కామారెడ్డి	లింగంపేట	1,416
నారాయణపేట	మద్దూరు	969
ములుగు	వెంకటాపురం(ఎం)	3,976
ఖమ్మం	నేలకొండపల్లి	1,227

నిబంధనలకు లోబడి పరిష్కరిస్తాం



భూ భారతి ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయి. అవసరమైన చోట అటవీ, రెవెన్యూ శాఖలతో జాయింట్ సర్వే నిర్వహించి వివాదాలు పరిష్కరిస్తాం. నిషేధ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి నిబంధనల మేరకు నడుచుకుంటాం. దరఖాస్తు ఇచ్చినవారికి వారం రోజుల్లో నోటీసులు ఇస్తాం. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తాం. ఒకవేళ రిజెక్ట్ అయితే ఎందుకు చేశామో లిఖితపూర్వకంగా సమాధానం ఇస్తాం.

– ఆశిష్ సంగ్వాన్, కలెక్టర్, కామారెడ్డి

భూమికి హక్కులు రాలేదు



మా ఊరిలో 62 సర్వే నంబరులో ఎకరన్నర భూమి ఉంది. ఈ భూమిలో మా తాతల కాలం నుంచి పంటలు సాగు చేస్తున్నాం. ఇప్పటి వరకు మాకు ఎలాంటి పాస్ పుస్తకాలు రాలేదు. ఆ సర్వే నంబరు ఫారెస్టుది అంటున్నారు. ఇప్పుడైనా మాకు న్యాయం జరుగుతుందేమోనని దరఖాస్తు చేసుకున్నం.

–ఆకుల లక్ష్మీనారాయణ, పోతాయిపల్లి, కామారెడ్డి జిల్లా

భూ మార్పిడి కాలేదు



నా భర్త దాసరి బాలకిష్టప్ప చనిపోయి ఐదేళ్లు అవుతోంది. ఆయన పేరుమీద 3 ఎకరాల భూమి ఉంది. దానిని నా పేరు మీదకు మార్చాలని ఎన్నోసార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన. కానీ ఏం లాభం లేదు. ఇప్పుడన్న చేస్తారన్న ఆశతో మరోసారి దరఖాస్తు చేసుకున్నా.

– మణెమ్మ, ఖాజీపూర్, నారాయణపేట జిల్లా

దుక్కులకు సమయమిదే!

రానున్న 4 రోజులపాటు తేలికపాటి వర్షాలు

- ఈ సమయంలో రైతులు దుక్కులు చేసుకోవటం మేలు
- మామిడి తోటల్లో సస్యరక్షణకు మంచి సమయం
- చాలా జిల్లాల్లో వచ్చే 5 రోజులు తీవ్రమైన ఎండలు
- వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం వెల్లడి



సాక్షి స్పెషల్ డెస్క్, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న 5 రోజులు పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా ప్రాంతాల రైతులు ఈ సమయంలో దుక్కులు దున్నుకోవాలని రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా.పి.లీలారాణి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బులెటిన్ విడుదల చేశారు. మామిడి పంటలో పండు ఈగ నియంత్రణకు ఇదే మంచి సమయమని తెలిపారు. వాతావరణ పరిస్థితులను బట్టి పంటల సాగులో ఈ నెల 26 (శనివారం) నుంచి 30 వరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక బులెటిన్లను విడుదల చేస్తున్నదని వెల్లడించారు.

బులెటిన్‌లోని ప్రధాన సూచనలు

- వేసవి దుక్కుల వల్ల భూమిలో నిద్రావస్థలో ఉన్న చీడపీడలు కలిగించే పురుగులు బయటపడి అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయటపడిన ప్యూపాలను, గుడ్లను, పక్షులు తిని నాశనం చేస్తాయి. భూమి గుల్లబారి నీటి నిల్వ శక్తి పెరుగుతుంది. అందువల్ల వేసవి జల్లులను వినియోగించుకొని వేసవి దుక్కులను చేసుకోవాలి.
- పండ్ల తోటల్లో వేసవి కాలంలో గుంతలు తీసి ఎండకు ఆరనివ్వాలి. దీనివల్ల నేలలోని పురుగులు వాటి గుడ్లు తెగుళ్లను కలిగించే శిలీంద్రాలు నశిస్తాయి. ఆ తర్వాత పండ్ల మొక్కలు నాటుకోవటం మంచిది.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసేటప్పుడు చెట్ల క్రింద నిలబడరాదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి.
- కోసిన పంటలను (వరి, మొక్కజొన్న, శనగ, పెసర, మినుము, జొన్న, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలు) వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పి ఉంచాలి. తాత్కాలికంగా పురుగు మందుల పిచికారీని వాయిదా వేసుకోవాలి.

వడగళ్ల రైతులకు సూచనలు

మామిడిలో కాయమచ్చ తెగులు గమనించినట్లయితే 1 గ్రా. కార్బండజిమ్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

5 రోజులు మండే ఎండలు.. ఈదురుగాలులతో వర్షాలు

వచ్చే 5 రోజులు పగటి ఉష్ణోగ్రతలు 38 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశం ఉందని లీలారాణి తెలిపారు. రాత్రి ఉష్ణోగ్రతలు 24 నుంచి 30 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావొచ్చని చెప్పారు. 26న ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల (గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. 27 నుంచి 29 తేదీల మధ్య ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయి.

లబ్ధిదారుల వివరాలతో 'ప్రజా పోర్టల్'

నేడు ఆవిష్కరించనున్న రాష్ట్ర ప్రభుత్వం!

- ఏ లబ్ధిదారుడి ఖాతాలో ఎంత నగదు పడిందో వెల్లడి
- ఏ పథకం కింద లబ్ధి పొందారనే వివరాలు కూడా
- సీజీజీ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రతి ఒక్కరి వివరాలను ప్రజాబాహుళ్యంలో ఉంచడం ద్వారా పారదర్శక పాలన అందించే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా 'ప్రజా పోర్టల్'పేరుతో ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రజా పోర్టల్‌లో రాష్ట్ర ప్రభుత్వం తాను అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఈ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలను పొందుపర్చనుంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, రాజీవ్ యువశక్తి, పింఛన్లు, సీఎంఆర్‌ఎఫ్, ఆరోగ్యశ్రీ లాంటి నగదు లబ్ధి పథకాలు, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి సబ్సిడీ పథకాల లబ్ధిదారుల వివరాలను ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఇలాంటి పోర్టల్ దేశంలో ఒక్క రాజస్తాన్ రాష్ట్రంలోనే ఉందని, అది కూడా ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి వెల్లడించారు.

ఈ పోర్టల్ ద్వారా ప్రభుత్వ నిధులు ఎప్పుడు, ఏ పథకం ద్వారా ప్రజలకు ఎలా చేరుతున్నాయన్న అవగాహన ప్రతి ఒక్కరికి కలుగుతుందని, అవినీతికి ఆస్కారం ఉండదని, అలాగే అసలు లబ్ధిదారుడికి తెలియకుండా ఇతరులు లబ్ధి పొందే అవకాశం ఉండదని ఆయన వెల్లడించారు. కాగా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ద్వారా రూపొందించి, నిర్వహించనున్న ఈ పోర్టల్‌ను ప్రభుత్వం శనివారం ఆవిష్కరించనున్నట్టు సమాచారం.

'రిజర్వేషన్ల' కేసులో సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట

ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: 'రిజర్వేషన్ల'కు సంబంధించి దాఖలైన ప్రైవేట్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ట్రయల్‌కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా ప్రతినిధుల కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేసిన బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లుకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది. తనపై ఎంపీ ఎన్నికల సమయంలో దాఖలైన 'రిజర్వేషన్ల'కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ చేసిన ప్రసంగంపై వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్‌రెడ్డి ఆరోపించారని తెలిపారు. సీఎం ఆడియో క్లిప్పింగ్‌లను, మీడియా ప్రచురణలను అందజేశారు. కాసం పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు.. సాక్షుల వాంగ్మూలం రికార్డు చేసింది. అయితే, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తనపై కేసు నమోదుచేశారని.. దానిని కొట్టివేయాలని రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

'భూతల స్వర్గం' మళ్లీ వెలవెల!

భూతల స్వర్గంగా పేరుగాంచిన అందాల కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడి ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న అక్కడి పర్యాటక రంగాన్ని మళ్లీ సంక్షోభంలోకి నెట్టేసింది. పహల్గాంలో ముష్కరులు 26 మంది టూరిస్టులను అత్యంత పాశవికంగా హతమార్చడం పర్యాటకుల విశ్వాసాన్ని దారుణంగా దెబ్బతీయడమే కాకుండా దాదాపు 2.5 లక్షల మంది కశ్మీరీల జీవనోపాధి, కశ్మీర్ లోయ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని ప్రశ్నార్థకం చేసింది. మళ్లీ పర్యాటకుల్లో మునుపటి విశ్వాసం, ఉత్సాహం నెలకొనాలంటే ఎన్నేళ్లు పడుతుందోనని టూరిజం వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

– సాక్షి, స్పెషల్ డెస్క్


పర్యాటకుల విశ్వాసాన్ని దెబ్బతీసిన కశ్మీర్ ఉగ్ర దాడి	ఒక్క రోజులోనే 90% బుకింగ్స్ రద్దు చేసుకున్న వేలాది మంది పర్యాటకులు	ఇప్పటికే అక్కడ పర్యటిస్తున్న టూరిస్టులు సైతం హోటళ్లు ఖాళీ చేసిన వైనం	నాలుగేళ్లుగా పుంజుకుంటున్న పర్యాటక రంగంపై నీలినీడలు	ప్రశ్నార్థకంగా మారిన 2.5 లక్షల మంది కశ్మీరీల జీవనోపాధి


హోటళ్లన్నీ ఖాళీ..

ఈ నెల 22న పహల్గాం సమీపంలో మినీ స్విట్జర్లాండ్‌గా పేరుగాంచిన బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాద దాడి ప్రభావంతో కశ్మీర్‌లో పర్యటించేందుకు సిద్ధమైన వేలాది మంది పర్యాటకుల్లో దాదాపు 90 శాతం మంది 24 గంటల వ్యవధిలోనే విమాన టికెట్లు రద్దు చేసుకున్నారు. మరోవైపు ఇప్పటికే కశ్మీర్ సందర్శనకు వచ్చిన పర్యాటకులు రాత్రికి రాత్రే హోటళ్లు, క్యాబ్‌ల బుకింగ్‌లు కూడా పెద్ద ఎత్తున రద్దు కావడం మొదలయ్యాయి. ఇప్పట్లో పర్యాటక పరిశ్రమ కోలుకొనే అవకాశమే లేదని ఓ ట్రావెల్ ఏజెంట్ వ్యాఖ్యానించారు. 'మొన్నటివరకు పర్యాటకులతో కళకళలాడిన మా హోటల్ ఇప్పుడు వెలవెలబోతోంది. అసలైతే గదులన్నీ వచ్చే నెలకు కూడా బుక్ అయ్యాయి. కానీ రాత్రికి రాత్రే పరిస్థితి ఒక్కసారిగా తల్లకిందులైంది. టూరిస్టులంతా భయంతో గదులు ఖాళీ చేసి వెళ్లిపోయారు' అని ఓ హోటల్ యజమాని వాపోయారు.

కేంద్రం చర్యలన్నీ బూడిదపాలు..

కశ్మీరీలకు పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. జమ్మూకశ్మీర్ వార్షిక పర్యాటక పరిశ్రమ విలువ దాదాపు రూ. 12 వేల కోట్లు. దీని విలువ 2030 నాటికి రూ. 30 వేల కోట్లకు పెరుగుతుందని అంచనా. జమ్మూకశ్మీర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని కేంద్రం 2019లో రద్దు చేయడంతోపాటు రాష్ట్ర హోదా తొలగించి జమ్మూకశ్మీర్‌ను లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతాలుగా చేసింది. అలాగే ఏటా స్థానికంగా దాదాపు 50 వేల మందికి ఉపాధి కల్పించేలా, ఐదేళ్లలో రూ. 2 వేల కోట్ల వార్షిక పెట్టుబడులను ఆకర్షించేలా 2020లో ప్రత్యేక పర్యాటక పాలసీని తీసుకొచ్చింది. దీనికితోడు మౌలిక సదుపాయాల మెరుగుదల, విమాన కనెక్టివిటీ, విదేశీ పర్యాటకులకు ఆన్–అరైవల్ వీసా, 75 కొత్త పర్యాటక ప్రదేశాలు, 75 కొత్త వారసత్వ/సాంస్కృతిక ప్రదేశాలు, 75 కొత్త సూఫీ/మత ప్రదేశాల స్థాపన కోసం రూ. వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించింది. కశ్మీర్‌ను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో నేరుగా అనుసంధానించడానికి రైల్వే కూడా కసరత్తు ప్రారంభించింది. ప్రీమియం రైలు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇందులో ఉంది. కేంద్రం చర్యలతో 2020 నుంచి కశ్మీర్ లోయను సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. 2024 నాటికి పర్యాటకుల సంఖ్య సుమారు 2.36 కోట్లకు చేరుకుంది. కానీ ఇప్పుడు ఉగ్రవాద దాడితో అక్కడి పర్యాటక రంగం చుట్టూ సంక్షోభం ముసురుకుంది.







ఎగిరిన పక్షులు మళ్లీ వస్తాయి..

చెట్టుకు సమీపంలో ఆటంకం తలెత్తితే పక్షులు ఎగిరిపోతాయి. అవి మళ్లీ తిరిగి వస్తాయి. కశ్మీర్‌లో కూడా అంతే. అంతా సర్దుకున్నాక పర్యాటకులు తిరిగి వస్తారన్న నమ్మకంతో ఉన్నాం. ప్రస్తుతానికి 90 శాతంపైగా ఖాళీ అయింది. వేలాది మంది తిరుగుముఖం పట్టారు. పర్యాటకమే మా ఆదాయ వనరు. ఇక్కడికి వచ్చిన వారికి కాశ్మీరీలు ఆతిథ్యం ఇస్తున్నారు. పర్యాటకులే మా కుటుంబం.

– గులాం రసూల్, వ్యాపారవేత్త, కశ్మీర్

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 26-4-2025



సోషల్ మీడియా

ఖాకీ రీల్స్

దేశవ్యాప్తంగా ఎంతోమంది మహిళా పోలీసులు సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకొంటున్నారు. 'ఖాకీ రీల్స్' కొత్త ట్రెండ్‌గా మారింది.

ఉత్తేజపరిచే వ్యక్తిత్వ వికాస ప్రసంగాల నుంచి వర్కవుట్‌ల వరకు ఆకట్టుకునే 'రీల్స్' చేస్తున్నారు....

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పోలీస్ ఆఫీసర్ కాంచన్ పాండేకు ఇన్‌స్టాగ్రామ్‌లో 99,900 మంది ఫాలోవర్‌లు ఉన్నారు. డ్యాన్స్ చేయడం, పోలీస్ యూనిఫామ్‌లో స్టైల్‌గా నడవడం, జుట్టును చలాకీగా తిప్పడంలాంటి 'రీల్స్' చేస్తుంటుంది. 'హిందీ సినిమా తారలకు ఏమాత్రం తీసిపోదు' అంటూ పాండే అందాన్ని పొగుడుతుంటారు అభిమానులు.

'ప్రతి రోజూ పరుగెత్తండి. కానీ ప్రతిరోజూ ఒక రౌండ్ పెంచండి'లాంటి సలహాలు ఆమె నోటి నుంచి వినిపిస్తాయి.

మధ్యప్రదేశ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ సిమ్రాన్ రఘువంశీ ఒకప్పుడు మోడల్ కావాలని కలలు కన్నది. కాని ఆమె కుటుంబం ఒప్పుకోలేదు. దీంతో 'మోడల్' కలకు తెర వేసి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరింది.

ఆ తరువాత ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారింది.

'ఖాళీ సమయాల్లో రీల్స్ చేస్తుంటాను' అంటున్న సిమ్రాన్‌ను–

'పోలీస్ యూనిఫామ్‌లో రీల్స్ చేయవద్దని సీనియర్ అధికారులు చెప్పారా?' అని అడిగితే...

'యూనిఫాంలో అభ్యంతరకరమైన రీల్స్ చేసినప్పుడు, అసభ్యకరమైన పాటకు యూనిఫామ్‌తో డ్యాన్స్ చేయడంలాంటివి చేసినప్పుడే సమస్య. అలా చేయనంత కాలం ఎలాంటి సమస్య ఉండదు' అంటుంది సిమ్రాన్.

సిక్కింకు చెందిన ఆలివా సవాడెన్ 'లేడీబైకర్క్యాప్' అనే ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా రాష్ట్రంలోని పచ్చని చెట్ల పక్క నుంచి, పరిశుభ్రమైన రోడ్ల వెంట రైడింగ్ చేస్తున్న వీడియోలను షేర్ చేస్తుంటుంది. పోలీస్ యూనిఫామ్, సివిడ్ డ్రెస్‌లలో ఆమె పోస్ట్‌లు కనిపిస్తుంటాయి.

'ఫిట్ సురేఖ' అనే హ్యాండిల్ ద్వారా పోలీసు అధికారి సురేఖ పవర్ లిఫ్టింగ్ నుంచి రన్నింగ్ వరకు రకరకాల వీడియోలు పోస్ట్ చేస్తుంటుంది.

'మీరు గెలవాలంటే మొండిగా ఉండాలి. ఓడిపోవడానికి భయం చాలు' అని తన పోస్ట్‌లో రాసింది.

అస్సాంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున జిమ్మీ రోంగ్మేయ్ ఎంటీవీ రియాలిటీ షోలో పాల్గొంది, వర్కవుట్ వీడియోలు, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన గ్లింప్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది.

దిల్లీలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అన్షు ఇన్‌స్టాగ్రామ్ వీడియోలతో పేరు తెచ్చుకుంది.

ఆమె పోస్ట్ చేసే వీడియోలలో ఆకట్టుకునే డైలాగులు ఎన్నో ఉన్నాయి.

తన సన్ గ్లాసెస్‌పై 'ఐ డోంట్ కేర్' అని రాసి ఉంటుంది.

మధ్యప్రదేశ్‌కు చెందిన పోలీస్ ఆఫీసర్ సారిక రావత్....

'అమ్మాయిలు ఏ గులాబీపై ఆధారపడరు. వారే ఈ విశ్వపు తోటలు' అంటుంది. సబ్-ఇన్‌స్పెక్టర్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం గైడెన్స్ వీడియోను రూపొందించమని ఫాలోవవర్స్ నుంచి వచ్చిన విన్నపాన్ని ఆమె అంగీకరించింది.

● నయా... వంచన



స్టెగానోగ్రఫీ

అలా చేస్తే లక్షలు మాయం అవుతాయి!

రవికి ఒకరోజు గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఆ తరువాత ఎస్.ఎం.ఎస్. వచ్చింది.

'ఫలానా వ్యక్తి మీకు తెలుసా?' అని.

మొదట్లో రవి పట్టించుకోలేదు. పదే పదే ఫోన్ కాల్స్ రావడంతో 'ఎవరీ వ్యక్తి?' అని తెలుసుకోవడానికి ఆ ఫోటోను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆ ఒక్క క్లిక్‌తో హ్యాకర్లు అతడి ఫోన్‌లోకి చొరబడగలిగారు. నిమిషాల వ్యవధిలోనే రవి బ్యాంకు ఖాతా నుంచి రెండు లక్షలు మాయమయ్యాయి.

ఈ స్మార్ట్ స్కామ్‌ను 'స్టెగానోగ్రఫీ' అంటారు,

స్టెగానోగ్రఫీ అనేది గ్రీకుపదం. దీని అర్థం 'రహస్య రచన' 'దాచిన రచన'

హాని చేయని మీడియా ఫైళ్లలో మాల్‌వేర్ లేదా సీక్రెట్ ఇన్‌స్ట్రక్షన్ పొందుపరచడమే 'స్టెగానోగ్రఫీ' టెక్నిక్. ఈ హిడెన్ ప్లేలోడ్‌లు ట్రెడిషనల్ డిటెక్షన్ సిస్టమ్ కంటపడకుండా తప్పించుకుంటాయి.

'ఇది కొత్త కాన్సెప్ట్ కాదు. 2017లో హ్యాకర్లు వాట్సాప్‌లో షేర్ చేసిన జిఫ్ ఫైల్స్‌లో హానికరమైన కోడ్స్ పొందుపరిచారు. డౌన్‌లోడ్ చేసినప్పుడు హిడెన్ కోడ్ బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతుంది. సెక్యూరిటీ సెట్టింగ్స్‌ను దాటవేసి, యూజర్ డేటాను యాక్సెస్ చేస్తుంది. ఇది జరగకుండా చర్యలు తీసుకున్నప్పటికీ సరికొత్త మార్పులతో 2019లో స్టెగానోగ్రఫీ తిరిగి వచ్చింది' అంటున్నాడు సైబర్ ఎక్స్‌పర్ట్ తుషార్‌శర్మ.

సంప్రదాయ మాల్వేర్ అటెంప్ట్స్‌కు 'స్టెగానోగ్రఫీ' ఏ రకంగా భిన్నమైనది?

ఎంతమాత్రం అనుమానానికి తావు ఇవ్వని రీతిలో ఇన్నోసెంట్ ఫైల్స్‌లో కోడ్‌ను దాచిపెడతారు,

'ఈ ఇమేజ్‌లు, ఆడియో ఫైల్స్ ప్రమాదకరమేమీ కాదు అనిపిస్తాయి. అందుకే అవి తరచు యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌ను దాటవేస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇమేజ్ రికగ్నిషన్ వంటి ఆధునాతన సాధనాలను కూడా స్టెగానోగ్రఫీ మోసం చేయగలదు' అంటున్నారు నిపుణులు

మరి దీనికి పరిష్కారం లేదా?

'స్టెగానోగ్రఫీని గుర్తించడానికి ఫోరెన్సిక్ సాధనాలు, స్టెగానాలిసిస్ ప్లాట్‌ఫామ్‌ల అవసరం ఉంది' అంటున్నారు సైబర్ నిపుణులు.

కొన్ని జాగ్రత్తలు

● అపరిచిత నంబర్స్ నుంచి వచ్చిన ఫైల్స్‌ను ఓపెన్, డౌన్‌లోడ్ చేయవద్దు ● ఫోన్‌ను అప్‌డేట్ చేస్తూ ఉండాలి ● ఆటో డౌన్‌లోడ్‌ను డిజేబుల్ చేయండి. వాట్సాప్ సెట్టింగ్‌ను మార్చడం ద్వారా అన్‌నోన్ మీడియా ఆటోమేటిక్‌గా సేవ్ కాకుండా నిరోధించవచ్చు. ● ఓటీపీలను ఎప్పుడూ షేర్ చేయవద్దు ● 'మై కాంటాక్ట్స్' గ్రూప్ పర్మిషన్ సెట్ చేయండి. అనుమానాస్పద గ్రూప్‌లను దూరం పెట్టడానికి ఇది ఉపయోగపడుతుంది ● వాట్సాప్‌లో 'సైలెన్స్' అన్‌నోన్ కాలర్స్' ఫీచర్‌ను యాక్టివేట్ చేయండి.

ఓనర్‌షిప్



సాగులో సాధికారత కోసం..

భారతదేశంలో మహిళా రైతులకు ప్రోత్సాహకాలు అందించడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నాయి. అవేంటంటే..

సమాన భూమి హక్కులు.. మహిళా రైతులకూ సమానంగా భూమి హక్కులు కల్పించడం వల్ల వారి ఆర్థిక, సామాజిక సాధికారతను పెంపొందిస్తున్నారు.

రుణాలు, ఇతర ఆర్థిక సహాయం.. మహిళారైతులకు రుణసౌకర్యాలు, సబ్సిడీలు, ఇతర ఆర్థిక సహాయాలు అందించడం ద్వారా వ్యవసాయ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

మిషన్ హార్టీ కల్చర్.. ఈ పథకంతో మహిళలకు సాగు నైపుణ్యం, శిక్షణ, సబ్సిడీలు, మద్దతులను అందిస్తున్నారు.

సహాయక సమూహాలు (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్), రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మహిళా రైతులకు సాధికారత కల్పించే లక్ష్యంతో మహిళల నేతృత్వంలోని ఎఫ్‌పీఓలను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎమ్ - కిసాన్)..

ఈ పథకం ద్వారా అర్హతగల రైతులకు బయోడిజాస్టర్‌లను అందిస్తూ రైతుల శ్రమ తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాదు దీనివల్ల ఆదాయమూ పెరుగుతోంది.

సాంకేతిక పరికరాలు, శిక్షణ.. మహిళా రైతుల కోసం ప్రత్యేక పరికరాలు అందించి.. శిక్షణ కార్యక్రమాలనూ నిర్వహిస్తూ వారు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి భారతప్రభుత్వం కృషిచేస్తోంది.

పట్టణ ప్రాంతాలకు పురుషుల వలస పెరుగుతున్నందున పశువుల పెంపకం, పాడిపరిశ్రమ, ఉద్యానవనాల పెంపకం, సాగు/సామాజిక అటవీ, చేపలు పట్టడం వంటి పనులను ఎక్కువగా మహిళలే నిర్వహిస్తున్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ఆహారంలో దాదాపు 60- 80 శాతాన్ని గ్రామీణ మహిళలే అందిస్తున్నారు. అయినప్పటికీ వారి శ్రమకు తగిన గుర్తింపు లభించట్లేదు. సమ ప్రాధాన్యం అందట్లేదు.

అందుకే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత కోసం అనేక పథకాలు, కార్యక్రమాలను చేపట్టింది. అందులో ఒకటే కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న 'నమో డ్రోన్ దీదీ' పథకం. ఇది DAY-NRLM కింద మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్‌లను అందిస్తుంది. ఈ పథకం మొత్తం బడ్జెట్ రూ. 1261 కోట్లు. ద్రావకాలు, పురుగుల మందుల వాడకానికి.. 2024-25 నుంచి 2025-2026 వరకు ఎంపిక చేసిన 14, 500 మహిళా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకు డ్రోన్‌లను అందించడం దీని ప్రస్తుత లక్ష్యం.

అత్యంత ప్రజాదరణ పొందిన కేంద్ర ప్రభుత్వ పథకాల్లో 'బేటీ బచావో.. బేటీ పఢావో', 'సుకన్య సమృద్ధి యోజన' కూడా ఉన్నాయి.

– బి.ఎస్. రత్న
బిజినెస్ కన్సల్టెంట్, దలీప్
మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ
ownership.sakshi@gmail.com
నిర్వహణ : సరస్వతి రమ



బ్యూటిప్



గోధుమ పిండిలో తాజా మీగడను కలుపుకుని ఆ మిశ్రమాన్ని ముఖం, మెడ, చేతులకు పట్టించుకోవాలి. నలుగు పెట్టుకున్నట్టుగా చేతితో ఈ మిశ్రమాన్ని తొలగించాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది. దీనిలో గంధం పొడి ఉపయోగిస్తే ఇంకా మంచి ఫలితం ఉంటుంది.

ఇంటిప్

పెద్ద ట్రేలో మట్టిపోసి కొత్తిమీర, మెంతుల వంటివి చల్లుకుని ఆ ట్రేని వంటగది కిటికీలో కాని బాల్కనీలో కాని పెట్టుకుంటే పచ్చదనం కంటికి ఆహ్లాదాన్నిస్తూ చూడడానికి అందంగానూ ఉంటుంది. తాజా కొత్తిమీర, మెంతికూర మీకెప్పుడు అవసరం వస్తుందా! అని ఎదురు చూస్తుంటాయి.



స్వావలంబన దిశగా...



– సరస్వతి రమ

'మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే నిర్ణయాధికారం వస్తుంది' అని నమ్మే వాళ్లలో తాటిపర్తి దీపికారెడ్డి కూడా ఉన్నారు. ఆమె ఎవరు? హైదరాబాద్ వాసి .. టీ లైఫ్ (తెలంగాణ లేడీ ఇండస్ట్రియలిస్ట్ ఫెడరేషన్ ఫర్ ఆంట్రప్రెన్యూర్స్) వ్యవస్థాపకురాలు. ఆంట్రప్రెన్యూర్‌షిప్ పట్ల గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలకు అవగాహన కల్పించి, ఉచిత శిక్షణతో వాళ్లను ఆ దిశగా నడిపించి.. ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఆమె ఇరవై ఏళ్ల ఆ ప్రయాణం గురించే ఈ కథనం..

చదువుకునే వయసు నుంచే దీపికా రెడ్డి .. ఇండస్ట్రియలిస్ట్‌గా స్థిరపడాలనే కోరుకున్నారు. అయితే ఆ లక్ష్యానికి ప్రయాణం మాత్రం పెళ్లయ్యాకే మొదలైంది. ఆమెకున్న పలురకాల ఆసక్తులు, అభిరుచుల మేరకు ఆయా కోర్సులు చదువుకుంటూ ఆయా రంగాల్లో తన ఆంట్రప్రెన్యూర్ స్కిల్స్‌ను నిరూపించుకున్నారు. అలా పెళ్లి తర్వాత కాకతీయ యూనివర్సిటీ నుంచి హెయిర్ అండ్ స్కిన్ కోర్స్‌లో డిప్లొమా చేశారు. ఏరోబిక్స్‌లో శిక్షణ పొందారు. ఆ అర్హతలతోనే 'బ్యూటీ అండ్ ఫిట్‌నెస్ సెంటర్' అనే ఓన్లీ ఫర్ విమెన్ జిమ్‌ను స్టార్ట్ చేశారు. ఇంటీరియర్ డిజైన్ కోర్స్ చేసి.. ఇంటీరియర్ డిజైనర్‌గా మారి, వేదిస్ ఇంటీరియర్స్ పేరుతో సంస్థనూ పెట్టారు.



టీ లైఫ్..

ఇంటీరియర్ డిజైనర్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌గా కొనసాగుతున్న దీపికకు హైదరాబాద్‌లోని ఎలీటా అసోసియేషన్ పరిచయం అయింది. అది మహిళల్లో ఆంట్రప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించడానికి శిక్షణనిచ్చే సంస్థ. అందులో జాయింట్ సెక్రటరీగా జాయిన్ అయ్యారు ఆమె. మూడేళ్లపాటు ఆ అసోసియేషన్‌లో అనుభవం గడించాక 2017లో తను సొంతంగా టీ లైఫ్ (తెలంగాణ లేడీ ఇండస్ట్రియలిస్ట్ ఫెడరేషన్ ఫర్ అంట్రప్రెన్యూర్స్) సంస్థను ప్రారంభించారు. తెలంగాణ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు ఆంట్రప్రెన్యూర్‌షిప్ పట్ల అవగాహన కల్పించి, వారికి కావల్సిన శిక్షణను ఇప్పించి వారిని ఆంట్రప్రెన్యూర్స్‌గా మలచడమే ఆ సంస్థ లక్ష్యం. అందుకే దాని తరఫున ఆమె తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పర్యటిస్తుంటారు. ఆంట్రప్రెన్యూర్స్ కావాలనుకున్న మహిళల కోసం అక్కడి కలెక్టర్లు, ఇతర ప్రభుత్వ అధికారుల సహాయంతో సదస్సులు నిర్వహిస్తుంటారు. ఆంట్రప్రెన్యూర్‌షిప్ కోసం బయట ఎలాంటి అవకాశాలున్నాయి, ప్రభుత్వ పథకాలేంటీ, లోన్స్, సబ్సిడీలు, శిక్షణ కార్యక్రమాలు, బిజినెస్ కోసం వాళ్ల ప్రాంతాల్లో ఉన్న రీసోర్సెస్ వంటివన్నీ వివరిస్తారు. సదస్సు తర్వాత వాళ్లకు దరఖాస్తు ఫారాలు ఇచ్చి, హాజరైన మహిళలకున్న బిజినెస్ ఆసక్తులను ఆ దరఖాస్తు ఫారాల్లో నింపమంటారు. ఆ ఫారాల ఆధారంగా వాళ్లకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్‌కి అందుతున్న రుణాలతో అందులోని సభ్యులు ఎలాంటి బిజినెస్ పెట్టుకోవచ్చో చెప్పి, తగిన శిక్షణ నిచ్చి.. ఆ వ్యాపారాలను పెట్టించారు కూడా! ఈ క్రమంలో ఆమె గమనించిన విషయం.. ఆ మహిళలందరినీ వాళ్లమ్మాయిలు ప్రోత్సహించడం.

'మొదటి నుంచీ నన్ను నేను ప్రూవ్ చేసుకుంటూ వచ్చిన చోటల్లా అది కుటుంబంలో కానీ.. సమాజంలో కానీ ఎక్కడైనా నాకు గౌరవం పెరుగుతూ వచ్చింది. దాన్ని గ్రామీణ మహిళలు, పట్టణ ప్రాంతం వారూ పొందాలని అనుకున్నాను. వాళ్లు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని అనుకుంటున్నాను. అందుకే టీ లైఫ్‌ని స్టార్ట్ చేశాను. మేము వెళ్లిన చోటల్లా పాజిటివ్ రెస్పాన్సే వస్తోంది. స్టూడెంట్స్ కూడా చాలా ఉత్సాహంగా ఉంటున్నారు. వాళ్లకోసం కంప్యూటర్, ఏఐ బేస్డ్ ప్రోగ్రామ్స్‌నూ పెట్టాం. ఇంట్లో వాళ్ల నుంచీ నాకు సపోర్ట్ దొరుకుతోంది. టీ లైఫ్ ధ్యేయం ఒక్కటే.. మహిళలు ఆంట్రప్రెన్యూర్స్‌గానే కాదు ఇండస్ట్రియలిస్ట్స్‌గానూ ఎదిగేందుకు తోడ్పడాలని. అయితే దీనికి ప్రభుత్వ సహకారం కూడా అవసరమే! కుటుంబంలో మహిళ ఆర్థికంగా బలంగా ఉంటే తర్వాత తరాల అమ్మాయిలూ స్ట్రాంగ్‌గా ఉంటారని నా నమ్మకం.'

– దీపికారెడ్డి

అమ్మాయిల కోసం..

దీపిక.. గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీలకూ వెళ్లి అక్కడి అమ్మాయిలకూ బిజినెస్ రంగంలో ఉన్న అవకాశాలు, శిక్షణ వంటి వాటి మీద అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటివరకు మూడున్నర వేల మంది మహిళలకు శిక్షణనిచ్చారు. అందులో వందకు పైగా మహిళలు ఆంట్రప్రెన్యూర్స్‌గా నిలబడ్డారు. ఇందులో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్‌కి చెందిన మహిళలే ఎక్కువ. ప్రస్తుతం టీ లైఫ్‌కి జగిత్యాల, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్‌లలో ఆఫీసులున్నాయి. మే నెలలో మహబూబ్‌నగర్‌లో కూడా ప్లాన్ చేయాలనుకుంటారు. టీ లైఫ్ ఆరంభించినప్పుడు కనీసం పదివేల మంది మహిళలకు అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చేరుకున్నారు కూడా. నెలకు నాలుగు నుంచి అయిదు బ్యాచ్‌లుంటాయి. అభ్యర్థులు పెట్టాలనుకున్న బిజినెస్‌ను బట్టి ఆ శిక్షణ కార్యక్రమాల గడువు ఉంటుంది. ఈ ట్రైనింగ్ సెషన్స్ అన్నీ ఎక్స్‌పర్ట్స్‌తోనే ఉంటాయి.

వంటిల్లు

వేసవి వచ్చిందంటే మామిడి సీజన్ మొదలైనట్లే. నోరూరించే పుల్లటి, తియ్యటి మామిడి రుచులను కాస్త ప్రత్యేకమైన వంటల్లో ఎలా వాడుకోవచ్చో ఇప్పుడు చూద్దామా?

సీజన్ డిష్





మామిడి బిర్యానీ

కావలసినవి: **బాస్మతి బియ్యం** – ఒక కప్పు; **పచ్చి మామిడికాయ** – 1 (ముక్కలుగా తరిగినది); **పచ్చి మిర్చి** – 3 (చిన్నగా తరిగినది); **నువ్వులు** – ఒక టీ స్పూన్; **వేరుశెనగలు** – 4 టేబుల్ స్పూన్లు; **కొబ్బరి తురుము** – అర కప్పు; **బెల్లం తురుము** – ఒక టీ స్పూన్; **నూనె** – సరిపడా; **ఆవాలు, శనగ పప్పు, మినపప్పు** – ఒక టీస్పూన్ చొప్పున; **కరివేపాకు, ఇంగువ, పసుపు** – కొద్దికొద్దిగా; **ఉప్పు** – తగినంత; **నీరు** – 2.5 కప్పులు)

తయారీ: ముందుగా బియ్యం కడిగి 20 నిమిషాల పాటు నీటిలో నానబెట్టాలి. తరువాత కుకర్‌లో బియ్యం, నీళ్లు, ఉప్పు, కొద్దిగా నూనె వేసి 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. ఈలోపు ఒక మిక్సీ బౌల్‌లో తరిగిన మామిడికాయ ముక్కలు, నువ్వులు, 1 టేబుల్ స్పూన్ వేరుశెనగలు, కొబ్బరి తురుము, అభిరుచిని బట్టి బెల్లం తురుము వేసుకుని, కొంచెం బరకగా పేస్ట్ చేసుకోవాలి. మందపాటి గిన్నెలో 3 టేబుల్ స్పూన్ల నూనె వేడి చేసుకుని, అందులో మిగిలిన వేరుశెనగలు వేయించుకోవాలి. తర్వాత ఆవాలు, శనగపప్పు, మినపప్పు, కరివేపాకు, ఇంగువ, పసుపు ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని, గరిటెతో తిప్పుతూ ఉండాలి. అవి బాగా వేగిన తర్వాత అందులో మామిడి–కొబ్బరి పేస్ట్ వేసుకుని సుమారు 3 నిమిషాల పాటు కలుపుతూ వేయించాలి. ఇప్పుడు రుచికి సరిపడా ఉప్పు వేసుకుని, మళ్ళీ బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ ఆఫ్ చేయాలి. ఉడికించిన అన్నం వేసి గరిటెతో బాగా కలిపి, మూతపెట్టి, చిన్న మంట మీద మగ్గనివ్వాలి. రైస్ ఉడికిపోతే మామిడికాయ బిర్యానీ సిద్ధమైనట్లే. నచ్చినవిధంగా గార్నిష్ చేసుకుని, వేయించిన పాపడ్లు, చిప్స్, పెరుగు ఇలా వేటితోనైనా సర్వ్ చేసుకోవచ్చు.



మామిడి బొబ్బట్లు

కావలసినవి: **గోధుమ పిండి** – ఒక కప్పు; **మామిడి పండు గుజ్జు** – ఒక కప్పు (బాగా పండి, తియ్యగా ఉన్నది); **కొబ్బరి తురుము** – పావు కప్పు; **బెల్లం తురుము** – పావు కప్పు (మామిడి తీపిని బట్టి ఎక్కువ లేదా తక్కువ వేసుకోవచ్చు); **యాలకుల పొడి** – అర టీ స్పూన్; **ఉప్పు** – తగినంత; **నెయ్యి** – సరిపడా; **నీరు** – కొన్ని;

తయారీ

ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, టేబుల్ స్పూన్ నెయ్యి వేసి పిండిని ఉండలు లేకుండా కొద్ది కొద్దిగా నీరు పోసుకుంటూ మెత్తని చపాతీ పిండిలా కలిపి, 30 నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. ఈలోపు స్టవ్ ఆన్ చేసుకుని కళాయిలో 2 టేబుల్‌స్పూన్ల నెయ్యి వేడి చేసుకుని కొబ్బరి తురుము వేయించి, బెల్లం తురుము వేసి కలపాలి. బెల్లం కరిగిన వెంటనే మామిడిపండు గుజ్జు వేసుకుని తిప్పుతూ ఉండాలి. చిన్న మంట మీద ఈ మిశ్రమాన్ని ఉడికించాలి. ఇది దగ్గరగా హల్వాలా కాగానే, యాలకుల పొడి వేసి బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. మరోవైపు గోధుమ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని, పూరీల్లా ఒత్తుకుని, మధ్యలో మామిడి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా ఉంచి చేత్తో బొబ్బట్లలా చేసుకోవాలి. వాటిని నేతిలో వేయించుకుంటే సరిపోతుంది.

కంటికి ఆహారం... వ్యాయామం

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. రోజూ కొద్ది సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు.. ఎక్కడ... ఎలా వీలయితే అలా సులువుగా చేసుకోవచ్చు. ఏం లేదు... పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ కొంతసేపు కంటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది.

అలాగే కంటికి మంచి చేసే ఆహారం కూడా ఉంది. ఆకుకూరల్లో కరివేపాకు, పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటిచూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. పండ్లలో



బొప్పాయి, మామిడి, ఉసిరి మంచిది. అలాగే క్యారట్, కోడిగుడ్డు, పాలు కంటికి మేలు చేస్తాయి.

20-20-20

ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసేవారికి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. అలాంటివారు ఈ 20-20-20 రూల్ ని పాటించాలి. అది వెరీ సింపుల్. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటర్ల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్ల పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్. అలాగే కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల కళ్ళు దెబ్బతినకుండా ఉండడం కోసం యాంటీ గ్లేర్ గ్లాసెస్‌ను ఉపయోగించండి.

ఇంతవరకూ ఏ సమస్యలూ లేకపోతే ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటిపరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే కళ్లజోడు వాడుతున్నవారయితే ఏడాదికి రెండు సార్లు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవడం మంచిది.

పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు ఉన్నవారికి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. ఏ వ్యాధీ లేనివారు భవిష్యత్తులో కంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు.

పారేయకండి... పదును పెట్టండి



వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, న్యూస్ పేపర్లు, పనికిరాని ఇతర గృహోపకరణాలను బుర్రకు కాస్త పదును పెడితే చాలు... కళాఖండాలుగా తయారు చేయచ్చు. ఈ వేసవి సెలవల్లో పిల్లలకు దీనిపై కాస్తంత ఐడియా ఇస్తే చాలు... ఆనక వాళ్లే అల్లుకు పోతారు. వీటితో సృజనాత్మకత పెరగడమే కాదు.. కుదురు వస్తుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతెలుస్తుంది. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ ప్రాముఖ్యత తెలిసొస్తాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఒకసారి వాడి పడేసే కార్టన్‌లను ఆహ్లాదకరమైన జంతువుల ఆకారాలుగా మార్చవచ్చు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచడానికి దోహదపడుతుంది. ఇందుకోసం పిల్లలను వారికి ఇష్టమైన జంతువు లేదా పక్షుల గురించి అడిగి, వాటి ఆకారాలను కాగితంపై ఔట్‌లైన్ గీయడం ద్వారా ప్రారంభించవచ్చు.

కావలసినవి: **ఖాళీ కార్టన్లు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, గమ్, గూగ్లీ కళ్ళు, పైప్ క్లీనర్లు.**

ఆలోచనకు తగ్గట్టు కార్టన్‌ను వివిధ ఆకారాలుగా కత్తిరించుకుని వారికి ఇష్టమైన రంగులలో పెయింట్ చేయనివ్వండి. రంగులు కలిపి నమూనాలను రూపొందించడానికి వారికే అవకాశం ఇవ్వడం మంచిది.

అలంకరణ: రంగు ఆరిన తర్వాత, గూగ్లీ కళ్ళపై జిగురు వేయండి. మార్కర్ల సాయంతో ముఖంలో ఇతర భాగాలను లేదా నమూనాలను గీయండి. పైప్ క్లీనర్‌లతో కాళ్ళు, యాంటెన్నా లేదా తోకలుగా చేసి చిన్న రంధ్రాలు చేసి దారంతో అటాచ్ చేయండి.



టాయిలెట్ పేపర్ రోల్ బైనాక్యులర్లు.. ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్‌ను బైనాక్యులర్‌లుగా మార్చుకోండి.

కావలసినవి: **రెండు ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్, నూలు లేదా రిబ్బన్, యాక్రిలిక్ పెయింట్ బ్రష్‌లు, గమ్, స్టిక్కర్లు, డెకరేషన్లు.**

పెయింటింగ్: పిల్లలను టాయిలెట్ పేపర్ రోల్స్‌కు పెయింట్ వేయమని చెప్పి, వాటిని పూర్తిగా ఆరిన తర్వాత పక్కపక్కనే అతికించండి. గ్లూ గట్టి పడగానే మెడ పట్టీకోసం రెండువైపులా నూలు లేదా రిబ్బన్‌ముక్కను అటాచ్ చేయండి. వీటికి స్టిక్కర్లు, మార్కర్లు, ఇతర అలంకరణలతో డెకరేట్ చేయండి. అలా తయారైన బైనాక్యులర్లతో సరదాగా బయటి ప్రదేశాలను చూడమని చెప్పండి.





బాటిల్ క్యాప్ అయస్కాంతాలు...

పాత బాటిల్ మూతలను అయస్కాంతాలుగా మార్చండి. వీటితో మీ రెఫ్రిజిరేటర్‌ను అందంగా అలంకరించండి.

కావలసినవి: **మెటల్ బాటిల్ మూతలు, చిన్న గుండ్రని అయస్కాంతాలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, పూసలు, బటన్లు, సీక్విన్, గ్లూ**

తయారీ: బాటిల్ మూత లోపల, వెలుపల బ్రైట్ కలర్స్ తో పెయింట్ చేయండి.ఆరిన తర్వాత క్యాప్‌ల లోపల చిన్న పూసలు, బటన్లు లేదా గవ్వలను అతికించండి. గ్లూ లేదా మంచి గమ్‌తో ప్రతి బాటిల్ మూత వెనుక భాగంలో ఒక చిన్న గుండ్రని అయస్కాంతాన్ని అటాచ్ చేయండి. ఇలా తయారైన వాటితో రిఫ్రిజిరేటర్‌పై కళాకృతులు, నోటీసులు లేదా ఫోటోలను ప్రదర్శించండి.



ప్లాస్టిక్ బాటిల్ ప్లాంటర్లు...

ప్లాస్టిక్ బాటిళ్లను అందమైన ప్లాంటర్‌లుగా తిరిగి ఉపయోగించవచ్చు, పిల్లలకు రీసైక్లింగ్, తోటపని నేర్పచ్చు.

కావలసినవి: **ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, కత్తెర, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, మట్టి, చిన్న మొక్కలు లేదా విత్తనాలు.**

తయారీ: ప్లాస్టిక్ బాటిళ్లను సగానికి కట్ చేసి, పైభాగాన్ని పారవేయండి. సీసాల దిగువ భాగాలను రంగులతో అలంకరించండి. ఇలా అలంకరించిన సీసాలను మట్టితో నింపి వాటిలో విత్తనాలు లేదా చిన్న మొక్కలను నాటండి. వీటిని ఎండ పడే ప్రదేశంలో ఉంచి, రోజూ నీరు పెట్టండి.

వార్తాపత్రిక కోల్లేజ్ కళ...

పాత వార్తాపత్రికలను కథను చెప్పే అద్భుతమైన కొల్లేజ్ కళాఖండాలుగా మార్చండి

కావలసినవి: **పాత వార్తాపత్రికలు, కత్తెర గ్లూ స్టిక్, కాగితం లేదా కాన్వాస్, మార్కర్లు**

తయారీ: వార్తాపత్రికల నుంచి ఆసక్తికరమైన చిత్రాలు, ముఖ్యాంశాలు, ఇతర న్యూస్‌ను కత్తిరించండి. కొల్లేజ్ సృష్టించడానికి కటౌట్ లను కాగితం లేదా కాన్వాస్‌పై అమర్చండి. విభిన్న లే ఔట్‌లు, థీమ్‌లతో ప్రయోగం చేయండి. తర్వాత, ఈ ముక్కలను అతికించండి. మార్కర్‌లు లేదా రంగు పెన్సిళ్లతో కొల్లేజ్‌కు నేపథ్యాలను జోడించండి. ఇలా తయారైన కోల్లెజ్‌ను కనిపించేలా వేలాడదీయండి.

సీడీ సన్ క్యాచర్లు...

పాత సీడీలకు మిరుమిట్లు గొలిపే సన్ క్యాచర్లుగా కొత్త జీవం పోయవచ్చు.

కావలసినవి: **పాత సీడీలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్లు, క్రాఫ్ట్ జిగురు, స్ట్రింగ్ లేదా రిబ్బన్, పూసలు, ఇతర డెకరేషన్‌లు.**

తయారీ: రంగురంగుల డిజైన్లు, నమూనాలు లేదా అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో సీడీలు మెరిసే వైపు పెయింట్ చేయండి. అంచుల చుట్టూ లేదా మధ్యలో పూసలతో అలంకరించి వాటిని సీడీ మధ్యలో ఉన్న రంధ్రం ద్వారా దారంతో అతికించండి. వీటిని ఎండ పడే కిటికీలో వేలాడదీస్తే అందమైన కాంతులు వెదజల్లుతాయి.

న్యూస్ పేపర్లతో ఫోటో ఫ్రేమ్...

కొన్ని పాత న్యూస్‌పేపర్లను తీసుకొని ప్రతి షీట్‌ను ముక్కలుగా చింపివేయండి. ఇప్పుడు, వార్తాపత్రికను ఒక మూల నుండి చుట్టడం ద్వారా సన్నని రోల్స్ తయారు చేయండి. రోల్‌ను భద్రపరచడానికి వార్తాపత్రిక అంచుని అతికించండి.

ఇప్పుడు మీకు కావలసిన ఏ పరిమాణంలోనైనా కార్డ్ బోర్డ్ ముక్కను తీసుకోండి. మీరు ఫ్రేమ్ చేయాలనుకుంటున్న ఛాయాచిత్రాన్ని ఫ్రేమ్ మధ్యలో ఉంచి, దాని రూపురేఖలను గీయండి. వార్తాపత్రిక రోల్స్‌ను అవుట్‌లైన్‌లపై అతికిస్తూ నాలుగు వైపులా కవర్ చేయండి. అదనపు వార్తాపత్రికను కత్తిరించండి. ఫ్రేమ్‌కు మీకు నచ్చిన ఏ రంగునైనా పెయింట్ చేసి ఫోటోగ్రాఫ్‌ను అతికిస్తే సరి.. మీ ఫోటో ఫ్రేమ్ రెడీ!

పిల్లల చేత ఇలాంటి వాటిని తయారు చేయిస్తే వారికి మంచి కాలక్షేపం అవుతుంది.



పాత ప్లాస్టిక్ సీసాలు, మెటల్ సీసా మూతలు, పెరుగు కుండలు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వంటి శుభ్రమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించండి. తర్వాత, ఇంట్లో "రీసైకిల్డ్ ఆర్ట్ స్టేషన్"ని సృష్టించండి. జిగురు, మార్కర్లు, పెయింట్, కత్తెర, ఇతర క్రాఫ్టింగ్ మెటీరియల్‌ను ఇచ్చి పిల్లలకు ఒక సవాలు ఇవ్వండి. వారు ప్లాస్టిక్ బాటిల్‌ను బర్డ్ ఫీడర్‌గా మార్చగలరా? ఆ పెరుగు కుండ పూల కుండగా మారగలదా? లేదా ప్లాస్టిక్ మూతలన్నీ కలబబోసుకుని రోబోట్ శిల్పంగా మారతాయేమో చూద్దాం!

లైఫ్@360

యోగా

మానసిక శక్తిని పెంచే శ్వాస

నాసిక రంధ్రాల ద్వారా శ్వాసను లోపలికి తీసుకుంటూ, తిరిగి వదులుతూ చేసే ప్రాణామాయ పద్ధతులలో ముఖ్యమైనవి నాలుగు ఉన్నాయి. వాటిలో..

కపాలభాతి: ఈ ప్రాణాయామంలో వేగంగా ఊపిరి తీసుకోవడం, వదలడం ఉంటుంది. ఈ విధానం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ కండరాలు బలోపేతం అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వల్ల చేసే పనిపైన శ్రద్ధ, సృజనాత్మకత పెరుగుతుంది. ఒక ప్రశాంతమైన స్థలంలో సుఖాసనంలో కూర్చొని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుతూ, వదులుతూ ఉండాలి.



భస్త్రిక: ఈ ప్రాణాయామం ద్వారా శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచవచ్చు. నోటిద్వారా శ్వాసను తీసుకొని, నోటిద్వారా వదలాలి. ఈ ప్రక్రియను పది-పదిహేను సార్లు పదే పదే చేయాలి.

భ్రామరి: ఈ ప్రాణాయామం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నోటితో తేనెటీగ లాగ హమ్ చేస్తూ .. నాసిక రంధ్రాల ద్వారా గాలి పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి.

ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించి, నిపుణుల సలహాతో వీటిని సాధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలను పొందుతారు.

సాక్షి సినిమా

ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గా విక్రాంత్

● కొలంబియా అంతర్యుద్ధం ప్రధానాంశంగా 'వైట్'



● విక్రాంత్

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ జీవితం వెండితెరపైకి రానుంది. రవిశంకర్ జీవితంతో సినిమా రానుందని ఎప్పట్నుంచో ఓ వార్త ప్రచారంలో ఉంది. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు కూడా టాక్ వినిపించింది. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాస్సీ చేయనున్నారనే ఊహాగానాలూ నెలకొన్నాయి. అందుకు తగ్గట్టు గత ఏడాది రవిశంకర్‌ని కలిశారు విక్రాంత్. ఆయన పాత్రలో ఒదిగిపోవడానికి కావాల్సిన సలహాలు, సూచనలు తీసుకున్నారట. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ని జూలైలో ఆరంభించాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. 'వైట్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి యాడ్ ఫిల్మ్ మేకర్ మాంటూ బస్సీ దర్శకత్వం వహించనున్నారు. కొలంబియాలో జరిగిన అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో రవిశంకర్ ఏ విధంగా కీలక పాత్ర పోషించారనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రలో ఒదిగిపోవడానికి విక్రాంత్ మాస్సీ మేకోవర్ అవుతున్నారు. హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించి, పలు భాషల్లో అనువదించి, రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది 'వైట్' విడుదల కానుంది.

వారం ముందుగానే...



● టామ్ క్రూజ్

హాలీవుడ్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులోనూ ఇండియాలో అద్భుతమైన ఆదరణ ఉంటుంది. తాజాగా భారతదేశంలో విడుదల కానున్న మరో క్రేజీ హాలీవుడ్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్'. టామ్ క్రూజ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇండియాలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మే 23న విడుదల కావాల్సి ఉంది. అయితే వారం ముందుగానే మే 17న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు మేకర్స్. ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీలో భాగంగా ఎనిమిదో చిత్రంగా 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్' రూపొందింది.

తన కోసమే నా పొగరే అణిగేనా...

నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' యూనివర్స్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే...' అంటూ సాగే మూడో పాటని శుక్రవారం విడుదల చేశారు. రాఘవ్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా, తన కోసమే నా పరుగే ఇక ఆగేనా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''హిట్: ది థర్డ్ కేస్' సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమ వెల్లువ, అభీ బార్ అర్జున్ సర్కార్...' పాటలకు మంచి స్పందన వచ్చింది. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా...' పాట కూడా ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



● నాని

హ్యాట్రిక్ హిట్ కావడం ఆనందంగా ఉంది

- ఇంద్రగంటి మోహనకృష్ణ



● రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్

''శివలెంక కృష్ణప్రసాద్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'జెంటిల్ మ్యాన్, సమ్మోహనం' చిత్రాలు హిట్ అయ్యాయి. మా కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' హ్యాట్రిక్ హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్ చేస్తున్నారు... మెసేజ్‌లు చేస్తున్నారు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ– ''ఈ రోజు మా టీమ్ గెలిచిందంటే నేనూ గెలిచాను. సినిమా గెలిచింది... మేం గెలిచాం'' అని చెప్పారు. ''మా సినిమా ప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''చాలా రోజుల తర్వాత థియేటర్‌లో అందరూ పగలబడి నవ్వుతున్నారు. నవ్వులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది'' అని తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో నటులు అవసరాల శ్రీనివాస్, వడ్లమాని శ్రీనివాస్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆ అనుబంధానికి పేరు పెట్టలేను!

- సమంత

''జీవితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్' పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ– ''నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను'' అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

మానవత్వం కరువైతే...



● శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్

''కలియుగమ్ 2064' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఫొటోగ్రఫీ, క్యారెక్టర్స్ డిజైన్, ఆర్టిస్టుల నటన... ఇలా అన్నీ ఒక మోడ్రన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన అనుభూతినిచ్చాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లలో తప్పకుండా చూడండి'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కిశోర్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం మే 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేయనుంది. ఈ సినిమా ట్రైలర్‌ని రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 2064లో ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ – ఇది చూడొచ్చు

అమెరికన్ ప్రెసిడెంటా... మజాకా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జీ 20 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా దర్శకుని ఊహ అనేది ప్రేక్షకుల ఊహకందకపోతే అప్పుడు ఆ సినిమా పండుతుంది. ముఖ్యంగా హాలీవుడ్ దర్శకుల ఆలోచనలే వేరు. ఏది అసాధ్యమో, ఏదైతే జరగదు అని ప్రేక్షకులు అనుకుంటారో దాన్నే సినిమాలో చూపిస్తుంటారు హాలీవుడ్ డైరెక్టర్స్. హాలీవుడ్ దర్శకుడు పాట్రిసియా రీగెన్ తీసిన 'జీ 20' సినిమా ఆ కోవలోకి చెందినదే. ఒక్కసారి ఊహించండి... ప్రపంచంలోనే ఉత్తమోత్తమ సురక్షితమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు అనే విషయం మనకు తెలుసు. మరి... ఆ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని తన కుటుంబంతో పాటు బందీలుగా తీసుకుని ప్రపంచాన్ని శాసిద్దామనుకున్న విలన్‌ను అమెరికా ప్రెసిడెంట్ ఎలా ఎదుర్కొన్నారో ఈ 'జీ 20'లో చూడవచ్చు. అది కూడా అమెరికన్ ప్రెసిడెంట్‌ను, అతని కుటుంబాన్ని బందీలుగా చేసుకోవడం కూడా చిన్న వేదిక మీదైతే కాదు, దాదాపు అరడజను దేశాధినేతలతో పాటు జీ 20 శిఖరాగ్ర సమావేశంలో హై సెక్యూరిటీ నడుమ ఉండగా అమెరికన్ ప్రెసిడెంట్‌తో పాటు అక్కడున్న మిగతా దేశాధినేతలందరినీ బందీలుగా చేసుకుంటాడు విలన్. ఇక్కడ ఈ సినిమా దర్శకుడు ఇంకా వినూత్నంగా ఆలోచించాడు. బందీలుగా ఉన్న తన కుటుంబాన్ని, ఇతర దేశాధినేతలను కూడా విలన్‌తో పోరాడి విడిపించే బాధ్యత ప్రెసిడెంట్ మీదే పెట్టాడు సదరు సినిమా డైరెక్టర్. 'జీ 20' సినిమా మంచి ఉత్కంఠతతో ప్రారంభమై, ఆద్యంతం ప్రేక్షకుడిని ఉర్రూతలూగిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ ప్రెసిడెంట్ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలెట్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సినిమాలో అమెరికన్ ప్రెసిడెంట్ కుంగ్ ఫూ ఫైటర్, గన్ షూటర్, అలాగే హెలికాప్టర్ రైడర్ కూడా. ఇక మరో పెద్ద ట్విస్ట్ ఏంటంటే సదరు అమెరికన్ ప్రెసిడెంట్ ఈ సినిమాలో ఓ లేడీ. ఈ పాత్రలో డేనియల్ సట్టన్ సూపర్‌గా నటించారు. పైన చెప్పుకున్నట్టు ఓ లేడీ అమెరికన్ ప్రెసిడెంట్ తన కుటుంబంతో పాటు ఇతర దేశాధినేతలను సూపర్ ఫైటింగ్ స్కిల్స్‌తో సేవ్ చేయడమనేది మామూలు కాన్సెప్టా... ఆలోచించండి. దటీజ్ 'జీ 20'. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. అయితే మీ పిల్లలను ఈ సినిమాకి దూరంగా ఉంచి మీరు మాత్రం వాచ్ ఇట్ ఫర్ వీకెండ్.



– హరికృష్ణ ఇంటూరు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	589	79,213
నిఫ్టీ ▽	207	24,039

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	17,323	△	153
డోజోన్స్	40,072	▽	21
ఎఫ్‌టీఎస్ఈ 100	8,415	△	8
డాక్స్	22,242	△	178
షాంఘై	3,297	▽	2
నికాయ్	35,039	△	667

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారెట్లు)	95,631	▽	655
బంగారం (22 క్యారెట్లు)	95,248	▽	652
వెండి (కేజీ)	97,684	△	60

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		85.10	86.12
£	బ్రిటన్ పౌండ్		112.30	115.21
€	యూరో		95.71	98.40
¥	జపాన్ ఎన్ (100)		58.85	60.39
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.74	55.94
S$	సింగపూర్ డాలర్		62.63	67.31
SAR	సౌదీ రియాల్		21.89	23.40
UAE D	యూఏఈ దిర్హామ్		23.37	24.16
¥	చైనా యువాన్		10.85	12.67

రిలయన్స్ జూమ్



- క్యూ4 లాభం రూ. 19,407 కోట్లు
- షేరుకి రూ. 5.5 డివిడెండ్
- రూ. 10 లక్షల కోట్లకు నెట్‌వర్త్

నిలకడగా..

ప్రపంచ బిజినెస్ వాతావరణరీత్యా గతేడాది సమస్యాత్మకంగా నిలిచింది. బలహీన ఆర్థిక పరిస్థితులు, రాజకీయ, భౌగోళిక మార్పుల నేపథ్యంలో నిర్వహణా సంబంధ క్రమశిక్షణ, కస్టమర్ కేంద్రంగా ఆవిష్కరణలు కంపెనీ నిలకడైన పనితీరు చూపేందుకు దోహదపడ్డాయి.

– ముకేశ్ అంబానీ, చైర్మన్, రిలయన్స్ ఇండస్ట్రీస్

ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2.4 శాతం పుంజుకుని రూ. 19,407 కోట్లను తాకింది. ప్రధానంగా రిటైల్ బిజినెస్ క్రమబద్ధీకరణ, టెలికం మార్జిన్లు మెరుగుపడటం ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 18,951 కోట్లు ఆర్జించింది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో సాధించిన రూ. 18,540 కోట్లతో పోల్చినా లాభంలో వృద్ధి నమోదైంది. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 5.5 డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 2.4 లక్షల కోట్ల నుంచి రూ. 2.6 లక్షల కోట్లకు బలపడింది. ఇబిటా 3.6 శాతం వృద్ధితో రూ. 48,737 కోట్లకు చేరింది.

పూర్తి ఏడాదిలో

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఆర్ఐఎల్ దాదాపు యథాతథంగా రూ. 69,648 కోట్ల నికర లాభం ఆర్జించింది. అయితే రూ. 10 లక్షల కోట్ల నెట్‌వర్త్‌ను సాధించిన తొలి దేశీ కంపెనీగా రికార్డు నెలకొల్పింది. ఈ బాటలో గతేడాది రూ. 20 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్(విలువ)ను అందుకున్న తొలి సంస్థగా సైతం నిలిచింది! ప్రయివేట్ ప్లేస్‌మెంట్ పద్ధతిలో మార్పిడిరహిత డిబెంచర్లు తదితర సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 25,000 కోట్లవరకూ సమీకరించేందుకు బోర్డు అనుమతించినట్లు ఆర్ఐఎల్ వెల్లడించింది. 2025 మార్చి31కల్లా రుణ భారం రూ. 3.24 లక్షల కోట్ల నుంచి రూ. 3.47 లక్షల కోట్లకు పెరిగింది.

విభాగాలవారీగా

రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నికర లాభం క్యూ4లో 29 శాతం జంప్‌చేసి రూ. 3,545 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 88,620 కోట్లయ్యింది. ఈ కాలంలో 238 స్టోర్లను కొత్తగా తెరవడంతో వీటి సంఖ్య 19,340కు చేరింది. అయితే స్టోర్ల క్రమబద్ధీకరణతో నిర్వహణ ప్రాంతం 2 శాతం తగ్గి 7.74 కోట్ల చదరపు అడుగులకు పరిమితమైంది. ఇక ఆయిల్ టు కెమికల్(ఓ2సీ) బిజినెస్ నిర్వహణ లాభం క్యూ4లో 10 శాతం క్షీణించి రూ. 15,080 కోట్లకు చేరింది. ఇంధన రిటైల్(జియో–బీపీ) బిజినెస్‌లో పెట్రోల్ అమ్మకాలు 24%, డీజిల్ విక్రయాలు 25% ఎగశాయి. కేజీ డీ6 క్షేత్రాలలో గ్యాస్ ఉత్పత్తి తగ్గడంతో ఇబిటా 8.6% నీరసించి రూ. 5,123 కోట్లకు పరిమితమైంది. గ్యాస్ ఉత్పత్తి రోజుకి 26.73 మిలియన్ ప్రామాణిక ఘనపు మీటర్లకు చేరగా.. చమురు 19,000 బ్యారళ్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఆర్ఐఎల్ షేరు బీఎస్ఈలో స్వల్ప క్షీణతతో రూ. 1,300 వద్ద ముగిసింది.

జియో జోరు

టెలికం, డిజిటల్ బిజినెస్‌ల జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం క్యూ4లో 26 శాతం జంప్‌చేసి రూ. 7,022 కోట్లను తాకింది. పూర్తి ఏడాదిలో 22% ఎగసి రూ. 26,120 కోట్లకు చేరింది. జియో వినియోగదారుల సంఖ్య 48.21 కోట్ల(క్యూ3) నుంచి 48.82 కోట్లకు ఎగసింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) రూ. 203.3(క్యూ3) నుంచి రూ. 206.2కు మెరుగుపడింది. క్యూ4 ఆదాయం రూ. 33,986 కోట్లు కాగా.. పూర్తి ఏడాదిలో రూ.1,28,218 కోట్లకు చేరింది. విలీనం తర్వాత జియోహాట్‌స్టార్ ఆదాయం రూ. 10,006 కోట్ల స్థాయిని అధిగమించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న జియోసినిమా, డిస్నీప్లస్‌హాట్‌స్టార్ విలీనంతో జియోహాట్‌స్టార్ ఏర్పాటైంది.

మారుతీ లాభం ఫ్లాట్



- క్యూ4లో రూ. 3,911 కోట్లు
- షేరుకి రూ. 135 డివిడెండ్
- అమ్మకాలు, లాభాల్లో రికార్డ్

న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం స్వల్ప వెనకడుగుతో రూ. 3,911 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది (2023–24) ఇదే కాలంలో రూ. 3,952 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 38,471 కోట్ల నుంచి రూ. 40,920 కోట్లకు బలపడింది. మొత్తం వ్యయాలు 8%పైగా పెరిగి రూ. 37,585 కోట్లను తాకాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 135 డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో 3% అధికంగా 6,04,635 యూనిట్ల అమ్మకాలు సాధించింది. ఒక క్వార్టర్‌కు ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికం. దేశీ విక్రయాలు 3% వృద్ధితో 5,19,546 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు 8% ఎగసి 85,089గా నమోదయ్యాయి.

పూర్తి ఏడాదికి...: మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మారుతీ కన్సాలిడేటెడ్ నికర లాభం 7.5 శాతం పుంజుకుని రూ. 14,500 కోట్లయ్యింది. 2023–24లో రూ. 13,488 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,41,858 కోట్ల నుంచి రూ. 1,52,913 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో మొత్తం 22,34,266 వాహనాలను విక్రయించింది. వెరసి గతేడాది కంపెనీ చరిత్రలోనే అత్యధిక విక్రయాలు, ఎగుమతులను నమోదు చేసింది. దేశీయంగా మందగమనం ఉన్నప్పటికీ పటిష్ఠ ఫలితాలు సాధించినట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు.

మారుతీ షేరు బీఎస్ఈలో 2% క్షీణించి రూ. 11,686 వద్ద ముగిసింది.

పహల్గాం ఎఫెక్ట్... సూచీలు రెండోరోజూ డీలా

ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు

- నిరాశపరుస్తున్న కార్పొరేట్ల క్యూ4 ఫలితాలు
- సెన్సెక్స్ 589 పాయింట్ల పతనం; నిఫ్టీ నష్టం 207 పాయింట్లు
- ఐటీ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు




ముంబై: పహల్గాం ఉగ్రదాడి కారణంగా భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకోవడంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం అరశాతానికి పైగా నష్టపోయాయి. ఇటీవల విడుదల అవుతున్న కార్పొరేట్ క్యూ4 ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాలను నిరాశపరుస్తున్నాయి. వీటికి తోడు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 589 పాయింట్లు క్షీణించి 79,213 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207 పాయింట్లు నష్టపోయి 24,039 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది రెండోరోజూ నష్టాల ముగింపు. మిడ్‌సెషన్ కల్లా సెన్సెక్స్ 1,196 పాయింట్లు క్షీణించి 78,606 వద్ద, నిఫ్టీ 398 పాయింట్లు పతనమై 23,848 వద్ద కనిష్టాన్ని తాకాయి. యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభంతో ద్వితీయార్ధంలో కొనుగోళ్లు జరిగాయి. దీంతో సూచీల నష్టాలు కొంతమేర తగ్గాయి. అమెరికా చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టవచ్చనే అశలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.

- ఫైనాన్స్ రంగ షేర్లలో భారీ అమ్మకాలు సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. యాక్సిస్ బ్యాంక్ 3.50%, ఎస్‌బీఐ 2%, బజాజ్ ఫిన్‌సర్వ్ 3%, బజాజ్ ఫైనాన్స్ 2%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.30%, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఒకశాతం చొప్పున నష్టపోయాయి.
- బీఎస్ఈలో రంగాల వారీగా ఐటీ మినహా అన్ని సూచీలు డీలాపడ్డాయి. సర్వీసెస్ 3.11%, యుటిలిటీ 3%, రియల్టీ 2.87%, విద్యుత్ 2.77%, కన్జూమర్ డిస్క్రెషనరీ 2.28%, ఇండస్ట్రియల్స్, క్యాపిటల్ గూడ్స్ 2% నష్టపోయాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు రెండున్నర శాతం క్షీణించాయి.
- మార్చి క్వార్టర్ నికరలాభం క్షీణతతో ప్రైవేటు రంగ యాక్సిస్ బ్యాంక్ 3.50% నష్టపోయి రూ.1,165 వద్ద స్థిరపడింది.
- గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో రూ.8.88 లక్షల కోట్లు సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే, బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.421.58 లక్షల కోట్లకు దిగివచ్చింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బంగారం.. కొనేదెలా..?
హింద్ జింక్ లాభం రూ. 3,003 కోట్లు

పీఎఫ్ ఖాతా బదిలీ ఎంతో సులభం!

డెస్టినేషన్ ఆఫీస్ అనుమతి అక్కర్లేదు



న్యూఢిల్లీ: ఒక సంస్థలో ఉద్యోగం వీడి, మరో సంస్థలో చేరిన సందర్భాల్లో భవిష్యనిధి (పీఎఫ్) ఖాతాను ఆన్‌లైన్‌లో సులభంగా బదిలీ చేసుకునే దిశగా ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు కొన్ని రకాల అనుమతులను తొలగించింది. ''ఇప్పటి వరకు పీఎఫ్ ఖాతా బదిలీ రెండు ఈపీఎఫ్ కార్యాలయాలతో ముడిపడి ఉండేది. ఇందులో ఒకటి పీఎఫ్ జమలు జరిగిన (సోర్స్) ఆఫీస్. ఈ మొత్తం మరో ఈపీఎఫ్ కార్యాలయం పరిధిలో (డెస్టినేషన్ ఆఫీస్)కి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను మరింత సులభతరం చేసే లక్ష్యంతో క్లెయిమ్‌ల బదిలీకి డెస్టినేషన్ ఆఫీస్ అనుమతుల అవసరాలను తొలగించాం. ఇందుకు సంబంధించి పునరుద్ధరించిన ఫామ్ 13 సాఫ్ట్‌వేర్‌ను అమల్లోకి తెచ్చాం. ఇక నుంచి క్లెయిమ్‌లకు సోర్స్ ఆఫీస్ నుంచి అనుమతి లభించగానే, సభ్యుడి/సభ్యురాలి పీఎఫ్ ఖాతా ప్రస్తుత కార్యాలయం పరిధిలోకి మారిపోతుంది''అని కేంద్ర కార్మిక శాఖ తెలిపింది.

ఎల్ఐసీ హౌసింగ్ రుణ రేట్లు తగ్గింపు

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఇటీవల కీలక పాలసీ రేట్లను తగ్గించిన నేపథ్యంలో తాము కూడా రుణాలపై వడ్డీ రేటును పావు శాతం తగ్గించినట్లు ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ వెల్లడించింది. ఇకపై ఎల్ఐసీ హౌసింగ్ ప్రైమ్ లెండింగ్ రేటు 8 శాతం నుంచి ప్రారంభమవుతుందని, కొత్త రేట్లు ఏప్రిల్ 28 నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ తెలిపింది. దీనితో ప్రస్తుత, కొత్త రుణగ్రహీతలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీఫైనల్లో జన్నత్

ఆసియా అండర్–17 జూనియర్ బాక్సింగ్ టోర్నీలో తొమ్మిది మంది భారత బాక్సర్లు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. బాలికల విభాగంలో జన్నత్ (54 కేజీలు), ఖుషీ చంద్ (46 కేజీలు), జియా (48 కేజీలు)... బాలుర విభాగంలో అంబేకర్ (48 కేజీలు), అమన్ దేవ్ (50 కేజీలు), టికమ్ సింగ్ (52 కేజీలు), ఉధమ్ సింగ్ (54 కేజీలు), రాహుల్ గరియా (57 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. క్వార్టర్ ఫైనల్స్‌లో జన్నత్ 4–1తో అనెహిలినా (ఉక్రెయిన్)పై, జియా 5–0తో థి రు నా దిన్ (వియత్నాం)పై గెలిచారు. ఖుషీ చంద్ పంచ్‌ల ధాటికి ప్రత్యర్థి నుగుయెన్ హాంగ్ (వియత్నాం) తట్టుకోలేకపోవడంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను నిలిపి వేశారు. బాలుర విభాగం క్వార్టర్ ఫైనల్స్‌లో అంబేకర్ 5–0తో టిమోఫిల్ (ఉక్రెయిన్)పై, అమన్ 3–2తో ఒసామా (జోర్డాన్)పై, ఉధమ్ 5–0తో కిటమురా (జపాన్), రాహుల్ 5–0తో అలారబటి (పాలస్తీనా)పై నెగ్గగా... టికమ్ పంచ్‌ల ధాటికి డయాబ్ (పాలస్తీనా) తట్టుకోలేకపోవడంతో రిఫరీ రెండో రౌండ్‌లో బౌట్‌ను నిలిపి వేశారు.

ఆసియా అథ్లెటిక్స్ పోటీలకు జ్యోతి, నిత్య, నందిని, రజిత

- మే 27 నుంచి 31 వరకు దక్షిణ కొరియాలో ఈవెంట్
- నీరజ్ చోప్రా దూరం



జ్యోతి యర్రాజీ



నిత్య గంధే



అగసార నందిని



కుంజ రజిత

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఆసియా సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. కొచ్చిలో గురువారం ముగిసిన ఫెడరేషన్ కప్‌లో రాణించిన క్రీడాకారులను, ఇంతకుముందు ఆసియా చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాలను అధిగమించిన ప్లేయర్లను భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) ఎంపిక చేసింది. మే 27 నుంచి 31వ తేదీ వరకు దక్షిణ కొరియాలోని గుమీ నగరంలో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో భారత్ నుంచి వివిధ విభాగాల్లో కలిపి మొత్తం 59 మంది బరిలోకి దిగుతారు. పలువురు అథ్లెట్స్ ఒకటికి మించి ఈవెంట్స్‌లో పోటీపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జ్యోతి యర్రాజీ, కుంజ రజిత... తెలంగాణ నుంచి నిత్య గంధే, అగసార నందిని భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆసియా పోటీలకు దూరంగా ఉంటున్నాడు. స్వదేశంలో మే 24న తన పేరిట జరగనున్న నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్ బరిలోకి దిగనుండటంతో అతడిని ఆసియా పోటీలకు ఎంపిక చేయలేదని ఏఎఫ్ఐ వివరించింది. 2023లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ పోటీల్లో భారత్ 6 స్వర్ణాలు, 12 రజతాలు, 9 కాంస్యాలతో కలిపి 27 పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. జ్యోతి యర్రాజీ 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం, 200 మీటర్లలో రజతం సాధించింది.

భారత అథ్లెటిక్స్ జట్టు

పురుషుల విభాగం: అనిమేశ్ కుజూర్ (200 మీటర్లు), అను కుమార్, కృషన్ కుమార్ (800 మీటర్లు), యూనుస్ షా (1500 మీటర్లు), అవినాశ్ సాబ్లే (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), గుల్‌వీర్ సింగ్, అభిషేక్ పాల్ (5000 మీటర్లు), గుల్‌వీర్ సింగ్, సావల్ బర్వాల్ (10000 మీటర్లు), ప్రవీణ్ చిత్రావెల్, అబ్దుల్లా అబూబకర్ (ట్రిపుల్ జంప్), సర్వేశ్ కుషారే (హైజంప్), సచిన్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ (జావెలిన్ త్రో), సమర్దీప్ సింగ్ (షాట్‌పుట్), తేజస్విన్ శంకర్ (డెకాథ్లాన్), సెర్విన్ సెబాస్టియన్, అమిత్ (20 కిలోమీటర్ల నడక). **4x100 మీటర్ల రిలే:** ప్రణవ్ ప్రమోద్ గౌరవ్, అనిమేశ్ కుజూర్, మణికంఠ హొబ్లీదార్, అమ్లాన్ బొర్గొహైన్, తమిళరసు, రాగుల్ కుమార్, గురీందర్‌వీర్ సింగ్. **4x400 మీటర్ల రిలే:** విశాల్, జై కుమార్, టీఎస్ మనూ, రిన్సీ జోసెఫ్, తుషార్ మన్నా, సంతోష్ కుమార్, ధరమ్‌వీర్ చౌధరీ, మోహిత్ కుమార్.

మహిళల విభాగం: నిత్య గంధే (200 మీటర్లు), జ్యోతి యర్రాజీ (100 మీటర్ల హర్డిల్స్), రూపల్ చౌధరీ, విత్యా రాంరాజ్ (400 మీటర్లు), ట్వింకిల్ చౌధరీ, పూజ (800 మీటర్లు), లిల్లీ దాస్, పూజ (1500 మీటర్లు), పారుల్ చౌధరీ, అంకిత (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్), సంజీవని జాధవ్, సీమా (10000 మీటర్లు), విత్యా రాంరాజ్, అను (400 మీటర్లు), శైలి సింగ్, అన్సీ సోజన్ (లాంగ్‌జంప్), పూజ (హైజంప్), సీమా (డిస్కస్ త్రో), అన్ను రాణి (జావెలిన్ త్రో), అగసార నందిని (హెప్టాథ్లాన్). **4x100 మీటర్ల రిలే:** నిత్యా గంధే, అభినయ రాజరాజన్, స్నేహ, శ్రాబణి నందా, దానేశ్వరి, సుదీక్ష. **4x400 మీటర్ల రిలే:** రూపల్, స్నేహ, శుభ, జిస్నా మాథ్యూస్, కుంజ రజిత, సాండ్రామోల్ సాబు.

గెలిచి నిలిచిన రైజర్స్

చెపాక్ మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టును సన్‌రైజర్స్ హైదరాబాద్ గతంలో ఎప్పుడూ ఓడించలేదు. ఈసారి చక్కటి బౌలింగ్‌తో సూపర్ కింగ్స్‌ను 154 పరుగులకే పరిమితం చేసినా... వరుసగా విఫలమవుతున్న బ్యాటింగ్ బృందంతో గెలుపుపై మళ్లీ సందేహాలు. ప్రధాన బ్యాటర్లంతా నిష్క్రమించగా 37 బంతుల్లో 49 పరుగులు చేయాల్సిన స్థితిలో జట్టు నిలిచింది. అయితే కమిందు మెండిస్‌కు ఫామ్‌లో లేక ఇబ్బంది పడుతున్న నితీశ్ కుమార్ రెడ్డి జత కలిశాడు. వీరిద్దరు ఎలాంటి సాహసాలకు పోకుండా చక్కటి సమన్వయంతో ఆడి రైజర్స్ శిబిరంలో ఆనందం నింపారు. టోర్నీలో మూడో విజయంతో హైదరాబాద్‌కు కాస్త ఊరట దక్కగా... ఏడో పరాజయంతో చెన్నై 'ప్లే ఆఫ్స్' అవకాశాలు దాదాపు ముగిసినట్లే!



కమిందు మెండిస్‌తో నితీశ్ గెలుపు సంబరం

- హైదరాబాద్‌కు కీలక విజయం
- 5 వికెట్లతో చెన్నై సూపర్ కింగ్స్ చిత్తు
- రాణించిన ఇషాన్, కమిందు మెండిస్

చెన్నై: ఐపీఎల్‌లో వరుసగా రెండు ఓటముల తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మరో విజయం దక్కింది. తొలిసారి చెన్నైని వారి వేదికపైనే ఓడించడంలో హైదరాబాద్ సఫలమైంది. శుక్రవారం జరిగిన పోరులో రైజర్స్ 5 వికెట్లతో సీఎస్‌కేపై గెలుపొందింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 19.5 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌటైంది. డెవాల్డ్ బ్రెవిస్ (25 బంతుల్లో 42; 1 ఫోర్, 4 సిక్స్‌లు), ఆయుశ్ మాత్రే (19 బంతుల్లో 30; 6 ఫోర్లు) రాణించగా... 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్షల్ పటేల్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం హైదరాబాద్ 18.4 ఓవర్లలో 5 వికెట్లకు 155 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 44; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, కమిందు మెండిస్ (22 బంతుల్లో 32 నాటౌట్; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

బ్రెవిస్ దూకుడు...

తొలి బంతికే ఆంధ్ర క్రికెటర్ షేక్ రషీద్ (0) అవుట్ కావడంతో చెన్నై ఇన్నింగ్స్ పేలవంగా మొదలైంది. మరోవైపు గత మ్యాచ్ తరహాలో ఆయుశ్ మాత్రమే చక్కటి బౌండరీలతో ఆకట్టుకున్నాడు. మూడో స్థానంలో వచ్చిన స్యామ్ కరన్ (9) విఫలం కాగా... తర్వాతి ఓవర్లోనే ఆయుశ్ కూడా వెనుదిరిగాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 50/3 చేరింది. 8 పరుగుల వద్ద జడేజా ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను హర్షల్ వదిలేశాడు. అయితే కొద్ది సేపటికే జడేజాను కమిందు బౌల్డ్ చేయగా... సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న బ్రెవిస్ మాత్రం కమిందు బౌలింగ్‌లో చెలరేగిపోయి 3 సిక్సర్లు బాదడం విశేషం. హర్షల్ వేసిన మరుసటి ఓవర్లో మరో సిక్స్ బాదిన బ్రెవిస్ తర్వాతి బంతికి కమిందు మెండిస్ కళ్లు చెదిరే క్యాచ్‌కు వెనుదిరిగాడు. శివమ్ దూబే (12), ధోని (6)లతో పాటు 'ఇంపాక్ట్ ప్లేయర్'గా వచ్చిన అన్షుల్ కంబోజ్ (2) కూడా ప్రభావం చూపలేకపోయారు. చివర్లో దీపక్ హుడా (21 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) కొన్ని పరుగులు జోడించడంతో స్కోరు 150 దాటింది.



హర్షల్ పటేల్

రాణించిన ఇషాన్ కిషన్...

ఛేదనలో సన్‌రైజర్స్‌కు కూడా సరైన ఆరంభం లభించలేదు. రెండో బంతికే అభిషేక్ శర్మ (0) అవుట్ కావడంతో తొలి దెబ్బ పడింది. ట్రవిస్ హెడ్ (16 బంతుల్లో 19; 4 ఫోర్లు) ఎక్కువ సేపు నిలవలేకపోగా పవర్‌ప్లేలో 37 పరుగులే వచ్చాయి. మరోవైపు ఇషాన్ కిషన్ మాత్రం కొన్ని చక్కటి షాట్లతో పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ (7) విఫలం కావడంతో రైజర్స్ కష్టాలు మరింత పెరిగాయి. వేగంగా ఆడే ప్రయత్నంలో రైజర్స్ వికెట్లు కోల్పోయింది. 16 పరుగుల వ్యవధిలో కిషన్, అనికేత్ వర్మ (19 బంతుల్లో 19; 2 సిక్స్‌లు) నిష్క్రమించడంతో గెలుపుపై సందేహాలు ఏర్పడ్డాయి. అయితే కమిందు, ఏడో స్థానంలో వచ్చిన నితీశ్ రెడ్డి (13 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు) ఒత్తిడిని అధిగమించి జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయతీరం చేర్చారు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రషీద్ (సి) అభిషేక్ (బి) షమీ 0; ఆయుశ్ (సి) ఇషాన్ కిషన్ (బి) కమిన్స్ 30; స్యామ్ కరన్ (సి) అనికేత్ (బి) హర్షల్ 9; జడేజా (బి) కమిందు 21; బ్రెవిస్ (సి) కమిందు (బి) హర్షల్ 42; శివమ్ దూబే (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 12; హుడా (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 22; ధోని (సి) అభిషేక్ (బి) హర్షల్ 6; అన్షుల్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 2; నూర్ (సి) షమీ (బి) హర్షల్ 2; ఖలీల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 154. వికెట్ల పతనం:** 1–0, 2–39, 3–47, 4–74, 5–114, 6–118, 7–131, 8–134, 9–137, 10–154. **బౌలింగ్:** షమీ 3–0–28–1, కమిన్స్ 4–0–21–2, ఉనాద్కట్ 2.5–0–21–2, హర్షల్ పటేల్ 4–0–28–4, అన్సారీ 3–0–27–0, కమిందు మెండిస్ 3–0–26–1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) ఆయుశ్ (బి) ఖలీల్ 0; హెడ్ (బి) కంబోజ్ 19; ఇషాన్ కిషన్ (సి) కరన్ (బి) నూర్ 44; క్లాసెన్ (సి) హుడా (బి) జడేజా 7; అనికేత్ (సి) హుడా (బి) నూర్ 19; కమిందు (నాటౌట్) 32; నితీశ్ రెడ్డి (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (18.4 ఓవర్లలో 5 వికెట్లకు) 155. వికెట్ల పతనం:** 1–0, 2–37, 3–54, 4–90, 5–106. **బౌలింగ్:** ఖలీల్ 3–0–21–1, కంబోజ్ 3–0–16–1, నూర్ అహ్మద్ 4–0–42–2, జడేజా 3.4–0–22–1, స్యామ్ కరన్ 2–0–25–0, పతిరణ 3–0–27–0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	8	6	2	12	1.104
ఢిల్లీ	8	6	2	12	0.657
బెంగళూరు	9	6	3	12	0.482
ముంబై	9	5	4	10	0.673
పంజాబ్	8	5	3	10	0.177
లక్నో	9	5	4	10	-0.054
కోల్‌కతా	8	3	5	6	0.212
హైదరాబాద్	9	3	6	6	-1.103
రాజస్తాన్	9	2	7	4	-0.625
చెన్నై	9	2	7	4	-1.302

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా x పంజాబ్
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

2003 డీఎస్సీ టీచర్లకు పాత పింఛను

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మరో మూడు నెలల్లో.. 2003 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పింఛను విధానం అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ పీఆర్‌టీయూటీఎస్ భవన్‌లో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 మెమోల ద్వారా పాత పింఛను విధానం వర్తిస్తుందనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సమావేశంలో పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కబడిగా సంరక్షణ

ఇంధనపల్లి సమీపంలోని కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వనమహోత్సవంలో భాగంగా అధికారులు వేలాది మొక్కలు నాటారు. కానీ వాటి సంరక్షణ చర్యలు చేపట్టకపోవడం, నీరందించకపోవడంతో.. నాటిన మొక్కలన్నీ ఎండిపోయి ఆనవాళ్లు కూడా మిగల్లేదు. మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన కర్రలు మాత్రమే మిగిలాయి. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అయ్యింది.- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రభుత్వ పాఠశాలలను సంస్కరించాలి

- ఎస్టీయూటీఎస్ సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించే దిశగా సంస్కరణలు చేపట్టాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ప్రభుత్వానికి సూచించారు. సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యా కమిషన్ ఇటీవల అనేక సంస్కరణలు సూచించిందని, ప్రాథమిక విద్యలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని పేర్కొందని తెలిపారు. మెరుగైన మౌలిక వసతులు అవసరమని స్పష్టం చేసిందన్నారు. వీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

బడి బియ్యం భద్రత ఎలా?



గురుకులాల్లో పేరుకు పోయిన నిల్వలు

50 రోజుల్లో పాడవుతాయనే ఆందోళన ● పురుగులు పడితే మళ్లీ వండటం కష్టమే

● ఏం చేయాలో చెప్పాలని అధికారులకు ఉపాధ్యాయుల విన్నపాలు

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవుల నేపథ్యంలో విద్యాసంస్థల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని కాపాడటం పెద్ద సమస్యగా మారిందని పాఠశాలల హెచ్‌ఎంలు అంటున్నారు. 50 రోజులపాటు నిల్వ ఉంచితే చెడిపోతాయని వారు చెబుతున్నారు. వీటి విషయంలో ఏం చేయాలో చెప్పాలని ఎంఈఓలను కోరుతున్నారు. దీంతో బియ్యం నిల్వపై సరైన మార్గదర్శకాలివ్వాలని రాష్ట్ర ఉన్నతాధికారులను జిల్లా విద్యాశాఖాధికారులు కోరారు. విద్యా సంస్థలకు ఈ నెల 23 నుంచి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. పాఠశాలలు తిరిగి జూన్ 13వ తేదీన తెరుచుకుంటాయి. దాదాపు 50 రోజులపాటు బియ్యాన్ని పాఠశాల ప్రాంగణంలోనే నిల్వ ఉంచాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ స్కూళ్లలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మోడల్ స్కూళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో రెండు పూటల భోజనం ఇస్తారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతీ నెలా బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ ఆయా విద్యా సంస్థలకు అందిస్తుంది. ఏప్రిల్ 15వ తేదీన నెలకు సరిపడా బియ్యాన్ని సరఫరా చేశారు. స్కూల్ చివరిరోజుల్లో విద్యార్థులు పెద్దగా లేకపోవడంతో బియ్యం నిల్వలు మరింత పెరిగాయి.

చెడిపోతే చిక్కులే

విద్యా సంస్థలకు అందించే బియ్యం నిల్వలపై ఇప్పటి వరకూ ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. సాధారణంగా నిల్వ ఉంచేప్పుడు ఇళ్లల్లో బోరిక్ పౌడర్ కలుపుతారు. పురుగు చేరకుండా చెమ్మలేని, గాలి చొరబడే చోటలో ఉంచి జాగ్రత్తలు తీసుకుంటారు. పాఠశాలల మూసివేతతో ఈ పరిస్థితి ఉండే అవకాశం లేదు. ఏ మాత్రం వర్షం పడినా దాదాపు 4 వేల పాఠశాలల్లో చెమ్మ చేరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. 15 వేల విద్యాసంస్థల్లో వంటగదులు చీకటిగా ఉంటాయి. దాదాపు అన్ని చోట్ల ఎలుకలు తిరుగుతున్నాయి. 50 రోజుల పాటు ఎవరూ ఉండరు కాబట్టి ఎలుకల స్వైర విహారం మరింతగా పెరుగుతుంది. చెమ్మ, గాలి సోకపోవడం వల్ల తెల్ల పురుగు చేరి, తుట్టెలు కట్టే అవకాశం ఉందని హెచ్‌ఎంలు అంటున్నారు. వీటిని తిరిగి వాడటం వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన చెబుతున్నారు. ఇలాంటివి తలెత్తితే ముందుగా హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటున్నారని వారు చెబుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకునే ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తున్నారు. మిగిలిపోయిన బియ్యాన్ని లెక్కగట్టి పౌరసరఫరాల శాఖ తీసుకోవాలని కోరుతున్నారు. వీటిని స్కూళ్లు తెరిచిన తర్వాత ఇచ్చే ఏర్పాటు చేయాలంటున్నారు.

రవాణా చార్జీలే సమస్య

పౌర సరఫరాల శాఖ నుంచి విద్యా సంస్థలకు కాంట్రాక్టు ఏజెన్సీ బియ్యాన్ని రవాణా చేస్తుంది. చేరవేయడం వరకే తమ కాంట్రాక్టు పరిధిలోకి వస్తుందని వారు చెబుతున్నారు. ఒకవేళ బియ్యం పాడయినా, పురుగు ఉన్నా వాటిని తిరిగి ఇచ్చి, వేరేవి తీసుకోవాలంటే కాంట్రాక్టు సంస్థ ముందుకు రావడం లేదు. ఇలాంటి సందర్భాల్లో స్కూల్ హెచ్‌ఎంలు తమ సొంత ఖర్చులతో బియ్యం మార్పిడి చేస్తున్నారు. ఇప్పుడు పెద్దఎత్తున బియ్యం నిల్వలు ఉంటాయి. ఎప్పుడైనా ఒక బస్తా బియ్యానికి అయ్యే రవాణా ఖర్చు భరించడం పెద్ద లెక్క కాదు. కానీ ఇంత నిల్వను చేరవేయడానికి అయ్యే ఖర్చులు తామెందుకు భరించాలని వారు అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.



కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి భారీ కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. సీఎం రేవంత్‌సహా ప్రభుత్వ పెద్దలు, వివిధ పార్టీల నేతలు, ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొని మృతులకు నివాళులు అర్పించారు.



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ ఈవెంట్‌కు విచ్చేస్తున్న అతిథులకు ఆహ్వానం పలుకుతున్న తెలంగాణ సంప్రదాయ కళాకారులు





పోషకాల వేసవి ఫలాలు

వేసవిలో లభించే సీజనల్ పండ్లు తాటిముంజలు, ఈతపండ్లు వడదెబ్బ తగలకుండా, డీహైడ్రేషన్ బారిన పడకుండా చలువ చేస్తాయి. పోషక విలువలు సమృద్ధిగా ఉండే వీటిని ప్రకృతి ఫలాలుగా భావిస్తారు. పల్లెటూళ్లలో సహజసిద్ధంగా ఇవి లభిస్తుండడంతో చిన్నాపెద్దా తేడా లేకుండా ఇష్టంగా తింటారు. దీంతో కొందరు చిరు వ్యాపారులు గ్రామాల నుంచి పట్టణాలకు తాటిముంజలు, ఈతపండ్లను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





రూపేశ్ ఎవరంటే...!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శాంతి చర్చల ప్రక్రియపై మావోయిస్టు పార్టీ నార్త్–వెస్ట్ సబ్ జోనల్ ఇన్‌చార్జ్ రూపేశ్ తరచూ స్పందిస్తున్నారు. అందులో భాగంగా ఇటీవల ఓ వీడియో ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు. రూపేశ్ పేరుతో ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తి రెండు తెలుగు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల్లో ఒకరిగా ముద్రపడిన తక్కెళ్లపల్లి వాసుదేవరావు అని పలువురు అనుమానిస్తున్నారు. తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ శేషన్న అలియాస్ రూపేశ్ పేరుతో ఆయన కొనసాగుతున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేట ఆయన స్వస్థలం. హనుమకొండలో పాలిటెక్నిక్ చదువుతూ రాడికల్ ఉద్యమాల వైపు ఆకర్షితుడై 1989 లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఆ తర్వాత అప్పటి పీపుల్స్ వార్ గ్రూపు చేపట్టిన పలు కీలక యాక్షన్లలో సభ్యుడిగా ఉన్నాడు.



రూపేశ్ అలియాస్ తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న (ఫైల్)

'అలిపిరి యాక్షన్'టీమ్ లీడర్

ఉమ్మడి ఏపీలో అప్పటి హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డిని ఘట్‌కేసర్ దగ్గర 2000 మార్చి 7న బాంబు పేల్చి చంపిన ఘటనతో ఆశన్న పేరు బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అంతకు కొద్దిరోజుల ముందే హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్‌నగర్ చౌరస్తాలో 1999 సెప్టెంబర్ 4న ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్రను దారి కాచి కాల్చి చంపిన టీమ్‌లోనూ ఆశన్న ఉన్నారు. వీటన్నింటికీ మించి 2003 అక్టోబర్‌లో తిరుపతి అలిపిరి వద్ద అప్పటి సీఎం నారా చంద్రబాబునాయుడిని లక్ష్యంగా చేసుకొని మందుపాతర పేల్చిన తొమ్మిది మంది సభ్యులతో కూడిన టీమ్‌కి ఆశన్నే నాయకత్వం వహించాడు. ఈ ఘటనతో తక్కెళ్లపల్లి వాసుదేవరావు పేరు దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అలిపిరి ఘటన తర్వాత ఆంధ్రా–ఒడిశా బోర్డర్ (ఏఓబీ)కి ఆశన్న వెళ్లారు. అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్‌కు 2017లో వచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ నార్త్–వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా ఆయన ఉన్నట్టు తెలుస్తోంది.

గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు ఏఐపై శిక్షణ

గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ శరత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు విద్యారంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాధనాల వినియోగంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ కమిషనర్ శరత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 5,560 మంది టీచర్లు పనిచేస్తున్నారని, వీరికి విడతల వారీగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మూడు రోజుల పాటు ఆరు సెషన్లలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్దేశించిన రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు జూమ్, వెబెక్స్ ఆధారిత శిక్షణ ఇస్తామని, మొత్తం 15 బ్యాచ్‌లుగా ఉపాధ్యాయులను విభజించి శిక్షణ పూర్తి చేస్తామన్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సాధనాల వాడకంపై నైపుణ్యం పెంపొందడం ద్వారా ఉపాధ్యాయులకు పాఠ్య ప్రణాళికల తయారీ, బోధన సామగ్రి రూపొందించటం, తరగతి గది కృత్యాలు వంటి కార్యకలాపాల్లో కొత్త ఆవిష్కరణలకు దారి తీసేలా ఉపయోగపడుతుందని, దీని ద్వారా ఉపాధ్యాయులలో ఆత్మవిశ్వాసం పెరిగి, విద్యా నిర్వహణలో నూతన దిశగా అడుగులు వేయుటకు దోహద పడుతుందని వివరించారు. రాష్ట్రంలోని గిరిజన విద్యాసంస్థల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులందరూ ఈ వినూత్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని శరత్ సూచించారు.

దిల్ రాజుకు మధ్యంతర రక్షణ కొనసాగింపు

మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కాపీరైట్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజుకు ఇచ్చిన మధ్యంతర రక్షణను సుప్రీంకోర్టు కొనసాగించింది. మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కాపీరైట్ వివాదానికి సంబంధించి నిర్మాత వి.వెంకటరమణారెడ్డి అలియాస్ దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలంటూ సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఇప్పటికే మధ్యంతర రక్షణ ఇచ్చింది. అంతేగాక తదుపరి విచారణ వరకు దిల్ రాజుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. శుక్రవారం సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మధ్యంతర రక్షణను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'నా మనసు నిన్ను కోరే నవల'ఆధారంగా 'మిస్టర్ పర్‌ఫెక్ట్' అనే సినిమా తీశారంటూ రచయిత్రి ముమ్ముడి శ్యామలాదేవి 2017లో దిల్ రాజుపై కేసు పెట్టారు. దీంతో మాదాపూర్ పోలీసులు నిర్మాత దిల్ రాజుపై కాపీ రైట్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసు విచారణ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో జరిగింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న సిటీ సివిల్ కోర్టు, సాక్ష్యాలను పరిశీలించి దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలని 2019లో ఆదేశించింది. ఈ ఉత్తర్వులను కొట్టివేయాలంటూ దిల్‌రాజు సుప్రీంకోర్టును ఆశ్రయించగా జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దిల్ రాజుపై చర్యల విషయంలో గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణను కొనసాగించిన జస్టిస్ జె.బి.పార్దీవాలా ధర్మాసనం, తదుపరి విచారణను వాయిదా వేస్తూ.. అప్పటి వరకు సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

మొక్కా.. 'బతుకమ్మా'!



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండక్కి పంపిణీ చేసిన చీరలు ప్రస్తుతం నర్సరీల్లోని మొక్కలకు రక్షణ కల్పిస్తున్నాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సీతారాంపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ హయాంలో అందించిన చీరలను మహిళలకు పంపిణీ చేయలేదు. గ్రామపంచాయతీ కార్యాలయంలోనే ఒక మూలన పడేశారు. వాటిలో కొన్నింటిని ఇలా ఈజీఎస్ నర్సరీలో మొక్కల నీడ కోసం వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వం మహిళలకు చీరలు పంపిణీ చేస్తే.. నర్సరీల్లో మొక్కలకు రక్షణగా ఉపయోగించడమేమిటని మాజీ ఉప సర్పంచ్ మహంకాళి కొమురయ్య ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

- చిగురుమామిడి

గాలిబుడగ జీవితం.. బతుకు నిత్య పోరాటం!



చంకలో చిన్న పిల్లలు..చేతిలో నీటి బుడగల గన్స్.. ఒకవైపు పిల్లలను ఆడిస్తూ, ఓదారుస్తున్నారు. ఇదే సమయంలో చిరు వ్యాపారం చేస్తూ ఆత్మాభిమానం చాటుతున్నారు. రోజూ కర్నూలు నగరంలో ఎంతో మంది అన్ని అవయవాలు బాగున్నా రోడ్లలో బిచ్చమెత్తుకుంటున్న దృశ్యాలు కోకొల్లలు. ఎలాగోలా బతికేస్తున్నామని కాకుండా, ఎంతోకొంత కష్టపడి సంపాదించిన సొమ్ముతో గంజినీళ్లు తాగినా ఆత్మసంతృప్తి ఉంటుందనేందుకు వీళ్లే ఉదాహరణ. రాజస్థాన్‌వాసులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో వాటర్ బబుల్ గన్స్ విక్రయిస్తున్నారు. పెద్ద దుకాణాల్లో జీఎస్టీలు చెల్లించి, నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తున్న వాళ్లలో సగం మందైనా ఇలాంటి వాళ్లను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయకుంటే ఉద్యమిస్తాం

సాక్షి, అమరావతి: మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో లోపాలను వెంటనే సరిచేయకుంటే నిరుద్యోగుల తరఫున ఉద్యమిస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాము ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీలను డీఎస్సీకి అనర్హులు చేసే నిబంధనలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీలో 45–50 శాతం మార్కులు ఉండాలనే నిబంధనను తొలగించి, అందరికీ అవకాశం కల్పించాలన్నారు. సిలబస్ విస్తృతి రీత్యా అభ్యర్థులకు సన్నద్ధత సమయాన్ని 90 రోజులు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ పరీక్షల సమయంలోనే ఏపీపీఎస్సీ, డీఎల్, జేఎల్ తదితర పరీక్షలు ఉన్నందున అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు.

ఎయిడెడ్ టీచర్లకు పాత స్టేషన్ పాయింట్లు కేటాయించాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలల నుంచి ప్రభుత్వంలోకి విలీనమైన ఉపాధ్యాయులకు 8 ఏళ్ల పాతస్టేషన్ పాయింట్లు కేటాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, చిన్నప్ప శుక్రవారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తిరుమలలోణి లేపాక్షి భవనం రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబించాలి

చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

సాక్షి, అమరావతి: తిరుమలలో కొత్తగా నిర్మించనున్న లేపాక్షి భవనం రాష్ట్ర పౌరాణిక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఉండాలని చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా సూచించారు. చేనేత, జౌళి శాఖ, ఆప్కో, లేపాక్షి ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పారిశ్రామిక మండలి అధికారులతో మంగళగిరి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సిసోడియా మాట్లాడుతూ..పర్యాటక కేంద్రాల్లో ఆప్కో, లేపాక్షి షోరూమ్‌లను ప్రారంభించాలన్నారు. లేపాక్షి బ్రాండ్ ద్వారా పురాతన శైలి కలిగిన కలప(ఆంటిక్ వుడ్) ఫర్నిచర్ విక్రయాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. గ్రామీణ స్థాయిలో స్థానిక ప్రతిభను ప్రోత్సహించి, కొత్త డిజైన్ల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని, ప్రతిభావంతులైన కళాకారులను గుర్తించి అవార్డులు ఇవ్వాలని సూచించారు. ఆప్కోకు ప్రభుత్వ శాఖల నుంచి రావలసిన బకాయిలను తక్షణమే వసూలు చేయడానికి ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మ్యారేజ్.. హైరేంజ్..

గోదారోళ్ల పెళ్లిళ్లలో ఆధునిక పోకడలు

ఉత్తరాది మహిళలతో అతిథులకు స్వాగతాలు

విందు భోజనాల వడ్డన నుంచి పాన్ అందించే వరకూ మర్యాదలు

ఖర్చుకు వెనుకాడని ఉమ్మడి జిల్లా వాసులు



గోదావరి జిల్లాల్లోని ఓ పెళ్లిలో రష్యా అమ్మాయిల సందడి



విదేశీ భామల సందడి





కళ్యాన మండపం ముందు ఆకర్షణగా...

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరుగుతున్న పెళ్లిళ్లలో అడుగడుగునా ఆధునికత కనిపిస్తోంది. సామాన్య, మధ్యతరగతి వారు కూడా అప్పోసొప్పో చేసి చాలా ఆడంబరంగా వివాహాలు చేయడం పరిపాటిగా మారింది. పెళ్లిళ్లలో అనేక కొత్త తరహా పద్ధతులు వచ్చి చేరుతున్నాయి. వాటిని అందరూ ఆమోదించడం గమనార్హం. ఈవెంట్ ఆర్గనైజర్లు కూడా అందుకు తగినట్టుగా పెళ్లి సందడిలో కొత్త కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. పెళ్లి మంటపం, రిసెప్షన్, పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడిని తయారు చేయడం, సంప్రదాయంగా పంపే సారె.. తదితర వాటిలో ఆధునికతను తీసుకువస్తున్నారు. ప్రస్తుతం జరిగే పెళ్లిళ్లలో ఉత్తరాది, విదేశీ భామలు సైతం సందడి చేస్తున్నారు.

సాక్షి, అమలాపురం: ఆధునిక కాలంలో జరుగుతున్న పెళ్లిళ్లలో అనేక కొత్త పోకడలు వచ్చాయి. పెళ్లి పందిరి నుంచి విందు భోజనాల వరకూ అన్నింటిలో కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. గతంలో గోదావరి జిల్లాల్లో జరిగే పెళ్లిళ్లలో తాటాకు పందిళ్లు, కొబ్బరి, మొగలి ఆకులతో తయారు చేసిన రకరకాల పువ్వులు, ఆవుపేడతో అలికిన పెళ్లి అరుగు, చుట్టూ ముత్యాల ముగ్గులు, బాజా భజంత్రీలు, సన్నాయి మేళాలు, సంప్రదాయ భోజనాలు, అతిథులకు పసుపు, కుంకుమలు పెట్టి రవికెలు అందించడం కనిపించేంది.

కొత్తదనం

1980 నుంచి గోదావరి పెళ్లిళ్లలో కొత్తదనం చోటు చేసుకుంది. టెంట్లు, షామియానాలు, పట్టు పరికిణీలు కట్టుకుని గులాబీలు ఇచ్చే పడుచు పిల్లలు, పన్నీరు జల్లే యంత్రాలు, మ్యూజికల్ నైట్‌లు, బ్యాండు మేళాలు, పచ్చి పువ్వుల మంటపాలు, పలు రకాల వంటలు, అతిథులకు వడ్డించే కేటరింగ్ కుర్రాళ్లు సందడి చేసేవారు.

ఆధునిక బాటలో..

గోదారోళ్ల పెళ్లిళ్లు 2020 నుంచి ఆధునిక బాట పట్టాయి. బాహుబలి సెట్టింగ్‌లు, డీజే సౌండ్‌లు, సినీనేప థ్య గాయకులతో సంగీత విభావరి, పెళ్లికి ముందు ఉత్తరాది బారాత్, సంగీత్, హల్దీలు, అనేక రకాల వంటకాలు, ఉత్తరాది భామలతో బుల్లెట్ బండ్ల మీద ఊరేగింపులు, విదేశీ భామలతో వినూత్న స్వాగత సత్కారాలు.. ఇలా ఆధునిక పుంతలు తొక్కుతున్నాయి.

బుల్లెట్ బండ్లపై సందడి

పెళ్లిళ్ల ఊరేగింపులో కూడా కొత్త ట్రెండ్ సాగుతోంది. మహారాష్ట్ర, రాజస్థాన్ యువతులు బుల్లెట్ బండ్ల మీద పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె వెంట ఊరేగింపుగా వస్తున్నారు. తలపాగాలు ధరించి, సంప్రదాయ వస్త్రధారణతో బుల్లెట్లు నడుపుతూ దారి పొడవునా సందడి చేస్తున్నారు. అలాగే రష్యా, బ్రెజిల్ భామలు పెళ్లి, రిసెప్షన్ వేదికల వద్ద స్వాగత సత్కారా లు చేస్తున్నారు. విచిత్ర వస్త్రధారణతో ఆహూతుల ను అలరిస్తున్నా రు. వెస్టర్న్ మ్యూజిక్‌కు లయబద్ధంగా డ్యాన్సులు చేస్తూ మంత్రముగ్ధులను చేస్తున్నారు. పీకాక్, స్వాన్ వేషధారణలతో స్వాగతం పలుకుతున్నారు. వీరితో పాటు అతిథులకు ముంత లస్సీలు అందజేసే మరాఠీ మహిళలు, కేటరింగ్ చేసే ఒడిశా యువతులు, ప్రత్యేకంగా బాదంపాలు అందించే పశ్చిమ బెంగాల్ మహిళలు, రకరకాల స్వీట్ పాన్‌లు అందించే నవాబులు ఇలా ప్రతి చోటా పెళ్లికి వచ్చేవారికి మర్యాదలు చేస్తున్నారు. ఇలా ఒక్కొక్క ఈవెంట్‌కు సుమారు రూ.5 లక్షల నుంచి రూ.కోటి వరకూ ఖర్చవుతుందని అంచనా.



పెళ్లిలో ముంత లస్సీ అందజేస్తున్న గుజరాతీ మహిళలు

ఖర్చు అధికమే..

రష్యన్ కళాకారులు వివిధ రకాల ప్రదర్శనల కోసం ముంబై, ఢిల్లీలో ఎక్కువగా ఉంటారు. వీరిని పెళ్లి ఈవెంట్‌కు తీసుకురావాలంటే పారితోషికంతో పాటు విమానం టికెట్లు కూడా ఇవ్వాలి. దీంతో ఒకేసారి విశా ఖ, రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ ప్రాంతాల్లో ఈవెంట్లు ఏర్పాటు చేసి, వీరిని రప్పిస్తున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, బెంగాల్ నుంచి వచ్చేవారు పెళ్లిళ్ల సీజన్‌లో వచ్చి స్థానికంగా ఉంటారు. వీరితో ఆయా రాష్ట్రాల సంప్రదాయ బ్యాండ్ కళాకారులను కూడా ఇక్కడి పెళ్లిళ్లకు తీసుకువస్తున్నారు.



ఊరేగింపులో బుల్లెట్ బళ్లపై రాజస్థాన్, మహారాష్ట్ర మహిళలు

ఆత్మీయంగా ఉంటారు



కోనసీమ జిల్లా ప్రజలు చాలా ఆత్మీయంగా ఉంటారు. మా ప్రదర్శనలను ఉత్సాహంగా తిలకిస్తారు. మాతో సెల్ఫీలు తీయించుకునేందుకు ఆసక్తి చూపిస్తారు. ఇక్కడ పెళ్లిళ్లు చాలా వైభవంగా జరుగుతాయి.

– అలీనా, రష్యా

ప్రత్యేక గుర్తింపు



వివాహాల సందర్భంగా నిర్వహించే ఊరేగింపుల్లో మాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మా వేషాలను, ఊరేగింపులో బుల్లెట్ నడిపే తీరును చూసి ప్రజలు ఎంతో ముచ్చట పడతారు. ఈవెంట్ల కోసం చాలా ప్రాంతాలకు వెళతాం. అయితే రాజమహేంద్రవరం, కాకినాడ, కోనసీమ వచ్చినప్పుడు మాకు వచ్చే ఆనందం వేరు.

– దామినీ ఈషా, మహారాష్ట్ర

అభిరుచి మేరకు ఏర్పాట్లు



పెళ్లి చేసే తల్లిదండ్రుల అభిరుచులకు అనుగుణంగా మేము అన్ని ఏర్పాట్లూ చేస్తాం. వేదిక అలంకరణ, ఆహారం, స్వాగత మర్యాదల విషయంలో ఎవరూ రాజీ పడడం లేదు. పెళ్లి, పెళ్లికీ కొత్తదనం ఉండేలా కోరుకుంటున్నారు. అందుకు అనుగుణంగా రష్యాతో పాటు ఉత్తరాది నుంచి కళాకారులను తీసుకువస్తున్నాం.

– కొవ్వూరి ధర్మారెడ్డి, ఈవెంట్ నిర్వాహకుడు, రావులపాలెం

రమణీయం..చారిత్రక దృశ్యకావ్యం



చారిత్రక సంపదకు, ప్రకృతి సోయగాలకు నెలవు నాగార్జున కొండ

- నాటి చరిత్రకు ప్రతిరూపం అనుపు
- వేసవి సెలవుల్లో వినోదం.. విజ్ఞానదాయకం

విజయపురిసౌత్: విద్యార్థులకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు అతి సమీపంలో ఉన్న నాగార్జున సాగర్‌ను కుటుంబ సమేతంగా వేసవి సెలవుల్లో చూడాల్సిందే. సాగర్ పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తుంది. చారిత్రాత్మకమైన ప్రాంతమే కాకుండా సాంకేతిక పరంగా సాగర్ ప్రాజెక్టు సందర్శన ఎంతో విజ్ఞానదాయకంగా నిలుస్తోంది. కృష్ణా జలాశయంలో లాంచీ ప్రయాణం ఆహ్లాదకరం. లాంచీలో ప్రయాణించి జలాశయం మధ్యన ఎనలేని ప్రఖ్యాతి ఉన్న నాగార్జునకొండ మ్యూజియం సందర్శించాల్సిందే. ప్రపంచంలోనే మానవ నిర్మిత ఐలాండ్‌మ్యూజియంలలో నాగార్జునకొండ రెండవది. ఆచార్య నాగార్జునుని విశ్వవిద్యాలయం ఇక్కడ ఉంది. బుద్ధదంత ధామమయమైన మహాస్థూపం, విశాలమైన వివిధ భిక్షువిహారాలు ఉన్నాయి. వీటన్నింటితో ఇక్ష్వాకుల రాజధానిగా విలసిల్లిన విజయపురి ప్రాంతం సాగర్‌లో ముంపునకు గురికాకుండా కేంద్ర పురావస్తు శాఖ వారు అక్కడ విశేష సామగ్రిని పరిరక్షించి, నేడు నాగార్జున కొండలో ప్రదర్శిస్తున్నారు.

హారతీ దేవాలయం

విశ్వవిద్యాలయానికి కొద్దిదూరంలో హారతీ దేవాలయం దాని దిగువన చతురస్త్రాకారంలో ఒకపెద్ద సరస్సు ఉంది. దీనికి నలువైపుల మెట్లతో ఒడ్డు ప్రాంతాలున్నాయి. హారతీ దేవాలయంలో ప్రవేశానికి ముందు ఈ సరస్సులో స్నానమాచరించేవారు.

నాగార్జున కొండకు ఇలా చేరుకోవాలి..

నాగార్జునకొండకు వెళ్లాలంటే విజయపురి సౌత్‌లోని లాంచీస్టేషన్ నుంచి 14కి.మీ. దూరం కృష్ణానదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో 45 నిమిషాల సమయం పడుతుంది. నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ మ్యూజియం. నాగార్జున సాగర్ పరిధిలోని విజయపురిసౌత్‌లో లాంచీస్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు లాంచీ టిక్కెట్టు ధర రూ.200, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30, 6 నుంచి 12 సంవత్సరాల చిన్నారులకు లాంచీకు రూ.150, మ్యూజియం సందర్శనకు 14 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీటిక్కెట్‌పై 20 శాతం రాయితీని పర్యాటకశాఖ ఇస్తుంది. ఇతర వివరాలకు లాంచీస్టేషన్ ఫోన్ 9705188311 నెంబర్‌ను సంప్రదించవచ్చు.



నాగార్జునకొండపై మ్యూజియం

ప్రాచీన విశ్వవిద్యాలయం



నాగార్జునకొండపై ఉన్న మహాస్థూపం

ఈ విశ్వవిద్యాలయం శిథిల అవశేషాలు నాగార్జునకొండ లోయలో ఏవిధంగా ఉండేవో అదే విధంగా ఆ ఇటుకలతోనే అనుపు వద్ద అమర్చారు. కృష్ణానది తీరాన విశాలమైన విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం నెలకొని ఉండేది. ఇది ప్రాచీన కాలపు గురుకులమై గురుశిష్య నివాసాలు ఒకేదగ్గరుండి సకల శాస్త్ర విజ్ఞాన కేంద్రమై, ప్రపంచఖ్యాతి గాంచింది.



మహా చైత్యం

ఇది బుద్ధ దాతువుపై కట్టిన అందాల చైత్యం. ఈస్థూపం నుంచి తవ్వి తీసిన ధాతువును ప్రస్తుతం బుద్ధుడు మొదటి ప్రసంగం చేసిన సారనాథ్‌లో ఉంచి, పూజిస్తున్నారు. ఇది శారీరక స్థూపాల జాతికి చెందినది. దీని అంతర్భాగంలో బుద్ధభగవానుని అస్థికలు అమర్చబడ్డాయి. ఇది ప్రాచీన శిల్ప నిర్మాణ ప్రావీణ్యానికి నిదర్శనం. చక్రము దాని ఆకులను ఇటుక గోడల్లా నిర్మించి ఆకుల మధ్య ఖాళీ స్థలాన్ని మట్టితో కప్పి స్థూపాకారాన్ని తయారు చేసి ఉపరితలాన్ని చుట్టుపక్కల పాలరాతి పలుకలతో కప్పి అర్ధగోళాకారంగా అందంగా నిర్మించారు.



ఎత్తిపోతల సోయగం

సాగర్‌కు 15 కి.మీ. దూరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో చంద్రవంక నదిపై సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతం. ఇది 70 అడుగుల పైనుంచి జాలువారే జలపాతం. పర్యాటకుల మనస్సును ఇట్టే ఆకర్షిస్తుంది. పూర్వకాలంలో యతులు తపస్సు చేసుకునే ప్రాంతం కావటంతో ఎత్తిపోతల అనే పేరు వచ్చింది. పెద్దలకు రూ.30 పిల్లలకు రూ.20 ప్రవేశ రుసుము వసూలు చేస్తారు. సాగర్‌నుంచి ముగ్గురు నలుగురు కలిసి ఆటో మాట్లాడుకోని వెళ్లాలి.

అంతర్రాష్ట్ర వర్డ్ పవర్ చాంపియన్‌షిప్‌లో ఏపీ విద్యార్థుల ప్రతిభ

సాక్షి, అమరావతి: అంతర్రాష్ట్ర వర్డ్ పవర్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్టు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విభా–లీప్ ఫర్ వర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముంబైలో జరిగిన పోటీల్లో 11 రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ఏపీ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని దక్కించుకున్నట్టు వివరించారు. ఎన్టీఆర్ జిల్లా కనిమెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బి.సింధు ప్రియ (2వ తరగతి, రెండో స్థానం), బి.రేవంత్ (4వ తరగతి, ప్రథమ స్థానం) గైడ్ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో విజయం సాధించారన్నారు. కృష్ణా జిల్లా వక్కపట్లవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన జి.జెతిన్ మణికంఠ (3వ తరగతి, ప్రథమ స్థానం) గైడ్ టీచర్ విజయ నిర్మల నేతృత్వంలో సత్తాచాటారని పేర్కొన్నారు. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎంపీపీఎస్ వండ్లూరులో 5వ తరగతి చదువుతున్న పి.చరణ్ శ్రీనివాస్ (మూడో స్థానం) గైడ్ టీచర్ శిరీష ప్రోత్సాహంతో గెలుపొందారని వివరించారు. విజేతలు, విభా ఫౌండేషన్ ప్రతినిధులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ప్రత్యేకంగా అభినందించారన్నారు. సమగ్ర శిక్ష, ఎస్సీఈఆర్టీ, విభా ఫౌండేషన్ సహకారంతో 2–5 తరగతుల విద్యార్థుల పఠనం, స్పెల్లింగ్ నైపుణ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో లీప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం 7 జిల్లాల్లో (ఎన్టీఆర్, కృష్ణా, అల్లూరి సీతారామరాజు, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య) అమలు చేస్తున్నామని వెల్లడించారు.

హజ్ కమిటీ చైర్మన్ ఎన్నికకు ప్రత్యేక అధికారి నియామకం

ఈ నెల 30న హజ్ కమిటీ చైర్మన్ ఎన్నిక

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు మైనార్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ ఎల్.సుధాకరరావును ఎన్నికల అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే సభ్యులను ప్రభుత్వం నియమించింది. 45 రోజుల్లో తొలి సమావేశం నిర్వహించి ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంది. విజయవాడ లబ్బీపేటలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ హజ్ కమిటీ కార్యాలయంలో ఈ నెల 30న చైర్మన్ ఎన్నిక జరగనుంది.

టీడీపీ కేంద్ర కార్యాలయ రిసెప్షనిస్టుకు చైర్మన్ గిరీ ?

ఇదిలా ఉండగా..హజ్ కమిటీ చైర్మన్ పదవికి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న వ్యక్తిని ఎంపిక చేశారన్న విషయం విమర్శలకు దారితీస్తోంది. మతపరమైన పవిత్ర హజ్ కమిటీని టీడీపీ కార్యకర్తలతో నింపేసి రాజకీయ వేదికగా మార్చేశారంటూ ఏపీ హజ్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ గౌస్ లాజమ్ తప్పుబట్టారు. ఇటీవల ఆయన మీడియా సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. మరోవైపు హజ్ కమిటీ ఎన్నిక విషయంలో ఇబ్బందికర పరిస్థితులున్నాయని, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. దీంతో హజ్ కమిటీ నియామకంలో న్యాయపరమైన వివాదాలు, రాజకీయ విమర్శలకు తావులేకుండా కనీసం ఇద్దరు ముస్లిం వర్గానికి చెందిన మేధావులను నియమించాలని నిర్ణయించారు. ఆ దిశగా ఇప్పటికే కొన్ని పేర్లు పరిశీలిస్తున్నారు.



● పరిశీలన

పిల్లలు భలే నవ్వుతారు...

పిల్లలూ... మిమ్మల్ని మీరు గమనించారా? మీరు ఎక్కువగా నవ్వుతుంటారు. పిల్లలు ఊరికూరికే నవ్వుతారు. ఊహ తెలిసిన పిల్లలే కాదు పసికందులు కూడా ఊరికూరికే నవ్వుతారు. ఎందుకలా నవ్వుతారు? పిల్లలకు నవ్వు అంత ఇష్టమా?

పిల్లలు మాటలు వచ్చేంత వరకు రెండు రకాలుగా మాత్రమే కమ్యూనికేట్ చేయగలరు. ఒకటి నవ్వడం, రెండవది ఏడవడం. ఆకలేసినప్పుడు, చికాకుగా ఉన్నప్పుడు లేదా ఏదైనా నొప్పి కలిగినప్పుడు ఆ భావాలని ఏడుపు ద్వారా వ్యక్తపరుస్తారు. మరి ఎందుకు నవ్వుతారు? పెద్దవాళ్లు సగటున రోజుకు 15–20 సార్లు నవ్వితే,పిల్లలు మాత్రం రోజుకి 300–400 సార్లు నవ్వుతారు. ఎందుకింత వ్యత్యాసం. అసలు పిల్లలు అన్ని సార్లు ఎలా నవ్వుతారో ఇప్పుడు తెలుసుకుందాం.

పిల్లల మెదడు ఆనం దాన్ని సులభంగా పట్టుకుంటుంది...

చిన్న పిల్లల మెదడు చాలా సరళంగా ఉంటుంది. వాళ్ళు చిన్న చిన్న విషయాల్లోనూ సంతోషం చూస్తారు. ఉదాహరణకు బెలూన్ గాలిలో తేలడం, కుక్కపిల్ల గెంతుతూ ఆడుకోవడం లాంటి సంఘటనలన్నీ వాళ్ళకి వింతగా తోస్తాయి దాంతో కిలకిలా నవ్వేస్తారు!

నవ్వు వాళ్ళకు ఒక భాష లాంటిది...

పిల్లలు ఇంకా పూర్తిగా మాట్లాడడం నేర్చుకోక ముందు నవ్వడం ద్వారా తమ భావాలను చూపిస్తారు. ఒక బొమ్మ నచ్చితేనో, అమ్మ జోలపాటలో మాధుర్యం నచ్చితేనో వాళ్ళు నవ్వుతూ తమ ఆనందాన్ని షేర్ చేస్తారు. ఇది వాళ్ళకు సహజంగా వచ్చే కమ్యూనికేషన్!

సైన్స్ ఏం చెప్తుంది?

నవ్వడం వల్ల మెదడులో 'డోపమైన్' అనే హ్యాపీ కెమికల్ విడుదల అవుతుంది. పిల్లల మెదడు ఈ డోపమైన్ను చాలా త్వరగా, సులభంగా రిలీజ్ చేస్తుంది. అందుకే వాళ్ళు ఒక చిన్నపాటి చక్కిలిగింతకి కూడా పొట్టచెక్కలయ్యేలా నవ్వుతారు.

పిల్లలు క్యూరియస్ ఎక్స్‌ప్లోరర్స్...

పిల్లలు ప్రపంచాన్ని ఒక అద్భుతంగా చూస్తారు. కాగితం ముక్కను చించడం, బబుల్ పగలడం, లేదా నీవు వాళ్ళతో సిల్లీ గేమ్ ఆడడం – ఇవన్నీ వాళ్ళకు కొత్తగా, ఫన్నీగా అనిపిస్తాయి. ఈ కొత్త అనుభవాలు వాళ్ళను నవ్విస్తాయి.

సామాజిక కారణం...

పిల్లలు తమ చుట్టూ ఉన్నవాళ్ళను గమనిస్తారు. నీవు నవ్వితే వాళ్ళూ నవ్వుతారు. దీన్ని 'మిర్రర్ న్యూరాన్స్' అంటారు. వాళ్ళ మెదడు ఇతరుల భావాలను కాపీ చేస్తుంది. అందుకే చిన్నతనంలో అమ్మ నవ్వితే తిరిగి నవ్వడం, ఏడిస్తే పిల్లలూ ఏడవడం మనం తరచూ చూస్తుంటాం.

నాటి రైతు బిడ్డ... నేడు ఐపీఎల్ హీరో



● వైభవ్ సూర్యవంశీ

బిహార్ రాష్ట్రంలోని మారుమూల పల్లె అయిన తాజ్‌పూర్‌లో పుట్టిన ఆ బాలుడు ప్రస్తుతం క్రికెట్‌లో దూసుకుపోతున్నాడు. రైతుబిడ్డగా ఎదిగిన అతను ఆటలో ప్రావీణ్యం చూపుతూ అందరిచేతా ప్రశంసలు అందుకుంటున్నాడు. 14 ఏళ్లకే ఐపీఎల్‌కు ఎంపికైన ఘటన సాధించిన అతనే వైభవ్ సూర్యవంశీ.

మార్చి 27, 2011న పుట్టిన సూర్యవంశీది రైతు కుటుంబం. పొలంలో పని చేస్తేనే ఇంట్లో అందరూ పొట్టనింపుకునే పరిస్థితి వారిది. చిన్ననాటి నుంచి క్రికెట్‌పై వైభవ్‌కు వల్లమాలిన ఇష్టం. ఆ ఇష్టాన్ని తండ్రి సంజీవ్ గమనించారు. ఎనిమిదేళ్ల తన కొడుకు ముందు ముందు క్రికెట్‌లో అద్భుతాలు సృష్టిస్తాడని ఆయన అంచనా వేశారు. ఇందుకోసం తన మద్దతు అవసరం అని గ్రహించి, తన పొలాన్ని అమ్మేసి మరీ కొడుకుకు క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. అప్పటినుంచి క్రికెట్‌పై దృష్టి పెట్టిన వైభవ్ శిక్షణ కోసమే పూర్తి సమయాన్ని కేటాయించాడు. సమస్తిపూర్‌కు తండ్రితో పాటు వెళ్లి అక్కడ కోచ్‌ల దగ్గర శిక్షణ పొందేవాడు. 12 ఏళ్లకే శిక్షణలో రాటుదేలాడు. తొలిసారి రంజీ ట్రోఫీలో పాల్గొని ముంబయి జట్టుపై ఆడాడు. అక్కడే అతని ప్రతిభ అందరికీ తెలిసింది. అనంతరం అండర్–16, అండర్–19 టోర్నమెంట్లలో వైభవ్ తన సత్తా చాటాడు. ఒక్కో చోట తన ఆటకు మరిన్ని మెరుగులు దిద్దుకుంటూ మేలైన క్రీడాకారుడిగా మారాడు. అండర్–19 ఏషియా కప్‌లో తన ఆటతో అందర్నీ మంత్రముగ్ధుల్ని చేశాడు. ఇన్ని విజయాలు సాధించిన వైభవ్ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)కు ఎంపికై దేశమంతటికీ తెలిశాడు. 14 ఏళ్లకు రూ.1.10 కోట్ల పారితోషికంతో ఐపీఎల్‌కు ఎంపికై, అతి చిన్నవయస్కుడైన ఐపీఎల్ ఆటగాడిగా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టు ద్వారా మైదానంలో విజృంభిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నాడు.

● మీకు తెలుసా?


సింహాల ముక్కుని బట్టి వాటి వయసుని లెక్కిస్తారు.!



మనుషుల్లో ఎవరినైనా మీ వయసెంతా అని అడిగితే ఇట్టే చెప్పేస్తారు. ఎందుకంటే మనుషులు మాట్లాడగలరు. కాని సింహాలకి వయసునెలా లెక్కపెడతారు? వాటికి మనలాగా మాటలూ రావు... బర్త్ సర్టిఫికేట్‌లు కూడా ఉండవు. మరి సినిమాల్లో, జియోగ్రఫీ ఛానళ్లలో ఎనిమిదేళ్ళ మగ సింహం... ఆరేళ్ళ ఆడ సింహం... అని అంత నిక్కచ్చిగా ఎలా చెప్తారు. ఎలాగంటే సింహాల వయస్సును అంచనా వేయడానికి శాస్త్రవేత్తలు పలు శారీరక లక్షణాలను పరిశీలిస్తారు. ఇవి సింహం వయస్సును నిర్ధారించడంలో సహాయపడతాయి. వాటిలో ప్రధానమైనది దాని ముక్కు రంగు. సింహపు ముక్కు రంగు వయస్సుతోపాటు మారుతుంది. చిన్నపిల్లలకు గులాబీ ముక్కు ఉంటుంది. మూడేళ్ళ వయస్సు నుంచి ముక్కుపై చిన్న నలుపు మచ్చలు కనిపించటం ప్రారంభమవుతాయి. ఈ మచ్చలు వృద్ధి చెందుతూ సింహానికి ఎనిమిదేళ్ల వయస్సు వచ్చేనాటికి ముక్కు పూర్తిగా నలుపు రంగులోకి మారుతుంది. అంతే కాకుండా సింహాల దంతాల రంగు, ముఖంపై ముడతలు, శరీర ఆకృతి, ఇతర లక్షణాలను పరిగణలోకి తీసుకుని వయసును లెక్కిస్తారు. బోనస్‌గా ఇంకో విషయం... సింహాల జీవితకాలం అడవులలో 8–12 సంవత్సరాలు, జూలో 18–25 సంవత్సరాలు. ఇప్పటివరకు అత్యధికంగా 25 సంవత్సరాలు బ్రతికిన సింహం పేరు 'జెండా'.

● మహనీయులు

దేశానికి సేవలందించిన వైద్యుడు... బిధాన్ చంద్రరాయ్




పిల్లలూ! మనకు ఏదైనా అనారోగ్యం వస్తే వైద్యుల దగ్గరికి వెళ్తాం. ప్రాణాలు నిలిపే వైద్యులను దేవుళ్లలా భావిస్తాం. మనదేశంలో ఒక వైద్యుడు ఉండేవారు. ప్రజలకు ఆయన ఎన్నో సేవలందించారు. ఆయన పుట్టినరోజైన జులై 1న మనం ఏటా 'వైద్యుల దినోత్సవం' జరుపుకుంటున్నాం. ఆయనే బిధాన్ చంద్రరాయ్.

బిధాన్ చంద్రరాయ్ 1882 జులై 1న బిహార్ రాజధాని పాట్నాలో జన్మించారు. వాళ్ల నాన్న ప్రకాశ్‌చంద్ర ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కాగా, అమ్మ కామినీదేవి సమాజ సేవకురాలు. వారిది ధనిక కుటుంబం. వారి ఐదుగురు పిల్లల్లో బిధాన్ చంద్ర చిన్నవాడు. చిన్నవయసు నుంచే ఇతరులకు సేవలందించాలని, వారు అభివృద్ధికి పాటు పడటం బిధాన్‌చంద్ర ఆశయంగా ఉండేది. ఇంట్లో ఆయనతోపాటు మరికొంతమంది పేద, అనాథ విద్యార్థులు చదువుకునేవారు.

1901లో కోల్‌కతా వైద్య కళాశాలలో చేరిన బిధాన్ చంద్ర అక్కడ వైద్యవిద్య పూర్తి చేసి 1909లో బ్రిటన్ దేశానికి వెళ్లి అక్కడ కూడా మెడిసిన్ చదివి తిరిగి స్వదేశానికి వచ్చారు. కోల్‌కతాలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆ సమయంలో దేశ స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. గాంధీజీని కలిసి ఆయనకు వ్యక్తిగత వైద్యుడిగా సేవలందించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడం అవసరమని గుర్తించి, దండియాత్రలో పాల్గొని జైలుకు వెళ్లారు. అనంతరం కొలకతా మేయర్‌గా ఎన్నికై ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించే పథకాలకు శ్రీకారం చుట్టారు. వైద్యశాలల్లో ఉచితంగా వైద్యం అందించే ఏర్పాటు చేశారు. రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన ఆయన 1950లో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. 12 ఏళ్లపాటు పదవిలో ఉండి ప్రజలకు ఎన్నో సేవలందించారు. 1961లో భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' పురస్కారం అందించింది. 1962 జులై 1న ఆయన మరణించారు. ఆయన పేరున మనం వైద్యుల దినోత్సవం జరుపుకుంటున్నాం.

● మన సినిమా | ఎ డాగ్స్ వే హోమ్

తెలివైన కుక్క



హాయ్ కిడ్స్... మీకు పెట్స్ అంటే ఇష్టమా... పిల్లి కాని, బర్డ్స్ కాని లేదా డాగ్ ని పెంచుకోవాలి అని అనుకుంటున్నారా.. అయితే ఇప్పుడు చెప్పబోయే మూవీ చూస్తే మీరు ఖచ్చితంగా డాగ్ ని పెంచుకుంటారు. ఆ మూవీ పేరే నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమ్ అవుతున్న ఎ డాగ్స్ వే హోమ్. ఈ మూవీలో డాగ్ చూపించిన తెలివి సూపర్. అంతలా ఏముందంటే ఈ మూవీలో....కొలరాడో స్టేట్ డెన్వర్ సిటీ లో ఉన్న లూకస్ కి చిన్న కుక్కపిల్ల ఒకటి దొరుకుతుంది. దాన్ని లూకస్ ఇంటికి తెచ్చుకుని పెంచుకుంటాడు. దానికి బెల్లా అని పేరు పెడతాడు. ఈ సినిమాలో బెల్లానే హీరో. లూకస్, బెల్లా మంచి ఫ్రెండ్స్ అవుతారు. వాళ్ళిద్దరూ భలే ఆడుకుంటారు. కాకపోతే ఓ సారి బెల్లా లోకల్ యానిమల్ కంట్రోల్ కి దొరుకుతుంది. అప్పుడు లూకస్ వాళ్ళకి ఫైన్ కట్టి బెల్లాని విడిపిస్తాడు. యానిమల్ కంట్రోల్ వాళ్ళు ఈ సారి బెల్లా కాని మాకు దొరికితే మళ్ళీ ఇవ్వము అని చెబుతారు. దాంతో లూకస్ భయపడి 400 మైల్స్ లో ఉన్న ఫార్మింగ్ టన్ లోని తన ఆంటీ ఓలివియా దగ్గర బెల్లాని వదిలి వచ్చేస్తాడు. కాని బెల్లాకి లూకస్ ని చూడాలని ఉంటుంది. అందుకే అడ్వెంచరస్ ట్రిప్ గా ఒక్కటే లూకస్ కోసం బయలుదేరుతుంది. మరి 400 మైల్స్ లో ఉన్న లూకస్ బెల్లాకి దొరుకుతాడా లేదా అన్నది మాత్రం ఎ డాగ్స్ వే హోమ్ లోనే చూడాలి. దీంట్లో బెల్లాగా నటించిన డాగ్ సూపర్ గా ఉంటుంది. సో కిడ్స్ గ్రాబ్ యువర్ రిమోట్ టు గైడ్ బెల్లా ఫర్ ఫైండింగ్ లూకస్.. హ్యాపీ వాచింగ్ ఎ డాగ్స్ వే హోమ్ ఇన్ ది నెట్ ఫ్లిక్స్.

- ఇంటూరు హరికృష్ణ

● సూపర్ టాలెంట్

తిలక్ మెహతా 13 ఏళ్లకే కంపెనీ పెట్టాడు

13 ఏళ్ల వయసు పిల్లలు ఏం చేస్తారు? స్కూల్ కి వెళ్ళడం, రావడం మధ్యలో హోమ్ వర్క్ చేయడం అమ్మ అనుమతిస్తే మొబైల్‌లో గేమ్స్ ఆడుకోవడం లేదా అకడమిక్‌గా కొంచెం ముందుకెళ్తే మ్యాథ్ ఒలంపియాడ్, సైన్స్ ఒలంపియాడ్‌లలో పాల్గొనడం చేస్తుంటారు. ఇవన్నీ కాదని ఇంకాస్త ముందుకెళ్తే కోడింగ్ నేర్చుకోవడమో చేస్తారు. కాని 13 ఏళ్లకే కంపెనీ పెడితే... ఆ కంపెనీ విజయవంతం అయ్యి 100 కోట్ల టర్నోవర్ చేస్తే... ఇలాంటివన్నీ ఆ వయసు పిల్లలకు సినిమాలో కూడా సాధ్యపడదు. కానీ నిజ జీవితంలో చేసి చూపించాడు తిలక్ మెహతా.

ఎనిమిదవ తరగతి చదువుతున్న 13 ఏళ్ల తిలక్ 2018లో సెలవులకు మేనమామ ఇంటికి వెళ్ళి అక్కడ తన మ్యాథ్ బుక్‌ని మరిచిపోయి వచ్చాడు. ఆ పుస్తకంతో అవసరం ఉండటంతో తండ్రిని తీసుకు రమ్మని అడిగితే అప్పటికే పనులతో అలసిపోయిన తండ్రి అంత దూరం బైక్ నడపలేను అన్నాడు. అప్పుడు తిలక్ మెహతా కొరియర్ యాప్స్ ఓపెన్ చేసి చూస్తే అన్నీ యాప్స్ కూడా పుస్తకం ఖరీదు కంటే ఎక్కువ ఉండటంతో నిరాశ కలిగింది. అప్పుడే ఒక ఆలోచన తడుతుంది. అతి తక్కువ ఖర్చుతో 'సేమ్ డే' డెలివరీతో ఒక కంపెనీ మొదలు పెట్టాలని నిర్ణయించుకుని, మేనమామ అండతో Papers N Parcels (PNP) అనే కొరియర్ కంపెనీ స్థాపించాడు.



అతి చిన్నవయసులోనే అతని ఆలోచన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2019లో TEDx Talks హాజరై తన ప్రయాణాన్ని వివరించాడు. 2020–2021 ఆర్థిక సంవత్సరానికి అతని కంపెనీ టర్నోవర్ 100 కోట్లు దాటింది. అందుకే పెద్దలు అంటారు ....'సాహసం చేయరా డింబకా' అని.

● కథ

రామయ్య వంట



అనగనగా ఓ ఊళ్లో రామయ్య అనే వంటవాడు ఉండేడు. చుట్టుపక్కల ఊళ్లల్లో అతని వంటలకు చాలా పేరుంది. ఎవరి ఇంట్లో పెళ్లయినా అతనే వచ్చి వంటలు చేసేవాడు. అతని చేతి వంట రుచి మరెవరికీ వచ్చేది కాదు. దీంతో అతను చాలా గొప్ప వంటవాడిగా పేరుపొందాడు.

ఆ ఊరిని ఆనుకుని అడవి ఉండేది. అందులో చాలా క్రూరమృగాలు ఉండేవి. సాయంత్రం దాటితే ఎవరూ అటువైపు వెళ్లేవారు కాదు. ఒకసారి పక్కూరిలో పెళ్లికి వంటలు చేసిన రామయ్య తిరిగి రావడానికి ఆలస్యమైంది. అప్పటికే చీకటి పడటంతో త్వరత్వరగా అడుగులు వేసి నడుస్తున్నాడు. ఆ చీకట్లో దారి తప్పి అడవిలోకి వెళ్లాడు. కాసేపటికి తాను అడవిలోకి వచ్చినట్టు గ్రహించాడు. అయితే చీకట్లో దారి కనిపించక, ఎటు వెళ్లాలో తెలియక ఓ చెట్టు కింద కూర్చున్నాడు.

ఇంతలో ఓ సింహం అతని వైపు వచ్చింది. సింహాన్ని చూడగానే రామయ్య గుండెలు జారిపోయాయి. వెంటనే చెట్టెక్కి కూర్చున్నాడు. సింహం గట్టిగా గర్జించడంతో అడవిలో ఇతర జంతువులు కూడా వచ్చాయి. సింహంతోపాటు పులి, ఎలుగుబంటి, నక్క, తోడేలు వంటి జంతువులన్నీ చెట్టు చుట్టూ చేరాయి. ఎలాగైనా అతణ్ని చంపి తినాలని ఆరాటపడుతున్నాయి. వాటిని తప్పించుకోవడం అసాధ్యమని రామయ్యకు అర్థమైంది. ఈ రోజు తన ప్రాణాలు పోయినట్లేనని బాధపడ్డాడు. ఎలాగైనా ఈ గండం నుంచి బయటపడాలని ఆలోచించాడు.

కింద నుంచి జంతువులు బిగ్గరగా అరుస్తున్నాయి. కిందకు దిగకపోతే తామే పైకి వస్తామని అంటున్నాయి. 'చాలా రోజుల నుంచి మనుషులు ఇటువైపు రాలేదు. ఇప్పుడు నువ్వు వచ్చావ్. త్వరగా నిన్ను చంపి తింటే మా ఆకలి తీరుతుంది. మంచి రుచి తగలక మా నాలుకలు చచ్చుబడ్డాయి' అని పులి రామయ్యను చూసి అంది. మిగిలిన జంతువులు కూడా తలాడించాయి. దీంతో రామయ్య మెదడులో తళుక్కున ఓ ఆలోచన మెరిసింది.

ధైర్యం తెచ్చుకొని, 'నన్ను చంపి తింటే మీకేమొస్తుంది? అదే మాంసం, అదే రక్తం. అంతకుమించి ఏమీ ఉండదు. నాకు అవకాశం ఇస్తే మీ నోటికి కొత్త రుచులు చూపిస్తా' అన్నాడు రామయ్య. జంతువులు ఆశ్చర్యంగా చూశాయి. 'వంటకు కావాల్సిన సరుకులు నా సంచిలో ఉన్నాయి. మీరు పాత్రలు తీసుకొస్తే కొత్త వంటకాలు చేస్తా' అన్నాడు. అతని ప్రతిపాదన జంతువులకు కొత్తగా అనిపించింది. 'అందుకు ఒప్పుకుంటాం. కానీ వంటకాలు రుచిగా లేకపోతే, వెంటనే నిన్ను చంపి తింటాం' అని అన్నాయి. సరే అని రామయ్య చెట్టు దిగాడు.

వంటకు కావాల్సిన సామాన్లను జంతువులు అతనికి సమకూర్చాయి. తన దగ్గరున్న సరుకులతో అన్నం, ముద్దపప్పు, చారు, గుత్తివంకాయ, పాయసం, వడలు చేశాడు రామయ్య. వాటిని జంతువులకు వడ్డించాడు. వాటిని తిన్న జంతువులు ఆ రుచికి మైమరిచిపోయాయి. జీవితంలో ఎప్పుడూ తినని పదార్థాలు తినడంతో వాటి ఆనందానికి అవధి లేకుండా పోయింది. రామయ్య కొసరి కొసరి వడ్డిస్తుంటే తృప్తిగా తిన్నాయి. రామయ్య చేతి మహత్యాన్ని మరీ మరీ మెచ్చుకున్నాయి.

తమకు ఇంత చక్కని వంట చేసి పెట్టినందుకు రామయ్యకు కతజ్ఞతలు చెప్పి, అతణ్ని అడవి నుంచి సాగనంపాయి. చక్కటి ఆలోచనతో ప్రాణాలు దక్కించుకున్న రామయ్య బతుకు జీవుడా అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.

నీతి: అపాయం చుట్టుముట్టినప్పుడు భయపడకుండా చక్కటి ఆలోచనతో దాన్ని ఎదుర్కోవాలి.



● ఈ జాతీయాలు

వెతకబోయిన తీర్థం ఎదురైనట్టు...

'వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు' అనేది దీనికి సమానార్థకమైన సామెత. పరిస్థితులు సంపూర్ణంగా అనుకూలించడం, కాలం కలసిరావడం అనే లాంటి అర్థాలలో ఈ జాతీయ ప్రయోగం కనిపిస్తుంది. పూర్వకాలం పుణ్యం కోసం దేశంలోని ఎక్కడెక్కడో ఉన్న తీర్థక్షేత్రాలను అన్వేషించి అక్కడికి వెళ్లి తీర్థస్నానం చేసి వస్తూ ఉండేవారు. అలాంటి రోజులలో ఆవిర్భవించిన జాతీయం ఇది. ఓ వ్యక్తి ఒక తీర్థక్షేత్ర మహిమను గురించి విన్నాడట. ఆ క్షేత్రం ఎక్కడ ఉందో తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నంత లోనే తన ఎదురుగా ఉన్నది తాను విన్న తీర్థమేనని తెలుసుకొని ఎంతో ఆనందించాడట. ఏ మాత్రం కష్టపడకుండా ఇలా తమకు కావల్సినవి తమ సమీపంలోనే ఉన్నాయని తెలుసుకొన్నప్పుడు లేదా తాము వెతుకున్నవారు తమకు ఎదురైనప్పుడు ఈ జాతీయాన్ని వాడటం కనిపిస్తుంది. 'వెతకపోయిన తీర్థం ఎదురైనట్టు నీకోసం బయలుదేరుతుంటే నీవే ఎదురొచ్చావు సంతోషం' అనేలాంటి ప్రయోగాలున్నాయి.

బంగారం.. కొనేదెలా..?



- ధర పెరుగుదలతో వినియోగదారుల్లో నిరాశ
- తక్కువ మొత్తంతో సరిపెట్టుకుంటున్న కస్టమర్లు
- చిన్న వర్తకులపై ఎక్కువ ప్రభావం
- అమ్మకాలు స్థిరపడతాయంటున్న పరిశ్రమ వర్గాలు
- అక్షయ తృతీయపై సానుకూల అంచనాలు

న్యూఢిల్లీ: బంగారం ధర రూ.లక్షలకు పెరిగిపోవడం వినియోగదారులు, ముఖ్యంగా మహిళల ఆకాంక్షలపై నీళ్లు చల్లినట్లయింది. భారతీయ మహిళలకు బంగారంతో విడదీయలేని అనుబంధమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సామాన్య కుటుంబాలకు చెందిన వారు సైతం బంగారు ఆభరణాల కోసమని చెప్పి తమకు తోచినంత పొదుపు చేస్తుంటారు. ఇటీవలి కాలంలో ధరలు అసాధారణంగా పెరిగిపోవడాన్ని వారు ఇప్పుడు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏటా వైశాఖమాసంలో వచ్చే అక్షయ తృతీయ(మొదటి తదియ), వివాహాల సందర్భంగా బంగారం ఆభరణాల కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. ఈ ఏడాది ఇప్పటికే బంగారం ధరలు 22 శాతం పెరిగిపోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జనవరి 1న 10 గ్రాముల బంగారం ధర రూ.79,390గా ఉండగా, అక్కడి నుంచి చూస్తే రూ.1.01 లక్షల వరకు వెళ్లి ప్రస్తుతం రూ.98వేల స్థాయిలో ఉంది.

ఇలా అయితే ఎలా కొనగలం?

''వచ్చే నవంబర్‌లో నా కుమార్తె వివాహం ఉంది. ఈలోపే బంగారం ధర గణనీయంగా పెరిగింది. ఇప్పుడు వివాహం కోసం బంగారం ఎలా కొనుగోలు చేయాలి?'' అన్నది నోయిడాకు చెందిన రూప అభిప్రాయం. పండగలు, వివాహాల సమయంలో బంగారం కొనుగోలు చేయకపోతే ఏదో కోల్పోయినట్టు ఉంటుందని ఢిల్లీ మయూర్ విహార్‌కు చెందిన సుశీలా దేవి మనోగతం. గతంలో 10 గ్రాములు కొనేవాళ్లం కాస్తా.. ఇప్పుడు 5 గ్రాములతో సరిపెట్టుకోవడమేనని నిర్వేదం వ్యక్తం చేశారు. ''నాకు బంగారం ఆభరణాలంటే ఎంతో ఇష్టం. అందుకే ఏటా ఒకసారి కొనుగోలు చేస్తుంటా. ధర రూ.లక్షకు చేరడం నన్ను కలచివేస్తోంది'' అని ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లా వాసి సీతా సాహు తెలిపారు. మరోవైపు చెప్పుకోతగ్గ స్థాయిలో బంగారం ఆభరణాలను సమకూర్చుకున్నవారు.. ధరలు భారీగా పెరిగిపోవడం పట్ల ఒకింత ఆనందాన్నీ వ్యక్తం చేస్తున్నారు. ''నా భర్త ఏటా బంగారం కొనిపెడుతుండేవారు. కానీ, నేడు ఆయన లేకపోయినప్పటికీ.. ఆభరణాలు మాత్రం నాకు గౌరవంతోపాటు, మద్దతుగా నిలుస్తున్నాయి''అని పుణెకు చెందిన అర్చనా దేశ్‌ముఖ్ (65) చెప్పారు.

అమ్మకాలపై ప్రభావం..

ధరల పెరుగుదలతో అమ్మకాలు తగ్గుతున్నట్టు ఆభరణాల వర్తకులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న వర్తకులపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ''దశాబ్దాల నుంచి ఇదే వ్యాపారంలో ఉన్నాం. మొదటిసారి కస్టమర్ల మొహాల్లో అయోమయాన్ని చూస్తున్నాం. గతంలో కస్టమర్లు ఆభరణాల డిజైన్లను ఎన్నింటినో చూసేవారు. ఇప్పుడు వాటిని చూసి వెనక్కి ఇచ్చేస్తున్నారు. ధరలు ఇలాగే పెరిగితే చిన్న వర్తకులు కొనసాగడం కష్టమే''అని ఢిల్లీ మయూర్ విహార్‌కు 'ఊర్మిళా జ్యుయలర్స్' స్వర్ణకారిణి సోనూసోని తెలిపారు. కానీ మహిళలు బంగారం తప్పకుండా పొదుపు చేసి, ఆభరణాలను కొనుగోలు చేస్తూనే ఉంటారని రాధేశ్యామ్ జ్యుయలర్స్‌కు చెందిన కరణ్ సోని అభిప్రాయపడ్డారు.

లైట్ వెయిట్ జ్యుయలరీకి డిమాండ్?

బంగారం ధరలు పెరిగిపోవడంతో ఈ నెల 30న అక్షయ తృతీయ సందర్భంగా కస్టమర్లు తేలికపాటి ఆభరణాలను కొనుగోలు చేయొచ్చని జ్యుయలర్లు అంచనా వేస్తున్నారు. ''అక్షయ తృతీయకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఈ సమయంలో బంగారం కొనుగోళ్లు పెరుగుతుంటాయి. ఈ ఏడాది ధరలు పెరిగినప్పటికీ లైట్ వెయిట్ ఆభరణాల రూపంలో మంచి డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నాం''అని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ చైర్మన్ రాజేష్ రోక్డే తెలిపారు. ధరల పెరుగుదల పట్ల కస్టమర్లు అసహనం వ్యక్తం చేసినప్పటికీ.. సురక్షిత సాధనంగా, మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగం కావడంతో క్రమంగా అమ్మకాలు సానుకూల స్థితికి చేరుకుంటాయన్నారు. ధరల పెరుగుదల నేపథ్యంలో విక్రయాలను పెంచుకునేందుకు వర్తకులు అన్ని రకాల ధరల్లో ఆభరణాలను అందుబాటులో ఉంచడంపై దృష్టి సారించినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అధిక ధరలతో అమ్మకాల పరిమాణం క్రితం ఏడాది స్థాయిలోనే ఉండొచ్చని లేదా 10 శాతం వరకు తగ్గొచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యుయలరీ డొమెస్టిక్ కౌన్సిల్ వైస్ చైర్మన్ అవినాష్ గుప్తా అభిప్రాయపడ్డారు. అక్షయ తృతీయ, వివాహాల సీజన్ కావడంతో విక్రయాల పట్ల ఆశావహంగా ఉన్నట్టు పీఎన్‌జీ జ్యుయలర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ పేర్కొన్నారు.

మనీవర్క్స్ కన్సల్టింగ్‌లో నాబార్డ్‌కు వాటాలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అగ్రి ఫిన్‌టెక్ అంకుర సంస్థ 24 గీ 7 మనీవర్క్స్ కన్సల్టింగ్‌లో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) 10 శాతం వాటా తీసుకుంది. ఒక స్టార్టప్‌లో నాబార్డ్ ఇన్వెస్ట్ చేయడం ఇదే ప్రథమం అని కంపెనీ తెలిపింది.



మనీవర్క్స్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని వారికి రుణ లభ్యతను మెరుగుపర్చే దిశగా ఈకిసాన్‌క్రెడిట్ (ఈకేసీసీ) ప్లాట్‌ఫాంను రూపొందించింది. ల్యాండ్ రికార్డులు, ఆధార్, ఈకేవైసీ మొదలైనవన్నీ ఇందులో అనుసంధానించడం వల్ల సహకార బ్యాంకులు, పీఏసీలు, ఆర్‌ఆర్‌బీలు.. రుణాలిచ్చేందుకు ఉపయోగకరంగా ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-4-2025

విశాఖ	430-00
చిత్తూరు	460-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

బోర్డు సమావేశాలు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండియా సిమెంట్స్, కామత్ హోటల్స్, వక్రంగీ, ఎంఆర్‌పీఎల్, మనోరమ ఇండస్ట్రీస్, పీటీసీ ఇండియా, ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్, ఇండియాబుల్స్ ఎంటర్‌ప్రైజస్, బన్సాలీ ఇంజనీరింగ్స్ పాలీమర్స్.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,691.00	5.15
TECHM	1,460.00	1.02
TCS	3,434.00	0.95
INFY	1,480.00	0.58
ULTRACEMCO	12,190.00	0.25

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	640	-8.13
ADANIENT	2,346.00	-3.95
ADANIPORTS	1,189.50	-3.79
TRENT	5,124.00	-3.75
ETERNAL	227.71	-3.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,757
ఎన్ఎస్ఈ	1,13,850
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,45,249
ఎఫ్ఐఐ	+ 2,952
డీఐఐ	- 3,540

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.05	$ 62.79
బ్రెంట్	66.78	$ 66.55

సరఫరా వ్యవస్థలో మార్పులతో భారత్‌కు ప్రయోజనాలు

ఆర్‌బీఐ బులెటిన్



న్యూఢిల్లీ: సరఫరా వ్యవస్థల్లో సర్దుబాట్లు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి వైవిధ్యమైన వనరులు, ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆసక్తి తదితర అంశాలతో భారత్‌కు ప్రయోజనాలు చేకూరగలవని ఏప్రిల్ బులెటిన్‌లో రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. సర్వీసుల ఎగుమతులు నిలకడగా నమోదవుతుండటం, రెమిటెన్సులు మెరుగ్గా ఉండటం.. కరెంటు అకౌంటుకు కాస్త బాసటగా నిలుస్తున్నాయని వివరించింది. పాలసీపరమైన మద్దతు ఉంటే అంతర్జాతీయంగా నెలకొన్న ఒడిదుడుకులను భారత్ తనకు అవకాశంగా మల్చుకునేందుకు వీలవుతుందని పేర్కొంది. వాణిజ్యం, టారిఫ్‌లపరమైన ఉద్రిక్తతలు పెరగడం, ఫలితంగా ఆర్థిక మార్కెట్లలో తీవ్ర ఒడిదుడుకులు తలెత్తడం వల్ల సమీప భవిష్యత్తులో ప్రపంచ వృద్ధి బలహీనపడుతుందేమోనన్న ఆందోళన నెలకొందని ఆర్‌బీఐ వివరించింది. ఇతర దేశాల్లో డిమాండ్ బలహీనపడటం వల్ల భారత ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడినా.. దేశీయంగా వృద్ధి చోదకాలుగా ఉంటున్న వినియోగం, పెట్టుబడులపై మాత్రం ప్రభావం పెద్దగా ఉండదని పేర్కొంది. 2025లో వర్షపాతం సాధారణంగా కన్నా మెరుగ్గా ఉంటుందనే అంచనాలతో వ్యవసాయ రంగం ఆశావహంగా కనిపిస్తోందని, దీనితో రైతుల ఆదాయాలు పెరిగి, ఆహార ధరలు అదుపులో ఉండవచ్చని రిజర్వ్ బ్యాంక్ వివరించింది.

'బ్యాంక్‌డాట్‌ఇన్' డొమైన్‌కు మార్పు ..

బ్యాంకులు ప్రస్తుతం తాము ఉపయోగిస్తున్న డొమైన్ నుంచి 'బ్యాంక్‌డాట్‌ఇన్' డొమైన్‌కి మారే ప్రక్రియను ప్రారంభించాలని రిజర్వ్ బ్యాంక్ సూచించింది. ఈ ఏడాది అక్టోబర్ 31 నాటికి దీన్ని పూర్తి చేయాలని పేర్కొంది. డిజిటల్ పేమెంట్స్ మోసాల ఉదంతాలు పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ బ్యాంకులన్నింటికీ ఈ ప్రత్యేక డొమైన్‌నే వినియోగంలోకి తేవాలని ఆర్‌బీఐ నిర్ణయించింది.

ఈవీ విడిభాగాల తయారీలోకి హిందాల్కో



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విడిభాగాల తయారీ విభాగంలోకి ప్రవేశించినట్లు హిందాల్కో వెల్లడించింది. ఇందుకు సంబంధించి పుణెలోని చకాన్‌లో రూ. 500 కోట్లతో తేలికపాటి బ్యాటరీ సొల్యూషన్స్ ఉత్పత్తి కోసం తయారీ ప్లాంటును ప్రారంభించింది. ఎంఅండ్ఎం సంస్థకు 10,000 అల్యూమినియం బ్యాటరీ ఎన్‌క్లోజర్లను కూడా అందించినట్లు కంపెనీ సందర్భంగా తెలిపింది. మహీంద్రాతో కలిసి అభివృద్ధి చేసిన ఈ బ్యాటరీ ఎన్‌క్లోజర్, సాధారణ ఉక్కు డిజైన్లతో పోలిస్తే 40 శాతం తక్కువ బరువు ఉంటుంది. వాహన రేంజి సుమారు 8-10 శాతం మెరుగుపడుతుంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకుని దేశీయంగానే అత్యంత నాణ్యమైన అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేసుకునేందుకు చకాన్ ప్లాంటు తోడ్పడగలదని హిందాల్కో ఇండస్ట్రీస్ ఎండీ సతీష్ పాయ్ తెలిపారు.

భారత షిప్పింగ్ మూలాలు పటిష్టం

సినర్జీ మెరైన్ గ్రూప్ సీఈవో జెస్పర్

న్యూఢిల్లీ: అమెరికా ప్రతీకార టారిఫ్‌ల వల్ల షిప్పింగ్ రంగంలో స్వల్పకాలికంగా కాస్త సమస్యలు తలెత్తినా, దీర్ఘకాలికంగా చూస్తే భారత మారిటైమ్ మూలాలు పటిష్టంగా ఉన్నాయని అంతర్జాతీయ షిప్ మేనేజ్‌మెంట్ కంపెనీ సినర్జీ మెరైన్ గ్రూప్ సీఈవో జెస్పర్ క్రిస్టెన్సన్ తెలిపారు. పోర్టు సామర్థ్యాలు .. ఎగుమతుల బేస్ పెరుగుతుండటం, సుశిక్షితులైన సిబ్బంది లభ్యత తదితర అంశాల దన్నుతో గ్లోబల్ షిప్పింగ్ పరిశ్రమలో పరిస్థితులకు అనుగుణంగా భారత్ తనను తాను మల్చుకోగలిగే స్థితిలో ఉందని వివరించారు.



బహుళ నైపుణ్యాలున్న ప్రొఫెషనల్స్‌కి షిప్పింగ్ రంగంలో డిమాండ్ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదని చెప్పారు. డిజిటలైజేషన్, డీకార్బనైజేషన్, నిబంధనలు తదితర అంశాల ఆధారంగా షిప్పింగ్ రంగంలో నైపుణ్యాల ఆధారంగా నియామకాలు ఉంటున్నాయని వివరించారు. సినర్జీలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 28,000 మంది సీఫేరర్స్ ఉండగా, వీరిలో 70 శాతం మంది భారతీయులేనని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫ్లీట్ విస్తరణకు అనుగుణంగా మరిన్ని నియామకాలు చేపట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఒలెక్ట్రా నుంచి దృఢమైన జీఎఫ్‌ఆర్‌పీ రీబార్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా తాజాగా కాంక్రీట్‌లో వినియోగించే స్టీల్ రీబార్‌కు ప్రత్యామ్నాయంగా అత్యాధునిక గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ రీబార్‌ని (జీఎఫ్‌ఆర్‌పీ) ఆవిష్కరించింది. మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా వార్షిక బడ్జెట్ సమావేశాల్లో భాగంగా కంపెనీ ఎండీ పీవీ కృష్ణారెడ్డి దీన్ని ఆవిష్కరించారు. ఈసీఆర్ గ్లాస్, ఎపాక్సీ రెసిన్ మిశ్రమంతో తయారైన ఈ ఉత్పత్తి, సాంప్రదాయ ఉక్కుతో పోలిస్తే దాదాపు రెట్టింపు బలంతో, సుమారు నాలుగు రెట్లు తేలికగాను ఉంటుంది. దీనితో ఒలెక్ట్రా, నిర్మాణ రంగంలోకి కూడా ప్రవేశించినట్లయిందని కంపెనీ సీఎండీ కేవీ ప్రదీప్ తెలిపారు. జీఎఫ్‌ఆర్‌పీ రీబార్ వినియోగంతో ఖర్చులు ఆదా అవుతాయని, నిర్వహణ వ్యయం తక్కువగా ఉండి నిర్మాణాల జీవితకాల గణనీయంగా పెరుగుతుందని వివరించారు. దీన్ని ఇండస్ట్రియల్ ఫ్లోరింగ్, పేవ్‌మెంట్లు, వంతెన డెక్‌లు, ప్రీకాస్ట్ నిర్మాణాల్లో ఉపయోగించవచ్చని చెప్పారు.

వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు

యూఎస్ వాణిజ్య ప్రతినిధి జైమీసన్ గ్రీర్



న్యూఢిల్లీ: భారత్‌తో వాణిజ్య ఒప్పందం అమెరికా ఉత్పత్తులకు కొత్త అవకాశాలను తీసుకొస్తుందని అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) జైమీసన్ గ్రీర్ తెలిపారు. అంతేకాదు ఇరు దేశాల్లోని కార్మికులు, రైతులు, వ్యాపారవేత్తలకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. భారత్-అమెరికా కాంపాక్ట్ భాగస్వామ్యం ప్రాధాన్యతను ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన మరోసారి ధ్రువీకరించినట్టు చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం దిశగా పురోగతిని ప్రస్తావించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ద్వైపాక్షిక చర్చలు వాణిజ్యం విషయంలో సమతుల్యతను తీసుకొస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. యూఎస్‌టీఆర్, భారత వాణిజ్య శాఖ, పరిశ్రమల శాఖలు చర్చలకు సంబంధించి నిబంధనలను ఇప్పటికే ఖరారు చేసినట్టు చెప్పారు. భారత మార్కెట్‌లో తన ఉత్పత్తులకు మరింత ప్రవేశం కల్పించడం కోసం అమెరికా చూస్తోందని, టారిఫ్, నాన్ టారిఫ్ అడ్డంకులను తగ్గించుకోవాలని అనుకుంటున్నట్టు తెలిపారు. దీర్ఘకాల ప్రయోజనాల దృష్ట్యా అదనపు హామీలపై చర్చించనున్నట్టు చెప్పారు. భారత్ పెద్ద ఎత్తున టారిఫ్‌లు విధిస్తోందంటూ అమెరికా ఇప్పటికే ఎన్నో సందర్భాల్లో ఆరోపించడం గమనార్హం. భారత్‌తో 45.7 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటును అమెరికా మోస్తోంది. 2024లో భారత్‌తో అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 129.2 బిలియన్ డాలర్లుగా ఉంది. భారత ఉత్పత్తులపై అమెరికా సగటు టారిఫ్ 3.3 శాతంగా ఉంటే, అమెరికా ఉత్పత్తులపై భారత్ సగటున 17 శాతం టారిఫ్ విధిస్తుండడం గమనార్హం. టారిఫ్‌లకు అదనంగా సేవల మార్కెట్‌కు సంబంధించి సాంకేతిక పరమైన అవరోధాలు, నియంత్రణపరమైన అవరోధాలు భారత్‌తో అమెరికా వాణిజ్యం పెంచుకునే విషయంలో అవరోధాలు కల్పిస్తున్నట్టు జైమీసన్ గ్రీర్ తెలిపారు.

మార్చి త్రైమాసిక ఫలితాలు

హింద్ జింక్ లాభం జూమ్

క్యూ4లో రూ. 3,003 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం హిందుస్తాన్ జింక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 47 శాతం జంప్‌చేసి రూ. 3,003 కోట్లను తాకింది. ఉత్పత్తి వ్యయాలు తగ్గడం, ఊపందుకున్న అమ్మకాలు ఇందుకు సహకరించాయి. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 2,038 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,822 కోట్ల నుంచి రూ. 9,314 కోట్లకు ఎగసింది. జింక్ ఉత్పత్తి వ్యయాలు 5 శాతం క్షీణించి టన్నుకి 994 డాలర్లకు పరిమితమైనట్లు కంపెనీ పేర్కొంది. మెటల్ గ్రేడ్స్ మెరుగుపడటం, దేశీయంగా పెరిగిన బొగ్గు లభ్యత, అనుబంధ ప్రొడక్టుల విక్రయాలు ఇందుకు దోహదపడినట్లు వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025-26) వృద్ధికి వీలుగా 25 కోట్ల డాలర్లవరకూ పెట్టుబడులు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. కంపెనీ సీఈవో అరుణ్ మిశ్రా పదవీ కాలాన్ని ఏడాదిపాటు పొడిగించినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు బీఎస్ఈలో 3% క్షీణించి రూ. 445 వద్ద ముగిసింది.

టాటా టెక్నాలజీస్ ఫర్వాలేదు

లాభంలో 20 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: టాటా టెక్నాలజీస్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 20 శాతం వృద్ధితో రూ.189 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.157 కోట్లుగా నమోదైంది. కన్సాలిడేటెడ్ ఆదాయం ఇదే కాలంలో రూ.1,325 కోట్ల నుంచి రూ.1,343 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.1,095 కోట్ల నుంచి రూ.1,088 కోట్లకు తగ్గాయి. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.677 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలోనూ (2023-24) నికర లాభం రూ.679 కోట్లుగా ఉండడం గమనార్హం. అంటే లాభంలో ఎలాంటి వృద్ధి లేదు. ఆదాయం రూ.5,233 కోట్ల నుంచి రూ.5,293 కోట్లకు పెరిగింది. ''గత ఆర్థిక సంవత్సరంలో 17 పెద్ద డీల్స్‌ను సాధించాం. ఇందులో ఒకటి 500 మిలియన్ డాలర్ల విలువైంది. మా కస్టమర్ల బేస్‌ను బలోపేతం చేసుకుంటున్నాం. ఇప్పుడు మిలియన్ డాలర్లకు పైగా ఆర్డర్ల విభాగంలో 44 కస్టమర్లు ఉన్నారు''అని టాటా టెక్నాలజీస్ సీఈవో, ఎండీ వారెన్ హారిస్ తెలిపారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో టాటా టెక్నాలజీస్ షేరు ధర 3 శాతానికి పైగా నష్టపోయి రూ.693 వద్ద ముగిసింది.

శ్రీరామ్ ఫైనాన్స్ లాభం 10% అప్

డిపాజిట్లపై వడ్డీ రేట్ల సవరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో శ్రీరామ్ ఫైనాన్స్ నికర లాభం సుమారు 10 శాతం పెరిగి రూ. 2,139 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఇది రూ. 1,946 కోట్లు. సమీక్షాకాలంలో నికర వడ్డీ ఆదాయం 13.40 శాతం వృద్ధితో రూ. 5,336 కోట్ల నుంచి రూ. 6,051 కోట్లకు పెరిగింది. నిర్వహణలో ఉన్న ఆస్తుల పరిమాణం క్రితం ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటి రూ. 2,24,862 కోట్లతో పోలిస్తే ఈ మార్చి చివరికి 17 శాతం పెరిగి రూ. 2,63,190 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై కంపెనీ రూ. 3 తుది డివిడెండు ప్రకటించింది. మరోవైపు, వివిధ మెచ్యూరిటీ కాలావధులకు సంబంధించి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరిస్తున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. సీనియర్ సిటిజన్లకు అదనంగా 0.50 శాతం, మహిళలకు 0.10 శాతం వడ్డీ రేటు లభిస్తుందని సంస్థ తెలిపింది. కొత్త రేట్లు మే 2 నుంచి అమల్లోకి వస్తాయి.

డీసీబీ బ్యాంక్ లాభం రూ.177 కోట్లు

డివిడెండ్ రూ. 1.35



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ డీసీబీ బ్యాంక్ మార్చితో అంతమైన త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 14 శాతం పెరిగి రూ.177 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.156 కోట్లుగానే ఉండడం గమనార్హం. మొత్తం ఆదాయం రూ.1,581 కోట్ల నుంచి రూ.1,961 కోట్లకు వృద్ధి చెందింది. బ్యాంక్ స్థూల నిరర్థక రుణ ఆస్తులు (ఎన్‌పీఏలు) 2.99 శాతంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి ఇవి 3.23 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు పెద్దగా మార్పు లేకుండా 1.12 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 1.11 శాతంగా ఉన్నాయి. వాటాదారుల వద్దనున్న ప్రతి షేరుకు రూ.1.35 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. ఇందుకు కంపెనీ వార్షిక సమావేశంలో (ఏజీఎం) వాటాదారులు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో డీసీబీ బ్యాంక్ షేరు 1.55% నష్టంతో రూ.127 వద్ద ముగిసింది.

ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభాలకు కోత

క్యూ4లో రూ. 87 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ ఆర్‌బీఎల్ బ్యాంక్ కన్సాలిడేటెడ్ లాభం గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో (2024-25 క్యూ4) గణనీయంగా (76 శాతం) తగ్గిపోయింది. రూ.89 కోట్ల లాభం నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.364 కోట్లుగా ఉండగా, 2024 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.47 కోట్లుగా ఉండడం గమనార్హం. నికర వడ్డీ ఆదాయం 2 శాతం తగ్గి రూ.1,563 కోట్లుగా నమోదైంది. రుణాల్లో 7 శాతం వృద్ధి కనిపించింది. ముఖ్యంగా ప్రొవిజన్లు, కంటింజెన్సీలకు (మొండి బకాయిలు, ఇతర అవసరాలకు) కేటాయింపులు రూ.785 కోట్లకు పెరిగిపోవడం లాభాలకు కోత పెట్టింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఇవి రూ.414 కోట్లుగానే ఉన్నాయి. నికర వడ్డీ మార్జిన్ 5.45 శాతం నుంచి 4.89 శాతానికి తగ్గింది. బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యతను గమనిస్తే.. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 2.6 శాతంగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 2.65 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.74 శాతం నుంచి 0.29 శాతానికి తగ్గాయి. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.695 కోట్ల లాభం నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.1,168 కోట్లుగా ఉంది. ప్రతీ షేరుకు రూ.1 చొప్పున డివిడెండ్ పంపిణీకి బోర్డు సిఫారసు చేసింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఆర్‌బీఎల్ బ్యాంక్ షేరు 5 శాతం నష్టంతో రూ.188 వద్ద స్థిరపడింది.

ఎస్‌బీఐ లైఫ్ లాభం ప్లస్

క్యూ4లో రూ. 814 కోట్లు



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం నామమాత్ర వృద్ధితో రూ. 814 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 811 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 37,567 కోట్ల నుంచి రూ. 24,169 కోట్లకు భారీగా క్షీణించింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 25,116 కోట్ల నుంచి రూ. 23,861 కోట్లకు వెనకడుగు వేసింది. కాగా.. మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 2,413 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ. 1,32,631 కోట్ల నుంచి రూ. 1,17,118 కోట్లకు నీరసించింది. కొత్త బిజినెస్(వీవోఎన్‌బీ) విలువ 7 శాతం పుంజుకుని రూ. 5,950 కోట్లను తాకింది. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 15 శాతం ఎగసి రూ. 4.5 లక్షల కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో షేరు బీఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 1,609 వద్ద ముగిసింది.



మూడు విభాగాల్లోనూ శ్రీజ పరాజయం

మనిక బత్రాకు దియా షాక్

ట్యూనిస్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ట్యూనిస్ కంటెండర్ టోర్నమెంట్‌లో భారత రెండో ర్యాంకర్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైన శ్రీజ... మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కే చెందిన సత్యన్ జ్ఞానశేఖరన్‌తో కలిసి క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలైంది. సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 35వ ర్యాంకర్ శ్రీజ 6-11, 9-11, 8-11తో ప్రపంచ 76వ ర్యాంకర్ క్రిస్టినా కాల్‌బెర్గ్ (స్వీడన్) చేతిలో ఓడిపోయింది. 23 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీజ తన సర్వీస్‌లో 12 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 11 పాయింట్లు సాధించింది. భారత నంబర్‌వన్, ప్రపంచ 30వ ర్యాంకర్ మనిక బత్రా కూడా అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. భారత్‌కే చెందిన దియా చిటాలె 12-10, 5-11, 9-11, 11-4, 11-4తో మనిక బత్రాను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. క్వాలిఫయింగ్ ద్వారా మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన దియా 38 నిమిషాల్లో మనికను ఓడించింది. తన సర్వీస్‌లో 29 పాయింట్లు సాధించిన దియా ప్రత్యర్థి సర్వీస్‌లో 19 పాయింట్లు సొంతం చేసుకుంది. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ యశస్విని ఘోర్పడే తొలి రౌండ్‌లో 7-11, 6-11, 9-11తో అనె యుసెవా (జపాన్) చేతిలో ఓటమి చవిచూసింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో శ్రీజ-సుతీర్థ ముఖర్జీ (భారత్) ద్వయం 11-7, 8-11, 8-11, 10-12తో జు కిహు-యాంగ్ హుజి (చైనా) జంట చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో శ్రీజ-సత్యన్ జ్ఞానశేఖరన్ ద్వయం 11-6, 11-9, 11-9తో దిమిత్రి లెవాజెక్-ఇజబెలా (సెర్బియా) జోడీపై గెలిచింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో శ్రీజ-సత్యన్ 6-11, 11-2, 18-16, 2-11, 4-11తో భారత్‌కే చెందిన మనుష్ షా-దియా చిటాలె చేతిలో ఓడిపోయారు.

హర్మీత్ ముందంజ

పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ హర్మీత్ దేశాయ్ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరగా... మానవ్ ఠక్కర్, సత్యన్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. హర్మీత్ 11-6, 11-8, 11-7తో వు యిఫె (చైనా)పై గెలుపొందాడు. మానవ్ 11-8, 6-11, 7-11, 8-11తో మటియాస్ ఫాల్క్ (స్వీడన్) చేతిలో, సత్యన్ 6-11, 5-11, 11-6, 11-9, 9-11తో నవీద్ షమ్స్ (ఇరాన్) చేతిలో పరాజయం పాలయ్యారు.

'నాపై విద్వేషం చూపిస్తున్నారు'

స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆవేదన

- అర్షద్ నదీమ్‌ను భారత్‌లో టోర్నీకి ఆహ్వానించడమే కారణం

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో తొలి వ్యక్తిగత స్వర్ణం సాధించి భారత అత్యుత్తమ అథ్లెట్‌గా గుర్తింపు తెచ్చుకున్న జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు కూడా దేశంలోని దురభిమానుల నుంచి వేధింపులు తప్పడం లేదు. తాను నిర్వహించబోయే 'నీరజ్ చోప్రా క్లాసిక్' టోర్నీ కి పాకిస్తాన్ ఆటగాడు, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్‌ను అతను ఆహ్వానించడమే అందుకు కారణం. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి నేపథ్యంలో పాకిస్తానీయులపై భారత అభిమానులు సహజంగానే ఆగ్రహంతో ఉన్నారు. దానిని ఇప్పుడు నీరజ్‌పై చూపిస్తున్నారు. నిజానికి ఈ ఘటన జరగక ముందే నదీమ్‌ను నీరజ్ ఆహ్వానించాడు. టోర్నీ జరిగే సమయంలో తాను గతంలోనే నిర్ణయించుకున్న కార్యక్రమం ప్రకారం విదేశాల్లో ఉంటున్నానని, అందుకు హాజరు కాలేనని కూడా నదీమ్ స్పష్టం చేసేశాడు. 'సహచర భారతీయుల్లాగే నేను కూడా కశ్మీర్ ఘటన పట్ల ఎంతో బాధపడుతున్నాను. దానిపై చాలా ఆగ్రహంగా కూడా ఉన్నాను. అయితే నాపై కొందరు చూపిస్తున్న విద్వేషం ఊహించలేనిది. వారి మాటల్లో ఎన్నో తిట్లు కనిపిస్తున్నాయి. నేను సాధారణంగా ఇలాంటివి పట్టించుకోను. కానీ దానిని బలహీనతగా భావించవద్దు. పైగా దేశం పట్ల నా అంకిత భావాన్ని ప్రశ్నిస్తే మాత్రం ఊరుకోను. అర్షద్‌కు ఆహ్వానం పంపడం ఒక క్రీడాకారుడి కోణంలోనే చూడాలి. నా ఈవెంట్‌కు అత్యుత్తమ ఆటగాళ్లను తీసుకురావాలనే ఉద్దేశంతో అలా చేశాను. అయితే పహల్గాం ఘటనకు ముందే అందరినీ ఆహ్వానించాం' అని నీరజ్ గుర్తు చేశాడు.

మా కుటుంబాన్ని వదిలేయండి!

కశ్మీర్ ఉగ్రదాడి ఘటన తర్వాత కొందరు వ్యక్తులు తన తల్లిని కూడా వదలడం లేదని, ఏడాది క్రితం ఆమె చేసిన వ్యాఖ్యను తప్పుగా అన్వయిస్తున్నారని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. పారిస్ ఒలింపిక్స్‌లో అర్షద్ స్వర్ణం, నీరజ్ రజతం గెలిచిన సమయంలో 'అర్షద్ కూడా నా కొడుకులాంటివాడే' అని నీరజ్ తల్లి సరోజ్ చెప్పింది. 'జనాలు తమ అభిప్రాయాలు వేగంగా ఎలా మార్చుకుంటారో ఇప్పుడు కనిపిస్తోంది. ఏడాది క్రితం మా అమ్మ ఏదో నిరాడంబరత్వం, భోళాతనంతో ఒక మాట అంది. అప్పుడు ఆమెను అందరూ అభినందించారు. ఇప్పుడేమో ఆ మాటను పట్టుకొని అమ్మను తిట్టడం బాధగా ఉంది. కొందరు నన్ను లక్ష్యంగా చేసుకోవడం, నేను వివరణలు ఇచ్చుకోవడం చాలా బాధగా ఉంది. నా గురించి తప్పుడు మాటలు ప్రచారం చేయకండి. దయచేసి నన్ను, నా కుటుంబాన్ని వదిలేయండి' అని ప్రస్తుతం ఇండియన్ ఆర్మీలో సుబేదార్ మేజర్ హోదాలో ఉన్న నీరజ్ చోప్రా విజ్ఞప్తి చేశాడు.



నీరజ్ చోప్రా
అర్షద్ నదీమ్



కోల్‌కతా జట్టు

కోల్'కథ' మారేనా!

- ఒత్తిడిలో డిఫెండింగ్ చాంపియన్
- నేడు పంజాబ్ కింగ్స్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్ 'ఢీ'
- వెంకటేశ్ అయ్యర్, రింకూ సింగ్, రసెల్‌లపై భారం
- జోరు మీదున్న శ్రేయస్ బృందం
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఐపీఎల్‌లో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేకపోయిన జట్లు... 18వ సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఇలా నాలుగు జట్లు చక్కటి ఆటతీరుతో దూసుకెళ్తున్నాయి. తాజా సీజన్‌లో 8 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 3 పరాజయాలతో 10 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఐదో స్థానంలో ఉన్న పంజాబ్ నేడు జరిగే మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో తలపడనుంది. గత సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు ఐపీఎల్ ట్రోఫీ అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్... ఇప్పుడు పంజాబ్ కింగ్స్ సారథిగా ఈడెన్ గార్డెన్స్‌లో అడుగు పెట్టనున్నాడు. పుష్కర కాలం తర్వాత కేకేఆర్‌కు మూడో ఐపీఎల్ ట్రోఫీ అందించిన శ్రేయస్ అయ్యర్‌ను ఫ్రాంచైజీ వేలానికి వదిలేస్తే... పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకొని కెప్టెన్‌ను చేసింది. కోచ్ రికీ పాంటింగ్‌తో కలిసి శ్రేయస్ జట్టును విజయవంతంగా ముందుకు నడిపిస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన తొలి పోరులో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది. స్వల్ప స్కోర్లు నమోదైన ఆ మ్యాచ్‌లో కేకేఆర్ 112 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక 95 పరుగులకు ఆలౌటైంది. ఈ నేపథ్యంలో సొంతగడ్డపై ఆ పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని కోల్‌కతా చూస్తుంటే... గెలుపు జోరు కొనసాగిస్తూ 'ప్లే ఆఫ్స్' వైపు మరో అడుగు ముందుకు వేయాలని పంజాబ్ భావిస్తోంది.

మిడిలార్డర్‌పైనే భారం!

డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న కోల్‌కతా... నిలకడగా విజయాలు సాధించడంలో విఫలమవుతోంది. 8 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 5 పరాజయాలతో 6 పాయింట్లు సాధించిన కోల్‌కతా పట్టిక ఏడో స్థానంలో ఉంది. కెప్టెన్ అజింక్యా రహానే ఒక్కడే ఓ మాదిరిగా ఆడుతుండగా... మిగిలిన వాళ్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. 8 మ్యాచ్‌ల్లో 271 పరుగులు చేసిన రహానే జట్టులో అందరికంటే ముందున్నాడు. 19 ఏళ్ల అంగ్‌క్రిష్ రఘువంశీ 197 పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. కోట్లు పెట్టి కొనుగోలు చేసుకున్న వెంకటేశ్ అయ్యర్... 135 పరుగులే చేయగా... ఓపెనర్లు క్వింటన్ డికాక్ 143, సునీల్ నరైన్ 147 కూడా మెరుపులు మెరిపించలేకపోతున్నారు. రింకూ సింగ్, రసెల్, రమణ్‌దీప్ సింగ్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచింది. రింకూ 8 మ్యాచ్‌ల్లో 133 పరుగులే చేయగా... రసెల్ 55, రమణ్‌దీప్ 30 పరుగులు చేశారు. ఈ ముగ్గురు ఫినిషింగ్ టచ్‌తో జట్టుకు భారీ స్కోర్లు అందిస్తారనుకుంటే... వారు వరస వైఫల్యాలతో సతమతమవుతున్నారు. బౌలింగ్‌లోనూ కేకేఆర్‌కు ఏదీ కలిసి రావడం లేదు. వరుణ్ చక్రవర్తి, నరైన్, మొయిన్ అలీ వంటి ముగ్గురు ప్రధాన స్పిన్నర్లు ఉన్నప్పటికీ పిచ్ వారికి అనుకూలంగా రూపొందించుకోలేక పోయిన కేకేఆర్ దానికి మూల్యం చెల్లించుకుంటోంది. పేసర్లు వైభవ్ అరోరా, హర్షిత్ రాణా ఫర్వాలేదనిపిస్తున్నారు. కేకేఆర్ ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింట గెలవాల్సిన పరిస్థితి ఉండటంతో ఈ మ్యాచ్‌లో విజయం కోసం సర్వశక్తులు ఒడ్డేందుకు కోల్‌కతా సిద్ధమైంది.



పంజాబ్ జట్టు

అన్నీ రంగాల్లో బలంగా...

కేకేఆర్‌తో పోల్చుకుంటే పంజాబ్ పరిస్థితి మెరుగ్గా ఉంది. ఈ సీజన్‌లో శ్రేయస్ సారథ్యం... పాంటింగ్ వ్యూహాలు... ఓపెనర్ల మెరుపులు... చాహల్ స్పిన్ మాయాజాలం వెరసి పంజాబ్ బలంగా కనిపిస్తోంది. లీగ్ ఆరంభంలో దూకుడైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న శ్రేయస్... గత మూడు మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితం కావడం కాస్త ఇబ్బంది పెడుతోంది. అయినప్పటికీ అతడు 8 మ్యాచ్‌ల్లో 263 పరుగులతో జట్టు తరఫున అత్యధిక పరుగులు చేశాడు. అందులో 3 అర్ధశతకాలు ఉన్నాయి. ప్రియాన్ష్ ఆర్య 254, ప్రభ్‌సిమ్రన్ సింగ్ 209, నేహల్ వధేరా 189, శశాంక్ సింగ్ 158 పరుగులు చేశారు. ఓపెనర్లు ఆర్య, ప్రభ్‌సిమ్రన్ జట్టుకు మంచి ఆరంభాలు ఇస్తుండగా... శ్రేయస్, ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, శశాంక్ సింగ్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగనున్నారు. బౌలింగ్‌లో ప్రధాన పేసర్ అర్‌్షదీప్ సింగ్ ఆకట్టుకుంటుండగా... యుజ్వేంద్ర చాహల్ ఫామ్‌లో ఉన్నాడు. అర్‌్షదీప్ 11 వికెట్లు తీయగా... కేకేఆర్‌తో గత మ్యాచ్‌లో చాహల్ 4 ప్రధాన వికెట్లు తీసి ఆ జట్టును దెబ్బకొట్టాడు. అటు బౌలింగ్ ఇటు బ్యాటింగ్‌లో సమతూకంగా ఉన్న పంజాబ్‌కు మార్కో యాన్సెన్, స్టొయినిస్ రూపంలో నిఖార్సైన ఆల్‌రౌండర్లు ఉండటం అదనపు బలంగా మారింది. ఈ ఇద్దరు మంచి టచ్‌లో ఉన్నారు. వరుస పరాజయాలతో సతమతమవుతున్న కేకేఆర్... పంజాబ్ జోరును ఎలా అడ్డుకుంటుందో చూడాలి!

34 ఐపీఎల్ చరిత్రలో కోల్‌కతా, పంజాబ్ జట్లు ముఖాముఖిగా 34 సార్లు తలపడ్డాయి. 21 మ్యాచ్‌ల్లో కోల్‌కతా, 13 మ్యాచ్‌ల్లో పంజాబ్ గెలుపొందాయి. పంజాబ్‌పై కోల్‌కతా అత్యధిక స్కోరు 261 కాగా, అత్యల్ప స్కోరు 95 పరుగులు. కోల్‌కతాపై పంజాబ్ అత్యధిక స్కోరు 262 కాగా, అత్యల్ప స్కోరు 111 పరుగులు.

కోబీ బ్రయాంట్ జెర్సీకి రూ. 59 కోట్లు



న్యూయార్క్: అమెరికా బాస్కెట్‌బాల్ దిగ్గజం, దివంగత కోబీ బ్రయాంట్ ఎన్‌బీఏ అరంగేట్ర మ్యాచ్‌లో వేసుకున్న జెర్సీ రికార్డు ధరకు అమ్ముడైంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) తొలి పోరులో బ్రయాంట్ ధరించిన జెర్సీ... శుక్రవారం నిర్వహించిన వేలంలో 70 లక్షల డాలర్ల (రూ. 59 కోట్ల 76 లక్షలు)కు అమ్ముడైంది. ఎన్‌బీఏ చరిత్రలో గొప్ప ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న కోబీ... 2020లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. ఆ ఘటనలో బ్రయాంట్ కూతురు గియానాతో పాటు మరో ఏడుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఎన్‌బీఏలో భాగంగా బ్రయాంట్ 1996-97 సీజన్‌లో లాస్ ఏంజెలిస్ లేకర్స్ తరఫున అరంగేట్రం చేశాడు. 2007-08 సీజన్‌లో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డు గెలుచుకున్న సందర్భంలో... బ్రయాంట్ సంతకం చేసిన జెర్సీ గతంలో 5.85 మిలియన్ డాలర్ల (రూ. 49 కోట్ల 93 లక్షల)కు అమ్ముడుపోగా... ఇప్పుడు ఆ రికార్డు బద్దలైంది. 18 ఏళ్ల వయసులో తొలి మ్యాచ్ ఆడిన కోబీ 8వ నంబర్ జెర్సీతో బరిలోకి దిగి... ఆరు నిమిషాల పాటు ఆడి ఖాతా తెరువలేకపోయాడు. 'ఈ జెర్సీ ఓ కుర్రాడి సహజసిద్ధ సామర్థ్యానికి, ఆ తర్వాత దిగ్గజ ప్రస్థానానికి మధ్య వారధి. ఒక లెజెండ్‌కు చెందిన అరుదైన, అసాధారణ వస్తువు' అని వేలం నిర్వహించిన సోథెబైస్ సంస్థ వెల్లడించింది. ఓవరాల్‌గా క్రీడాకారుల జెర్సీల వేలంలో... బేబ్ రూత్ జెర్సీ (24 మిలియన్ డాలర్లు), మైకేల్ జోర్డాన్ ఎన్‌బీఏ జెర్సీ (10.1 మిలియన్ డాలర్లు), డీగో మారడోనా అర్జెంటీనా జెర్సీ (9.3 మిలియన్ డాలర్ల) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

మానసిక సమస్యలతో...

సెలెక్షన్స్‌కు పాకిస్తాన్ మాజీ కెప్టెన్ నిదా దార్ దూరం



కరాచీ: పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, వెటరన్ ప్లేయర్ నిదా దార్ మానసిక సమస్యలతో జట్టు ఎంపికకు దూరమైంది. ఆ దేశ క్రికెట్‌లో ఇలా మానసిక ఆరోగ్య సమస్యలతో దూరమవడం ఇదే తొలిసారి. 39 ఏళ్ల నిదా పాక్ జట్టులో కీలకమైన ఆల్‌రౌండర్. అంతర్జాతీయ క్రికెట్‌లో వన్డేలు, టి20ల్లో కలిపి 272 మ్యాచ్‌లు ఆడింది. ఐసీసీ మహిళల ప్రపంచకప్ క్వాలిఫయర్స్ కోసం ఎంపిక చేసిన జట్టులో ఆమె ఫిట్‌నెస్ టెస్ట్‌కు హాజరైంది. అయితే లాహోర్‌లో శిక్షణ శిబిరం నుంచి తప్పుకుంది. ఆమె చివరిసారిగా గత అక్టోబర్‌లో దుబాయ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడింది. అయితే కొన్నాళ్ల నుంచి తను మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు చెప్పింది. 'కొన్ని నెలలుగా నేను వ్యక్తిగతంగా, వృత్తిగతంగా ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాను. నాలో మానసిక స్థైర్యం మునుపటిలా లేదు. అందువల్లే కొన్నాళ్లు ఆటకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. దయచేసి అందరు నా నిర్ణయాన్ని గౌరవిస్తారని ఆశిస్తున్నాను' అని నిదా దార్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. నిదా పాక్ తరఫున 112 వన్డేలు ఆడి 1690 పరుగులు చేయడంతోపాటు 108 వికెట్లు పడగొట్టగా... 160 టి20 మ్యాచ్‌లు ఆడి 2091 పరుగులు సాధించి, 144 వికెట్లు తీసింది.



కూర్పుపై కసరత్తు

నేడు ఆస్ట్రేలియా 'ఎ'తో భారత మహిళల హాకీ జట్టు పోరు

పెర్త్: భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆస్ట్రేలియా పర్యటనలో కూర్పుపై కసరత్తులు చేయనున్నట్లు భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్ వెల్లడించాడు. ఈ టూర్‌లో భాగంగా భారత అమ్మాయిల జట్టు ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో రెండు మ్యాచ్‌లు... ప్రధాన జట్టుతో 3 మ్యాచ్‌లు ఆడనుంది. పెర్త్ వేదికగా శనివారం ఆస్ట్రేలియా 'ఎ'తో సలీమా టెటె సారథ్యంలోని భారత జట్టు తలపడుతోంది. మే 1, 3, 4న వరసగా ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో టీమిండియా మ్యాచ్‌లు ఆడనుంది. భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య ఇప్పటి వరకు 16 మ్యాచ్‌లు జరగగా... అందులో ఆసీస్ 10 మ్యాచ్‌ల్లో గెలవగా... భారత్ మూడు విజయాలు సాధించింది. ఈ నేపథ్యంలో హరేంద్ర మాట్లాడుతూ... ఇటీవల బెంగళూరులో నిర్వహించిన జాతీయ శిబిరం ప్లేయర్లకు ఉపయోగపడనుందని అన్నాడు. 'ఈ పర్యటన మా ఆటతీరును పరీక్షించుకునేందుకు తోడ్పడుతుంది. ఇంకా ఏ రంగాల్లో మెరుగు పడాలో అర్థం చేసుకునేందుకు ఆస్ట్రేలియా కంటే మెరుగైన ప్రత్యర్థి ఉండరు. కూర్పును పరీక్షించడంతో బెంచ్ బలాన్ని మరింత పెంపొందించుకుంటాం. ఆస్ట్రేలియాలాంటి జట్టును వారి సొంతగడ్డపై ఎదుర్కోవడం అతిపెద్ద సవాల్. ఇది ముున్ముందు టోర్నీలకు తోడ్పడుతుంది' అని హరేంద్ర అన్నాడు. ఇటీవల ప్రొ లీగ్‌లో ప్రపంచ మూడో ర్యాంకర్ నెదర్లాండ్స్‌పై విజయం సాధించి మన అమ్మాయిల జట్టు మంచి టచ్‌లో ఉంది. ఈ పర్యటన కోసం సలీమా సారథ్యంలో 26 మందితో జట్టును ప్రకటించారు. అందులో సీనియర్ గోల్ కీపర్ సవిత, నవ్‌నీత్ కౌర్, డ్రాగ్‌ఫ్లికర్ దీపిక ఉన్నారు. ఈ సిరీస్ కోసం ఐదుగురు కొత్త అమ్మాయిలు జ్యోతి సింగ్, సుజాత, అజ్మీన, పూజ యాదవ్, మహిమ టెటెకు అవకాశమిచ్చారు. 'బలమైన ప్రత్యర్థితో పోరుకు సిద్ధంగా ఉన్నాం. మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా బరిలోకి దిగుతాం. జట్టు కూర్పు పరీక్షించుకునేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. ప్రొ లీగ్‌లో యూరప్ అంచె పోటీలు, మహిళల ఆసియా కప్‌నకు ముందు ప్లేయర్లకు ఇది మంచి అనుభవం అవుతుంది' అని కెప్టెన్ సలీమా వెల్లడించింది.


పాకిస్తాన్‌కు చెందిన తన భార్యాపిల్లలు తిరిగి వెళ్తున్న వేళ శుక్రవారం అటారీ సరిహద్దు వద్ద ఓ భారతీయుని భావోద్వేగం.


పాకిస్తానీ అయిన తన భర్తకు వీడ్కోలు చెబుతూ కంటతడి పెట్టుకుంటున్న భారతీయురాలు జకియా ఫిర్‌దౌస్


పాక్ వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో వెనుదిరుగుతున్న మహిళ. ఆమెకు భారత పాస్‌పోర్టు, కుమారునికి పాక్ పాస్‌పోర్టు ఉన్నాయి.


పాక్ తిరిగి వెళ్తూ భారత్‌కు చెందిన తన బంధువులను హత్తుకుని రోదిస్తున్న మహిళ

అంతర్జాతీయ ప్రయాణం

మరింత భారం

గగనతలంపై పాక్ నిషేధ ఫలితం

- విమానయాన సంస్థలపై అదనపు భారం
- అదనపు వ్యయం, ప్రయాణ సమయంతో ప్రయాణికులకు ఇబ్బందులు
- విదేశాలకు ప్రయాణ చార్జీలు 8 నుంచి 12 శాతం పెరిగే అవకాశం

పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం దాయాదీ దేశం పాకిస్తాన్‌పై భారత్ కఠిన ఆంక్షలు విధించింది. పాకిస్తాన్ సైతం అదే రీతిలో స్పందిస్తూ తమ గగనతలాన్ని భారత దేశ విమానాలు ఉపయోగించుకోకుండా నిషేధించింది. ఇండియా విమానాలు తమ గగనతలం గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలపై అదనంగా ఆర్థిక భారం పడుతోందని, అతిమంగా ప్రయాణికులే భరించాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఉత్తర భారత దేశం నుంచి పాక్ గగనతలం గుండా పశ్చిమ దేశాలకు ప్రయాణించాల్సిన విమానాలు ఇక చుట్టూ తిరిగి వెళ్లక తప్పదు. దీనివల్ల విమాన చార్జీలు 8 నుంచి 12 శాతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. యూరప్, ఉత్తర అమెరికా, మధ్య ప్రాచ్య దేశాలకు వెళ్లేవారు అదనపు భారం భరించాల్సి ఉంటుంది. కొన్ని ముఖ్యమైన అంతర్జాతీయ రూట్లలో విమాన ప్రయాణాలు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. ఇండియాలో రిజిస్టర్ అయిన అన్ని విమానాలతో పాటు భారతీయుల యాజమాన్యంలో ఉన్న విమానాలు పాక్ గగనతలం గుండా ప్రయాణించేందుకు అనుమతి లేదు.

ఇక సుదూర ప్రయాణాలే

పాక్ ఆంక్షల ప్రభావం ఇప్పటికే మొదలైందని ఎయిర్ ఇండియా, ఇండిగో వంటి సంస్థలు నిర్ధారించాయి. తమ అంతర్జాతీయ విమానాలను మరో మార్గం గుండా మళ్లించామని తెలిపాయి. తమ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాక్ ఆంక్షల విషయంలో తాము చేయగలిగేది ఏమీ లేదని నిస్సహాయత వ్యక్తంచేశాయి. ఇండియా నుంచి యూరప్, అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాలకు వెళ్లాల్సిన విమానాలు అరేబియా సముద్రం మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల రెండు నుంచి రెండున్నర గంటల అదనపు సమయం పడుతోందని ఓ పైలట్ చెప్పారు. ఢిల్లీ, అమృత్‌సర్, జైపూర్, లక్నో, వారణాసి తదితర నగరాల నుంచి ప్రయాణించేవారు అదనపు సమయం వెచ్చించడంతోపాటు అదనపు వ్యయం భరించాల్సి వస్తోంది. ఇండియా విమానాలకు పాకిస్తాన్ ఎయిర్‌స్పేస్ అత్యంత కీలకం. చాలావరకు విమానాలు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. ఇన్నాళ్లూ ఎటువంటి ఇబ్బందుల లేకుండా ప్రయాణాలు సాగిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఏ విమానానికి ఎంత సమయం అదనంగా అవసరమన్న దానిపై త్వరలో పూర్తి స్పష్టత వస్తుందని సీనియర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ ఒకరు తెలిపారు.

ఇప్పుడు చేయాల్సిందేమిటి?

- పాక్ ఆంక్షల కారణంగా విమానయాన చార్జీలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది కాబట్టి సాధ్యమైనంత త్వరగా టికెట్లు బుక్ చేసుకోవాలి.
- విమానాల విషయంలో అప్‌డేట్స్ కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్ లేదా యాప్‌ను తరచూ చెక్ చేసుకోవాలి.
- అంతర్జాతీయ ప్రయాణాలకు అదనపు సమయం కేటాయించేందుకు సిద్ధపడాలి. తదనుగుణంగా పక్కా ప్లానింగ్ ఉండాలి.
- ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రయాణికుల లగేజీపై పరిమితి విధించే అవకాశం కనిపిస్తోంది. కనుక తక్కువ లగేజీతోనే ప్రయాణించాలి.

కనెక్టింగ్ విమానాలు అందుకోవడం కష్టం

రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమాన ప్రయాణాలు మరింత ఖరీదు కాబోతున్నాయి. విమానాలు ఎక్కువ దూరం ప్రయాణిస్తే ఇంధనంతోపాటు నిర్వహణ ఖర్చులు కూడా పెరుగుతాయి. అదే స్థాయిలో టికెట్ చార్జీలు పెరగడం తథ్యం. విమానయాన సంస్థలు తమపై పడే అదనపు వ్యయాన్ని ప్రయాణికులకే బదిలీ చేస్తాయి. మరో ఇబ్బంది ఏమిటంటే.. ప్రయాణానికి అదనపు సమయం పట్టడం వల్ల ఇతర దేశాల్లో కనెక్టింగ్ విమానాలు అందుకోవడం కష్టం కావొచ్చు. అందుకే ప్రయాణ ప్రణాళికను రీషెడ్యూల్ చేసుకోవాలి. విదేశాల నుంచి వచ్చేవారు కూడా ఆలస్యంగా స్వదేశానికి చేరుకుంటారు. లాంగ్ జర్నీ వల్ల విమానాల్లో ఇంధనం లోడ్ పెరుగుతుంది. ఎక్కువ ఇంధనాన్ని నింపుకోవాలి. ప్రయాణ సమయానికి అనుగుణంగా భద్రతాపరమైన ప్రమాణాలు కూడా పాటించాలి. పేలోడ్‌ను తగ్గించుకోవాలి. అంటే తక్కువ మంది ప్రయాణికులు, తక్కువ లగేజీతో ప్రయాణించాలి. దీనివల్ల విమానాల్లో సీట్లు లభించడం కష్టమవుతుంది. ఓవర్‌బుకింగ్ వంటి పరిణామాలు ఎదురవుతాయి. ముందస్తు ప్రణాళిక ఉంటే తప్ప అంతర్జాతీయ విమానాల్లో అప్పటికప్పుడు సీట్లు దొరకవు. భారత విమానాలకు తమ గగనతలాన్ని పాక్ మూసివేయడం ఇదే మొదటిసారి కాదు. 2019 ఫిబ్రవరిలోనూ ఇలాంటి పరిస్థితి తలెత్తింది. భారత సైన్యం చేపట్టిన బాలాకోట్ వైమానిక దాడుల నేపథ్యంలో తమ గగనతలం గుండా భారత విమానాలు ప్రయాణించకుండా నిషేధించింది. ఈ నిషేధం కొన్ని నెలలపాటు కొనసాగింది. ఇప్పట్లో భారత ప్రయాణికులకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

సిమ్లా ఒప్పందం నాటి పాక్ జెండా మాయం



సిమ్లా: 1972లో సిమ్లా ఒప్పందం జరిగిన చారిత్రక టేబుల్‌పైని పాకిస్తాన్ జెండా అనుమానాస్పద రీతిలో శుక్రవారం ఉదయం మాయమైంది. ఈ ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు గురువారం పాకిస్తాన్ ప్రకటించడం తెల్సిందే. పహల్గాం దారుణానికి నిరసనగా భారత్ పలు తీవ్ర చర్యలు ప్రకటించడం బదులుగా పాక్ కూడా సిమ్లా ఒప్పందం నుంచి వైదొలగడం వంటి నిర్ణయాలు తీసుకుంది. కాగా, 1972 జూలై 2వ తేదీ అర్ధరాత్రి దాటాక హిమాచల్ ప్రదేశ్ రాజ్‌భవన్‌లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ, పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సిమ్లా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఆ సమయంలో రాజ్‌భవన్‌లోని కీర్తి హాల్‌లోని వేదికపైని టేబుల్‌పై రెండు దేశాల జెండాలను ఏర్పాటు చేశారు. అక్కడుంచిన ఫలకంపై సిమ్లా ఒప్పందంపై 3-7-1972న ఇక్కడే సంతకాలు జరిగాయి' అని ఉంటుంది. అక్కడే సంతకం చేస్తున్నట్లు భుట్టో, పక్కన ఇందిర కూర్చున్న ఫొటో ఉంటుంది. అయితే, టేబుల్‌పైనున్న పాక్ జెండా మాత్రం ఆకస్మికంగా కనిపించకుండా పోయింది. ఈ విషయాన్ని రాజ్‌భవన్ అధికారులు శుక్రవారం ఉదయం ధ్రువీకరించారు.


ఉగ్రవాది ఆదిల్ థోకర్


పోనీవాలా ఆదిల్ షా

ఇద్దరు ఆదిల్‌ల కథ

- ఉన్మాదిగా మారి స్వదేశీయులనే కాల్చిందొకడు
- తూటాలకు ఎదురొడ్డిన ప్రాణత్యాగం మరొకరిది
- గుణపాఠంగా నిలుస్తున్న ఇద్దరు కశ్మీరీల జీవితం

శ్రీనగర్: ఇద్దరూ కశ్మీరీలే. ఇద్దరి పేరూ ఒకటే. కానీ ఒక ఆదిల్ మతోన్మాదంతో పాక్ ముష్కర ముఠాలో భాగమై స్వదేశీయులపైనే కాల్పులకు తెగబడ్డాడు. కశ్మీర్ ప్రతిష్టకే మాయని మచ్చలా మిగిలాడు. మరో ఆదిల్ ఆ తూటాలకు ధైర్యంగా ఎదురొడ్డి నిలిచాడు. పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలర్పించాడు. మొదటివాడు పహల్గాంలో పర్యాటకులపై దాడికి తెగబడ్డ ఏడుగురు లష్కరే తొయిబా ఉగ్రవాదుల్లో ఒకడైన ఆదిల్ హుసేన్ థోకర్ అలియాస్ ఆదిల్ గురీ. వారిని ప్రతిఘటించిన సయీద్ ఆదిల్ హుసేన్ షా స్థానిక పోనీవాలా. కశ్మీర్ పర్యాటకానికి చెడ్డపేరు రాకుండా అడ్డుకునేందుకు చివరిదాకా పోరాడిన అతని ధైర్యసాహసాలను దేశమంతా ముక్త కంఠంతో ప్రశంసిస్తోంది.

టీనేజీలోనే...

20 ఏళ్లు దాటిన ఆదిల్ థోకర్ స్వగ్రామం దక్షిణ కశ్మీర్‌లోని బిజ్‌బెహరా ప్రాంతంలోని గురీ. టీనేజర్‌గా ఉండగానే 2018లో పాక్ బాట పట్టాడు. అధికారిక పత్రాలతోనే వెళ్లినా కొద్ది రోజులకే పాక్‌లోనే 'మాయమైపోయాడు'. పాక్‌కు చెందిన నిషేధిత లష్కరే తొయిబా ఉగ్ర సంస్థలో చేరినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. తోటి ముష్కరులతో కలిసి 2024లో నియంత్రణ రేఖ గుండా భారత్‌లోకి చొరబడ్డట్టు నిర్ధారించుకున్నాయి. అప్పటినుంచీ జమ్మూలోని దోడా, కిష్త్వార్ తదితర ప్రాంతాల్లో ఆదిల్ థోకర్ మారణహోమం సృష్టిస్తున్నాడు. లోయలో ఏడాదిన్నరగా జరిగిన పలు ఉగ్ర ఘటనల్లో కూడా అతని హస్తమున్నట్టు తేలింది. పహల్గాం దాడిలో పాల్గొన్న ఏడుగురిలో ఐదుగురు పాకిస్తానీలు కాగా ఇద్దరు కశ్మీరీ ఉగ్రవాదులు. థోకర్ వారిలో ఒకడని దాడిలో చనిపోయిన ఓ వ్యక్తి భార్య నిర్ధారించింది. పోలీసులు తమకు చూపిన ఫొటోల ద్వారా అతన్ని గుర్తుపట్టింది. "నా భర్త తలను తూటాలతో ఛిద్రం చేసింది ఇతనే. దాడి తర్వాత తోటి ఉగ్రవాదులతో కలిసి అడవిలోకి మాయమయ్యాడు" అని వివరించింది.

దేశమంతా జేజేలు

గుర్రాలను నడుపుకునే 30 ఏళ్ల ఆదిల్ హుసేన్ షాది పహల్గాం. కర్కశ దాడికి వేదికైన బైసారన్ మైదానాల్లోకి రోజూ గుర్రాలపై పర్యాటకులను చేరవేస్తుంటాడు. దాడి వేళ తోటి స్థానికుల్లా తనకెందుకు లెమ్మని అనుకోలేదు. ముష్కరులు కేవలం హిందువులనే లక్ష్యం చేసుకుంటున్నా, తనకు ఎలాంటి ప్రమాదమూ లేదని తెలిసినా ఊరుకోలేదు. తనవంటి వారికి జీవనాధారమైన పర్యాటకులను కాపాడేందుకు చివరిదాకా ప్రయత్నించాడు. ఒక ఉగ్రవాది నుంచి తుపాకీ లాక్కోబోయాడు. ఆ ప్రయత్నంలో కాల్పులకు బలయ్యాడు. మూడు తూటాలు ఆదిల్ ఛాతీని ఛిద్రం చేశాయి. తన పిల్లలందరిలోనూ ఆదిలే అత్యంత దయా స్వభావి అంటూ తండ్రి సయీద్ హైదర్ షా కన్నీటి పర్యమంతమయ్యాడు. ఆదిల్ అంత్యక్రియలకు జనం భారీగా పోటెత్తారు. జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

పర్యాటకుల మతంపై ఆరా తీసిన

పోనీ రైడ్ నిర్వాహకుడి అరెస్ట్

న్యూఢిల్లీ: పహల్గాంలో గుర్రం స్వారీ సమయంలో నిర్వాహకుడొకరు తమను మతం గురించి అడిగాడంటూ ఓ పర్యాటకురాలు చెబుతున్నట్లుగా ఉన్న వీడియోపై గండేర్‌బల్ పోలీసులు కూపీ లాగారు. అతడిని గండేర్‌బల్‌లోని గోహిపారాకు చెందిన ఐజాజ్ అహ్మద్ జుంగల్‌గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రదాడితో ఇతడికి సంబంధముందా అనే కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు విడుదల చేసిన నలుగురు అనుమానితుల స్కెచ్‌లపై యూపీలోని జౌన్‌పూర్‌కు చెందిన యుక్తా తివారీ అనే పర్యాటకురాలు స్పందించారు. వారిలో ఇద్దరితో ఘటన రోజున తాను మాట్లాడినట్లు తెలిపారు. అయితే, తాను వారి పేర్లు అడగలేదని చెప్పారు. ఆమె వెంట ఉన్న స్నేహితులు సైతం వీరిని గుర్తు పట్టారు. అతడు తమను, పేరు, మతం గురించి అడిగాడని, ఎన్నడైనా అజ్మీర్ దర్గాకు గానీ అమర్నాథ్‌కు గానీ వెళ్లారా అని కూడా ఆరా తీశాడన్నారు. హిందూ ముస్లిం మతాల్లో ఏదంటే ఎక్కువ ఇష్టమని మరొకడు ఆరా తీశాడని యుక్తా తివారీ పోలీసులకు తెలిపారు. 'ఖురాన్ చదివారా, స్నేహితుల్లో హిందువులెందరు, ముస్లింలెందరు అని కూడా అడిగాడు. ఉర్దూ నాకు రాదని చెప్పగా, ఖురాన్ హిందీలోనూ ఉంటుందన్నాడు. దీంతో నాకు భయమేసింది. ఇంతలోనే అతడి ఫోన్ మోగింది. ఆ వ్యక్తి ప్లాన్ ఏ బ్రేక్ ఫెయిల్. ప్లాన్ బి 35 తుపాకులు పంపాం. వ్యాలీలో గడ్డిలో దాచామని చెప్పాడు. నేను వింటున్నట్లు తెలుసుకుని, వెంటనే మాట మార్చాడు' అని వివరించారు. అలా వారితో చాలా సేపు మాట్లాడామన్నారు. అతడు ఏడేళ్లుగా ఖురాన్ బోధిస్తున్నట్లుగా చెప్పాడన్నారు. అక్కడ తనకు పోలీసులెవరూ కనిపించకపోవడంతో ఈ విషయాలను చెప్పడం కుదరలేదని ఆమె వివరించారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఆ తర్వాత తనకు కనిపించలేదన్నారు. తమ మతం గురించి, 35 తుపాకులను గురించి మాట్లాడినందువల్లే ఆ ఇద్దరూ తనకు, తన స్నేహితులకు బాగా గుర్తుండిపోయారని తివారీ వివరించారు.

కూంబింగ్ ముమ్మరం

పర్యాటకులు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసు విభాగం స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ అనుమానితుల కోసం కథువా జిల్లాలో శుక్రవారం భారీ స్థాయిలో గాలింపు చేపట్టింది. ఘటనాస్థలి నుంచి ఆపరేషన్ మొదలైందని అధికారులు తెలిపారు. అదేవిధంగా, పుల్వామా, బారాముల్లా జిల్లాల్లో నిషేధిత జమ్మూకశ్మీర్ నేషనల్ ఫ్రంట్(జేకేఎన్ఎఫ్) సంస్థ కార్యకలాపాలు, స్థానికులకు సంబంధాలపై విచారణ మొదలు పెట్టారు. పట్టణలోని గులాం మహ్మద్ గనీ నివాసంలోనూ సోదాలు జరిపారు. ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ సమక్షంలో జరిపిన తనిఖీల్లో జేకేఎన్ఎఫ్‌కు సంబంధించిన సాహిత్యం లభ్యమైంది. వీటిన్నిటినీ రికార్డు చేశారు.

అక్త్రాయ్ పోస్ట్‌ను మూసేసిన భారత్

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఆర్ఎస్‌పురా సెక్టార్‌లో భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దుల్లో ఉన్న అక్త్రాయ్ పోస్ట్‌ను మూసివేసినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ పోస్ట్ ద్వారా రెండు దేశాల పౌరుల రాకపోకలకు ఇకపై అవకాశం ఉండదన్నారు. భారత ప్రభుత్వం ఇప్పటికే ప్రధానమైన అట్టారీ ఇంటిగ్రేటెడ్ బోర్డర్ పోస్టును పూర్తిగా మూసివేయడం తెల్సిందే.

సమరయోధులపై అపహాస్యమా?

రాహుల్‌గాంధీకి సుప్రీం మందలింపు

- మీ నానమ్మ కూడా సావర్కర్‌ను ప్రశంసించారు
- స్వాతంత్ర్యం తెచ్చిన వారిపై అవేం అనుచిత వ్యాఖ్యలు?
- పునరావృతమైతే తీవ్ర చర్యలు
- సుమోటోగా స్వీకరిస్తాం: ధర్మాసనం

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధులపై అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు మందలించింది. వీర సావర్కర్‌ను మహారాష్ట్ర ప్రజలు ఎంతగానో ఆరాధిస్తారని గుర్తు చేసింది. "మీ నానమ్మ ఇందిరాగాంధీ ప్రధానిగా ఉండగా సావర్కర్‌ను ప్రశంసిస్తూ లేఖ రాశారని మీకు తెలుసా? మనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తెచ్చిపెట్టిన వారిని ఇలా అవమానిస్తారా?" అంటూ ఆగ్రహం వెలిబుచ్చింది. "మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటిని సుమోటోగా తీసుకుంటాం" అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం శుక్రవారం హెచ్చరించింది. "ఇలాగే వదిలేస్తే మున్ముందు 'గాంధీ బ్రిటిష్‌వారికి సేవకుడు' అని కూడా చెబుతారు. ఎందుకంటే వైస్రాయ్‌ను ఉద్దేశించి ప్రసంగించేటప్పుడు గాంధీ 'మీ నమ్మకమైన సేవకుడు' అంటూ మాట్లాడేవారు. స్వాతంత్ర్య యోధులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడాన్ని అనుమతించబోం" అని స్పష్టం చేసింది. సావర్కర్‌పై రాహుల్ వ్యాఖ్యలను బాధ్యతారాహిత్యంగా అభివర్ణించింది. యూపీలో దాఖలైన కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై స్టే విధించింది.

ఢిల్లీ మేయర్‌గా బీజేపీ నేత రాజా ఇక్బాల్ సింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ అధికారం దాదాపు రెండేళ్ల తర్వాత బీజేపీకి దక్కింది. ఆ పార్టీకి చెందిన రాజా ఇక్బాల్ సింగ్ శుక్రవారం ఢిల్లీ నూతన మేయర్‌గా ఎన్నికయ్యారు. 142 ఓట్లకు గాను ఇక్బాల్‌కు 133 ఓట్లు పడ్డాయి. కాంగ్రెస్‌కు చెందిన మన్‌దీప్ సింగ్‌పై ఇక్బాల్ ఘన విజయం సాధించారు. ఒక ఓటును చెల్లనిదిగా అధికారులు ప్రకటించగా, బీజేపీకి చెందిన ఎంపీ మనోజ్ తివారీ గైర్హాజరయ్యారు. కాంగ్రెస్‌కు మొత్తం 8 ఓట్లు పడ్డాయి. కాగా, ఈ ఎన్నికను ఆప్ బహిష్కరించింది. నెల రోజుల్లో స్టాండింగ్ కమిటీ వేసి ఢిల్లీ ప్రభుత్వం సహకారంతో ప్రజలకు సమస్యలే లేకుండా చేస్తామని ఇక్బాల్ సింగ్ ఎన్నిక అనంతరం ప్రకటించారు. ఇక్బాల్ సింగ్ నార్త్ ఎంసీడీ మేయర్‌గా చేశారు. 2020 దాకా పార్టీ సివిల్ లైన్స్ జోన్ చీఫ్‌గా వ్యవహరించారు.

కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టాలి: ఎన్‌హెచ్ఆర్‌సీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడిని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) తీవ్రంగా ఖండించింది. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఉగ్రవాద చర్యల్లో పాల్గొనేవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయం వచ్చిందని తేల్చిచెప్పింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పర్యాటకుల ప్రాణాలను బలి తీసుకున్న ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ ఘటన వెనుక ఉన్న అసలు కుట్రదారులను చట్టం ముందు నిలబెట్టి, శిక్షించాలని స్పష్టంచేసింది. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చినా, నిధుల సమకూర్చినా కఠిన శిక్ష విధించాల్సిందేనని పేర్కొంది. ఉగ్రవాదం నేడు మానవాళికి అతిపెద్ద శత్రువుగా మారిందని ఎన్‌హెచ్ఆర్‌సీ ఆందోళన వ్యక్తంచేసింది. నిరాయుధ పర్యాటకులపై క్రూరంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు ఉగ్రవాదమే ప్రధాన కారణమని ఉద్ఘాటించింది. జీవించే హక్కుతోపాటు ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడాలంటే ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాల్సిందేనని వెల్లడించింది. పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఎన్‌హెచ్ఆర్‌సీ విజ్ఞప్తి చేసింది.

పీవోకేను భారత్‌లో కలిపేయండి: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: ఆక్రమిత కశ్మీర్(పీవోకే)ను భారత్‌లో కలిపేసి, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి ముగింపు పలకాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ డిమాండ్ చేశారు. పహల్గాం ఘోరాన్ని నిరసిస్తూ శుక్రవారం జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో అలోక్ కుమార్ మాట్లాడారు. ప్రపంచానికి పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదం నుంచి విముక్తి కల్పించడానికి, జిహాదీల చేతుల్లో బందీగా మారిన పీవోకేను కాపాడేందుకు, ఆ ప్రాంతాన్ని భారత్‌లో విలీనం చేయడానికి ఇప్పుడు సమయమొచ్చిందని ఆయన పేర్కొన్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన కఠినమైన దౌత్య చర్యల ఫలితంగా నేడు పాకిస్తాన్ ఏకాకిగా మారిందన్నారు. కశ్మీరీ ప్రజల అభివృద్ధికి ఎంతో కీలకమైన పర్యాటక రంగాన్ని దెబ్బతీసేందుకు చేసే కుట్రలు ఫలించబోవని స్పష్టం చేశారు.

పహల్గాం ఉగ్రదాడి అత్యంత హేయం: కీర్ స్టార్మర్

లండన్: పహల్గాం ఉగ్రవాద దాడిని బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ తీవ్రంగా ఖండించారు. ఆయన శుక్రవారం భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ముష్కరుల అకృత్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉగ్రవాదుల రాక్షసత్వానికి 26 మంది బలైపోయినట్లు తెలిసి కలత చెందానని చెప్పారు. బ్రిటిష్ ప్రజల తరఫున మృతులకు నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. సామాన్య పర్యాటకులను ముష్కరులు పొట్టన పెట్టుకోవడం అత్యంత హేయమని స్టార్మర్ మండిపడ్డారు. ఈ ప్రతికూల సమయంలో భారతీయులకు పూర్తిగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పహల్గాం ఘటనను బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు సైతం ఇప్పటికే ఖండించారు. నెదర్లాండ్స్ ప్రధాని డిక్ స్కూఫ్, శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే సైతం ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

తప్పిన భారీ రైలు ప్రమాదం

చెన్నై: తమిళనాడులో శుక్రవారం అతి పెద్ద రైలు ప్రమాదం త్రుటిలో తప్పింది. కాసేపట్లో మరో రైలు రానుండగా పట్టాలపై ట్రాక్ ఛేంజింగ్ మెకానిజంలో బోల్టులు కనిపించకుండా పోయాయి. సాధారణ తనిఖీల్లో భాగంగా దీన్ని గుర్తించడంతో ముప్పు తప్పింది. ఉత్తర తమిళనాడులోని చెన్నై-అరక్కోణం-బెంగళూరు రైల్వే కారిడార్లో శుక్రవారం అర్ధరాత్రి దాటాక తనిఖీలు నిర్వహిస్తున్నారు. తిరువళంగాడు రైల్వేస్టేషన్ సమీపంలో ట్రాక్ అలైన్‌మెంట్‌ను నియంత్రించే పాయింట్ మెషీన్ వద్ద బోల్టులు కనిపించలేదు. దాంతో రైల్వే సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆ లైన్లో కాసేపట్లోనే రైలు వెళ్లనుండటంతో సాంకేతిక బృందం వేగంగా స్పందించి సమీప స్టేషన్‌మాస్టర్‌ను అప్రమత్తం చేసింది. దాంతో రైలును ఆగమేఘాలపై ఆపేయడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్ చేంజింగ్ పాయింట్ల వద్ద బోల్టులు, నట్లు ఊడటం అసాధారణమని, ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేసుంటారని అనుమానిస్తున్నారు. ఇలా బోల్టులు, నట్లు ఊడటం వల్లే 2024 అక్టోబర్ 11న బాగ్‌మతి ఎక్స్‌ప్రెస్ లూప్ లైన్‌లోకి వెళ్లి ఆగున్న గూడ్స్‌ను ఢీకొట్టింది. 13 బోగీలు పట్టాలు తప్పడమే గాక చాలామంది ప్రయాణికులు తీవ్రగంత గాయపడ్డారు. లోకో పైలట్ సకాలంలో ఎమర్జెన్సీ బ్రేక్స్ వేసి అపార ప్రాణనష్టాన్ని నివారించారు.

కారు బాంబు దాడిలో రష్యా సైనికాధికారి మృతి

మాస్కో: రష్యా రాజధాని మాస్కోలో కారు బాంబు పేలుడు ఘటనలో ఉన్నత స్థాయి సైనికాధికారి మృతి చెందారు. జనరల్ స్టాఫ్ విభాగంలో ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ యరోస్లావ్ మొస్కాలిక్(59) కారు బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు రక్షణ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా వెల్లడించారు. సైనిక జనరల్ మృతిని ఆమె ఉగ్రదాడిగా అభివర్ణించారు. నిత్యం ఇలాంటి దాడులు జరుగుతుంటే యుద్ధాన్ని ఆపడం ఎలా సాధ్యమని ఆమె ప్రశ్నించారు. అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ ఘటన అనంతరం అధ్యక్ష భవనం క్రెమ్లిన్‌లో ఉక్రెయిన్‌తో ఒప్పందం విషయమై చర్చలు జరిపారు. ఇటీవలి కాలంలో పలువురు రష్యా సైనికాధికారులు ఇలాంటి దాడుల్లోనే చనిపోయారు. ఇవి ఉక్రెయిన్ పనేనని రష్యా ఆరోపిస్తోంది.

28న కశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

శ్రీనగర్: పహల్గాం దాడి అనంతర పరిస్థితులపై చర్చించేందుకు ఈ నెల 28వ తేదీన జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 18(1) నిబంధనను అనుసరించి సమావేశం చేసినట్లు శుక్రవారం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పేర్కొన్నారు. ఒమర్ సర్కారు విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పార్లమెంట్ ప్రత్యేక భేటీ జరగాలి: సిబల్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడిని ఖండిస్తూ పార్లమెంట్‌లో ఒక తీర్మానం ప్రవేశపెట్టి, ఆమోదించాలని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. ఇందుకోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. "దేశం ఐక్యంగా ఉందన్న సందేశాన్ని ప్రపంచానికి ఇవ్వాల్సిన అవసరముంది. ఉగ్రవాదాన్ని ప్రేరేపించకుండా పాకిస్తాన్‌పై ఒత్తిడి పెంచాలి. ఇందుకు మన ఎంపీలను ముఖ్య దేశాలకు పంపి పాక్ దుర్నీతిని వివరించాలి. పాక్‌తో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించకుండా ప్రపంచ దేశాలను ఒప్పించాలి. కఠిన ఆర్థిక ఆంక్షలు విధిస్తే పాక్ దిగిరాక తప్పదు" అని స్పష్టంచేశారు. పహల్గాం దాడి భారతదేశ సార్వభౌమత్వంపై జరిగిన దాడిగా కపిల్ సిబల్ అభివర్ణించారు. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో ప్రతిపక్షం మొత్తం ప్రధాని మోదీకి అండగా నిలుస్తోందని తెలిపారు.

షాజహాన్ గోల్కొండపై ఎప్పుడు దండెత్తాడు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కుతుబ్‌షాహీ యుగం

కులీకుతుబ్‌షా తన బంధువులతో కలసి మధ్య ఆసియా నుంచి దక్కన్‌కు వలస వచ్చాడు. ఇతడు బహమనీ సుల్తాన్ మహమూద్ షా (1482–1518) కొలువులో చేరి సేనాపతి అయ్యాడు. ఆ సమయంలో ఇతడు తెలంగాణ ప్రాంతంలో దోపిడీ దొంగలను అణచివేశాడు. ఎదురు తిరిగిన సామంతులను దారిలోకి తెచ్చాడు. 1487లో బహమనీ రాజ్యంలో దక్కనీ, అఫాకీ(స్థానికేతర)ల మధ్య ఘర్షణలు తలెత్తాయి. కులీ వీటి నుంచి సుల్తాన్‌ను రక్షించాడు. గోవా పాలకుడైన బహదూర్ జిలానీ (1493) సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటును అణచివేసే ప్రయత్నంలో నాటి తెలంగాణ పాలకుడైన కుతుబ్ ఉల్‌ముల్క్ డకానీ మరణించాడు. దీంతో మహమూద్ షా ఆ బాధ్యతను కులీకుతుబ్‌షాకు అప్పగించాడు. తిరుగుబాటును కులీ పూర్తిగా అణచి వేశాడు. దీంతో మహమూద్‌షా అతడికి కుతుబ్ ఉల్‌ముల్క్ బిరుదునిచ్చి 1496లో గోల్కొండ జాగీర్‌దార్‌గా నియమించాడు. కులీ కుతుబ్‌షా 1518లో స్వతంత్రం ప్రకటించుకొని తెలంగాణ ప్రాంతాన్ని పాలించాడు. గోల్కొండను కాకతీయుల కాలంలో నిర్మించారు. దీన్ని గతంలో మంగళారం అని పిలిచేవారు. కులీ స్వతంత్రంగా పాలన చేపట్టిన తొలినాళ్లలో మెదక్ జిల్లా కోహిర్ నుంచి ఓరుగల్లు వరకు మాత్రమే ఇతడి పాలనలో ఉండేది. ఓరుగల్లు నుంచి తూర్పు తీరం వరకు ఉన్న ప్రాంతాన్ని షితాబ్‌ఖాన్ (సీతాపతిరాజు) పాలించేవాడు. ఇతడు గజపతుల సామంతుడు. షితాబ్‌ఖాన్ 1504లో ఓరుగల్లు కోటను కైవసం చేసుకున్నాడు. ఇతడు స్వతంత్రంగా ఓరుగల్లు రాజ్యపాలన చేపట్టాడు. ఇతడి మంత్రి ఎనుములపల్లి పెద్దనామాత్యుడు. చరిగొండ ధర్మన్న అనే కవి పెద్దనామాత్యుడి వద్ద ఆశ్రయం పొందాడు. ధర్మన్న రచించిన చిత్రభారతంలో షితాబ్‌ఖాన్ ప్రశంస కనిపిస్తుంది. వరంగల్, ఖమ్మం మెట్టు, నల్లగొండ ప్రాంతాలు షితాబ్‌ఖాన్ రాజ్యంలో భాగంగా ఉండేవి. కులీకుతుబ్‌షా ఓరుగల్లుపై దాడి చేసి ఇతణ్ని సంహరించాడు.

రాజ్య విస్తరణ

రాచకొండ, పానుగల్లు, ఘనపురం (మహబూబ్‌నగర్), దేవరకొండ, నల్లగొండ, ఉర్లుగొండ, ఉండ్రుగొండ, అనంతగిరి దుర్గాధిపతులు స్వతంత్రంగా పరిపాలించేవారు. కృష్ణదేవరాయల మరణానంతరం (1529) కులీకుతుబ్‌షా ఈ దుర్గాలను జయించి రాజ్యాన్ని విస్తరించాడు. తర్వాత కరీంనగర్ జిల్లాలో కివాం ఉల్‌ముల్క్‌ను ఓడించాడు. ములంగూర్, ఎల్లందుల, రామగిరి కోటలను స్వాధీనం చేసుకున్నాడు. ఆదిల్‌షాతో యుద్ధం చేసి కోవిలకొండను ఆక్రమించాడు. హరిచంద్ తిరుగుబాటును అణచి నల్లగొండను వశం చేసుకున్నాడు. తర్వాత కృష్ణానదీ తీరం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. కొండపల్లి, ఇంద్రకొండ, ఏతగిరి, దుర్గాధీశులను ఓడించాడు. దీంతో కృష్ణా, గోదావరి నదుల మధ్య ఉన్న తీరాంధ్ర కూడా ఇతడి పాలనలోకి వచ్చింది. కులీకుతుబ్‌షా కవి పండితులను ఆదరించాడు. ఇతడికి ఆరుగురు కుమారులు. చివరివాడైన ఇబ్రహీం కుతుబ్‌షాను దేవరకొండ పాలకుడిగా నియమించాడు.

యువరాజు, పెద్ద కుమారుడైన హైదర్ ముందే మరణించాడు. రెండో కుమారుడైన కుతుబుద్దీన్ యువరాజు అయ్యాడు. కానీ రాజకీయాల పట్ల శ్రద్ధ పెట్టలేదు. మిగతా ముగ్గురు తండ్రి బతికుండగానే సింహాసనాన్ని ఆకాంక్షించారు. నాలుగో కుమారుడైన అబ్దుల్ కరీం తిరుగుబాటు చేశాడు. ఇతడు బీజాపూర్ వెళ్లి సుల్తాన్‌తో సంప్రదింపులు జరిపాడు. గోల్కొండను ముట్టడించాలని భావించాడు. ఆ ప్రయత్నాల్లోనే మరణించాడు. కులీకుతుబ్‌షా మూడో కుమారుడైన జంషీద్, అయిదో కుమారుడైన దౌలత్ వారసత్వం కోసం కలహించుకున్నారు. దీంతో కులీకుతుబ్‌షా జంషీద్‌ను గోల్కొండలో, దౌలత్‌ను భువనగిరిలో బంధించాడు. జైలు నుంచి తప్పించుకున్న జంషీద్ తండ్రిని హత్య చేశాడు. సోదరుడైన కుతుబుద్దీన్‌ను చిత్రహింసలకు గురి చేసి జైల్లో ఉంచాడు. అనంతరం సింహాసనాన్ని ఆక్రమించాడు. ఇతడు రాజ్యాన్ని విస్తరించలేదు. కానీ తన రాజ్య భాగాలను కోల్పోలేదు.

మల్కిభరాముడు

కులీ ఆరో కుమారుడు ఇబ్రహీం కుతుబ్‌షా (1550–80). ఇతడు విజయనగర రాజుల సాయంతో సింహాసనాన్ని ఆక్రమించాడు. కవి పండితులను ఆదరించి మల్కిభరాముడిగా పేరొందాడు. ఇతడు విజయనగరంలో ఏడేళ్లపాటు శరణార్థిగా ఉన్నాడు. వారి సహాయంతోనే సింహాసనాన్ని ఆక్రమించాడు. కానీ వారి పతనానికే కారణమయ్యాడు. బీజాపూర్, అహ్మద్‌నగర్, గోల్కొండ, విజయనగర రాజులు దక్కన్‌పై ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇబ్రహీం తళ్లికోట యుద్ధంలో విజయనగర రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చింది. ఈ యుద్ధంలో ఓటమి వల్ల విజయనగర సామ్రాజ్యం పతనావస్థకు చేరింది. దీంతో ఇబ్రహీం కుతుబ్‌షా తీరాంధ్రను జయించడానికి మార్గం సుగమమైంది. ఇతడు 1571లో రాజమండ్రి, దాని పరిసర ప్రాంతాలను జయించాడు. 1579లో కొండవీటిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత వినుకొండ, ఖమ్మం దుర్గాలను, కసింకోటను వశం చేసుకున్నాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా తన పాలనా కాలంలో హుస్సేన్‌సాగర్, ఇబ్రహీంపట్నం చెరువులను తవ్వించాడు. ఇబ్రహీంబాగ్, పూల్‌బాగ్, లంగర్ (భిక్షా గృహాలు)ను ఏర్పాటు చేశాడు. మూసీనదిపై పురానాపూల్ వంతెనను నిర్మించాడు.

ఇబ్రహీం మరణానంతరం మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1580–1612) అధికారం చేపట్టాడు. ఇతడు 14వ ఏట రాజ్యానికొచ్చాడు. ఇతడు ఇబ్రహీం, భాగీరథిల సంతానం. దక్కన్ ముస్లింల సహకారంతో అశ్వారావు చేసిన కృషి వల్ల మహమ్మద్ కులీ అధికారంలోకి వచ్చాడు. ఇతడు కవి అయినప్పటికీ రాజ్య విస్తరణలో అలక్ష్యం ప్రదర్శించలేదు. దక్షిణాన పెనుగొండ, గండికోటలను జయించాడు. తూర్పున శ్రీకాకుళం వరకు రాజ్యాన్ని విస్తరించాడు. అనేక తిరుగుబాట్లను అణచివేశాడు. 1592లో రాజధానిని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు మార్చాడు. ఇదే సమయంలో మొగలులు విజృంభించి 1590 నాటికి ఉత్తర భారతాన్నంతా ఆక్రమించారు.

అనంతరం వారు దక్కన్‌పై దృష్టి సారించి అహ్మద్‌నగర్‌ను వశపర్చుకున్నారు. ఈ ప్రభావం మహమ్మద్ కులీపై కూడా పడింది. ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొన్నప్పటికీ ఇవేవీ కులీ కళాపోషణను ప్రభావితం చేయలేదు. తన ప్రియురాలైన భాగమతి పేరు మీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. కులీ ఆమెకు హైదర్ మహల్ అనే పేరు పెట్టాడు. దీంతో భాగ్యనగరం హైదరాబాద్‌గా వ్యవహారంలోకి వచ్చింది.

ఇతడు చార్మినార్ (1591), చార్‌కమాన్ (1592), జామామసీద్ (1597–1598)లను నిర్మించాడు. దారుల్ షిఫా, దాద్ మహల్, ఖుదాదాద్ మహల్, నద్ది మహల్‌లను నిర్మించాడు. భాగె మహమ్మది, బస్నత్ ఘాట్, కోహినూర్ తదితర నిర్మాణాలు చేపట్టాడు. ఇవన్నీ ఇతడి కళాభిరుచికి నిదర్శనం.

కులీ మరణం తర్వాత అతడి అల్లుడయిన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా(1612–26) సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడు మొగలులతో సఖ్యతగా వ్యవహరించాడు. ఇతడి కాలంలోనే డచ్చివారు, బ్రిటిషర్లు తీరాంధ్ర వెంట వర్తక స్థావరాల్ని నెలకొల్పారు. మహమ్మద్ కుతుబ్‌షా ఖైరతాబాద్ మసీద్‌ను నిర్మించాడు. మక్కా మసీదు నిర్మాణానికి పునాది వేశాడు. 1624లో ఈద్‌గాను నిర్మించాడు. అమ్మాన్ భవనం, నబీబాగ్ కూడా ఇతడి కాలం నాటివే.

పతనం ఆరంభం..

మహమ్మద్ తర్వాత అతడి పెద్ద కుమారుడైన అబ్దుల్లా కుతుబ్‌షా(1626–72) రాజ్యానికి వచ్చాడు. ఇతడు మొగలుల నుంచి స్వతంత్రతను నిలబెట్టుకోలేకపోయాడు. దక్కన్‌లో మొగలులను ఎదిరించిన మలికంబర్ 1626లో, బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా 1627లో మరణించారు. వీరి మరణంతోపాటు కొన్ని ఇతరకారణాల వల్ల దక్కన్‌పై మొగలుల దండయాత్రకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

మొగల్ చక్రవర్తి షాజహాన్ 1636లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతడితో సంధి చేసుకుని మొగలుల ఆధిపత్యాన్ని అంగీకరించాడు. నాటి నుంచి కుతుబ్‌షాహి రాజ్య క్షీణదశ ప్రారంభమైంది. అబ్దుల్లా ఒకవైపు సామంతుడిగా ఉంటూనే కర్ణాటక రాజ్యంపై ఆధిపత్యం కోసం ప్రయత్నించాడు. తన సేనాని మహ్మద్ సయీద్ మీర్‌జుంలాను 1645లో కర్ణాటకపై దండయాత్రకు పంపాడు. ఫలితంగా కర్ణాటక రాజ్య తూర్పు భాగాలు అబ్దుల్లా రాజ్యంలో భాగమయ్యాయి. 1653లో విశాఖపట్టణం సుల్తాన్ వశమైంది. తీరాంధ్ర గోల్కొండ సామ్రాజ్యంలో విలీనమైంది. ఈ విజయాలతో విదేశీ వర్తకుల వ్యాపార స్థావరాలు గోల్కొండ రాజ్య పరిధిలోకి వచ్చాయి. దీంతో వారికి గోల్కొండ రాజ్యంతో సంబంధాలు ఏర్పడ్డాయి.

కర్ణాటక విజయాలతో అబ్దుల్లా సేనాని మహమ్మద్ సయీద్‌లో అత్యాశ మొదలైంది. ఇతడు తిరుగుబాటు చేసి స్వతంత్రం ప్రకటించుకున్నాడు. దక్కన్ సుబేదార్, షాజహాన్ కుమారుడైన ఔరంగజేబుకు చాడీలు చెప్పాడు. అతడి మాటలు నమ్మిన ఔరంగజేబు 1656లో గోల్కొండపై దండెత్తాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతి కష్టం మీద ఔరంగజేబుతో సంధి చేసుకున్నాడు. కుతుబ్‌షా తన రెండో కుమార్తెను ఔరంగజేబు కుమారుడైన మహమ్మద్ సుల్తాన్‌కు ఇవ్వడానికి అంగీకరించాడు. మహమ్మద్‌ను తన వారసుడిగా ప్రకటించడానికి, కోటి హొన్నులు కప్పం కట్టడానికి అబ్దుల్లా ఒప్పుకున్నాడు. దీంతో గోల్కొండలో మొగల్ అధికారుల ఆధిపత్యం పెరిగింది.

తానీషా పాలన

1672లో అబ్దుల్లా మరణించడంతో వారసత్వ వివాదం ఏర్పడింది. అనూహ్య పరిస్థితుల్లో అబుల్‌హసన్ తానీషా (1672–87) కుతుబ్‌షాహీ రాజ్య వారసుడయ్యాడు. తానీషా సుల్తాన్ పదవిని చేపట్టగానే ఔరంగజేబుకు అనేక కానుకలు పంపాడు. మొగలులకు సామంతుడిగా ఉండేందుకు అంగీకరించాడు. ఇందుకు ఔరంగజేబు ఒప్పుకున్నాడు. కానీ తానీషా శివాజీకి సహాయపడకూడదని, పేష్కను సమయానికి చెల్లించాలని షరతులు విధించాడు. మొగలులతో ఎప్పటికైనా ప్రమాదమేనని తానీషా భావించాడు. అందుకే రాజ్యాన్ని పటిష్ఠం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. తాను అధికారంలోకి రావడానికి తోడ్పడిన ముజఫర్‌ను మీర్ జుమ్లా (ప్రధానమంత్రి)గా నియమించాడు. కానీ అతడు అన్ని వ్యవహారాల్లో తలదూర్చేవాడు. అది సహించని తానీషా ముజఫర్‌ను తొలగించాడు. హనుమకొండకు చెందిన మాదన్నను ప్రధానిగా, అక్కన్నను సర్వ సైన్యాధ్యక్షుడిగా నియమించాడు. మాదన్న రాజ్య వ్యవహారాలను చక్కదిద్దాడు. కర్ణాటక ప్రాంతంలో పాశ్చాత్య వర్తకులు సృష్టించిన అలజడులను అణచివేశాడు. తిరుగుబాటుదారులపై కఠినచర్యలు తీసుకున్నాడు. ఉన్నత పదవుల నుంచి స్థానికేతరులను తొలగించి స్థానికులను నియమించాడు. నీటి వనరుల నిర్మాణాలు చేపట్టి వ్యవసాయభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాడు.

ఔరంగజేబు దండయాత్ర

ఇదే సమయంలో ఔరంగజేబు దక్కన్ రాజ్యాలన్నింటినీ నిర్మూలించడానికి ఉద్యుక్తుడయ్యాడు. మొగలుల నుంచి రాజ్యాన్ని రక్షించుకోవడానికి తానీషా 1677లో శివాజీతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి కుదరడంలో అక్కన్న మాదన్నలు ముఖ్య పాత్ర పోషించారు. ఇది ఔరంగజేబు ఆగ్రహానికి కారణమైంది. కొంత కాలానికి శివాజీ మరణించాడు. దీంతో ఔరంగజేబు అదను చూసుకొని 1685లో గోల్కొండపై దండెత్తాడు. మొగలు సైన్యానికి ఔరంగజేబు కుమారుడైన షా ఆలం నాయకత్వం వహించాడు.

మొదట గోల్కొండకే విజయం లభించింది. కానీ సేనానుల నమ్మక ద్రోహంతో గోల్కొండ ఓడిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో తానీషా మొగలులతో సంధి చేసుకున్నాడు. ఈ సంధి ప్రకారం పాత బకాయిల కింద మొగలులకు కోటి హొన్నులు చెల్లించాలి. ఏటా రెండు లక్షల హొన్నుల కప్పం చెల్లించాలి. మల్ఖేడు, సేడం ప్రాంతాలను మొగలులకు అప్పగించాలి. అక్కన్న మాదన్నలను పదవుల నుంచి తొలగించాలి. మొదటి మూడు షరతులను తానీషా అమలు చేశాడు.

కానీ అక్కన్న మాదన్నలను తొలగించడంలో ఆలస్యం చేశాడు. ఇది సహించని ముస్లిం సర్దార్లు 1686 మార్చి 24 రాత్రి అక్కన్న మాదన్నలను హత్య చేశారు. వారి తలలను ఔరంగజేబుకు కానుకగా పంపారు. అయినా ఔరంగజేబు సంతృప్తి చెందలేదు. బీజాపూర్ ఆక్రమణ అనంతరం 1687 ఫిబ్రవరి 7న మళ్లీ గోల్కొండపై దండెత్తాడు. ఎనిమిది నెలల హోరాహోరీ యుద్ధం తర్వాత ఒక సేనాని ద్రోహంతో గోల్కొండ మొగలుల వశమైంది. అబుల్ హసన్ తానీషాను బంధించి దౌలతాబాద్ కోటకు తరలించారు. దీంతో కుతుబ్‌షాహీల పాలన అంతరించింది. గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది.

అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

చైల్డ్ డెవలప్‌మెంట్ - పెడగాగీ

వైయక్తిక భేదాలు

1. వీటిలో శాబ్దికేతర సామూహిక పరీక్ష?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) ఆర్మీ బీటా 4) భాటియా నిష్పాదన
2. వీటిలో శాబ్దిక పరీక్ష కానిది?
   1) బీనే సైమన్ 2) ఆర్మీ ఆల్ఫా
   3) రావన్స్ ప్రోగ్రెసివ్ టెస్ట్
   4) ఒటిస్ మానసిక సామర్థ్యాల పరీక్ష
3. సెప్టెంబరు 5, 1971 ఏ వారం? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే రాజు అనే విద్యార్థి క్యాలెండర్ సహాయంతో ఆదివారం అని సమాధానం ఇచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం రాజు ఉపయోగించిన ఉత్పత్తి?
   1) యూనిట్లు 2) వర్గాలు
   3) అంతర్భావాలు 4) సంబంధాలు
4. ఈ–మెయిల్, టెలిగ్రాం, పోస్ట్ కార్డు, బుక్ ల్లో వేరుగా ఉన్నదేది? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. బుక్ తప్ప మిగిలినవి ప్రసార సాధనాలని రాము సమాధానమిచ్చాడు. రాములో గమనించే ఉత్పత్తి గిల్‌ఫర్డ్ ప్రకారం?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
5. అవగాహన అనే లక్ష్యంతో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
6. వినియోగమనే లక్ష్యంలో ఫలితాలను ఊహించడమనే స్పష్టీకరణం గిల్‌ఫర్డ్ ఉత్పత్తుల్లో ఏ కారకాన్ని సూచిస్తుంది?
   1) వర్గాలు 2) సంబంధాలు
   3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
7. ప్రజ్ఞా విభాజన పట్టికకు సంబంధించి సరి కాని ప్రవచనం?
   1) సగటు కంటే తక్కువ 81–90 ప్రజ్ఞాలబ్ధి
   2) అల్పబుద్ధులు 51–70 ప్రజ్ఞాలబ్ధి
   3) ఉన్నత ప్రజ్ఞావంతులు 121–140 ప్రజ్ఞాలబ్ధి
   4) మంద బుద్ధులు 25–50 ప్రజ్ఞాలబ్ధి
8. ప్రజ్ఞా విభజన పట్టికలో ఆరోహణ క్రమంలోని సరైన జతను గుర్తించండి?
   1) మందబుద్ధులు, అల్పబుద్ధులు, మూఢులు, బుద్ధిహీనులు
   2) మందబుద్ధులు, మూఢులు, అల్పబుద్ధులు, బుద్ధిహీనులు
   3) మూఢులు, బుద్ధిహీనులు, అల్ప బుద్ధులు, మందబుద్ధులు
   4) బుద్ధిహీనులు, మందబుద్ధులు, అల్ప బుద్ధులు, మూఢులు
9. Rose పదం చూసినప్పుడు ప్రయోజ్యుడు XOP అనే అర్థరహిత పదాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటే ఆ ప్రక్రియ?
   1) స్మృతి- విస్మృతి 2) ద్వంద్వ సంసర్గలు
   3) గుర్తింపు 4) ఏదీకాదు
10. 'మానవులందరూ మర్త్యులే. సోక్రటీస్ మానవుడు కాబట్టి మర్త్యుడే' అని ఆలోచించడం ఏ రకమైన ఆలోచన?
    1) విభిన్న 2) హేతుబద్ధ
    3) ఊహాలోచన 4) సమైక్య
11. రిమోట్ అసోసియేషన్ టెస్ట్ ఏ ప్రవర్తనాంశాన్ని మాపనం చేస్తుంది?
    1) సృజనాత్మకత 2) ప్రజ్ఞ
    3) సహజ సామర్థ్యాలు 4) స్మృతి
12. వీటిలో సరికాని జత?
    1) అమూర్తంగా ఆలోచించడమే ప్రజ్ఞ- టెర్మన్
    2) గ్రహణ శక్తిని ప్రజ్ఞ అంటారు- గాల్టన్
    3) భౌతిక సామాజిక పరిసరాలకు అను గుణంగా ప్రవర్తించడమే ప్రజ్ఞ- పియాజే
    4) అభ్యసించగల సామర్థ్యమే ప్రజ్ఞ–స్పెన్సర్
13. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించేది?
    1) రాజు శారీరకంగా బలవంతుడు, ఉద్వేగంగా అస్థిరుడు
    2) రాజు స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత గల వాడు
    3) రాజు చదవడం, రాయడం రెండూ ఇష్టపడతాడు
    4) రాజు గణితం కంటే సాంఘిక శాస్త్రాన్ని ఇష్టపడతాడు
14. వీటిలో సరికాని జత?
    1) డాల్టన్ ప్రణాళిక- మోరిసన్
    2) విన్నెట్కా ప్రణాళిక- వాష్ బర్న్
    3) గారీ ప్రణాళిక-విలియం బర్ట్
    4) నాన్ గ్రేడెడ్ పద్ధతి- గుడ్ లాడ్
15. ప్రజ్ఞ, సృజనాత్మకతలకు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) ప్రజ్ఞ ఉన్న వ్యక్తులందరూ సృజనాత్మకంగా ఉండాలని లేదు
    2) సృజనాత్మకత ఉన్న వారందరికీ ఎంతో కొంత ప్రజ్ఞ ఉంటుంది
    3) సృజనాత్మకంగా ఉండాలంటే ప్రజ్ఞ అవసరం లేదు
    4) విభిన్న ఆలోచన ఉన్నవారికి సృజనాత్మకత ఎక్కువ
16. ఉపాధ్యాయుడు 4×5×6 అనే ప్రశ్నను ఇచ్చినపుడు విద్యార్థి ఉపయోగించే విషయం?
    1) చిత్రాలు 2) చిహ్నాలు
    3) వర్గాలు 4) సంబంధాలు
17. పావురం, గరుడపక్షి, నెమలి, కంగారుల్లో సరికానిది గుర్తించమని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. కంగారు జంతువు, మిగిలినవి పక్షులని విద్యార్థి సమాధానమిచ్చాడు. గిల్‌ఫర్డ్ ప్రకారం విద్యార్థి ఉపయోగించిన ఆలోచన ఫలితం?
    1) పద్ధతులు 2) వర్గాలు
    3) సంబంధాలు 4) యూనిట్లు
18. విద్యార్థి శారీరక వయసు పదేళ్లు. ఐతే 16 ఏళ్ల వారికి ఉద్దేశించిన పరీక్షను సాధించాడు. ప్రజ్ఞా లబ్ధి ఆధారంగా అ విద్యార్థి ఏ వర్గీకరణకు చెందుతాడు?
    1) ఉన్నత 2) అత్యున్నత
    3) సగటుకంటే ఎక్కువ 4) ప్రతిభ కలవారు
19. రెండు ప్రపంచయుద్ధాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపాయి. మూడో ప్రపంచయుద్ధం జరిగితే అనర్థాలేమిటి? అని ఉపాధ్యాయుడు ప్రశ్నిస్తే.. గిల్‌ఫర్డ్ ప్రకారం ఆ విద్యార్థి ఉపయోగించిన ఉత్పన్నాలు?
    1) వర్గాలు 2) సంబంధాలు
    3) అంతర్భావాలు 4) రూపాంతరాలు
20. వీనిలో సాధారణ కారకం(జి)కు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) అభ్యసనం, సాధారణ ప్రజ్ఞను ప్రభావితం చేస్తుంది
    2) వంశపారంపర్యత సాధారణ ప్రజ్ఞను నిర్ధారిస్తుంది
    3) గణితం, సైన్సుల్లో ప్రతిభ సాధారణ కారకంపై ఆధారపడి ఉంటుంది.
    4) సాధారణ కారకం (జి) ప్రజ్ఞను నిర్ధారించే ప్రధాన అంశం
21. ద్వికారక సిద్ధాంతం ప్రకారం తీవ్ర భాషాపరమైన అభిరుచులు ఏ కారకంపై ఆధారపడి ఉంటాయి?
    1) జి 2) పి 3) ఎస్ 4) జి1
22. వీటిలో వ్యక్తంతర్గత భేదాన్ని సూచించేది?
    1) రాణి తన వయసు వారితోపాటు మార్కులు సాధిస్తుంది
    2) రాణి తెలుగులో చూపిన అభిరుచి గణితంలో చూపదు
    3) రాణి క్రీడల్లో ఇతరుల కంటే ప్రతిభ చూపుతుంది
    4) రాణి క్రీడలు, చదువుకు సమాన ప్రాధాన్యమిస్తుంది
23. వీటిలో సరికాని ప్రవచనం?
    1) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగు పర్చుకోలేం
    2) జ్ఞానం ప్రజ్ఞ అనే గమ్యాన్ని చేరడానికి సహకరిస్తుంది
    3) జ్ఞానం సహాయంతో ప్రజ్ఞను మెరుగు పర్చుకోవచ్చు
    4) ప్రజ్ఞ వల్ల జ్ఞాన సముపార్జన జరుగుతుంది.
24. వీటిలో అంతర వ్యక్తిగత భేదాలను సూచించనిది?
    1) రాజులో తన వయసువారి కంటే మానసిక పరిపక్వత ఎక్కువ
    2) రాజు చదవడం ఇష్టపడినంత రాయడం ఇష్టపడడు
    3) రాజు తన స్నేహితుల కంటే వ్యవహారిక దక్షత కలవాడు
    4) రాజు క్రికెట్ ఏ స్థాయిలో ఆడతాడో హాకీ కూడా అదేస్థాయిలో మిగతావారి కంటే బాగా ఆడగలడు

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4) 1
5) 4	6) 3	7) 4	8) 3
9) 2	10) 2	11) 1	12) 4
13) 2	14) 1	15) 3	16) 2
17) 2	18) 2	19) 3	20) 1
21) 3	22) 2	23) 3	24) 2

మనోవిజ్ఞాన శాస్త్రం- స్వభావం, పద్ధతులు

1. విద్యపై సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావాన్ని కనుక్కోవడానికి చేసే పరిశోధనలో స్వతంత్ర చరం?
   1) వయసు 2) ప్రజ్ఞ
   3) సాంఘిక ఆర్థిక స్థితి 4) విద్య
2. వీటిలో ప్రవర్తన లక్షణాన్ని వర్ణించడంలో సరైన ప్రవచనం?
   1) స్తబ్దమైంది 2) స్థిరమైంది
   3) గతి శీలమైంది 4) అచేతనమైంది
3. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థులను మూడు సమూహాలుగా విభజించాడు. వీటిలో మొదటి సమూహానికి హోంవర్క్ చేస్తే బహుమతి ఇస్తానని తెలిపాడు. రెండో సమూహానికి హోంవర్క్ ఇచ్చాడు. కానీ దండన/ బహుమతి ప్రకటించలేదు. మూడో సమూహానికి ఇంటి పని చేయకబపోతే దండిస్తానని చెప్పాడు. ఇందులో నియంత్రిత సమూహం?
   1) ఒకటోది 2) రెండోది 3) మూడోది
   4) ఒకటి, మూడు సమూహాలు
4. నవజాత శిశువును అధ్యయనం చేయడానికి ఉపయోగపడని పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
5. 'నిన్నటికంటే ఈ రోజు పాఠం బాగా అర్థమైందని' టీచర్‌తో విద్యార్థి చెప్పినప్పుడు ఆ విద్యార్థి ఉపయోగించిన పద్ధతి?
   1) పరిశీలన 2) అంతః పరీక్షణ
   3) వ్యక్తి అధ్యయన 4) ప్రయోగాత్మక
6. వ్యక్తి అధ్యయనంలో అన్ని విషయాలను సక్రమంగా విశ్లేషణ చేయడానికి ఉపయో గించాల్సిన పరిశీలన పద్ధతి?
   1) సంచరిత 2) అసంచరిత
   3) నియంత్రిత 4) అంతఃపరిశీలన
7. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం ఆధునిక విద్యకందించిన విషయం?
   1) ఆశయాలు ఎందుకు నిర్ణయించుకోవాలి
   2) ఏ ఆశయాలు నిర్ణయించుకోవాలి
   3) ఎలా లక్ష్యాలు సాధించాలి
   4) ఏ పాఠ్యాంశాలు బోధించాలి
8. 'పని చేయని, పని చేసే తల్లులు–వారి పిల్లల సాధన' అనే అంశాల గురించి ప్రయోగ పూర్వకంగా ఫలితాలు తెలుసుకో వాలనుకున్న పరిశీలకుడు పరీక్షించాల్సిన స్వతంత్ర చరం?
   1) పని చేయని తల్లులు
   2) పనిచేసే తల్లులు 3) 1, 2
   4) పనిచేసే తల్లుల పిల్లల విద్యాసాధన
9. కేస్‌స్టడీలో ప్రధానంగా ఉపయోగించే పద్ధతి?
   1) ప్రయోగ 2) అసంచరిత పరిశీలన
   3) సమాంతర అధ్యయన (Cross Sectional)
   4) కాలక్రమ (Longitudinal)
10. ప్రయోగ పద్ధతిలో వేర్వేరు వయసున్న శిశువులను ప్రయోజ్యులుగా ఎంపిక చేసుకొని అధ్యయనం చేసే పద్ధతి?
    1) సంచరిత పరిశీలన 2) అసంచరిత పరిశీలన
    3) సమాంతర అధ్యయన (Cross Sectional)
    4) కాలక్రమ (Longitudinal)
11. ప్రజ్ఞ ప్రభావం సృజనాత్మకతపై ఉండదని పేర్కొన్న పరిశోధకుడు నియంత్రించిన మధ్యస్థ చరం?
    1) ప్రజ్ఞ 2) సృజనాత్మకత
    3) ప్రేరణ 4) ప్రజ్ఞ, సృజనాత్మకత
12. సాంఘిక ఆర్థిక స్థితి ప్రభావం విద్యార్థుల సాధనపై ఉంటుందనే పరిశోధనలో ప్రయోగ ఫలితం?
    1) విద్యార్థుల సాంఘిక ఆర్థిక స్థితి
    2) విద్యార్థుల వైఖరి
    3) విద్యార్థుల సాధన
    4) విద్యార్థుల అభిరుచి
13. బోధనానుభవం ప్రభావం బోధనా సామర్థ్యంపై ఉందో లేదో తెలుసుకోవాల నుకునే ప్రయోగంలో బోధనాభిరుచి ఏ చరం?
    1) స్వతంత్ర 2) పరతంత్ర
    3) మధ్యస్థ 4) అస్థిర
14. 'నేను ఆందోళనలో ఉన్నానని' పేర్కొన్న వ్యక్తి ఉపయోగించిన పద్ధతి?
    1) పరిశీలన 2) అంతఃపరీక్షణ
    3) ప్రయోగ 4) వ్యక్తి అధ్యయన
15. ఉపాధ్యాయుడు ఆట స్థలంలో విద్యార్థుల ప్రవర్తనను వీడియో సహాయంతో గమనించడం ఏ పరిశీలన?
    1) నియంత్రిత 2) సంచరిత
    3) ప్రయోగ 4) అసంచరిత
16. శైశవ దశలోని లక్షణాలను తెలుసుకోవడానికి తగని పద్ధతి?
    1) ప్రయోగ 2) వ్యక్తి అధ్యయన
    3) అంతఃపరీక్షణ 4) పరిశీలన
17. వ్యక్తి అధ్యయన పద్ధతిలో సమస్యాత్మక విద్యార్థి కానిది?
    1) ప్రతిభావంతుడు
    2) అభ్యసన వైకల్యత ఉన్నవాడు
    3) సగటు ప్రజ్ఞ ఉన్న విద్యార్థి
    4) చదువులో వెనకబడిన విద్యార్థి
18. గ్రామీణ/పట్టణ ప్రాంతాల ప్రభావం విద్యార్థి వ్యక్తీకరణ నైపుణ్యాలపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగ పరిశోధనలో మధ్యస్థ చరం కానిది?
    1) వ్యక్తీకరణ నైపుణ్యాలు 2) అభిరుచి
    3) కుటుంబం 4) విద్యార్హతలు
19. విల్ హెల్మ్ ఊంట్‌కు సంబంధించి సరికాని ప్రవచనం?
    1) సంరచనాత్మక వాదానికి మూలపురుషుడు
    2) సంసర్గవాదానికి మూలపురుషుడు
    3) మనోవిజ్ఞానశాస్త్ర పితామహుడు
    4) ప్రయోగాత్మక మనోవిజ్ఞానశాస్త్ర పితామహుడు
20. హెర్బర్ట్ సోపానాల్లో సరైన వరుస క్రమం?
    1) సన్నాహం, సంసర్గం, ప్రదర్శన, అన్వయం, సాధారణీకరణం, సింహా వలోకనం
    2) సన్నాహం, ప్రదర్శన, అన్వయం, సంసర్గం, సాధారణీకరణం, సింహావ లోకనం
    3) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, సింహావలోకనం, అన్వయం
    4) సన్నాహం, ప్రదర్శన, సంసర్గం, సాధారణీకరణం, అన్వయం, సింహా వలోకనం.
21. జీన్ పియాజె తన ముగ్గురి పిల్లల సంజ్ఞానాత్మక వికాసాన్ని అనేక ఏళ్ల పాటు పరిశీలించాడు. ఇది ఏ రకమైన పరిశోధనా పద్ధతి?
    1) అంతఃపరిశీలన
    2) సమాంతర (Cross sectional)
    3) కాలక్రమ (Longitudinal)
    4) వ్యక్తి అధ్యయన పద్ధతి
22. ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థులను రెండు సమూహాలుగా విభజించి, ఒక సమూహానికి స్వతంత్ర చరం ప్రవేశ పెట్టాడు. రెండో సమూహానికి స్వతంత్రచరం ప్రవేశ పెట్ట లేదు. ప్రయోగం అనంతరం ఫలితాలు విశ్లే షించాడు. ఇది ఏ రకమైన సమూహ నమూ నా?
    1) ఏక 2) నియంత్రిత
    3) పరిభ్రమణ 4) ద్వి
23. ఉపాధ్యాయుడు తరగతిగదిలో బోధిస్తూ విద్యా ర్థుల ఇంగితాలను గమనించడం ఏ పరిశీలన?
    1) అసంచరిత 2) ప్రయోగ
    3) సంచరిత 4) స్వయం
24. ప్రస్తుత నార్కోఅనాలిసిస్ పద్ధతికి మూలమైన వాదం?
    1) గెస్టాల్ట్ 2) మనో విశ్లేషణ
    3) ప్రవర్తన 4) సంరచనాత్మక
25. ఆదాయ ప్రభావం ఉద్యోగ సంతృప్తిపై ఉందో లేదో తెలుసుకునే ప్రయోగంలో మధ్యస్థచరం కానిది?
    1) ఉద్యోగి వైఖరి 2) ఉద్యోగి సంతృప్తి
    3) ఉద్యోగి అభిరుచి
    4) ఉద్యోగి ప్రేరణ

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2
5) 2	6) 1	7) 3	8) 3
9) 4	10) 3	11) 3	12) 3
13) 3	14) 2	15) 4	16) 3
17) 3	18) 1	19) 2	20) 4
21) 3	22) 2	23) 3	24) 3
25) 2			

మాక్ నంబర్ దేనికి సంబంధించింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

భౌతిక శాస్త్రంలో ముందుగా భౌతిక రాశులు, బలం, ఉష్ణం, కాంతి, ధ్వని, అయస్కాంతత్వం, విద్యుత్ మొదలైన పాఠ్యాంశాలపై పట్టు సాధించాలి. వీటి కోసం 10వ తరగతి వరకు ఉన్న భౌతిక శాస్త్ర పాఠ్యపుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. వీటితో పాటు శుద్ధగతిక శాస్త్రం, విశ్వ గురుత్వాకర్షణ, ప్రవాహిలు, తలతన్యత, ద్రవ్యరాశి కేంద్రం, ఆధునిక భౌతిక శాస్త్రం లాంటి అంశాలపై కూడా ఇటీవల ప్రశ్నలు అడుగుతున్నారు. వీటి కోసం 6 నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాలతోపాటు ఇంటర్మీడియట్ స్థాయి పుస్తకాలను కూడా చదవాలి. అభ్యర్థికి 10వ తరగతి వరకు ఉన్న అన్ని అంశాలపై సాధారణ అవగాహన ఉండాలనేది జనరల్ స్టడీస్ ముఖ్య ఉద్దేశం. పరీక్షల దృష్ట్యా జనరల్ సైన్స్‌లో భౌతిక శాస్త్రానికి వెయిటేజీ ఉంది.

శిక్షణా సంస్థల్లో కొంతమంది అధ్యాపకులు తరచుగా కొన్ని టాపిక్స్‌ను మాత్రమే బోధించి, వాటి నుంచే ప్రశ్నలు వస్తాయని చెబుతారు. కానీ పోటీ పరీక్షలకు సంబంధించి నిర్దిష్టంగా ఒక టాపిక్ నుంచి ప్రశ్నలు వస్తాయని చెప్పలేం. వర్తమాన అంశాల ప్రాధాన్యాల ఆధారంగా ఏ పాఠ్యభాగం నుంచైనా ప్రశ్నలు ఇవ్వవచ్చు. అందువల్ల అభ్యర్థులు గత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన పెంచుకొని వాటికి అనుగుణంగా సన్నద్ధమవ్వాలి.

భౌతిక శాస్త్రంలో సాధారణంగా స్టాండర్డ్ జీకే, ప్యూర్ సైన్స్, అప్లయిడ్ సైన్స్ లేదా జనరల్ సైన్స్ అనే మూడు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతున్నారు. శాస్త్రవేత్తలు, పరికరాల పేర్లు, ఆవిష్కరణలు– సంవత్సరాలు మొదలైనవి స్టాండర్డ్ జీకేకు సంబంధించిన అంశాలు. కొన్ని ఉదాహరణలు..

1. టెలిస్కోప్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
2. అచ్చుయంత్రాన్ని కనుగొన్నదెవరు?
3. విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదించింది ఎవరు?
4. ఐన్‌స్టీన్‌కు ఏ సిద్ధాంతానికి నోబెల్ బహుమతి లభించింది?
5. ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి ఏ సంవత్సరంలో లభించింది?
6. 'యురేకా' అని అరిచిందెవరు?



సమాధానాలు

1) గెలీలియో 2) జాన్ గూటన్ బర్గ్ 3) న్యూటన్
4) ఐన్‌స్టీన్ 'ఫొటో ఎలక్ట్రిక్ ఎఫెక్ట్' కనుగొన్నందుకు నోబెల్ బహుమతి లభించింది. వాస్తవానికి ఈయన సాపేక్ష సిద్ధాంతానికి నోబెల్ వస్తుందని భావించారు.
5)1921
6) ఆర్కిమెడిస్. గ్రీకు భాషలో 'యురేకా' అంటే 'కనుగొన్నాను' లేదా 'తెలుసుకున్నాను' అని అర్థం. నూతన విషయాన్ని కనుగొన్న సందర్భంలో ఆర్కిమెడిస్ 'యురేకా' అని గట్టిగా అరుస్తూ వీధుల వెంట తిరిగారు.

ప్యూర్ సైన్స్‌లో భాగంగా ఒక్కోసారి ఫిజిక్స్‌లో సమస్య (ప్రాబ్లం)లపై కూడా ప్రశ్నలు అడగవచ్చు. సులభమైన అంశాలు, దాదాపుగా నేరుగా సమాధానం గుర్తించేవిధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి.



గతంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో సమస్యలపై అడిగిన కొన్ని ప్రశ్నలను గమనించండి.

1. ఒక వస్తువు వేగాన్ని రెట్టింపు చేస్తే దాని గతిశక్తి ఎన్నిరెట్లు అవుతుంది?
2. ఒక రేడియోధార్మిక మూలకం అర్ధజీవిత కాలం 4 సంవత్సరాలు. అయితే అది 3/4వ వంతు విఘటనం చెందడానికి పట్టే కాలం ఎంత?
3. ఒక గ్రహం, దాని నక్షత్రానికి మధ్య ఉన్న దూరం రెట్టింపు అయితే దాని ఆవర్తన కాలం ఎన్ని రెట్లు అవుతుంది?

సమాధానాలు

1) 4 రెట్లు 2) 8 సంవత్సరాలు 3) 2√2 రెట్లు

మూడో విభాగమైన అప్లయిడ్ సైన్స్ నుంచి అత్యధిక ప్రశ్నలు వస్తాయి. ఫిజిక్స్‌లో సుమారు తొంభై శాతం ప్రశ్నలు ఈ విభాగం నుంచే ఉంటాయి. దీంట్లో భాగంగా మౌలికాంశాలతో పాటు వివిధ ధర్మాలు, నియమాలు, సూత్రాలు, సిద్ధాంతాలు, వాటి అనువర్తనాలపై ప్రశ్నలు అడుగుతారు.
ఉదా: కాంతి ధర్మాలు, అయస్కాంతాల సాధారణ ధర్మాలు, ధ్వని ధర్మాలు.

నియమాలకు సంబంధించి న్యూటన్ గమన నియమాలు, కెప్లర్ గ్రహగమన నియమాలు, న్యూటన్ విశ్వ గురుత్వాకర్షణ నియమం, ఆర్కిమెడిస్ సూత్రం, ప్లవన సూత్రం, బెర్నౌలీ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం, పాస్కల్ సూత్రం మొదలైనవాటిని క్షుణ్నంగా చదవాలి. వీటి ఆధారంగా నిజ జీవితంలో జరిగే సంఘటనల్ని విశ్లేషించుకోవాలి. అభ్యర్థి సబ్జెక్టుకు సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించడంతో పాటు జనరల్ సైన్స్‌లో ప్రశ్నలను అడగడంలో ఉన్న మరో ముఖ్య ఉద్దేశం విశ్లేషణా సామర్థ్యాన్ని పరీక్షించడం. విషయాన్ని బట్టీపట్టడం కంటే అర్థం చేసుకుంటూ చదివినప్పుడే ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా సమాధానాలను గుర్తించవచ్చు. ఎక్కువగా ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలను చదవడం వల్ల నిర్మాణాత్మక పరిజ్ఞానం, సామర్థ్యం, తార్కిక విశ్లేషణ సాధ్యం కాదు. అందువల్ల ప్రధాన కాన్సెప్టులను క్షుణ్నంగా అధ్యయనం చేయడం ప్రయోజనకరం. పాఠ్యాంశాలపై పట్టు సాధించిన తర్వాత సాధ్యమైనంత ఎక్కువగా ప్రశ్నలను సాధన చేయాలి. అభ్యర్థులు ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని చదివితే మంచి మార్కులు సంపాదించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ఒక వస్తువు భారం దేంట్లో గరిష్ఠంగా ఉంటుంది?
   1) శూన్య ప్రదేశం 2) హైడ్రోజన్
   3) గాలి 4) నీరు
2. నీటిలో తేలియాడుతున్న వస్తువు దృశ్యభారం ఎంత?
   1) శూన్యం
   2) వస్తువు నిజ భారంలో సగం
   3) వస్తువు నిజ భారానికి సమానం
   4) వస్తువు నిజ భారానికి రెట్టింపు
3. ఒక ప్రవాహిలో మునిగి ఉన్న వస్తువు ఘ.ప. 200 ఘనపు సెంటీమీటర్లు. అయితే అది ఎంత ఘనపరిమాణం ఉన్న నీటిని స్థానభ్రంశం చెందిస్తుంది?
   1) 0 2) 50 ఘ.సెం.మీ.
   3) 200 ఘ.సెం.మీ.
   4) 400 ఘ.సెం.మీ
4. ఒక ప్రవాహిలో వేలాడుతున్న వస్తువు దృశ్య భారం ఎంత?
   1) దాని నిజ భారానికి రెట్టింపు
   2) నిజ భారానికి సమానం
   3) నిజ భారంలో సగం 4) శూన్యం
5. ఆకుపచ్చని కాంతిలో పసుపు పచ్చని పుష్పం ఏ వర్ణంలో కనిపిస్తుంది?
   1) తెలుపు 2) నలుపు
   3) ఆకుపచ్చ 4) పసుపు పచ్చ
6. కిందివాటిలో ప్రాథమిక వర్ణం కానిది?
   1) ఎరుపు 2) ఆకుపచ్చ
   3) పసుపుపచ్చ 4) నీలం
7. అణు రియాక్టర్లలో మితకారిణి విధి ఏమిటి?
   1) చర్యా వేగాన్ని మార్చడం
   2) న్యూట్రాన్ల వేగాన్ని పెంచడం
   3) న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడం
   4) ఉష్ణోగ్రతను తగ్గించడం
8. భారజలం రసాయనిక నామం?
   1) డై హైడ్రోజన్ ఆక్సైడ్
   2) హైడ్రోజన్ డయాక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) హైడ్రోజన్ పెరాక్సైడ్
9. ఒకే సైజు, ఒకే ఆకృతిలో ఉన్న A, B అనే రెండు లోహపు డబ్బాలను ఒకే పదార్థంతో తయారు చేశారు. వాటిని 4^0C ఉష్ణోగ్రత వద్ద నున్న నీటితో పూర్తిగా నింపి ఒకదాన్ని వేడిచేసి, మరో దాన్ని చల్లారిస్తే ఆ రెండింటిలో నీటి ఘనపరిమాణం ఏమవుతుంది?
   1) Aలో పెరిగి Bలో తగ్గుతుంది
   2) Aలో తగ్గి Bలో పెరుగుతుంది
   3) రెండింటిలో పెరుగుతుంది
   4) రెండింటిలో తగ్గుతుంది
10. పీడనం పెరగడం వల్ల నీటి భాష్పీభవన స్థానం?
    1) పెరుగుతుంది
    2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
11. కిందివాటిలో దయా అయస్కాంత పదార్థం కానిది?
    1) బంగారం 2) వజ్రం
    3) కోబాల్ట్ 4) ఆల్కహాల్
12. మాక్ నంబర్ దేనికి సంబంధించింది?
    1) ఉష్ణోగ్రత 2) వేగం
    3) పీడనం 4) భారం
13. ఒక ట్యూబ్ లైట్ 40 వాట్ల సామర్థ్యాన్ని కలిగి ఉంది. దాన్ని ఎన్ని గంటలపాటు వెలిగిస్తే 1 యూనిట్ కరెంట్ వినియోగం అవుతుంది?
    1) 40 2) 25
    3) 24 4) 10
14. ఉష్ణోగ్రతతో నీటి స్పర్శ కోణం?
    1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) స్పర్శ కోణం ఉష్ణోగ్రతపై ఆధారపడదు
15. భూస్థావర ఉపగ్రహాలు భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తు వద్ద తిరుగుతాయి?
    1) 1000 కి.మీ. 2) 3200 కి.మీ.
    3) 3600 కి.మీ. 4) 36,000 కి.మీ.
16. భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లేకొద్దీ పీడనం?
    1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) పెరగవచ్చు లేదా తగ్గవచ్చు
17. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందెవరు?
    1) టాలమీ 2) కోపర్నికస్
    3) గెలీలియో 4) న్యూటన్
18. భూమిపై ప్రదేశం లేదా విశ్వంలోని ఏదైనా స్థానం ఆధారంగా ఒక వస్తువు ద్రవ్యరాశి, భారానికి సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ద్రవ్యరాశి, భారం రెండూ స్థిరంగా ఉంటాయి
    2) ద్రవ్యరాశి, భారం రెండూ మారతాయి
    3) ద్రవ్యరాశి స్థిరంగా ఉంటుంది కానీ భారం మారుతుంది
    4) భారం స్థిరంగా ఉంటుంది కానీ ద్రవ్యరాశి మారుతుంది
19. 1 కేజీ, 10 కేజీల ద్రవ్యరాశి ఉన్న రెండు వస్తువులను సమాన వేగాలతో నిటారుగా పైకి విసిరితే, ఆ రెండింటిలో ఏది గరిష్ఠ ఎత్తుకు చేరుతుంది?
    1) 1 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    2) 10 కేజీ ద్రవ్యరాశి ఉన్న వస్తువు
    3) రెండూ సమాన గరిష్ఠ ఎత్తునకు చేరుకుంటాయి
    4) వాటి గరిష్ఠ ఎత్తు అనేది పైకి విసిరిన సాధారణ వేగంపై ఆధారపడి ఉంటుంది
20. కాలానికి ప్రామాణిక ప్రమాణం ఏది?
    1) సెకన్ 2) నిమిషం
    3) గంట 4) రోజు

సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 4;
5) 2; 6) 3; 7) 3; 8) 3;
9) 3; 10) 1; 11) 3; 12) 2;
13) 2; 14) 2; 15) 4; 16) 1;
17) 2; 18) 3; 19) 3; 20) 1

What is the average selling price of..




Model Questions


Directions (Q. No. 1-5) : Study the pie chart carefully and answer the given questions.

The Pie chart shows the percentage breakup of the people is living in a six floors building and the other pie chart shows the percentage breakup of the male members are living in that building.
Note: All the data is given for 2017.

Total number of people = X



Total number of male = 300



1. If the total number of females live on 3rd floor is 1/3rd of the total number of males live on 3rd floor then find the total number of people lives on 3rd floor and 4th floor together?
   a) 166 b) 176
   c) 156 d) 148 e) 184
2. If the total number of females live on 5th floor and 6th floor together is 32 then find the difference between the total number of people lives on 1st and 2nd floor together to that of the total number of people lives on 5th and 6th floor together?
   a) 100 b) 72 c) 80
   d) 84 e) 96
3. If the total number of females live on 3rd floor is 50% of the total number of males lives on 2nd floor then the total number of people live on 1st floor is what percentage of the total number of people live on 2nd floor?
   a) 72% b) 85%
   c) 90% d) 55% e) 80%
4. The total number of people live on 5th floor in 2017 is 80. In 2018, the total number of people live on all floors together is increased by 20% from that previous year then find the difference between the total number of people live on 1st and 3rd floor together to the total number of people lives on 4th and 6th floor together in 2018. (The percentage breakup in 2018 will remain the same)
   a) 144 b) 156
   c) 162 d) 140 e) 136
5. The total number of males live on 1st floor, 2nd floor and 3rd floor together is approximately what percentage more/less than of the total number of males live on 4th floor, 5th floor and 6th floor together.
   a) 167% b) 97%
   c) 67% d) 34% e) 125%

Directions (Q. 6-10): Study the following information carefully and answer the given questions.

Among 400 cricket players, 45% played in IPL-1 and 6.25% played only in IPL-1. Again, 57.5% players played in IPL-2 and 11.25% players played only in IPL-2. Again, 72.5% players played in IPL-3 and 27.5% players played only in IPL-3. Twenty per cent players played in all three IPL tournaments.

6. How many players are there who played in IPL 1 and IPL2 but not in IPL 3?
   a) 30 b) 35 c) 40
   d) 65 e) 45
7. What is the percentage of players who played in IPL 2 and IPL 3 but not in IPL 1?
   a) 12.5% b) 16.25%
   c) 22.75% d) 24%
   e) None of these
8. What is the percentage of the players who played in at least two IPL tournaments?
   a) 30% b) 35%
   c) 45% d) 50% e) 55%
9. The number of players who played only in either IPL 1 or IPL 2 is what percentage of the players who played in all three IPL?
   a) 72% b) 75%
   c) 82.5% d) 85%
   e) None of these
10. The number of players who played in at most one IPL tournament is what percentage more/less than the number of players who played in at least one IPL?
    a) 55% more b) 55% less
    c) 40% more d) 40% less
    e) None of these

Direction (Q. No. 11-15): Refer the following line graph and answer the questions based on it.

The line graph shows the percentages of markup on CP and discount offered on MP of six different articles sold by a shopkeeper.



11. Selling price of article C is Rs.528 and the marked prices of articles C and E are the same. What is the average selling price of both the articles in Rupees?
    a) 534.5 b) 544.5 c) 554.5
    d) 524.5 e) None of these
12. Cost Price of article A is Rs.450 and that of article D is Rs.600. What is the ratio of marked price of both the articles?
    a) 5 : 6 b) 3 : 4 c) 3 : 5
    d) 4 : 5 e) None of these
13. If the cost price of article E is double to that of article A, the marked price of article E is how much percent more than that of article A?
    a) 50% b) 40% c) 60%
    d) 30%
    e) None of these
14. For which article, the profit percent is the minimum?
    a) D and E b) D c) E
    d) E and F
    e) None of these
15. If the cost price of each of the article B and F is Rs.800, then what is the total profit earned by shopkeeper on both the articles?
    a) Rs.152 b) Rs.248
    c) Rs.184 d) Rs.216
    e) Cannot be determined

KEY & SOLUTIONS

1.

Floor	Total number of males
1st floor	15
2nd floor	24
3rd floor	36
4th floor	105
5th floor	66
6th floor	54

The total number of males on 3rd floor = 36
The total number of females on 3rd floor 36/3 = 12
The total number of people on 3rd floor = 36 + 12 = 48
So, we know that
12% = 48
The total number of people on 3rd floor and 4th floor
= 12% + 32% = 44%
The total number of people on 3rd floor and 4th floor
= (48/12)× 44 = 44× 4 = 176
Ans: b


2. The total number of males live on 5th and 6th floor together
= 66 + 54 = 120
The total number of females live on 5th and 6th floor together = 32
The total number of people live on 5th and 6th floor together
= 120 + 32 = 152
So, (20% + 18%) = 152
38% = 152
The percentage of people live on 1st and 2nd floor together
= 8% + 10% = 18%
So, required difference
= 38 – 18 = 20%
Then, (152/38)×20 = 80 **Ans: c**

3. The percentage of the total number of people live on 1st floor = 8%
The percentage of the total number of people live on 2nd floor = 10%
So, required percentage =
= (8/10)×100 = 80%
Ans: e

4. The total number of people live on 5th floor in 2017 = 80
So, 20% = 80
100% = (80/20) ×100 = 400
So the total number of people lives on all floors in 2017 = 400
So the total number of people lives on all floors in 2018
= (400/100)×120 = 480
So, required difference
= (32% + 18%) – (8% + 12%)
= 30%
Then, (30/100)×480 = 144
Ans: a

5. The total percentage of people live on 1st, 2nd floor and 3rd floor together = 5 + 8 + 12 = 25%
The total percentage of people live on 4th, 5th floor and 6th floor together
= 35 + 22 + 18 = 75%
So, required percentage
= [(75-25)/75]×100
= (50/75)×100 = 67%(Approx)
Ans: c

6.



x + y + 80 + 25 = 180
or x + y = 75 ______(i)
y + z + 80 + 110 = 290
or, y + z = 100 ______(ii)
x + z + 80 + 45 = 230
or x + z = 105 ______(iii)
From eqn (i), (ii) and (iii),
x = 40, y = 35, z = 65 **Ans: c**

7. Required percentage
= (65/400)×100 = 16.25 **Ans: b**

8. At least two IPL = 40 + 35 + 65 + 80 = 220
Required%
= (220/400)×100 = 55%
Ans: e

9. Only IPL-1 = 25, only IPL-2 = 45
∴ Total = 70
Required%
= (70/80)×100 = 87.5%
Ans: e

10. At least one IPL = 400
At most one IPL = 25 + 45 +110
= 180
∴ Required%
= [(400-180)/400]×100 = 55%
Ans: b

11. Marked price of article C
= [100/(100-20)]×528 = Rs.660
Then, marked price of article E
= Rs. 660
Selling price of article E
= 660×(100-15)/100 = Rs.561
Required average
= (528+561)/2 = Rs.544.5
Ans: b

12. Required ratio
= 450×(100+60)/100:
600×(100+50)/100
= 4 : 5 **Ans: d**

13. Let the cost price of article A be Rs. 100
Then, the cost price of article E
= Rs. 200
Marked price of article A
= 100 + 60% of 100 = 160
Marked price of article E
= 200 +20% of 200 = 240
Required percentage
= [(240-160)/160]×100 = 50%
Ans: a

14. Profit% = (100+Markup%) × [(100-Discount%)/100]-100
Profit% for article A
= (100+60) × [(100-25)/100]-100
= 20%
Similarly,
Profit% for article B = 19%
Profit% for article C = 32%
Profit% for article D = 5%
Profit% for article E = 2%
Profit% for article F = 8%
Ans: c

15. Profit% = (100+markup%) × [(100-Discount%)/100]-100
Profit % for article B = 19%
Profit % for article F = 8%
Total profit = 19% of 800 + 8% of 800 = 27% of 800 = Rs. 216
Ans: d